డాక్టర్ పి.ఎస్. గోపాలకృష్ణ

మీగురించి మీకు తెలుసా?



మీ గురించి మీకు తెలుసా?

డాక్టర్ పి.ఎస్. గోపాలకృష్ణ

Media House
Publications
2002

MEE GURINCHI MEEKU TELUSAA?
(Do you know Yourself?)
By-
Dr. P.S.Gopala Krishna

First Published: November, 2002.

Cover:
Artwork: Mohan
Design: Vivid Design Ventures
✆: 040-658 8819

Typesetting: R.J.Graphics
✆: 040-661 0373

Printed at: Akruthi Offset Printers
✆: 040-766 4525

For Copies:
- **Media House Publications**
  1-9-289/4, Behind Post Office
  Vidyanagar, Hyderabad - 500 044.
  ✆: 040-760 7307.
- **Visaalaandhra Book House**
  and all other leading Book Shops

Price: **Rs. 75**
$ 8

అంకితం

నాకు అక్షరాభ్యాసం చేయించిన
మా తండ్రి గారు
కీ. శే. **పాతాళభేది సుబ్రహ్మణ్య కవి** గారికీ,

నా నాలుగేళ్ల ప్రాయం నుంచి
నాకు తల్లీ తండ్రీ తానే అయి
నన్ను మనిషిని చేసిన
మా అమ్మ
కీ. శే. **పాతాళభేది లీలావతమ్మ** గారికీ.

–గోపాలకృష్ణ

విన్నవింత

స్థలం - ఆకాశవాణి, హైదరాబాదు. సంవత్సరం- 1985. గో. సెల్వం గారనే కేంద్ర నిర్దేశకులు కొత్త కార్యక్రమాల గురించి ముచ్చటిస్తూ ప్రతిరోజూ ఒక కొత్త విషయం గురించి ఐదేసి నిమిషాలు మాట్లాడితే ఎట్లా ఉంటుందో ప్రయత్నించి చూడాలన్నారు. ఆ ప్రయత్నం కొన్నాళ్లు సాగింది.

స్థలం - ఆకాశవాణి, మద్రాసు (చెన్నై వానొలి నిలయం). సంవత్సరం- 1998. గో. సెల్వంగారనే కేంద్ర నిర్దేశకులు ప్రతిరోజూ ఒక విషయం గురించి ఐదేసి నిమిషాలు మాట్లాడే కార్యక్రమం ఒకదాన్ని మొదలు పెట్టించారు. మొదట ఆకాశవాణిలో పనిచేసే వేర్వేరు ఉద్యోగులు సమర్పించిన ఆ కార్యక్రమం కొన్నాళ్లకు ఒక ఉద్యోగే సమర్పిస్తే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది. అట్లా ఆ కార్యక్రమాన్ని తెన్‌కచ్చి. కో. స్వామినాథన్ గారనే ఉద్యోగి (సంపాదకులు) వ్రాసి చదివి ప్రసారం చేయడం మొదలయింది (చాలా సార్లు ఆయనే మరొకరి తోడు లేకుండా రికార్డింగూ చేసుకొనేవారు). ఆ కార్యక్రమం శ్రోతలనెంతగానో ఆకట్టుకొంది. 1998 నుంచి 2001 దాకా ప్రత్యేక సందర్భాలలో తప్ప ప్రతి నిత్యమూ కార్యక్రమం ప్రసారమైనది. తమ ప్రసంగాలను 'ఇంద్రు ఒరు తగవల్' (ఈరోజు ఒక సమాచారం) అనే కార్యక్రమ శీర్షికతోనే స్వామినాథన్ పది సంపుటాలలో ప్రచురించారు. స్వామినాథన్ గారితో నాకున్న చిరకాల మైత్రివి బట్టి నేనూ కొన్ని ప్రసంగాల విషయంలో తోడ్పడడం, అడపా దడపా రికార్డింగులు చేసిపెట్టడం వంటి సేవలు చేశాను.

ఒక విషయం గురించి ప్రసంగించి దానికి సంబంధించిన చెణుకును వినిపించడం ఆ కార్యక్రమానికి నిర్దేశించిన పద్ధతి. స్వామినాథన్‌గారు వ్యంగ్యంగా చెప్పే పద్ధతిని పాటించడంవల్ల కొన్ని సందర్భాలలో చెబుతున్న విషయాలను చెప్పవలసినంత గంభీరంగానూ, గాఢంగానూ చెప్పడంలేదని కొందరు విమర్శించారు. ఈ విమర్శతో నిమిత్తం లేకుండా కార్యక్రమం విశేష జనాదరణ పొందింది.

1999 చివర హైదరాబాదు ఆకాశవాణి కేంద్ర నిర్దేశకులు శ్రీమతి దుర్గా భాస్కర్‌గారు ఒక కొత్త కార్యక్రమం ఏదయినా మొదలుపెట్టమని కోరినప్పుడు 'విన్నవింత' పేరిట (ప్రతి బుధ) వారానికి ఒక ప్రసంగం రాసి వినిపించే ప్రయత్నం మొదలుపెట్టాను. అంతకు రెండేళ్ల ముందు 'అదండీ సంగతి' అని ఒక ప్రయత్నం మొదలుపెట్టినా కారణాంతరాలవల్ల ఆ కార్యక్రమం కొనసాగలేదు. కాని విన్నవింత రెండేళ్లుగా నిరాటంకంగా కొనసాగుతూ వస్తున్నది. 'విన్నవింత' అంటే కన్నవీ విన్నవీ చదువుకొన్నవీ విన్నవించే ప్రయత్నమే. ఒక్క ముక్తాయింపు విషయంలో 'విన్నవింత' మాత్రం 'ఇంద్రు ఒరు తగవల్' ధోరణినే పాటించినా - విషయ ప్రస్తారంచేసే విషయంలో ఎంతో భిన్నమైనది. ఐదు నిమిషాలలో ప్రసంగించవలసిన పరిమితిని దృష్టిలో పెట్టుకొని అడపాదడపా 'చైతన్యస్రవంతి' విధానం పాటించి ఒక అంశం గురించి వివిధ విశేషాలు, వివిధ కోణాలు చెప్పడానికీ, ఒక అంశం గురించి వీలయినన్ని వివరాలు చెప్పడానికీ ప్రయత్నించాను. విన్నవీ కన్నవీ చదువుకొన్నవీ

కనుక – ఈ 'విన్నవింత'ల్లో విషయ విన్యాసంలో తప్పు నా సొంతమని చెప్పుకోదగినది చాలా పరిమితం. ఈ అవకాశం నాకు కల్పించిన ఆకాశవాణికి నేను కృతజ్ఞుణ్ణి.

చాలా ఏళ్లుగా వెనుకబడిన నా రచనా వ్యాసంగానికి ఒక తీరూతెన్నూ కలగడానికి విన్నవింత సాయపడింది.

ప్రతివారమూ ఈ కార్యక్రమాలు రూపొందడానికి ఎంతో సహకరించిన ఆకాశవాణి హైదరాబాదు కార్యక్రమ నిర్వాహకులు సుమనస్పతి రెడ్డి గారికీ, డాక్టర్ బిడిఎల్ ప్రసన్న గారికీ, శ్రీమతి అల్లంరాజు ఉషారాణి గారికీ, డాక్టర్ పుట్టపర్తి నాగపద్మినీదేవి గారికీ నా కృతజ్ఞతలు.

ఈ ప్రసంగాలన్నిటికీ తొలి చదువరి – శ్రోత సి. హెచ్. చలపతిరావు గారు. (ఆకాశవాణి ప్రాంతీయ శిక్షణా సంస్థలో కార్యక్రమ నిర్వాహకులు). ఎన్నో సందర్భాలలో ఆయన చక్కని మార్పులూ చేర్పులూ సూచించి ప్రసంగాలకు వన్నెలుదిద్దారు. ఆయన నిర్వ్యాజ ప్రేమాభిమానాలకు నేను కృతజ్ఞుణ్ణి.

విన్నవింత గురించి ఎప్పటికప్పుడు తమ స్పందనలు తెలిపి ప్రోత్సహించిన వారెందరో. ఎందరో శ్రోతలు ఉత్తరాలు రాసి ప్రోత్సహించారు. వారందరికీ నా కృతజ్ఞతలు.

ఈ ప్రసంగాలు పుస్తక రూపంలో వెలువడడానికి సోదరులు డాక్టర్ కె.బి.గోపాలం గారు, ఎన్.సి.నరసింహాచార్యులు గారు, అల్లంరాజు వెంకటరావు ('సుధామ') గారు మొదలయిన వారి ప్రేరణ కారణం. వారికి నా ధన్యవాదాలు.

నా ప్రయత్నాలన్నిటికీ ప్రోత్సాహాన్ని అందించే నా ఉత్తమార్ధం కృష్ణవేణి ఓర్పును ఇక్కడ ప్రత్యేకంగా స్మరిస్తున్నాను.

ఇన్నేళ్లుగా రాస్తున్నా పుస్తక రూపంలో ఒక రచనా వెలువడలేదన్న నా కొరతను తీర్చిన వారు మిత్రులు, మీడియాహౌస్ అధినేత డాక్టర్ గోవిందరాజు చక్రధర్‌గారు. ఆయన పూనుకోకపోతే ఈ పుస్తకం వెలువడి ఉండేదికాదు. నా సోమరితనాన్నీ, చాదస్తాన్నీ భరించి ఈ పుస్తక ప్రచురణకు ముందుకు వచ్చిన ఆయనకు హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకొంటున్నాను. పుస్తకానికే కాక నా ప్రసంగ వ్యాసాలన్నిటికీ ఓపికగా శీర్షికలుపెట్టి, ప్రవేశికలు రాసి, అక్షరాక్షరమూ సరిచూసి పుస్తకాన్ని ఇంత సొగసుగా ప్రచురించిన చక్రధర్ గారి అభిమానాన్ని మాటల్లో వివరించలేను.

పుస్తకం అట్టమీది ఆలోచనాత్మకమైన చిత్రాన్ని చిత్రించిన వారు ప్రముఖ చిత్రకారులు మోహన్‌గారు. ఈచిత్రం ఆయన దీక్షగా కొన్ని గంటలు వెచ్చించి గీసినది. మోహన్‌గారి ఆదరాభిమానాలు నేను మరువలేనివి.

చక్కగా టైప్‌సెట్ చేసిన ఎన్.రఘురామయ్య గారికీ, ముఖపత్రం డిజైన్ చేసిన వివిడ్ పవన్ గారికీ, చక్కగా ముద్రించిన ఆకృతి ప్రింటర్స్ కిరణ్ గారికీ, పకడ్బందీగా కట్టుదిట్టం (బైండ్) చేసిన సుదర్శన్ గారికీ నా కృతజ్ఞతలు.

ఈ పుస్తకానికి పాఠకులయిన మీకూ నేను కృతజ్ఞుడినే.

–పి. ఎస్. గోపాలకృష్ణ

ఇలా చదవండిక

1. జీవితమే ఒక అన్వేషణ 9
2. జీవితంలో దిద్దుబాట్లు 12
3. చూపుల్లో తేడా 15
4. మిమ్మల్ని మీరు తెలుసుకోండి 18
5. ప్రయత్నమే పరమావధి 20
6. ఏంచేస్తే మీకు ఆనందం? 23
7. ఉత్సాహం ఒక్కటే చాలదు 25
8. సంకల్పం ఉండాలే కానీ... 28
9. తెలియడం వెలుతురు 31
10. మీలో ఉన్నది వినయమా? గర్వమా? 33
11. మనసారా నవ్వగలుగుతున్నారా? 36
12. అసలు సమస్య ఏమిటి? 38
13. మీ భారం భౌతికమా? మానసికమా? 41
14. గొప్ప చెప్పుకోవటంలో గొప్పేం ఉంది? 43
15. పొగడ్తలకు లొంగుతారా? 45
16. మంచి చేస్తే మెచ్చుకుందాం 48
17 మొగమాటానికి పోతే... 51
18. ఉపగ్రహాలుగా మారితే ఉపద్రవమే 54
19. అనుకరణా అక్కరకు వస్తుంది 57
20. ఏది సహనం? ఏది అసహనం? 60
21. సలహాలను సరిగా అంచనా వేయాలి 63
22. పొదుపు అవసరమే.... కానీ 66
23. మార్పు అంటే భయమా? 69
24. జాగ్రత్త - అతి జాగ్రత్త 71
25. సమయస్ఫూర్తి 74
26. స్నేహాల విషయంలో 77
27. అంచనాలు తారుమారు కావచ్చు 80
28. ఆచితూచి మాట్లాడదాం 83

29. ఏవాడ చిలక ఆవాడ మాటలు పలుకుతుంది 85
30. మాటల అర్థాలు 88
31. వెనక మాట్లాడితే వెతలే 90
32. తనతో తాను మాట్లాడుకోవడం 93
33. శ్రద్ధగా వింటున్నామా? 95
34. వినడం వేరు - వినిపించుకోవడం వేరు.................................. 98
35 విని రాసుకోవడం 101
36. చెప్పడం - చెప్పించుకోవడం.. 104
37. ప్రశ్నించడం కూడా కళే 107
38. ప్రశ్నించడం నేర్చుకోండి 110
39. నిర్ణయాలు తీసుకుంటున్నారా? 113
40. మంచి పనులకు ప్రతిరోజూ మంచిదే...................................... 115
41. కాలం విలువ మారదు 118
42. ఏ పని ఎప్పుడు చేయాలి? 120
43. తీరిక వేళల్లో... 122
44. మీరు సేకరిస్తున్న దేమిటి? 125
45. అలవాటులో పొరబాటు 127
46. మనసుపెట్టి పనిచేస్తేనే ఫలితం 130
47. ఊరుకుంటే ఊరా? పేరా? 133
48. అతిగా పనిచేస్తే అనర్థమే 135
49. కలిసి పనిచేసేటప్పుడు 137
50. పురుగు నేర్పిన పాఠం 140
51. త్యాగధనుల జాడలే సమ్మతి, నెమ్మది.................................. 143
52. పోప్ ఎంపికలో పొగపాత్ర 146
53. గురు-శిష్య సంబంధం 149
54. పేర్లు గుర్తుంటాయా? 151
55. బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్ 154
56. వయసుకు తగ్గ వస్త్రధారణ 157
57. ఇక విజయం మీదే 160



1. జీవితమే ఒక అన్వేషణ

కొందరు వేదికలు వెతుక్కుంటూ ఉంటారు. కొందరు వేదనలు వెతుక్కుంటూ ఉంటారు. అన్నం కోసం, ఆదరణ కోసం, ప్రేమకోసం, ప్రేరణ కోసం, నీళ్లకోసం, కన్నీళ్లు తుడిచే వాళ్లకోసం వెతుకులాట సాగుతూనే ఉంటుంది. ఆత్మ సాక్షాత్కారం కోసం, ముక్తికోసం, మానవాతీత శక్తుల సాధనకోసం. ఇనుమును బంగారం చేసే పరుసవేది కోసం - ఇలా రకరకాల ఫలితాల కోసం శతాబ్దాలుగా మానవులు అన్వేషణ సాగిస్తూనే ఉన్నారు.

'జీవితం ఒక నిరంతర అన్వేషణ' అని చాలామంది అంటూ ఉంటారు. అన్వేషణ అంటే వెతకడం, వెతుక్కోవడం అని సూక్ష్మంగా అర్థం చెప్పుకుంటే చాలా ఇబ్బంది. మాటల అర్థాలకోసం నిఘంటువులలో వెతుక్కోవాలి. కొందరికి రెండు రకాల ఇబ్బందులు రావచ్చు. మొదటిది నిఘంటువును వెతుక్కోవడం. రెండవది నిఘంటువులో మనకు కావలసిన మాట వెతుక్కోవటం.

జీవితం అంతులేని అన్వేషణ అన్నది ఆధునిక జీవితానికి ఎంతగానో వర్తిస్తుంది. లేనివాళ్లు లేనిదానికోసం వెతుక్కోవడమూ, ఉన్నవాళ్లూ లేనిదానికోసం వెతుక్కోవ దమూ చూస్తూనే ఉంటాం. అసలు మానవుల అన్వేషణ పుట్టుకకు ముందునుంచే మొదలవుతుందనవచ్చు. ముందు కాన్పుకోసం ఒక మంచి ఆస్పత్రిని వెతుక్కోవాలి. బతికి బట్టకట్టితే ఆ తర్వాత చదువుకోవడానికి ఒక బడి (వెతుక్కోవాలి). ఆ తర్వాత పై చదువుల కోసం అవకాశాలు (వెతుక్కోవాలి) ఆ తర్వాత ఉద్యోగం, ఉపాధి (కోసం వెతుక్కోవడం). చిరుద్యోగమయితే సదుద్యోగం కోసమో కింది పదవి అయితే పై పదవి కోసమో వెతుక్కోవడం మామూలే. తగిన భార్యకోసమో భర్తకోసమో వెతుక్కోవడం మరింత కష్టమైన పని. పెళ్లయిన తర్వాత సొంతయిల్లు లేకుంటే బాడుగ ఇళ్లకోసం వెతుక్కోవడం పెద్దపని. ఈ మధ్యలో ఏ మధ్యాహ్నమో సినిమా చూడడానికి వెళ్లి కూచోవలసిన కుర్చీలకోసం చీకట్లో వెతుక్కోవడంవంటి చిన్న వెతుకులాటలూ ఉంటాయి. తాళాలు, రసీదులు, ప్రయాణం కోసం ముందే కొన్న టికెట్లు, టెలిఫోన్ నెంబర్లూ చిరునామాలూ రాసుకున్న కాగితాలు వెతుక్కోవడంలోనూ జీవితంలో ఎంతో కొంతకాలం గడుస్తుంది. కొందరు వేదికలు వెతుక్కుంటూ

ఉంటారు. కొందరు వేదనలు వెతుక్కుంటూ ఉంటారు. అన్నంకోసం, ఆదరణ కోసం, ప్రేమ కోసం, ప్రేరణ కోసం, నీళ్లకోసం, కన్నీళ్లు తుడిచే వాళ్ల కోసం – వెతుకులాట సాగుతూనే ఉంటుంది.

పాతకాలం నాటి పత్రాలు కావాలంటే గ్రామ పుర నగర పాలక సంస్థలవారూ, ప్రభుత్వ కార్యాలయాలవారూ అన్వేషణ కోసం రుసుము వసూలు చేస్తూ ఉంటారు.

రెండువేల అయిదువందల ఏళ్ల క్రితం గ్రీస్ దేశంలో అనెక్సగోరస్ అనే ఒక పెద్ద మనిషి ఉండేవాడు. ఆయన పట్టపగలే వెలుగుతున్న దివిటీని చేతపట్టుకుని తిరుగుతూ ఉండేవాడట. రాత్రి దివిటీ అవసరం కానీ, పగలు దాని అవసరం ఏమిటి అని కొందరు, అనవసరంగా ఈ బరువు ఎందుకు మోస్తున్నావని మరి కొందరూ అడిగితే – ఆయన తెలివితేటలున్న మనుషులు కనిపిస్తారేమో అని వెతుకు తున్నానని సమాధానం చెప్పేవాడట.

ఆత్మ సాక్షాత్కారంకోసం, ముక్తికోసం, మానవాతీత శక్తుల సాధన కోసం, ఇనుమును బంగారం చేసే పరుసవేది కోసం – ఇలా రకరకాల ఫలితాల కోసం శతాబ్దాలుగా మానవులు అన్వేషణ సాగిస్తూనే ఉన్నారు.

వెదకబోయిన తీగ కాళ్లకు తగిలే అదృష్టం కొందరిదయితే – తీగ వెదకబోయి చేతి సంచీ జారవిడుచుకునే అదృష్టం మరి కొందరిది.

శాస్త్ర సాంకేతిక పరిశోధనలు, అన్వేషణలు నిరంతరంగా కొనసాగుతూ ఉండడంవల్ల – ఎన్నో కొత్త ఆవిష్కరణలు వెలుగుచూశాయి.

18వ శతాబ్దానికి చెందిన అమెరికా శాస్త్రవేత్త బెంజమిన్ ఫ్రాంక్లిన్ – విద్యుత్తు గురించి పరిశోధనలు జరిపారు. 1752లో ఆయన ఒక గాలిపటం సాయంతో మెరుపులోని విద్యుత్తును భూమికి దించే ప్రయత్నం చేశారు. ఆయన బతికి బయటపడ్డారు కానీ ఆయన తర్వాత ఆ ప్రయోగం చేసిన ఇద్దరూ ప్రాణాలు కోల్పో యారు. భవనాలను మెరుపుల దాడినుంచి రక్షించే చువ్వల ఆవిష్కరణకు ఫ్రాంక్లిన్ అన్వేషణ దారితీసింది.

18వ శతాబ్దంలో రెనీ అంటాయిన్ రూమర్ అనే శాస్త్రవేత్త కీటకాల ప్రవర్తన గురించీ వాటి జీవితాల గురించీ విశేష కృషిచేశారు. ఆయన జీర్ణ క్రియ గురించి కొన్ని అన్వేషణలు జరిపారు. తన పెంపుడు రాబందుకు రకరకాల ఆహారాలు పెట్టే వారు. జీర్ణం కాని వాటిని ఆ పక్షి కక్కుతూ ఉండేదట. రెండువైపులా తెరచి ఉన్న లోహపు గొట్టాల లోపల స్పాంజి ముక్కలు పెట్టి పక్షిచేత మింగించి, పక్షి దాన్ని జీర్ణించుకోలేక కక్కిన తర్వాత స్పాంజికి అంటిన జీర్ణరసాన్ని రూమర్ పరిశీలించే వారు. ఈ అన్వేషణలో భాగంగా ఒకసారి ఆయన ఆ రాబందుకు ఏదో తినిపిస్తే –

అది దాన్ని మింగలేక కక్కలేక జీవన్ముక్తి పొందిందట. రూమర్ స్ఫూర్తితో 18వ శతాబ్దానికే చెందిన లాజరో స్పాలెంజనీ అనే శాస్త్రవేత్త రాబందులనేకాక కాకుల వంటి పక్షులను వాడి జీర్ణక్రియ ఎలా జరుగుతుందో పరిశీలించారు. ఆహార పదార్థానికి దారంకట్టి పక్షిచేత మింగించి – జీర్ణమవుతున్న పదార్థాలను బయటకు లాగి చూసేవారట. ఏడు గంటలలో దాదాపుగా ఆహార పదార్థాలు జీర్ణ రసాలలో పూర్తిగా కరుగుతాయని కనుగొన్నారు. ఒక లినెన్ సంచిలోకొద్దిగా నమిలిన బ్రెడ్డు ముక్కలను పెట్టి – ఆ సంచిని అలాగే మింగితే 23 గంటల తర్వాత – బ్రెడ్డు జీర్ణమై సంచీ బయట పడిందట. ఉత్సాహం పట్టలేక –స్పాలెంజనీ చెక్క గోళాలలోనూ, లోహపు గొట్టాలలోనూ ఆహారం దట్టించి మింగడానికి ప్రయత్నించారు. అవి గొంతుకు అడ్డం పడి ఊపిరి ఆడకపోయేసరికి చెక్కలనూ, లోహాలనూ మింగడం సాధ్యపడదని సోదాహరణంగా గ్రహించి – తన అన్వేషణను ముగించారు.

విద్యుచ్ఛక్తి చేత పని చేయించటం ఎలాగో అన్వేషించిన తామస్ ఆల్వా ఎడిసన్ రోజుకు 20 గంటలు పనిచేసేవారు. 1847లో జన్మించి 84 సంవత్సరాలు జీవించిన ఎడిసన్ 1300 పైగా ఆవిష్కరణలు నమోదు చేసుకున్నారు. గ్రామఫోన్, ఎలక్ట్రిక్ బల్బ్, తొలి చలనచిత్ర నిర్మాణ విధానాలలో ఒకటయిన కైనెటోస్కోప్ వంటివి ఎడిసన్ ఆవిష్కరించినవే. ఎడిసన్ బాల్యంలో ఒకసారి ఆయన ఒక రైలుబండిలోని సరుకుల పెట్టెలో రసాయన పరిశోధన చేస్తూండగా – పేలుడు జరిగింది. సరుకుల పెట్టె దాదాపుగా దెబ్బతిన్నది. పక్కస్టేషనులో బండి ఆగగానే – పరిశోధకుడినీ అతని పరిశోధన సామగ్రితోబాటు బండిలోంచి బయటకు పారేశారట.

ముక్తాయింపు:

ఒక ఊళ్లో ఒక తెలివయిన పెద్దమనిషి ఉండేవాడట. ఒకరోజు రాత్రి – వీధి దీపం కింద ఆ పెద్ద మనిషి ఏదో వెతుకుతూ ఉన్నాడు. దారినిపోయే చిన్న మనిషి పెద్ద మనిషిని చూసి 'ఏం వెదుకుతున్నావు' అని అడిగాడట. 'దారం ఎక్కిస్తూ ఉండగా సూది పడిపోయింది' అన్నాడట పెద్దమనిషి. 'ఎక్కడ పడి ఉంటుందంటావు' అని అడిగాడు చిన్న మనిషి. 'ఇంట్లోనే పడింది' అన్నాడు పెద్ద మనిషి. 'మరి ఇక్కడ ఎందుకు వెదుకుతున్నావు' అని అడిగాడు చిన్న మనిషి. 'ఇంట్లో దీపం లేదు కదా అందుకని ఇక్కడ దీపం కింద వెదుకుతున్నాను' అన్నాడు పెద్ద మనిషి.



2. జీవితంలో దిద్దుబాట్లు

ఒక్కోసారి పొరపాట్లవల్ల మేలు కూడా జరగవచ్చు. మన దేశానికి బయలు దేరిన కొలంబస్ అమెరికా తీరానికి చేరడం అరుదుగా జరిగే మంచి పొరపాట్లలో ఒకటి. ఇలాగే కొందరు శాస్త్రవేత్తలు చేసిన చిన్న పొరపాట్లు కొత్త ఆవిష్కరణలకు దారితీశాయి.

అయ్యవారు ఏంచేస్తున్నారు అంటే చేసిన తప్పులు దిద్దుకుంటున్నారు అని పాతకాలంలో ఒక నానుడి ఉండేది. తప్పులు చేయడం మానవ సహజమని ఒక రంటే, తప్పులెన్నేవారికి తమ తప్పులు తెలియవని మరొకరు అన్నారు. తెలిసి చేసినా తెలియక చేసినా తప్పు తప్పే అనే వారూ ఉన్నారు. అన్నీ తెలిసిన వాళ్లూ ఏదీ తెలియని వాళ్లూ లేరు. అందువల్ల ఒప్పులే చేసే వాళ్లూ తప్పులే చేయనివాళ్లూ అరుదు. కొన్ని ఊళ్లలో పాత రోజుల్లో పంచాయితీల వాళ్లు - ఎవరయినా తప్పుచేసి నట్టు రుజువయితే తప్పు వేసే వారు. ఇక్కడ తప్పు అంటే జరిమానా అన్నమాట.

తప్పన్నా పొరపాటన్నా ఒకటేనా? తెలిసి చేసేది తప్పు కావచ్చు. తెలియక జరిగేది పొరపాటు కావచ్చు. సంస్కృతంలో పొరపాటును ప్రమాదం అన్నారు. పెద్దవాళ్లయినా పొరపాట్లు చేయవచ్చు. ఏనుగయినా కాలుజారి కిందపడవచ్చు.

ఐజాక్ న్యూటన్ ప్రయోగాలు చేసుకొంటూ ఉంటే ఒక పిల్లీ దాని పిల్లలూ మాటిమాటికీ ఆ గది లోపలికీ బయటికీ తిరుగుతూ ఉండేవట. తలుపు వేసి ఉంటే తీసేదాకా గొడవ చేస్తుండేవట. దాంతో న్యూటన్ తమ పని చెడిపోకుండా ఉండేం దుకు ఒక ఏర్పాటు- కాదు రెండు ఏర్పాట్లు చేయించారట. అంటే తలుపుకు రెండు బెజ్జాలు వేయించారన్న మాట. ఎవరో వచ్చి తలుపుకు ఈ రెండు బెజ్జాలు ఎందుకు వేయించారని అడిగితే 'పెద్దది తల్లి పిల్లి పోవడానికీ, చిన్నది పిల్లి పిల్లలు పోవడానికీ' అని బదులిచ్చాడట న్యూటన్.

దిద్దుకోగలిగిన తప్పులూ దిద్దుకోలేని తప్పులూ కూడా ఉంటాయి. కందుకూరి వీరేశలింగం పంతులుగారు ఏది రాసినా ఒకసారి గట్టిగా ఆలోచించి రాసేవారు. అందుకే ఆయన తమకు రాసిన దాన్ని కొట్టివేయడమూ దిద్ది రాయడమూ అలవాటు లేదని గట్టిగా రాసుకోగలిగారు. విశ్వకవి రవీంద్రులు తాము రాస్తున్న పుటలో

ఏవయినా దిద్దుబాట్లూ సర్దుబాట్లూ చేయవలసి వస్తే ఆ కొట్టిన పదాలను కలిపి పూవులలాగానో తీగెలలాగానో ఒక అందమైన చిత్రం తయారుచేసేవారు.

కొందరి విషయంలో పొరపాట్లు చేయడం అలవాటుగా మారుతుంటుంది. చార్లెస్ లాంబ్ ఆంగ్లంలో పెద్ద పేరు తెచ్చుకున్న రచయిత. ఆయన లండన్‌లోని తూర్పు ఇండియా కంపెనీలో కొన్నాళ్లు ఉద్యోగం చేశాడు. రోజూ పనికి ఆలస్యంగా వచ్చేవాడు. ఒకటి రెండుసార్లు లాంబ్‌ను మందలించిన పెద్దలు, ఆలస్యంగా రావడం లాంబ్‌కు అలవాటుగా మారడంతో ఒకసారి తీవ్రంగా అడిగారట – 'ఒకటి రెండు సార్లయితే పొరపాటు అనుకోవచ్చు – రోజూ చేస్తే తప్పుడు అలవాటు కదా' అని. లాంబ్ అందుకు 'నేనూ రోజూ ఆలస్యంగా వస్తున్న మాట సరే. రోజూ ముందుగానే వెళ్లిపోతున్నా కదా' అని గట్టిగా బదులు చెప్పాడట.

కొన్నిరకాల ఉద్యోగాలు చేయడానికి కొన్ని రకాల అర్హతలు ఉండాలి. కొందరికి రంగులను సరిగా గుర్తుపట్టలేని బలహీనత ఉంటుంది. అటువంటి వారికి రైళ్లు నడపడం వంటి ఉద్యోగాలు ఇవ్వరు. కళ్లలో రంగులను గ్రహించే స్తూపాలవంటి అమరికలు 3 ఉంటాయని 1960 నాటికి శాస్త్రవేత్తలు కనుగొన్నారు. రంగుల తరంగాల పొడవును బట్టి వాటి విశ్లేషణ జరుగుతుంది. కొందరిలో మూడు అమరికలలో ఒకటో రెండో పనిచేయకపోవచ్చు. అటువంటివారు అన్ని రంగులూ గుర్తుపట్టలేరు.

మనసు చేసే మాయవల్ల ఒక అక్షరానికి బదులు మరొక అక్షరం చదువుకుంటుంటారు కొందరు. ఈ రకమైన ఇబ్బంది అనువాదాలు చేసేవారికీ, కొన్నిసార్లు మహా పండితులకూ ఎదురవుతూ ఉంటుంది. అస్తగిరి అంటే సూర్యుడు అస్తమించే పడమటి కొండ. అందస్తగిరి అని ఉన్నదాన్ని దస్తగిరి అని చదువుకొని పండితులొకరు ఊహాగానం చేశారు. కీర్తిశేషులు అనడానికి సంగ్రహంగా కీ.శే. అనీ, క్రీస్తుశకం అనడానికి సూక్ష్మంగా క్రీ.శ. అని రాయడం అలవాటు. ఒక పండితుడు తొందరలో క్రీ.శ. అని రాయడానికి బదులు క్రీ.శే. అని పొరపాటు రాసుకున్నారు.

'నా మొగం చూసి ఎవరూ గుర్తుపట్టరు. నన్ను వెనుకనుంచి చూసి నేను వాళ్ల స్నేహితుడిలాగా ఉన్నాననో తమ్ముడి బావమరిదిలాగా ఉన్నాననో నా వీపుమీద బాది మరీ పలకరించి – పొరపాటుకు చింతించి పోతుంటారు. ఇట్లా నా వీపు పొరపాటు దెబ్బలు ఎన్ని తిన్నదో' అని కన్నడ రచయిత ఒకరు వాపోయారు.

ఒక్కోసారి పొరపాట్ల వల్ల మేలుకూడా జరగవచ్చు. మన దేశానికి బయలుదేరిన కొలంబస్ అమెరికా తీరానికి చేరడం అరుదుగా జరిగే మంచి పొరపాట్లలో ఒకటి.

స్పెయిన్ నుంచి మనదేశం చేరడానికి పడమరగా ప్రయాణం చేయాలనీ, స్పెయిన్ నుంచి ఇండియా ఎక్కువ దూరంలోలేదనీ ఆ దూరం 3900 మైళ్లు అంటే

6275 కిలోమీటర్లేననీ ప్రపంచంలో ఆరుపాళ్లు నేల ఒకపాలు సముద్రం ఉంటుందనీ- రకరకాల పొరపాటు అంచనాలతో బయలుదేరినా కొలంబస్ కొత్త ప్రపంచాన్ని కనుగొన్నవాడుగా చరిత్రకెక్కాడు.

ఇలాగే కొందరు శాస్త్రవేత్తలు చేసిన చిన్న పొరపాట్లు కొత్త ఆవిష్కరణలకు దారితీశాయి. శాస్త్రవేత్తలూ పొరపాట్లు చేయవచ్చు. 25 ఏళ్ల క్రితం ఒక శాస్త్రవేత్త మానవులు కనీవినీ ఎరుగని తోకచుక్క ఒకటి కనిపిస్తుందని ప్రకటించారు. తీరా ఆ తోకచుక్క గురించి శాస్త్రవేత్త వేసిన లెక్కల్లో తప్పులు దొర్లాయని తేలింది.

ముక్తాయింపు:

ఒక ఊళ్లో ఒక పెద్ద మనిషికి కవల పిల్లలు ఉండేవారు. ఆ పిల్లలు పెరిగి పెద్దవాళ్లయిన తర్వాత ఒకరోజు తండ్రి ఏదో మాట అంటే - ఆ పిల్లల్లో చిన్నవాడు అలిగి ఎక్కడికో వెళ్లిపోయాడు. కొన్నాళ్లకు కవలలలో పెద్దవాడు బజారులో వెడుతుంటే - ఒక ముసలమ్మ ఎదురయింది. అబ్బాయి ఆమెను పలకరించాడు. ఈలోగా ఆమెకు ఒక అనుమానం రాగా 'ఊరు విడిచి వెళ్లింది నువ్వా! నీ తమ్ముడా! బాబూ' అని అతణ్ణి అడిగింది.



3. చూపుల్లో తేడా

ప్రతి ఒకరూ ప్రపంచం ఎట్లా ఉండాలని తాము అనుకుంటున్నారో ఆ దృక్పథంతోనే చూస్తుంటారు. ఒక వ్యక్తికి మంచి అనిపించింది మరొక వ్యక్తికి చెడుగా కనిపిస్తుంది. అంతమాత్రాన ఇద్దరిలో ఒకరు మంచివారనీ రెండవవారు చెడ్డవారనీ చెప్పడం పొసగదు. మనుషులలో మంచీ చెడూ కలిసే ఉంటాయి. కళ్ల ముందు ఒక వేలును పెట్టుకుని చూడాలనుకోండి. ఒక వేలునే ఎన్నిరకాలుగా చూడవచ్చు? మూడురకాలుగా చూడవచ్చు. రెండుకళ్లతో కలిసి ఒక చూపు. ప్రతి కంటితో విడివిడిగా రెండుచూపులు.

'కండవర్ విండిలై విండవర్ కండిలై' అని తమిళంలో ఒకసూక్తి ఉంది. అంటే చూసినవారు చెప్పలేరు. చెప్పినవారు చూడలేరు అని అర్థం. కన్నులు చూస్తాయి. కాని మాట్లాడలేవు. నోరు మాట్లాడుతుంది. కానీ చూడదు. చూసి చెప్పడంలో చెప్పి చూడడంలో తేడాలుండవచ్చు. ఈ తమిళ సూక్తికి ఆధ్యాత్మికంగా కూడా అర్థం చెప్ప వచ్చునట. ఆత్మ సాక్షాత్కారం పొందినవారు మౌన ముద్రాలంకారులుగా ఉంటే ఆ అనుభవం లేనివారు ఎక్కువగా మాట్లాడుతూ ఉంటారని అభిప్రాయం.

ఒక విషయం గురించి చెప్పవలసినప్పుడు కూడా పదుగురు పదిరకాల అభిప్రాయాలు చెబుతూ ఉంటారు. ఒక్కోసారి ఒక విషయం గురించి ఒక వ్యక్తి అభిప్రాయం కూడా ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క తీరులో ఉండవచ్చు. మనిషి దృక్పథంలో ఇటువంటి మార్పులు ఎందుకు వస్తుంటాయి? అసలు దృక్పథం అంటే ఏమిటి?

ఏ విషయాన్నయినా ఎవరయినా ఏ కోణం నుంచి చూస్తున్నారు అనే దాన్నిబట్టి వారి దృక్పథం ఏమిటో తెలుసుకోవచ్చు.

ఒక సభాగారంలో ఒక సభ ఏర్పాటు చేశారట. సభలో 300 ఆసనాలు ఉన్నా యట. సభకు రమ్మని ఆహ్వానాలు ఎందరికో పంపినా వచ్చినవారు 150 మందేనట. సభ సగమే నిండింది. సభా నిర్వాహకులలో ఒకరు సగం సభ ఖాళీగా ఉందన్నాడట. మరొక నిర్వాహకుడు సభ సగమే నిండిందన్నాడట.

అక్బర్ చక్రవర్తి, బీర్బల్ ఒకసారెప్పుడో కలిసి కూచుని భోజనం చేస్తుండగా వంకాయ కూర వడ్డించారట. అక్బర్ ఆ కూర తిని – కాయగూరలలో వంకాయ వంటిది లేదంటే బీర్బల్ అవును అవునన్నాడట. మరి కొన్నాళ్లకు మళ్లీ వంకాయ కూర వండితే అక్బర్ ఛీ వంకాయ వంటి నీరసమైన శాకం ఇంకోటి లేదంటే బీర్బల్ అవును అవునన్నాడట. అక్బర్‌కు అనుమానం వచ్చింది. అప్పుడు వంకాయ వంటిది లేదంటే అవునని ఇప్పుడు కాదన్నా అవుననడంలో అంతరార్థం ఏమిటి అని బీర్బల్‌ను అడిగాడట. ఇలా భిన్నమైన అభిప్రాయాలు చెప్పడంవల్ల బీర్బల్‌కు నిలకడ లేదని అనుకోవలసి రావచ్చునన్నాడట. అందుకు బీర్బల్ అక్బర్‌తో 'నేను పాదుషా గారి సేవకుడిని కానీ వంకాయకు సేవకుడిని కాను' అని చెప్పాడట.

మహమ్మద్ ప్రవక్త ఒకసారి తమ అనుయాయులతో కలిసి ఒక ఊరికి వెళ్లారట. ప్రవక్తను చూడగానే ఆయనపట్ల అభిమానంగల ఒక మనిషి ఆయన దగ్గరికి వచ్చాడట. 'అయ్యో! ఈ ఊరికి ఎందుకు వచ్చారు? ఇక్కడి వాళ్లు మొండి వాళ్లు. ఎవరికీ ఏదీ తెలుసుకోవాలనే జిజ్ఞాసకానీ ఓపికకానీ లేవు' అన్నాడట. ప్రవక్త తల పంకించి 'మీరు చెప్పింది సమంజసంగానే ఉంది' అన్నారట. కాసేపటికి మరొక పెద్దమనిషి ప్రవక్త దగ్గరికి వచ్చాడట. ఆయన ప్రవక్తతో – 'మీరు ఈ ఊరికి వచ్చి చాలా మంచి పనిచేశారు. ఇక్కడివాళ్లు చాలా సహృదయులు. వీళ్లకు మంచి విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తీ ఆలోచనా ఎక్కువ' అన్నాడట.ప్రవక్త తల పంకించి 'మీరు చెప్పింది సమంజసంగానే ఉంది' అని చెప్పారట.

ప్రవక్త వెంట వచ్చిన అనుయాయులలో ఒకాయనకు అనుమానం కలిగింది. ఆయన నెమ్మదిగా ప్రవక్తను ప్రశ్నించాడు. 'ఆయన చెప్పిన అభిప్రాయానికి భిన్నమైన అభిప్రాయం ఈయన చెప్పాడు. తమకు ఇద్దరి అభిప్రాయాలూ సమంజసంగా ఉందన్నారు. ఇది ఎలా సాధ్యం' అని ఆయన అడిగారు.

అందుకు ప్రవక్త – 'ప్రతి ఒకరూ ప్రపంచం ఎట్లా ఉండాలని తాము అను కుంటున్నారో ఆ దృక్పథంతోనే చూస్తుంటారు. ఒక వ్యక్తికి మంచి అనిపించింది మరొక వ్యక్తికి చెడుగా కనిపించింది. అంతమాత్రాన ఇద్దరిలో ఒకరు మంచివారనీ రెండవ వారు చెడ్డవారనీ చెప్పడం పొసగదు. మనుషులలో మంచీ చెడూ కలిసే ఉంటాయి. ఇద్దరు చెప్పిన మాటలలోనూ తప్పులేదు. కాకుంటే వారు చెప్పిన అభిప్రాయాలు అసమగ్రంగా ఉన్నాయని చెప్పవచ్చు' అన్నారట.

మానసిక శాస్త్రవేత్త ఒకరి అభిప్రాయం ప్రకారం – మానవ దృక్పథాలలోని తేడాలకూ ఘర్షణలకూ ప్రధానమైన అంశాలు నాలుగు. అవి వ్యక్తికీ ఆ వ్యక్తి శరీరానికీ మధ్య ఉండే సంబంధం. వ్యక్తికీ ఆ వ్యక్తి హోదాకూ సాధించిన ప్రగతికీ

మధ్య ఉండే సంబంధం. ఆ వ్యక్తికీ తక్కిన వ్యక్తులకూ సంఘానికీ మధ్య ఉండే సంబంధం. ఆ వ్యక్తికి తన ఆలోచనలతో కల్పనా శక్తితో భవిష్యత్తుతో ఉండే సంబంధం. రోజంతా పనిచేసిన తర్వాత ఏకాంతంగా విశ్రమిస్తే బాగుంటుందన్నది పాశ్చాత్య దృక్పథం. మన గ్రామాలలో రోజంతా పని చేశాక అయిన వాళ్లతో స్నేహితులతో కలిసి సరదాగా కాలక్షేపం చేయటం విశ్రాంతిలో భాగంగా కనిపిస్తుంది.

కళ్లముందు ఒక వేలును పెట్టుకుని చూడాలనుకోండి. ఒక వేలునే ఎన్ని రకాలుగా చూడవచ్చు? మూడు రకాలుగా చూడవచ్చు. రెండు వేళ్లతో కలిసి ఒక చూపు. ప్రతి కంటితో విడివిడిగా రెండు చూపులు.

ముక్తాయింపు:

ఉగాది గురించి కవిత రాయమని ఒక దినపత్రిక వారు, ఒక వారపత్రిక వారు, ఉగాది కవి సమ్మేళనం ఏర్పాటు చేయాలనుకున్న ఒక సంస్థవారూ ఒక కవిగారిని కోరారట. కవిగారు ఒకే కవితరాసి మూడు ప్రతులు తీసి పంపించారట. ఇలా చెయ్యవచ్చా అని మరొక కవిగారికి అనుమానం వచ్చింది. ఆయన వెళ్లి ఒక పండితుడిని అడిగాడు. పండితుడు– 'మీ గురించి ఆ కవిగారి అభిప్రాయం ఏమిటో అడిగితే ఎవరు అడిగినా అదే చెబుతారు కదా! ఈ ఏడాది ఉగాది గురించి ఆయన దృక్పథం అది. ఎందరు అడిగినా అదే చెబుతాడు' అని వివరించాడు.



4. మిమ్మల్ని మీరు తెలుసుకోండి

బలాలు, బలహీనతలు ఏమిటో తెలిస్తే చాలదు. మేలిరకం విత్తనాలు తెచ్చి జాగ్రత్త పెట్టినంత మాత్రాన చెట్లు వాటంతట అవే పుట్టుకు రావు. పెరగవు. ప్రతి మనిషిలోనూ వేర్వేరు శక్తి సామర్థ్యాలు ఉంటాయి. రహదారిలో ఒకవైపు నుంచి ఎదురువైపుకు వెళ్లేముందు ఆగి జాగ్రత్తగా అటూ, ఇటూ చూసి దాటమని చెబుతుంటారు. జీవితపు రహదారికీ ఈ సూత్రం అన్వయిస్తుంది.

అనగనగా ఒక బడి. ఆ బడిలో ఒక ఉపాధ్యాయుడు. బడి చదువు అయిపోయి కళాశాలలకు పైచదువుల కోసం వెళ్లబోయే విద్యార్థులను ఆయన ఒక ప్రశ్న అడిగే వాడట. 'మిమ్మల్ని ఎవరయినా ఎట్లా గుర్తుపెట్టుకోవాలని అనుకుంటున్నారు' అన్నదే ఆ ప్రశ్న. ఆ ప్రశ్నకు ఒకల్లిద్దరు విద్యార్థులే జవాబులు చెప్పేవారట. చాలామంది జవాబులు చెప్పేవారు కాదట. అప్పుడు ఆ ఉపాధ్యాయుడు 'ఇప్పుడు ఈ ప్రశ్నకు జవాబు చెప్పలేకపోతే ఇబ్బంది లేదు. ముప్పై నలభై ఏళ్ల తర్వాత ఈ ప్రశ్నకు మీరు జవాబు చెప్పలేకపోతే మీ జీవితం సార్థకం కాలేదని అనుకోవలసి రావచ్చు' అని చెప్పేవాడట. ఒక ఆర్థర్ కాటన్‌ను, ఒక సి పి బ్రౌన్‌ను, ఒక వీరేశలింగాన్ని, ఒక గురజాడ అప్పారావును ఎందుకు గుర్తు చేసుకుంటున్నాము?

ఎవరినయినా ఎందుకు గుర్తు పెట్టుకోవాలి? ఈ ప్రశ్నకు జవాబు చెప్పేముందు మరెన్నో ప్రశ్నలకు జవాబులు చెప్పాలి. ఈ ప్రశ్నలు ఎవరికి వారు వేసుకోవలసినవే. 'అసలు వ్యక్తిగా నా ఉనికి ఏమిటి?' అన్నది మొదటి ప్రశ్న. ఒంటరిగా బతుకీడ్చే ఏ కొందరికో తప్ప చాలామందికి కుటుంబపరంగా, సమాజపరంగా తాము స్వీకరించిన వృత్తి ఉద్యోగాల పరంగా ఉనికి ఉంటుంది. ఒకవేళ 'వ్యక్తిగా నా ఉనికి ఏమిటి' అన్న ప్రశ్నకు 'కుటుంబంలో కానీ, వ్యవస్థలోకానీ, పనిచేసే సంస్థలోకానీ ఇమడలేక పోతున్నాను' అనేది సమాధానమైతే మరికొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. మనం సరయిన చోట లేమా? ఇమడలేకపోవడానికి మనలోపం కారణమా? మనం పనిచేస్తున్న వ్యవస్థలోని లోపం కారణమా? మనకు గుర్తింపు రావలసినంతగా రావడం లేదన్నది కారణమా?

ఉద్యోగాల విషయమే తీసుకుంటే మొదటి ఉద్యోగం లాటరీ వంటిదని కొందరు

అంటారు. అంటే అది మనకు తగిన ఉద్యోగం అయినా కావచ్చు. అనువైనది కాకుండానూ పోవచ్చు.

చేస్తున్న పనిలో మార్పు లేకుంటే విసుగు పుడుతుంది. ఈ విసుగునుంచి తప్పించుకోవడం ఎలా? 'పనిలో ఆసక్తి లేనప్పుడు పనిచేసే తీరులో మార్పుచేసు కోగలమా?' అని చూడాలి అంటారు మానసిక శాస్త్రవేత్తలు. కొందరికి గానుగెద్దు పద్ధతి సుఖంగా ఉంటుంది. ఆ సుఖం అలవాటయితే కొత్త పద్ధతులు, కొత్త ఆలోచ నలు కష్టం అనిపిస్తాయి. అవసరంకన్నా ఎక్కువ పనిచేసే పరిస్థితుల్లో ఉంచే ఉద్యోగాలూ ఉంటాయి. చేసిందే చేసిందే చేసిందే చేస్తూ ఉంటే వచ్చే యాంత్రికత నుంచి బయటపడాలి. అయితే అందరికీ పనికివచ్చే అద్భుత నివారణోపాయాలు లేవు. ప్రతి వ్యక్తిలోనూ బలాలూ, బలహీనతలూ ఉంటాయి. మన బలమేమిటో బలహీనత ఏమిటో, ఏదయినా పనిచేసినప్పుడే తెలుస్తుంది.

ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ - సింఫనీ వాద్య బృందంలో వయొలిన్ వాయించడం కోసం తాము ఏమయినా చేయగలం అనేవారు. లెక్కలంటే తమకు చిరాకు అనేవారు. రోజుకు నాలుగు గంటలు వయొలిన్ సాధన చేసినా - ఆయన సమస్యల కారణంగా ఆయన సింఫనీ వాద్యబృందంలో చేరలేకపోయారు. అయినా గణితశాస్త్రంలో మేధావిగా పేరు తెచ్చుకొన్నారు.

బలాలు, బలహీనతలు ఏమిటో తెలిస్తే చాలదు. మేలిరకం విత్తనాలు తెచ్చి జాగ్రత్త పెట్టినంత మాత్రాన చెట్లు వాటంతట అవే పుట్టుకురావు. పెరగవు. ప్రతి మనిషిలోనూ వేర్వేరు శక్తి సామర్థ్యాలు ఉంటాయి. రహదారిలో ఒకవైపునుంచి ఎదురు వైపుకు వెళ్లేముందు ఆగి జాగ్రత్తగా అటూ ఇటూ చూసి దాటమని చెబు తుంటారు. జీవితపు రహదారికీ ఈ సూత్రం అన్వయిస్తుంది.

తనను తాను తెలుసుకోవడంవల్ల తన బలాలు ఏవో, బలహీనతలు ఏవో తెలుసుకోవడంవల్ల వ్యక్తిత్వాన్ని దిద్దుకోవచ్చు. మార్పుకు వయసు ప్రతిబంధకం కాదు. అయితే వ్యక్తిత్వ వికాసానికి అడ్డదారులు లేవు. వ్యక్తిత్వ వికాసానికి ఆస్తి పాస్తులూ, పేరు ప్రతిష్ఠలూ కొలతబద్దలు కావని పెద్దల హెచ్చరిక.

ముక్తాయింపు:

పరిశోధకులుగా, కవిగా పేరు గడించిన పండితులొకరు చాలా ఏళ్లు ఆ క్షేత్రంలో ఉండేవాడు. ఆ కవిగారు పరమపదించిన తర్వాత ఆయన గురించి వ్యాసం వ్రాయడం కోసం ఒక రచయిత ఆ ఊరికి వెళ్లి కవిగారికి పరిచితులుగా పేరొందిన ఒక పండితుడి ఇంటికి వెళ్లాడు. 'కవిగారిని నేనెలా మరచిపోతానండీ! ఒక వాయ 32 ఇడ్డెన్లు వేడివేడిగా అట్టే తినేవారు కదా' అన్నాడట ఆ పండితుడు.



5. ప్రయత్నమే పరమావధి

స్వర్గలోకంలోని గంగను పాతాళం దాకా తీసుకు రావడానికి భగీరథుడు ఎన్నో ప్రయత్నాలు చేశాడు. తన లక్ష్యం నెరవేరేదాకా విశ్రమించలేదు. అతీతమైన ప్రయత్నాలకు ఆంజనేయస్వామి ఒక మంచి ఉదాహరణ. అవసరమైతే ఆకారం పెంచుకోనూ గలడు. అక్కరలేదంటే సూక్ష్మ రూపం ధరించనూ గలడు. సాగరం దాటనూ గలడు. సంజీవనిని తేనూగలడు.

'మన అనుమానాలే మన పాలిట ద్రోహులు – మనలను ప్రయత్నం చేయనీక భయపెడతాయి. మనం గెలుచుకోగల మంచిని కోల్పోయేలా చేస్తాయి' అని మహాకవి షేక్స్పియర్ 'మెషర్ ఫర్ మెషర్' అనే నాటకంలో వ్రాశారు. అనుమానం ఒక సమస్య. ప్రయత్నం చేయకపోవడం మరొక సమస్య. ఎవరెస్ట్ శిఖరం మీద తొలిసారి అడుగుపెట్టిన వారిలో ఒకరయిన ఎడ్మండ్ హిలరీ– 'మనం గెలిచేది కొండను కాదు మనలనే' అన్నారు.

ప్రతి మనిషికీ కొన్ని బలాలూ కొన్ని బలహీనతలూ ఉంటాయి. బలాలను పెంచుకోవాలి. బలహీనతలను తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. మంచిని పెంచడానికి ప్రయత్నం అవసరం. ఏదయినా పనిచేయడానికి ప్రయత్నం కావాలి. ఆ ప్రయత్నం చేయడానికి ఆలోచన కావాలి. పని జరగడానికి ఒకోసారి మానసిక ప్రయత్నంతోబాటు శారీరక ప్రయత్నమూ కావాలి. ఆ ప్రయత్నం చేయ్యడానికి పరిశ్రమించాలి. కష్టనష్టాలను ఓర్చుకోవాలి. కిందపడిన ప్రతిసారీ లేవడానికి ప్రయత్నం అవసరం. అబ్రహాం లింకన్ అమెరికాకు అధ్యక్షుడు అయే నాటికి ఆయన వయసు 51 సంవత్సరాలు. అంతకు ముందు తమ 47వ ఏట ఆయన ఉపాధ్యక్ష పదవికి పోటీచేసి ఓడిపోయారు. అంతకుముందు శాసనసభకు పోటీచేయడానికి ఆయనకు అభ్యర్థిత్వం దొరకలేదు. ఆయన యువకుడుగా ఉన్నప్పుడు రెండుసార్లు వ్యాపారంలో నష్టపోయారు. అప్పట్లోనే ఒకసారి మానసికంగా దెబ్బతిని కుంగిపోయారు. ఎన్ని కష్టాలు వచ్చినా ఎన్ని నష్టాలు ఎదురయినా తట్టుకుని నిలబడి తన ప్రయత్నాలు కొనసాగించాడు ఆయన.

కొన్ని సందర్భాలలో కొన్ని విమర్శలు ఎంతటి ఉత్సాహవంతులనయినా నీరు కార్చేస్తాయి. ఆంగ్ల మహాకవి కీట్స్ - విమర్శల ధాటికి తట్టుకోలేకపోయారు. సంగీత శాస్త్ర కోవిదులుగా పేరు గడించిన బీథోవెన్‌కు సంగీతం నేర్పిన ఉపాధ్యాయులలో ఒకరు బీథోవెన్ సంగీత స్రష్టగా రాణించలేడని చెప్పారు. లూయీ పాశ్చర్‌కు రసాయన శాస్త్ర పరిజ్ఞానం అంతంత మాత్రమే అని విమర్శించిన వారున్నారు. నాలుగేళ్ల వయసుదాకా మాట్లాడడం కూడా చేతకాని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌కు చదువు అబ్బడం కష్టమన్నారు. మరికొందరు మేధావులు చిన్నతనంలో ఇబ్బందులు పడినవారే. గణిత శాస్త్రంలో అద్వితీయులుగా పేరు గడించిన శ్రీనివాస రామానుజంగారికి బడిలో చదువుకుంటున్న రోజులలో లెక్కలు చెప్పే ఉపాధ్యాయులతో ఇబ్బందులు ఎదురయ్యేవట. రాకెట్ వైజ్ఞానికులుగా ప్రసిద్ధులయిన వెర్నెర్ వాన్ బ్రాన్ (Wernher Von Braun) ఉన్నత పాఠశాలలో చదువుతున్నప్పుడు లెక్కల పరీక్షలో ఉత్తీర్ణులు కాలేకపోయారు. విన్‌స్టన్ చర్చిల్ బడి చదువుల రోజులలో చాలా ఇబ్బందులు పడ్డారు. ఘంటసాల వెంకటేశ్వరరావు చిన్నతనంలో వాళ్ల పొరుగూరిలో జరిగిన సంగీత కార్యక్రమంలో అవమానానికి గురయ్యారు. అయితే ఉత్తరోత్తరా తాము ఎన్నుకొన్న రంగాలలో ప్రసిద్ధులు కావడానికి వాళ్ల ప్రయత్నాలే కారణాలు. ప్రయత్నం చేయడానికి వయసుతో నిమిత్తం లేదు.

క్లాడ్ మోనెట్ అనే ప్రసిద్ధ చిత్రకారుడు తన ఎనభయ్యవ ఏట కూడా చిత్రాలు చిత్రిస్తూనే ఉన్నారు. కంటిచూపు మందగించినా ఆయన రోజుకు 12 గంటలు పని చేస్తూనే ఉండేవారు. పాబ్లో పికాసో జగత్ప్రసిద్ధి చెందిన చిత్రకారుడు. 92 ఏళ్లు జీవించారు. 70 ఏళ్లు దాటాక కొత్త చిత్రకళా శైలిని రూపొందించారు. స్పెయిన్ దేశానికి చెందిన పాబ్లో కాసల్స్ - చెల్లో వాద్య కళాకారులుగా ప్రసిద్ధులు. 1973లో ఆయన చనిపోయేనాటికి ఆయన వయసు 97 ఏళ్లు. ఆరోజుకూడా ఆయన ఏదో ఒక కొత్త సంగీతాన్ని వాయించడానికి సాధన చేస్తూ ఆ ప్రయత్నంలో చనిపోయారు.

ప్రయత్నం అంటే మనకు భగీరథుడి ప్రయత్నం గుర్తుకు వస్తుంది. స్వర్గలోకంలోని గంగను పాతాళం దాకా తీసుకురావాలి. ఆ గంగను తీసుకురావడానికి భగీరథుడు ఎన్నో ప్రయత్నాలు చేశాడు. తపసులు చేశాడు. తన లక్ష్యం నెరవేరేదాకా విశ్రమించలేదు. అతీతమైన ప్రయత్నాలకు ఆంజనేయస్వామి ఒక మంచి ఉదాహరణ. అవసరమైతే ఆకారం పెంచుకోనూ గలడు. లేదంటే సూక్ష్మరూపం ధరించనూ గలడు. సాగరం దాటగలడు. సంజీవనిని తేనూగలడు. చిన్న విషయాలకు ఒకోసారి పెద్ద ప్రయత్నాలు అవసరం. తెల్లవారు జామున నిద్రలేవడం, ఉత్తరాలకు జవాబులు వ్రాయడం, పొదుపు పాటించడం, కాలం వృథా చెయ్యకుండా ఉండడం వంటివి చిన్న విషయాలుగా కనిపించినా కొందరికి అవి ఎంతో ప్రయత్నం చెయ్యనిదే

సాధ్యం కావు. మనం చేయలేని పనులు చేయడానికి ఎంత ప్రయత్నించినా సాధ్యం కాదు. మనకు సాధ్యమైన మంచి పనులు చేయడానికి ప్రయత్నించాలి. గుండె ధైర్యమే పెట్టుబడిగా ప్రయత్నాలు చేసి తాము ఎన్నుకొన్న రంగాలలో విజయం సాధించినవారు మన దేశంలోనూ కోకొల్లలుగా కనిపిస్తారు. తెలుగువారి సంగతే తీసుకుంటే పూట గడవని స్థితిలోనుంచి లక్షలాది రూపాయలు ఆర్జించే న్యాయ వాదిగా ఎదిగిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, 'నీ గొంతు మైక్‌కు పనికిరాదు' అన్నవారిచేతే తన పాటలు పదే పదే రికార్డు చేయించుకునే స్థాయికి ఎదిగిన ఘంటసాల వెంకటేశ్వరరావు – మంచిని పెంచుకోవడానికి ప్రయత్నాలు ఎలా పనికివస్తాయో తెలియజేసే ఆదర్శ పురుషులకు ఉదాహరణలు.

ముక్తాయింపు:

అనగనగా ఒక పత్రికా రచయిత తమ పత్రిక కోసం ఒక చలన చిత్ర నటుడితో సంభాషిస్తూ బోలెడు ప్రశ్నలు అడిగాడు. అలవాటుగా – 'మీరు చలన చిత్రాలలోకి రాకుండా ఉంటే ఏం చేస్తూ ఉండేవారు' అని అడిగాడు. అందుకు ఆ నటుడు 'చిత్రాలలోకి రావడానికి ప్రయత్నిస్తూ ఉండేవాడిని' అని జవాబిచ్చాడు.



6. ఏం చేస్తే మీకు ఆనందం?

ఏం చేస్తే మీకు సంతోషంగా ఉంటుంది? కొత్త విషయం తెలుసుకోవడమూ, కొత్తపని చేయడమూ సంతోషం కలిగిస్తాయని చాలామంది భావన. సంగీతం వినడం, కొండలెక్కడం, ఈత కొట్టడం, గాలిపటాలు ఎగరవేయడం, చదవడం, బొమ్మలు గీయడం, బొమ్మలు చేయడం - ఇలా రకరకాల పనులు చాలామందికి సంతోషం కలిగించే విషయాలే.

సంతోషమూ దుఃఖమూ అని విడివిడిగా లేవనీ సంతోషంతో పొంగి పోవడమూ దుఃఖంతో కుంగిపోవడమూ అనుచితమని కొందరు తత్త్వవేత్తలు చెబుతుంటారు. ఒక ఊళ్లో ఒక వీధిలో ఒక మనిషి నడుస్తూ ఐదురూపాయల నోటు పారేసుకున్నాడు. ఆయన వెనక వస్తున్న మనిషికి ఆ నోటు దొరికిందట. పారేసుకున్న మనిషి కాసేపు తర్వాత తనవి ఐదురూపాయలు పోయాయని గ్రహించాడు. డబ్బు పోయినందుకు దుఃఖించాడు. దొరికిన మనిషి సంతోషించాడు. ఈ వ్యవహారంలో డబ్బు పోగొట్టు కొన్న వ్యక్తి దుఃఖం వెలా అది దొరికిన వ్యక్తి సంతోషం వెలా ఐదురూపాయలే.

'సంతోషమూ దుఃఖమూ రెండూ మనస్సుకు సంబంధించిన స్థితులే' అని గుర్తించాలని పెద్దలు చెబుతుంటారు. 'పారడైస్ లాస్ట్' అనే తొణికిన స్వర్గం కావ్యంలో ఆంగ్ల మహాకవి జాన్ మిల్టన్ ఒక పాత్ర చేత పలికించిన అభిప్రాయం ఇక్కడ గమనించాలి. 'మనసుదొక ప్రత్యేకస్థానం. అది స్వర్గాన్ని నరకంగానో నరకాన్ని స్వర్గంగానో చేసుకోగలదు' అంటాడు మిల్టన్.

ఏది సంతోషం ఏది దుఃఖం అనే ప్రశ్నలకు సరైన సమాధానాలు దొరకవు. సంతోషం కానిది దుఃఖం, దుఃఖం కానిది సంతోషం అని నిర్వచించడం వల్ల సంతోషం కలగదు. సంతోషమూ దుఃఖమూ మనిషిలోనే ఉంటాయి. మనిషికి వెలుపల ఉండవు. ఏ మనిషి అయినా తనకు బాహ్యంగా ఉన్న పరిస్థితుల'వల్ల కానీ తక్కిన మనుష్యుల వల్ల కానీ కలిగే సంతోషమూ దుఃఖమూ తనను బాధించని స్థితిలో ఉండడం చాలా కష్టం. సన్మార్గంలో సరైన పనులు చేయడం పిల్లలకు నేర్పాలనీ అలా వాళ్ల సంతోషం అనుభవించేలా చేయాలనీ 2500 ఏళ్ల నాడు ప్లేటో చెప్పారు. సన్మార్గంలో సరైన పనులు చేయడం అంటే ఇతరులను బాధించడం కాదు.

కొందరికి ఇతరులను శారీరకంగా, మానసికంగా బాధించడం ఆనందాన్ని కలిగించ వచ్చేమో కానీ అది నిజమైన ఆనందం కాదు.

నేను బాగున్నాను తక్కిన ప్రపంచం బాగుంది అని కొందరూ, నేనూ బాగా లేనూ ప్రపంచమూ బాగా లేదు అని మరి కొందరూ. నేను బాగా ఉన్నాను ప్రపంచం బాగా లేదు అని కొందరూ, నేను బాగా లేను ప్రపంచం బాగుంది అని మరి కొందరూ అనుకోవడం వల్ల ఆయావ్యక్తుల జీవిత గతులు ఉంటాయని మానసిక శాస్త్రవేత్తలు అంటుంటారు. 'తన కలిమి ఇంద్రపదవి' అని పెద్దలు ఎన్నడో చెప్పారు. ఆనంద సాధనంగా చదువు ఇంకా అభివృద్ధికాలేదని చెప్పాలి.

'ఏం చేస్తే మీకు సంతోషంగా ఉంటుంది' అని ఆ మధ్య మానసిక శాస్త్రవేత్తలు చాలామందిని ప్రశ్నించారు. కొత్త విషయం తెలుసుకోవడమూ, కొత్త పని చేయ డమూ ఎక్కువ సంతోషం కలిగిస్తాయని ఆ చాలామందిలో చాలామంది బదులిచ్చా రట. సంగీతం వినడం, కొండలెక్కడం, ఈత కొట్టడం, గాలిపటాలు ఎగరవేయడం, చదవడం, బొమ్మలు గీయడం, బొమ్మలు చేయడం – ఇలా రకరకాల పనులు చాలా మందికి సంతోషం కలిగించే విషయాలే. అయితే ఒకప్పుడు ఆనందం కలిగించిన పని ఎల్లవేళలా ఆనందం కలిగించేదిగా ఉంటుందని చెప్పడం కష్టం. వేదాంతులు నిత్యానందం గురించి, శాశ్వతానందం గురించి అన్వేషించాలనీ తాత్కాలికమైన సుఖాలకోసం మానవులు పరుగుతీయకూడదనీ చెబుతారు. మామూలుగా చూసినా – ఇష్టమైన పని ఆనందం కలిగించాలి. అయితే తమ ఇష్టం మరొకరికి కష్టం కాకుండా చూసుకోవలసిన సామాజిక కర్తవ్యమూ ఉంటుంది.

'మనుషులు ఆనందంగా ఉండక పోవడానికి కారణాలు ఏమిటి' అని పరిశోధ నలు జరిగాయి. ఏ కొత్త విషయమూ చూసి ఆశ్చర్యపడకపోవడం, ఇతరులను ఆశ్చర్య పరచలేక పోవడం, జీవితంలో ఆనందం కలిగించేది ఏమిటో దుఃఖం కలిగిం చేది ఏమిటో తెలుసుకోకపోవడం, సమస్యలను వివిధ కోణాల నుంచి పరిశీలించక పోవడం, కొత్త అభిప్రాయాలకు ఆస్కారం లేకుండా ప్రవర్తించడం వంటివి దుఃఖ కారణాలని తెలుసుకున్నారు. ఏ మంచి పని అయినా బాగా చేస్తే ఆనందం కలుగు తుంది అని అనుభవం పాఠం నేర్పుతుంది. జీవితం ఎంత యాంత్రికంగా ఉన్నా ఆలోచించడానికీ, విశ్రాంతి తీసుకోవడానికీ కొంతకాలం కేటాయించాలనీ, అలా ఆనందాన్వేషణ చేయాలని మానసిక శాస్త్రవేత్తల సలహా.

ముక్తాయింపు:

'మీరు ఈ వయసులో కూడా ఇంత ఆనందంగా ఉండడానికి కారణమేమిటి' అని ఒక వంద సంవత్సరాల పెద్దమనిషిని ఒక ఇరవై ఏళ్ల చిన్నమనిషి అడిగాడు. 'ఇటువంటి ప్రశ్నలు ఎవరినీ అడగకపోవడమే' అని పెద్దమనిషి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.



7. ఉత్సాహం ఒక్కటే చాలదు

ఉత్సాహం ఉండడం మంచిదే. కాని ఉత్సాహానికి వన్నె తెచ్చే కృషీ, ప్రతిభా రెండూ అవసరమే. ఉస్తాద్ అల్లావుదీన్ ఖాన్‌గారు హిందుస్తానీ సంగీత విద్వాంసులలో అగ్రగణ్యులలో ఒకరు. ఒకసారి ఆయనను ఎవరో హిందుస్తానీ సంగీతం నేర్చుకోవడానికి ఎన్నేళ్లు పడుతుందో చెప్పమని అడిగారట. ఖాన్‌గారు తమ చేతి కర్రపిడిని చూపించి ఈ పిడికి ఈ మెరుగు ఈ చేతికింద 15 ఏళ్లు ఉండడంవల్ల వచ్చింది అని చెప్పారట. ఎంతో కొంత ప్రతిభ ఉంటే, ఆ ప్రతిభకు కృషితో మెరుగు దిద్దవచ్చు.

పాతకాలం తెలుగు సినిమా ఒక దాంట్లో 'ఏం చేస్తే అది ఘనకార్యం' అని పాట ఒకటి ఉంది. ఆ పాట హాస్యనటులతో చిత్రించినది కావడంవల్ల అందులో అపహాస్యం చేయదగ్గ ఘనకార్యాల పట్టీ కూడా కనిపిస్తుంది. చాలామంది ఏదో ఒకటి చేసేయ్యాలనే ఉత్సాహంతో ఉంటారు. కొందరు ఆ ఉత్సాహం కొద్దీ ఏవో పనులు కూడా చేసి ఏదో సమస్యలలో పడుతుంటారు.

గయోపాఖ్యానం కథ చాలామందికి తెలిసిందే. తెలిసి చేసినా తెలియక చేసినా తాను చేసిన పనివల్ల తనకు చెరగని పేరు కావాలనే వరం కోరి గయుడు తపసు చేశాడట. ఆ వరం సంపాదించి విమానంలో ఆకాశంలో విహరిస్తూ తాంబూల సేవనం చేసి విమానంలోంచి తాంబూలాన్ని ఉమ్మాడట. అది వెళ్లి సూర్యభగవానుడికి అర్ఘ్య ప్రదానం చేస్తున్న శ్రీకృష్ణుడి చేతిలో పడిందట. అందుకు శ్రీకృష్ణుడు కోపించడమూ, ఆ తర్వాత గయుడి కారణంగా కృష్ణార్జునుల మధ్య యుద్ధం జరగడం దాకా వెళ్లిందని కొన్ని కథలు చెబుతారు. చాలా ఏళ్ల క్రితం – ఒక యువకుడు సొంతంగా టపాకాయలు చేయబోయి ఎక్కువ మందుగుండు పెడితే టపాకాయ బాగా పేలుతుందనే ఊహతో పెద్ద టపాకాయ చేసి – దాన్ని పేల్చే ప్రయత్నంలో తన ప్రాణం మీదికేకాక మరి కొందరి ప్రాణం మీదికి కూడా తెచ్చుకున్నాడట.

ఒక పెద్ద మనిషికి – ఒక చిత్రమైన అలవాటుంది. ఉదాహరణకు – ఆయనకు ఒక గాయకుణ్ణి పరిచయం చేస్తే – గాయకుడి ఆదాయం గురించీ అతనికి వస్తున్న అవకాశాల గురించీ అడిగి తెలుసుకుంటాడు. వెంటనే తాను గాయకుడు కానందుకు విచారిస్తాడు. ఎవరో సినిమా రచయితను పరిచయం చేస్తే తాను ఆ రచయిత

కానందుకు విచారిస్తాడు. అవతలి మనిషి గాయకుడు కావడానికీ రచయిత కావడానికీ వెనక ఉన్న శ్రమను గుర్తించడు.

మరొక పెద్దమనిషి – ఎప్పటికప్పుడు తాను పెద్ద రచయిత అయిపోవాలని ఏదో ఒక విషయం గురించి ఏదో ఒక రచన చేస్తుంటాడు. పాట, పద్యం, కవిత, వ్యాసం, కథ, నవల – ఆయన చేయి చేసుకోని సాహిత్య ప్రక్రియ కానీ ఆయన రాసి మెప్పించిన రచనగానీ లేవు. కానీ ఆయన ప్రయత్నం మానడు. ఎవరయినా 'మీ రచన బాగులేదండీ' అంటే – అవతలి మనిషి తన గొప్పతనాన్ని గుర్తించకుండా ఈర్ష్యతో అటువంటి మాట అంటున్నారని పదిమందికీ చెప్పి బాధ పడుతుంటాడు.

ఉత్సాహం ఉండడం మంచిదే. కాని ఉత్సాహానికి వన్నె తెచ్చే కృషీ ప్రతిభా రెండూ అవసరమే. ఉస్తాద్ అల్లావుద్దీన్ ఖాన్‌గారు హిందూస్తానీ సంగీత విద్వాంసులలో అగ్రగణ్యులలో ఒకరు. ఒకసారి ఆయనను ఎవరో హిందూస్తానీ సంగీతం నేర్చుకోవడానికి ఎన్నేళ్లు పడుతుందో చెప్పమని అడిగారట. ఖాన్‌గారు తమ చేతి కర్ర పిడిని చూపించి – ఈ పిడికి ఈ మెరుగు ఈ చేతికింద 15 ఏళ్లు ఉండడంవల్ల వచ్చింది అని చెప్పారట. ఎంతోకొంత ప్రతిభ ఉంటే – ఆ ప్రతిభకు కృషితో మెరుగు దిద్దవచ్చు.

ప్రతి మనిషీ గాయకుడూ, రచయితా, సినిమా తారా కానక్కరలేదు. మానవత్వానికి విలువలు పెంచే పనులు చేస్తే చాలు.

అయితే ఇక్కడే ఒక చిక్కు ఉంది. మనస్తత్త్వ శాస్త్రబోధన చేసే ఒక తరగతిలోకి నలుగురిని ప్రవేశపెట్టారట. ఆ నలుగురినీ తరగతిలోని విద్యార్థులకు పరిచయం చేశారు – మొదటివ్యక్తి ఒక ఉన్నతాధికారి, రెండో వ్యక్తి ఆ ఉన్నతాధికారి దగ్గర పని చేసే గుమాస్తా, మూడో వ్యక్తి ఒక వ్యాపారస్థుడు, నాలుగో వ్యక్తి నిరుద్యోగి అని. విద్యార్థుల మనస్తత్వాన్ని పరీక్షించడానికి చేసిన ఆ ప్రయోగం తర్వాత నలుగురిలో ఎక్కువ పొడవైనవారు ఎవరో చెప్పమంటే – ఎక్కువమంది విద్యార్థులు అధికారి ఎత్తు ఎక్కువని చెప్పారట. నిజానికి తక్కిన ముగ్గురు వ్యక్తులూ ఆ వ్యక్తికన్నా కొంత పొడవైన వారేనట.

ఈరకంగా విలువకట్టే ప్రమాదం ఉన్నా – మానవత్వం విలువ పెంచే పనులు చేయడానికి ప్రతివారికీ ఎంతో వీలుంటుంది. లంకకు వారధి కట్టడానికి ప్రయత్నిస్తున్న శ్రీరామచంద్రుడికి సాయపడడానికి ప్రయత్నించిన ఉడత కథ చక్కని ఆదర్శం.

స్వామి రామతీర్థ ఒక చక్కని సలహా చెప్పారు – 'విద్యుచ్ఛక్తిని మనం కనిపెట్టలేదు. ఫోను, రైలు, విమానం వంటి వాటినీ మనం కనిపెట్టలేదు. ఎందరెందరి కృషి ఫలితంగానో మానవజాతి ఎన్నెన్నో సౌకర్యాలను అనుభవిస్తున్నది. ఎందరి కృషికో

మనం వారసులం. అలాగే మనం ప్రపంచం నుంచి నిష్క్రమించే నాటికి మనకు అందివచ్చిన ప్రపంచాన్ని మరింత సుందరంగా మరింత సుఖదాయకంగా ఉండేలా మన తరువాతి వారికి అందచేయవచ్చు కదా!' అని. ఇందుకు, మనం చేస్తున్న పని ఏదయినా, అది మన దృష్టిలో ఎంత చిన్నదయినా – దాన్ని మరింత శ్రద్ధగా మరింత బాగా చేయడానికి ప్రయత్నించవచ్చు.

ముక్తాయింపు:

విశ్వనాథ సత్యనారాయణగారికి ఒక అభిమాని ఉండేవారట. ఆయనకు సత్యనారాయణగారి పట్ల తమ అభిమానం చూపడానికి తగిన స్థితిగతులు లేవట. ఆయన కష్టపడి సొగసుగా ఒక విస్తరి తయారు చేశాడు. అది తన అభిమానానికి గురుతుగా విశ్వనాథవారికి అందించాడు. ఆయన ఆ విస్తరిలో భోంచేశాడు. అభిమాని ఉప్పొంగిపోయాడు.



8. సంకల్పం ఉండాలేకానీ...

అమధ్య ఒక ఫ్రెంచి పత్రికా సంపాదకుడికి తీవ్రమైన జబ్బు చేసింది. కాళ్లు తప్ప ఆయన శరీరంలో పనిచేసే భాగం ఏదీ లేదు. తనకు వినిపించినా నోరు విప్పి మాటాడలేని స్థితిలో ఆయన కనురెప్పల కదలికలతో ఒక నర్సు సాయంతో తన గురించిన పుస్తకం ప్రచురించుకోగలిగాడు. అంటే ఆయన ప్రతిసారీ కనురెప్ప కదిలించినప్పుడు ఒక అక్షరం చొప్పున సూచిస్తూ వచ్చాడన్నమాట.

'షావుకారు' చిత్రంలో ప్రసిద్ధ గాయకులు మాధవపెద్ది సత్యంగారు ఒక మంచి పాత్రలో కనిపిస్తారు. ఆ పాత్ర చూపులేని ఒక తాతయ్య పాత్ర. ఆ చిత్రానికి కథ, మాటలు సమకూర్చినవారు చక్రపాణి. కథానాయిక పాత్ర - చూపులేని తాతయ్య పాత్రతో ఒకచోట వెలుగు గురించీ చీకటి గురించీ ప్రస్తావిస్తుంది. ఆ సన్నివేశంలో చక్రపాణి చూడలేని ఆ పాత్ర నోట ఒక సంభాషణ పలికించారు. 'మీరు వెలుతురూ చూస్తారు. చీకటీ చూస్తారు. నాకెప్పుడే వెలుగే. ఎప్పుడూ ఆనందమే' అంటుంది ఆ పాత్ర.

కలిమీ లేమీ ఆర్థిక స్థితికి సంబంధించినవి కావు. అవి హార్దిక స్థితికి సంబంధించినవి. అలాగే ఆరోగ్యమూ అనారోగ్యమూ కూడా చాలా సందర్భాలలో మనసును బట్టి ఉంటాయి. వైకల్యం చాలా సందర్భాలలో శరీరాన్ని కాక మనసునే ఎక్కువగా బాధిస్తుంటుంది. అన్ని అవయవాలూ సక్రమంగా ఉన్న చాలామంది సాధించలేని విజయాలనూ, అందుకోలేని ఔన్నత్యాన్నీ అంగవైకల్యం ఉన్నవారు కొందరు సాధించడానికి కారణం - ఆ అంగవైకల్యం ఉన్నవారికి మానసిక వైకల్యం లేకపోవడమే. శారీరక రుగ్మత మనసును బాధించకుండా చూసుకోగలవారు చాలా తక్కువ మంది.

హెలెన్ కెల్లర్ - పుట్టినప్పుడు మామూలుగానే ఉన్నా 19 నెలల ప్రాయంలో వచ్చిన విషజ్వరం కారణంగా ఆమె చూపూ, వినికిడి శక్తీ, మాట్లాడే శక్తీ కోల్పోయారు. తల్లిదండ్రుల ప్రోత్సాహమూ స్వయం కృషీ ఆమెకు ప్రపంచ స్థాయిలో ఎంతో ప్రసిద్ధిని తెచ్చిపెట్టాయి.

శారీరక వైకల్యమూ బుద్ధి మాంద్యమూ ఉన్నవారికి ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు మొదలు కావడానికి కృషిచేసిన ప్రముఖులలో హెలెన్ కెల్లర్ కూడా ఒకరు.

హెలెన్‌కు తగిన శిక్షణ ఇవ్వడానికి ఆమె తల్లిదండ్రులు అలెగ్జాండర్ గ్రహం బెల్‌ను సంప్రదించగా ఆయన – ఆన్ మాక్స్‌ఫీల్డ్ సల్లివన్ అనే ఉపాధ్యాయిని పేరు సూచించారు. ఆన్ కంటిచూపు లేని స్థితిలో ఉండి కొద్దిగా చూడగల స్థాయికి చేరుకున్నవారు. అమెరికాలోని బోస్టన్‌లోని పెర్కిన్స్ స్కూల్ ఫర్ ది బ్లైండ్‌లో ప్రత్యేకంగా విద్యాభ్యాసం చేసినవారు. 20 ఏళ్ల ఆన్ ఏడేళ్ల హెలెన్‌కు ఉపాధ్యాయిని అయి ఆమెకు అక్షరాభ్యాసం చేయించారు. తమ గొంతుమీద హెలెన్ వేళ్లుపెట్టి – శబ్దాలను చేతులతో వినడం నేర్పించారు. 1887లో మొదలయిన హెలెన్ విద్యాభ్యాసం – 1904లో ఆమె మసెచుసెట్స్‌లోని కేంబ్రిడ్జ్‌లో రాడ్‌క్లిఫ్ కళాశాల నుంచి పట్టభద్రులయ్యేదాకా కొనసాగింది. హెలెన్ ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి – తమవంటి ఎందరికో స్ఫూర్తినిచ్చి ప్రోత్సహించగలిగారు. హెలెన్ కెల్లర్ జీవిత కథ, ఆమె అనుభవాల సంకలనం ఎందరికో మార్గదర్శకాలయినాయి.

వారం రోజులపాటు తమకు కంటిచూపు, వినికిడి శక్తి లభిస్తే ఏమేం చేయాలనుకుంటున్నామో తెలియజేస్తూ ఆమె ఒక వ్యాసం ప్రచురించారు. ప్రకృతిలోని రంగు రంగుల అందాలను తిలకించి పులకించాలనుకుంటున్నామనీ, పక్షుల కిలకిలా రవాలు, సెలయేళ్ల జలపాతాల గల గల ధ్వనులూ తనివితీరా వినాలనుకుంటున్నామనీ ఆమె ఆ వ్యాసంలో పేర్కొన్నారు. తమ స్పర్శకు మాత్రమే తెలిసిన పువ్వుల మెత్తదనంతోబాటు వాటి రాగాలనూ రంగులనూ ఆస్వాదించాలనుకుంటున్నామనీ ఆమె వివరించారు. ఆ వ్యాసం చదివితే అన్ని అవయవాలూ సరిగా ఉన్నవారు ఎంతటి భాగ్యవంతులో తెలుసుకోవచ్చు.

ఇంగ్లండ్‌కు చెందిన స్టీఫెన్ హాకింగ్ ప్రపంచ ప్రసిద్ధి గడించిన భౌతిక శాస్త్రవేత్త. 1960లో తమ 18వ ఏట హాకింగ్‌కు తీవ్రమైన నరాల జబ్బు వచ్చింది. ఆయన నడవలేరు. తనంత తానుగా కూచోలేరు. చేయి కదల్చాలన్నా, మాటాడాలన్నా ఎంతో కష్టపడాలి. ఇన్ని శారీరక సమస్యలున్నా ఆయన భౌతిక శాస్త్రంలో డాక్టరేట్ సంపాదించారు. తమ శారీరక సమస్యలు ఆయన పరిశోధనలకూ, కృషికీ అడ్డురాలేదు.

ఆ మధ్య ఒక ఫ్రెంచి పత్రికా సంపాదకుడికి తీవ్రమైన జబ్బు చేసింది. ఆస్పత్రిలో చేర్చారు. కళ్లు తప్ప ఆయన శరీరంలో పనిచేసే భాగం ఏదీలేదు. తనకు వినిపించినా నోరువిప్పి మాటాడలేని స్థితిలో ఆయన కనురెప్పల కదలికలతో ఒక నర్సు సాయంతో తన గురించిన పుస్తకం ప్రచురించుకోగలిగారు. అంటే ఆయన

ప్రతిసారీ కనురెప్ప కదిలించినప్పుడు ఒక అక్షరం చొప్పున సూచిస్తూ వచ్చారన్న మాట.

మన రాష్ట్రంలోనే - సంజీవరాయ శర్మగారని ఒకాయన ఉండేవారు. ఆయనకు దృష్టి లేదు. కాని గణితంలో అపారమైన ప్రజ్ఞ కనబరచేవారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ గారికి ఆమె జీవిత చరమాంకంలో కంటిచూపు మంద గించింది. తాము చూడలేకపోయినా మంచం నుంచి కదిలే పరిస్థితి లేకపోయినా ఆమె తమ సేవా కార్యకలాపాలను నిరాటంకంగా కొనసాగించగలిగారు.

ఇలా - తనువుకే తప్ప మనసుకు వైకల్యం లేదని నిరూపించిన వారు ఎంద రెందరో.

ఈ విన్నవింత షావుకారు చిత్రంలోని ఒక పాత్రతో మొదలు పెట్టాము. ఆ పాత్ర సృష్టికర్త చక్రపాణికి ఒకసారి తీవ్రంగా జబ్బు చేసింది. చికిత్సకోసం ఒక సేని టోరియంలో ఉన్నారు. అప్పట్లో ఆయన జబ్బుగురించి దిగులుపడక వంగభాష నేర్చుకున్నారు. శరత్ సాహిత్యాన్ని తెలుగులోకి సొగసుగా అనువదించి గొప్ప అను వాదకులుగా పేరు గడించారు.

ముక్తాయింపు:

ఒక పెద్ద మనిషికి తాను సరిగా చూడలేకపోతున్నానని అనుమానంగా ఉంటే నేత్రవైద్యుడి దగ్గరికి వెళ్లాడు. వైద్యుడు పరీక్షలు జరిపి కళ్లజోడులు మారుస్తూ ఎదు రుగా ఉన్న పట్టికలోని అక్షరాలు చదవమన్నాడు. యాభై కళ్లజోళ్లు మార్చినా పెద్ద మనిషి తనకు ఎదురుగా ఉన్న అక్షరాలు కనిపించడం లేదు అన్నాడు. అప్పుడు వైద్యుడు పెద్దమనిషితో 'తమకు ఇప్పుడు అవసరమైనవి కళ్లద్దాలు కావు. అక్షరా భ్యాసం' అన్నాడు.



9. తెలియడం వెలుతురు

తెలివితేటలు ప్రధానంగా ఏడురకాలుగా ఉండవచ్చని కొందరు ప్రతిపాదించారు. గణిత జ్ఞానం, భాషా జ్ఞానం, సంగీత జ్ఞానం, స్థల జ్ఞానం, వ్యాయామ జ్ఞానం, ఇతరులతో సంబంధ బాంధవ్యాలకు సంబంధించిన జ్ఞానం, తన గురించిన జ్ఞానం అని ఆ ఏడిటినీ పేర్కొన్నారు. ఎవరి తెలివి వారిదే. ఎవరి తేటా వారిదే. 'తెలివి ఒకరి సొమ్ము' అని పెద్దలు అనడానికి కారణం ఇదే.

'అన్నీ తెలిసిన వాళ్లూ లేరు. ఏదీ తెలియని వాళ్లూ లేరు' అని మనకొక సామెత ఉంది. తెలియడం, తెలియకపోవడం, తెలుసునని తెలియడం, తెలియదని తెలియడం, తెలియదని తెలియకపోవడం మొదలైన వాటివల్ల కష్టాలున్నట్టే సుఖాలూ ఉంటాయని అనుభవజ్ఞులు అంటూ ఉంటారు. తెలియడం తెలియకపోవడం అన్నవి విషయాలకు సంబంధించినవి కావచ్చు. వ్యక్తుల పరిచయాలకు సంబంధించినవి కావచ్చు. పరస్పర సంబంధ బాంధవ్యాలకు చెందినవీ కావచ్చు.

'ఫలానా కార్యాలయంలో పనిచేసే ఫలానావారు మీకు తెలుసా' అని అడిగినప్పుడు ఆ తెలియడం కేవలం పరిచయానికి పరిమితమైనది కాకపోవచ్చు. ఆ తెలియడం అన్నది ఆ ఫలానా వారిచేత ఫలానా పని చేయించగల సామర్థ్యం కలిగి ఉండడం కావాలన్నమాట. తెలుసుకోవడంవల్ల లభించేది తెలివి. తెలి అంటే తెల్లన అని అర్థం చెప్పుకుంటే – తెలియకపోవడం చీకటి. తెలియడం వెలుతురు. 'తేట తెల్లం' అని ఒక పదం ఉంది. అంటే తేట తేరడం అనీ చెప్పుకోవచ్చు. ఆ మాటకు స్పష్టం అని అర్థం. ఏదయినా విషయం గురించి కలగాపులగంగా ఉన్న అభిప్రాయాలలోని అవాంతర విషయాల నుంచి అసలు విషయం విడివడినప్పుడు అంతా తేరుకోవడమే కదా!

తెలియడం, తెలియకపోవడం అనే దాన్ని బట్టి మనుషుల తెలివితేటలను అంచనా వేయడం గురించి శాస్త్రవేత్తలు చాలా పరిశోధనలను జరిపారు. జరుపుతున్నారు.

1861లో పాల్ బ్రోకా అనే శాస్త్రవేత్త ఒక సిద్ధాంతం ప్రతిపాదించారు. ఆయన అభిప్రాయం ప్రకారం మెదడు కొలతబట్టి బుద్ధికొలత ఉంటుంది. అలాగే వయసు మళ్లిన వాళ్లలోకన్నా నడివయసు వారిలో, స్త్రీలలోకన్నా పురుషులలో, తెలివి తక్కువ వారిలోకన్నా తెలివయిన వారిలో మెదడు పెద్దదిగా ఉంటుందనీ ఆయన పేర్కొ

న్నారు. చాలా ఏళ్లు ఈ బ్రోకాగారి సిద్ధాంతాన్ని చాలామంది అక్షర సత్యాలుగా భావిస్తూ వచ్చారు. ఆల్ఫ్రెడ్ బైనెట్ అనే శాస్త్రవేత్త మెదడు కొలతకూ చదువులలో రాణించడానికీ సంబంధం ఉందా అని పరిశీలించారు. ఈ కొలతలతో లాభం లేదని ఆయన కొన్ని మనోవైజ్ఞానిక పరిశీలనలు మొదలుపెట్టారు. భౌతికమైన వయస్సుకూ మేధస్సుకు సంబంధించిన వయస్సుకూ తేడా ఉంటుందనే బైనెట్ సూచికను ప్రతిపాదించారు. ఆ తర్వాత మేధస్సు వయస్సుకూ భౌతికమైన వయస్సుకూ మధ్య ఉన్న నిష్పత్తిని మేధోసూచిక (IQ- Intelligence Quotient) అనాలని విలియం స్టెర్న్ అనే జర్మన్ శాస్త్రవేత్త ప్రతిపాదించారు. అయితే ఈ మేధో సూచికల నిర్ధారణ నిష్కర్షగా చేయడంలో ఇబ్బందులు వెలుగు చూడడంతో తెలివితేటలను కొలవడం కష్టమని తేలింది. ఎందుకు అంటే అసలు తెలివితేటలు అంటే ఏమిటి అని చెప్పడం కష్టం కనుక. తెలివి తేటలు అనడానికి వేర్వేరు శాస్త్రజ్ఞులు వేర్వేరు నిర్వచనాలు చెప్పారు. మనిషి మెదడు ఒకే తరుణంలో వేర్వేరు ప్రపంచాలలో ఉంటుందనీ వాళ్లు చెప్పారు. అంటే ఒకస్థాయిలో కన్నా ఎక్కువ స్థాయిలలో పనిచేస్తూ ఉంటుందన్న మాట!

తెలివితేటలు ప్రధానంగా ఏడు రకాలుగా ఉండవచ్చునని కొందరు ప్రతిపాదించారు. గణిత జ్ఞానం, భాషా జ్ఞానం, సంగీత జ్ఞానం, స్థల జ్ఞానం, వ్యాయామ జ్ఞానం, ఇతరులతో సంబంధ బాంధవ్యాలకు సంబంధించిన జ్ఞానం, తన గురించిన జ్ఞానం అనీ ఆ ఏడిటినీ పేర్కొన్నారు. ఎవరి తెలివి వారిదే. ఎవరి తేటా వారిదే. 'తెలివి ఒకరి సొమ్ము' అని పెద్దలు అనడానికి కారణం ఇదే.

అందుకే తెలివి తేటలకు సంబంధించిన పరీక్షలు చేసినప్పుడు అవి ఒక బృందంలోని కొందరు వ్యక్తులకు తెలిసిన కొన్ని విషయాలకే పరిమితం అని గుర్తించాలి. కవిత్వం రాసేవారికి కాకరకాయ కూర వండడం తెలియకపోవచ్చు. సెనగ పంట పండించేవారికి శంకరాభరణ రాగ లక్షణం తెలియకపోవచ్చు. ఎవరి రంగంలోవారు నిపుణులే కావచ్చు.

ముక్తాయింపు:

అనగనగా ఒక సంస్థలో ఒక పెద్ద ఉండేవారు. ఆ పెద్ద పేరిట ఒక విషయం గురించిన పెద్ద వ్యాసం ఒకటి ఒక పత్రికలో వెలువడింది. ఆ పెద్ద వ్యాసాన్ని ఒక పెద్దమనిషి చదివి ఆ సంస్థలో పనిచేస్తున్న పరిచితుడు ఒకాయనకు ఫోన్ చేశాడు. 'ఆ విషయం గురించి మీ పెద్దగారికి చాలా విషయాలు తెలిసినట్లుంది. ఒకసారి వారితో ఆ విషయాలు చర్చించాలి' అన్నాడు. పరిచితుడు 'వద్దు' అన్నాడు. పెద్దమనిషి 'ఎందుకు?' అన్నాడు. పరిచితుడు 'మా పెద్దగారికి ఆ విషయం గురించి ఎంత తెలుసునో నాకు తెలుసును కనుక' అన్నాడు. 'ఎట్లా' అని అడిగాడు పెద్దమనిషి. 'ఆ వ్యాసం రాసినవాణ్ణి నేనే కనుక' అన్నాడు పరిచితుడు.



10. మీలో ఉన్నది వినయమా? గర్వమా?

'అతి వినయం ధూర్త లక్షణం' అన్నది అనుభవంలోంచి పుట్టిన అభిప్రాయం. పోట్ల ఎద్దు కుమ్మే ముందు తలవంచుతుంది. తలవంచినంత మాత్రాన అది వినయం ప్రకటిస్తున్నదనుకోవడం పొరపాటే. నాయకులయిన వారికి వినయం తప్పనిసరిగా ఉండవలసిన లక్షణం అని అమెరికా మాజీ అధ్యక్షుడు ఐసెన్ హోవర్ అంటూ ఉండేవారు. బహిరంగంగా తప్పులను ఒప్పుకునేంత వినయం నాయకులకు ఉండాలనేవారు.

'అయ్యగారికి విద్యాలేదు గర్వమూ లేదు' అని సామెత ఒకటి ఎవరో ఒక అయ్యగారిని గురించి చెబుతుంది. ఈ సామెత తెలుగులో ఉన్న గడుసు సామెతలలో ఒకటి. అంటే అయ్యగారికి విద్య ఉంటే గర్వం ఉన్నా తప్పులేదని కానీ, విద్యలేకుంటే గర్వం ఉండకూడదని కానీ, విద్య ఉన్నా గర్వం ఉండనక్కరలేదని కానీ ఈ సామెతకు వ్యాఖ్యానాలు చెప్పుకోవచ్చు. 'విద్యా దదాతి వినయం' అని సంస్కృతంలో సూక్తి ఉంది. దీన్నే మనవాళ్లు తెలుగులో 'విద్య యొసగును వినయము' అన్నారు. అంటే విద్యవల్ల వినయం రాక తప్పదు అని చెప్పుకోవాలి. సంస్కృతంలోనే విద్యా గర్వం గురించిన కొన్ని అభిప్రాయాలూ కనిపిస్తాయి. చాలామందిలో యౌవనంలో విద్యా గర్వం ఎంతోకొంత కనిపిస్తుందట. అప్పుడు అటువంటి వాళ్లు 'అహమేవ పండితః' – 'నేనే పండితుణ్ణి' అనుకుంటారట. మధ్య వయసులో 'అహమపి పండితః' 'నేనూ పండితుణ్ణే' అనుకుంటారట. వయసు మళ్లిన తర్వాత, లోకం తెలిసిన తర్వాత 'నాహం పండితః' – 'నేను పండితుణ్ణి కాను' అనుకుంటారట.

అతివినయం ధూర్త లక్షణం అన్నది అనుభవంలోంచి పుట్టిన అభిప్రాయం. పోట్ల ఎద్దు కుమ్మేముందు తలవంచుతుంది. వంచినంతమాత్రాన అది వినయం ప్రకటిస్తున్నదనుకోవడం పొరబాటే.

భారతీయ సాహిత్య స్రష్టలలో ప్రముఖులలో తులసీదాసు ఒకరు. రామ్ చరిత్ మానస్ పేరిట ఆయన వ్రాసిన రామకథ నేటికీ ఎందరికో ప్రేరణనూ మనశ్శాంతినీ కలిగిస్తూ ఉంది. తులసీదాసు తమ జీవిత చరమాంకంలో బ్రజ భాషలో వ్రాసిన 'వినయ్ పత్రికా' ఒక మహత్తర కృతి. 279 పాదాల వినయ్ పత్రికలో కవి ఎంతో

వినయంతో శ్రీరామచంద్రుడికి కలి దోషాల గురించి విన్నవించుకుంటారు. ప్రపంచానికే తాము అధిపతుల మన్నంత ధీమాతో ప్రవర్తించేవారినికాక లోకేశ్వరుడిని తులసీదాసు ఆశ్రయిస్తారు. గణేశ స్తుతితో మొదలయ్యే తమ రచనలో కవి – సూర్యుడు, శివుడూ మొదలైన దేవతలనూ, శ్రీరాములవారి కొలువులోని వారినీ స్తుతించడంలో ఒక చక్కని క్రమం పాటించారు.

ఆత్మాశ్రయ కవిత్వానికి మంచి ఉదాహరణగా పేరుపొందిన వినయపత్రిక తులసీదాసు దాసభావంతో ప్రకటించిన భక్తితో పరిమళిస్తూ ఉంటుంది. తనను మనసు పేరిటనో జీవుడి పేరిటనో పిలుచుకుంటూ దేవతలను స్తుతిస్తూ – కవి మాయకూ మనిషికీ మధ్య మనసే వారధి అంటారు. భగవంతుడికి సంపూర్ణ శరణాగతి చేయడంవల్ల మనసు శుభ్రపడుతుంది. ఆత్మ ఉద్ధరణకు భగవత్ కృప అవసరం. తర్కజ్ఞానం వల్లా వేదాంత పరిభాష తెలియడంవల్లా లాభం లేదంటారు తులసీదాసు. దీపం గురించి మాట్లాడడంవల్లా తెలియడంవల్లా చీకటి తొలగదు అంటారు ఆయన. వినయ పత్రికలో సంస్కృత భాషా విన్యాసం ఎక్కువగా ఉండడంవల్ల అది దేశంలోని వివిధ ప్రాంతాలలోని వారెందరికో అందుబాటులోకి వచ్చిందని పండితుల అభిప్రాయం.

మహాభారతంలో ద్రౌపదీ పాండవులూ మహాప్రస్థానం సాగిస్తున్న ఘట్టంలో వినయానికి సంబంధించిన కొన్ని సూచనలు కనిపిస్తాయి. ద్రౌపది నేలకూలిన కాసేపటికి సహదేవుడు నేలబడితే, సహదేవుడికి తనంతవాడు లేడనే అహంకారం ఉండేదని ధర్మరాజు భీముడికి చెబుతాడు. ఆతర్వాత నకులుడు పడిపోతాడు. అతనికి తనంతటి సుందరాకారుడు లేడనే అహంకారం ఉండేదంటాడు ధర్మరాజు. ఆ పిమ్మట అర్జునుడు పడిపోతాడు. అర్జునుడు – కౌరవులనందరినీ ఒకరోజులో చంపుతానన్న మాట నిలుపుకోలేకపోయాడనీ, ధనుర్ధారులలో తనంతటివాడు లేడనే గర్వం ఉండేదనీ అంటాడు ధర్మరాజు. చివరికి భీముడు నేలవాలుతూ ధర్మరాజును పలకరిస్తే భీముడికి ఉన్న భోజనప్రీతివల్ల భుజశక్తి వచ్చిందనీ, దాంతో క్రోధమూ, అహంకారమూ పెరిగాయనీ అందువల్ల అతనికీ పాటు తప్పలేదనీ అంటాడు ధర్మరాజు.

వినయం అన్నది– విద్యకు వన్నె తెచ్చే గుణం. నాయకులయిన వారికి వినయం తప్పనిసరిగా ఉండవలసిన లక్షణం అని అమెరికా మాజీ అధ్యక్షులు ఐసెన్ హోవర్ అంటూ ఉండేవారు. ఒప్పులకు తాము బాధ్యులమనీ తప్పులకు తాము బాధ్యులు కామనీ అనుకుంటే నాయకులు కాలేరనీ బహిరంగంగా తప్పులు ఒప్పుకొనేంత వినయం ఉండాలని ఐక్ అనేవారు.

ఘంటసాల వెంకటేశ్వరరావుగారు ఒకసారి ఒక సినిమాకు సంగీత దర్శకత్వం వహిస్తే ఆ సంగీతం స్థాయి గురించి ప్రముఖ కళా విమర్శకులు వి.ఎ.కె. రంగారావు

గారు ఘంటసాలకు తమ అసంతృప్తి తెలియజేస్తూ ఉత్తరం రాస్తే సినిమా సంగీతం విషయంలో 'మీ అభిప్రాయం స్వీకార యోగ్యము' అని వినయంగా జవాబు వ్రాశారు ఘంటసాల.

ముక్తాయింపు:

'మన కొత్త అధికారికి బాగా గర్వం అనుకుంటాను' అన్నాడు ఒక కార్యాలయం లోని ఉద్యోగి తన సహోద్యోగితో. 'ఏమయిందీ?' అన్నాడు సహోద్యోగి. 'వారం నుంచీ రోజూ పొద్దునే తనే నాకు నమస్కారం చెప్పేవాడు ఈరోజు తను నమస్కారం పెట్టలేదు' అన్నాడు ఉద్యోగి.



11. మనసారా నవ్వగలుగుతున్నారా?

మనసారా నవ్వితే మానసికమైన ఒత్తిడి తగ్గి జీవితం మరింత తీయగా ఉంటుంది. పిల్లలు రోజుకు 150 సార్లు హాయిగా నవ్వుతారట. పెద్దలు ఆరుసార్లు నవ్వితే ఎక్కువట. నవ్వితే మంచిదేగానీ నవ్వించడం చాలా కష్టం. ఉదయం నవ్వించిన సంఘటన సాయంకాలం చిరాకు కలిగించవచ్చు.

'నవ్వు నాలుగు విధాల చేటు' అని పాత సామెత. 'నవ్వు నలభైవిధాల గ్రేటు' అని ఆధునిక హాస్యరచయిత ఒకాయన ఆ సామెతకు మార్పు ప్రసాదించారు. 'లక్ష్మణ దేవర నవ్వు' అని జానపద గాథ ఒకటుంది. రావణ వధ జరిగిన తర్వాత రాముడు పట్టాభిషిక్తుడై కొలువుండగా ఆ నిండు కొలువులో లక్ష్మణుడు నవ్వినాడట. లక్ష్మణుడు ఎందుకు నవ్వినట్టు? రాముడూ, సీతా, సుగ్రీవుడూ, విభీషణుడూ – ఎవరికి తోచినట్టు వాళ్లు అర్థం చేసుకున్నారట. ఇంతకూ లక్ష్మణుడు ఎందుకు నవ్వాడు? పధ్నాలుగేళ్ల వనవాసంలో తనకు దూరంగా ఉన్న నిద్ర– ఆ నిండు కొలువులో ఆవులింతగా పలుకరించినందుకు. మయసభలో ద్రౌపది దుర్యోధనుణ్ణి చూసి నవ్విందా లేదా? నవ్విందని దుర్యోధనుడు అనుకోబట్టి భారతయుద్ధం దాకా వచ్చింది. వినాయకుణ్ణి చూసి చంద్రుడు నవ్వాడట. ఆ నవ్వు వినాయకుడికి కోపం తెప్పిస్తే – ఆయన చంద్రుడికి శాపం ఇచ్చాడట. ఆ శాప ఫలితం శ్రీకృష్ణుడంతటి వాడిని దెబ్బతీసిందని పురాణ గాథ. ఎవరి నవ్వు వారి కానందం. 'నవ్విస్తూ తానవ్వక ఉండడం గొప్ప' అని హాస్యబ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావుగారు అనేవారు. నవ్వు నానా రకాలు. హాసము, మందహాసము, దరహాసమూ – ఫరవాలేదు. అట్టహాసాలూ వికటాట్ట హాసాలూ బాధా కారకాలు కావచ్చు. నవ్వి చెడినవారు లేరు. నవ్వక చెడి పోతే పోయేరు అనుకోవడానికి వీలులేదు.

చిరునవ్వులు చిందించడం చేతగాకపోతే – వ్యాపారం చేయడానికి పూనుకో వద్దని చైనా సామెత ఒకటి హెచ్చరిస్తుంది. అయితే నవ్వుకు పరిమితులున్నాయా? అన్నివేళలా హితంగా మితంగా నవ్వడం సాధ్యమా? ఓరనవ్వు కోరనవ్వు కాకుండా చూసుకోవడం ఎలా? నవ్వవలసిన చోట నవ్వడమూ ఏడవవలసిన చోట ఏడ వడమూ మంచి మానవ లక్షణాలు. జీవితంలో ఏడుపూ నవ్వూ కలిసే ఉంటాయి – హైదరాబాద్ మహానగరంలో చింతలబస్తీ పక్కనే ఆనందనగర్ ఉన్నట్టు.

రాబర్ట్ హోల్డన్ అని ఇంగ్లండ్‌లో ఒకాయన ఉన్నారు. ఆయన హాస చికిత్సా

లయం ఒకటి నడుపుతూ నవ్వుల గురించి పరిశోధనలు చేస్తున్నారు. ఆయన నవ్వుల గురించి సీరియస్‌గానే పరిశీలించి - పిల్లలు రోజుకు 400 సార్లు చిరునవ్వులు చిందిస్తే పెద్దలు 15 సార్లకు మించి చిరునవ్వు లొలికించరని తేల్చాడు. పిల్లలు రోజుకు 150 సార్లు హాయిగా నవ్వుతారట. పెద్దలు ఆరుసార్లు నవ్వితే ఎక్కువట. పాశ్చాత్య దేశాలలో చిన్నప్పటినుంచీ పదిమందిలో నవ్వరాదనీ గంభీరంగా ఉండాలనీ బోధిస్తుంటారు. ప్రాచ్య దేశాలలో ఇటువంటి సమస్యలేదు. అన్నిటినీ తేలికగా తీసుకొని నవ్వగలగడం అంత తేలికయిన విషయం కాదు. మనసారా నవ్వితే - మానసికమైన ఒత్తిడి తగ్గి జీవితం మరింత తీయగా ఉంటుందని హోల్డన్‌గారు తేల్చారు.

నవ్వితే మంచిదేగానీ నవ్వించడం చాలా కష్టం. ఉదయం నవ్వించిన సంఘటన సాయంకాలం చిరాకు కలిగించవచ్చు. కొందరు దొరలకు బూతాడితేగాని నవ్వు పుట్టదని - ప్రాచీన కవులు బాధపడిన సంగతి ఇక్కడ గుర్తు చేసుకోవాలి. కొన్ని సినిమాలలో హాస్యం పేరిట చూపించే దృశ్యాలు మల్లాది రామకృష్ణ శాస్త్రిగారి మాటలు అరువు తెచ్చుకుంటే 'తీసేవారికి పరిశ్రమ - చూసేవారికి శ్రమ'.

కొన్నేళ్ల క్రితం మధ్య ఆఫ్రికాలోని టాంగన్యీకా దేశంలోని బుకోబా జిల్లాలోని ఒక గ్రామంలో ఒక బడిలో తరగతి జరుగుతుండగా ఇద్దరు పిల్లలు నవ్వడం మొదలు పెట్టారు. ముసి ముసి నవ్వులుగా మొదలయిన ఆ నవ్వుల జడి - తరగతిలోని పిల్లలందరికీ సోకింది. అక్కడ నుంచి ఆ పక్క తరగతిలో పిల్లలు నవ్వడం మొదలు పెట్టారు. కాసేపటికి బడి అంతా నవ్వుల సందడిలో మునిగిపోవడంతో ఆ పూటకు బడికి సెలవు ప్రకటించవలసి వచ్చింది. ఇళ్లకు వెళ్లినా ఆ పిల్లలు నవ్వుతూనే ఉన్నారట. ఆ నవ్వులలో పెద్దలూ శ్రుతి కలిపారట. ఆ గ్రామం నుంచి ఈ నవ్వుల జబ్బు పక్క గ్రామాలకూ పాకిందట. ఆ నవ్విన వాళ్లకు శరీరంలోని నీళ్లకొలత తగ్గిపోవడమూ, బడలిక రావడమూ జరిగి రెడ్‌క్రాస్ వాళ్లు వచ్చి చికిత్సలు అందించవలసి వచ్చిందట. ఆఫ్రికాలో అలా నవ్వుల జబ్బు అంతకుముందు చాలాసార్లు చెలరేగిందని ఒక ప్రముఖ పత్రిక సంపాదకీయం కూడా ప్రచురించింది.

కోపంతో ముఖం ముడుచుకున్నప్పుడు ముఖం మీద ఎక్కువ ఒత్తిడి ఉంటుందనీ- నవ్వితే ముఖం తేలికగా ఉంటుందనీ శాస్త్రవేత్తలు అంటారు. ఆఫ్రికాలో వాళ్లలా అలిసిపోయేంతగా నవ్వకపోయినా - యథాశక్తి నవ్వడం అవసరం. ఆరోగ్యకరం.

ముక్తాయింపు:

ఒక తెలుగు రచయిత ఒక హాస్య రచన చేసి ఒక తెలుగు పెద్ద మనిషికి చదవడానికి ఇచ్చాడు. ఆ పెద్ద మనిషి ఆ రచన చదివి నోరు చప్పరించి 'నాకయితే నవ్వు రాలేదు' అన్నాడు. రచయిత బ్రహ్మానంద పడిపోయి - 'అయితే మిగతా వాళ్లందరికీ నవ్వు వస్తుందన్నమాట' అని అక్కడి నుంచి సంతోషంగా వెళ్లిపోయాడు.



12. అసలు సమస్య ఏమిటి?

ఏ సమస్య నయినా పరిష్కరించుకోవాలంటే - మొదట సమస్యను గుర్తించాలి. సమస్య ఏమిటో స్పష్టంగా తెలిస్తే ఆ సమస్యను సగం పరిష్కరించినట్టే. సమస్య ఏమిటో తెలిశాక ఆ సమస్య స్వరూప స్వభావాల గురించి తెలుసుకోవాలి.

"నాకు ఎన్ని సమస్యలున్నాయంటే – వాటిలో ఒక సమస్యను ఎన్నుకొని దాని గురించి విచారించడం పెద్ద సమస్యగా పరిణమిస్తున్నది" అని ఒక పెద్దమనిషి విచారించాడట. సమస్యలు రకరకాలు. ఒక్కొక్కరికి ఒక్కొక్కరకమైన సమస్య ఉండవచ్చు.

'రాక్సీలో నార్మా షేరర్ – బ్రాడ్వేలో కాంచనమాల' అని యాభై ఏళ్ల క్రితం చెన్నపురిలోని విద్యార్థికి ఎదురయిన సమస్య గురించి శ్రీశ్రీ కవిత రాశారు. నార్మా షేరర్ హాలీవుడ్ నటి. కాంచనమాల తెలుగు నటి. హాలీవుడ్ చిత్రం చూడాలా, తెలుగు చిత్రం చూడాలా అన్నది అప్పటి విద్యార్థి సమస్య. సినిమా చూడడం కూడా సమస్య అవుతుందా అంటే కొందరికి కావచ్చు.

అష్టావధానాలలో, శతావధానాలలో సమస్యలు ఇచ్చి పూర్తి చేయమంటూ ఉంటారు. ఆకాశవాణి చాలా ఏళ్లపాటు సమస్యా పూరణం కార్యక్రమాన్ని నిర్వహించింది. ఒక అవధానంలో ఒకాయన ఒక సమస్య ఇచ్చాడట – 'రాట్నము వలదంచు గాంధీ రయమున పలికెన్' అని. మహాత్మాగాంధీ రాట్నం వలదని చెబుతారా? అవధానిగారు 'కట్నాల రంగుల రాట్నము వలదంచు గాంధీ రయమున పలికెన్' అని పూరించి ఆధునికులను బాధిస్తున్న వరకట్న సమస్య గురించి ప్రస్తావించి మన్ననలు పొందారట.

సమస్యలు– భౌతికం కావచ్చు. మానసికం కావచ్చు. ఆర్థికం కావచ్చు. ఏ సమస్యనయినా ఎట్లా పరిష్కరించుకోవాలి? సమస్యలన్నిటికీ పరిష్కార మార్గాలుంటాయా? కొందరు పెద్దలు సమస్యలను వర్గీకరించే ప్రయత్నాలు చేశారు. వాళ్ల అభిప్రాయం ప్రకారం సమస్యలు కాని సమస్యలు ఒకరకం. అస్పష్ట సమస్యలు రెండవ రకం. అత్యవసర సమస్యలు మూడవరకం. ప్రాథమిక సమస్యలు నాలుగవ రకం. సమస్యలు కాని సమస్యలు చాలా తాత్కాలికమైనవి. నార్మా షేరర్ సినిమా చూడాలా, కాంచనమాల సినిమా చూడాలా వంటి రకానికి చెందినవి. అస్పష్ట

సమస్యలు– తీరూ తెన్నూ లేనివి. కొందరికి తమ సమస్య ఏమిటో తెలియదు. అత్యవసర సమస్యలు – వెంటనే పరిష్కరించవలసినవి. ప్రాథమిక సమస్యలు – కష్టపడి కానీ పరిష్కరించుకోలేనివైనా కావచ్చు. సులభంగా పరిష్కారం కానివీ కావచ్చు. పైగా ఒకరికి సమస్య అనిపించింది మరొకరికి సమస్య కాకపోవచ్చు. 'పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటం' అని పెద్దలు ఊరికే అనలేదు! ఏ సమస్య నయినా పరిష్కరించుకోవాలంటే – మొదట సమస్యను గుర్తించాలి కదా! జాన్ డ్యూయీ అనే అమెరికన్ విద్యావేత్త 'సమస్య ఏమిటో స్పష్టంగా తెలిస్తే ఆ సమస్యను సగం పరిష్కరించినట్టే' అని అభిప్రాయపడ్డారు.

సమస్య ఏమిటో తెలిసిన తర్వాత – ఆ సమస్య స్వరూప స్వభావాల గురించి తెలుసుకోవాలట.

సమస్య ఎప్పుడు ఎలా మొదలయింది? అది వ్యక్తులకు సంబంధించిందా? అది తాత్కాలికమైనదా? వెంటనే పరిష్కరించవలసిందా? సమస్యకు కారణాలు ఏమిటి? లేదా కారకులు ఎవరు? సమస్య పరిష్కారం కొత్త సమస్యలకు దారి తీస్తుందా? సమస్య పాతదే అయితే అంతకు ముందు దాని గురించి ఎందుకు పట్టించుకోలేదు? అని రకరకాల ప్రశ్నలు వేసుకోవాలట.

సమస్యలను పరిష్కరించవలసిన వ్యక్తిగానీ, వ్యక్తులుగానీ సమస్యకు కారకులా అనీ గుర్తించాలట. పరిష్కారం కోసం ఎవరిని సంప్రదించాలో తెలుసుకోవాలట. సమస్యను పరిష్కరిస్తే వచ్చే పర్యవసానం ఏమిటో ఆలోచించాలట. ఇవన్నీకాక ఆ సమస్య మరేదయినా సమస్యలో అంతర్భాగమేమో చూడాలట.

సమస్యలను ఎలా పరిష్కరించాలి అంటే ఒక పెద్దమనిషి ఆ సమస్య గురించి మేలుకొన్నప్పుడే కాక నిద్రిస్తున్నప్పుడూ ఆలోచించాలని చెప్పాడు. నిద్రిస్తూ ఆలోచించడం ఎలాగా అంటే – చాలా సమస్యలకు కలల రూపంలో పరిష్కార మార్గాలు లభించాయి కదా అని ఆయన వాదన. కొన్ని సమస్యలకు ఆకస్మికంగా పరిష్కారాలు స్ఫురించవచ్చు. గ్రీకు తత్త్వవేత్త ఆర్కిమెడీస్ ఒక సమస్య పరిష్కార మార్గాన్ని స్నానపు తొట్టెలో స్నానం చేస్తున్నప్పుడు కనుగొన్నారనీ ఆ ఉత్సాహంలో ఆయన స్నానపు తొట్టెలోంచి అనాచ్ఛాదితంగా పరుగుతీశారని చెబుతారు.

సమస్యలతో సర్దుకుపోయి జీవించవచ్చు కదా అని కొందరు ప్రశ్నిస్తుంటారు. సమస్య అనుకుంటే సమస్య, కాదనుకుంటే కాదు అనీ కొందరు తత్త్వబోధ చేస్తుంటారు. మనసుంటే మార్గం ఉంటుందనీ పరిష్కారం లేని సమస్య అంటూ ఉండదనీ మరికొందరు చెబుతుంటారు.

ముక్తాయింపు:

స్టీఫెన్ లీకాక్ పేరుమోసిన హాస్య రచయిత. ఆయన ఒకప్పుడు చిన్న ఉద్యోగం ఒకటి చేస్తుండేవాడు. జీతం చాలకపోవడం ఆయన సమస్య. ఆయన జీతం పెంచ మంటూ తమ అధికారికి ఒక ఉత్తరం రాశారు: అయ్యా తాము నాకు నెలకు 400 డాలర్ల జీతం ఇస్తున్నారు. ఈ జీతం చాలక చాలా సమస్యగా ఉన్నది. తాము నా జీతం పెంచకపోయినయెడల నేను ఈ నాలుగువందల డాలర్ల జీతానికే పనిచేయ వలసి ఉంటుంది. కనుక తెలియజేయడమైనది.

- ఇట్లు భవదీయుడు

స్టీఫెన్ లీకాక్

అని రాశాడట ఆయన!



13. మీ భారం భౌతికమా? మానసికమా?

> **భారం అన్నది భౌతికం కావచ్చు. మానసికం కావచ్చు. కొన్నిసార్లు భౌతిక భారం మానసిక భారానికి దారితీయవచ్చు. మానసిక భారం శరీరాన్ని భౌతికంగా కుంగదీయవచ్చు. ఏ కారణం చేతనయినా గర్వం బలిసి ఆ కారణంగా తలబరువు పెరగడం - అంత మంచిది కాదని పెద్దల మాట. ఆత్మవిశ్వాసం వేరు. అహంకారం వేరు.**

అనగనగా ఇద్దరు సన్యాసులు. వాళ్లిద్దరూ ఒక అడవిదారి వెంబడి నడుస్తున్నారు. దారిలో ఒక యువతి దెబ్బతిని పడి ఉంది. నడవలేక పోతున్నది. సన్యాసులిద్దరిలో ఒకాయన ఆమెను పలకరించాడు. ఆమె ఆ దారిలో ఉన్న కాలువదాటి అవతలి గట్టు చేరుకోవాలి. పలకరించిన సన్యాసి ఆమెను జాగ్రత్తగా మోసుకువచ్చి అవతలి గట్టున దిగబెట్టాడు. ఆ తర్వాత ఆయనా తోడి సన్యాసీ నడక సాగించారు. ఒక గంట నడిచాక తోడి సన్యాసి – యువతిని మోసిన సన్యాసితో 'నువ్వు ఆ యువతిని మోసుకు రాకుండా ఉండాల్సింది' అన్నాడు. 'నేను ఆ యువతిని ఎప్పుడో కిందికి దించేశాను. నువ్వే ఆమె భారాన్ని ఇంకా మోస్తున్నావు' అన్నాడు యువతిని మోసిన సన్యాసి. ఇది జెన్ బౌద్ధ గాథలలో ఒకటి.

భారం అన్నది భౌతికం కావచ్చు. మానసికం కావచ్చు. కొన్నిసార్లు భౌతిక భారం మానసిక భారానికి దారితీయవచ్చు. మానసిక భారం శరీరాన్ని భౌతికంగా కుంగదీయవచ్చు. కొన్ని సందర్భాలలో అయినవాళ్ళను కూడా బరువులుగా భావించే వాళ్లు ఉండవచ్చు.

కొండలమధ్య నెలకొన్న సిమ్లా వంటి పట్టణాలలో ఒకచోటి నుంచి మరొక చోటికి బరువులు తరలించడం ఎంతో కష్టమైన పని. బరువులు మోయడంలో ఆరితేరిన కార్మికులే లేకుంటే అటువంటి ఊళ్లలో బతుకు దుర్భరమై పోతుంది. రైల్వే స్టేషన్లలో తల బరువుకు ఇంత అని చెల్లించి బరువులు మోసే వారి సాయం పొందవచ్చునని చెప్పే ప్రకటనలు కనిపిస్తూ ఉంటాయి. ఏ తల ఎంత బరువు మోయగలదు అన్నది ఇదమిత్థంగా చెప్పలేము.

బిహారుకు చెందిన ఒక మనిషి తల బరువు పెరగడంవల్ల ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఇటీవల ప్రసార సాధనాలు తెలియజేశాయి. అంతుపట్టని ఒక జబ్బు

వల్ల ఆ మనిషి తలలోని ఎముకలు పెరిగి పోతున్నాయట. దాంతో ఆ మనిషి తల బరువు విపరీతంగా పెరిగి – ఆయన చూపులో, మాట తీరులో తేడాలు వస్తున్నాయి.

తల బరువుకూ మెదడు బరువుకూ సంబంధం లేదు. మెదడు బరువుకూ తెలివి తేటలకూ సంబంధం లేదని శాస్త్రవేత్తలు లెక్కలు చెప్పారు.

నీతిచంద్రిక – పరువము, కలిమి, దొరతనము, అరయమి అనే నాలుగు లక్ష ణాలలో ఏ ఒకటి ఉన్నా కొందరి ప్రవర్తనలో మార్పు రావచ్చు అంటుంది. కొత్తగా కొమ్ములు వచ్చిన దూడకు నేల కనిపించదని పెద్దల అభిప్రాయం.

తల బరువు పెరిగితే కుదురు తప్పుతుంది. తలబరువు పెరగడానికి భౌతిక కారణాలతోబాటు మానసికమైన కారణాలు, ఆర్థికమైన కారణాలు కూడా ఉండ వచ్చు. మతి పెరగడం పురోగతికి గుర్తేకాని మనసు పెరగడం ఆ పురోగతికి వన్నె తెస్తుంది.

శారీరక బలం, సౌందర్యం, అధికారం, ధనబలం ఇవన్నీ కూడా కొన్ని సందర్భా లలో తలబరువు అంటే అహంకారానికి దారితీయవచ్చు. తమిళయోగి తిరువళ్లువర్ రెండువేల ఏళ్ల క్రితమే ఒక హెచ్చరిక చేశారు – శరీరమే పెద్ద బరువు. అటువం టప్పుడు ఇంకా దానికి బంధనాలు చేర్చి బరువు పెంచడం ఎందుకు అని.

ఈ అభిప్రాయమే మహాకవి శ్రీశ్రీ ఇంకోరకంగా ఒక సినిమా పాటలో 'బతుకు మా పెద్ద బరువు' అని రాశారు. ఈ బరువును తేలిక చేసుకోవడానికి మార్గాలు లేవా అంటే ఉన్నాయి. కాకపోతే కొంత కష్టపడాలి. 'ప్రతిది సులభమ్ముగా సాధ్య పడదు లెమ్ము. నరుడు నరుడౌట దుష్కరము సుమ్ము' అని మహాకవి దాశరథి తెలుగులో చెప్పిన మహాకవి గాలిబ్ మాటలు ఇక్కడ గుర్తుచేసుకోవాలి.

పిల్లల తల కుదురుగా నిలిచేదాకా ఆందోళన పడుతూ ఉంటారు కొందరు తల్లిదండ్రులు. వయసు మళ్లిన దశలో తల కుదురు తప్పి వాలిపోవడమూ కొందరిలో కనిపిస్తుంటుంది. ఇవి భౌతికమైన సమస్యలు. ఏ కారణం చేతనయినా గర్వం బలిసి ఆ కారణంగా తల బరువు పెరగడం – అంత మంచిదికాదని పెద్దల మాట. ఆత్మ విశ్వాసం వేరు. అహంకారం వేరు.

ముక్తాయింపు:

ఒక పెద్దమనిషి ఒక సాధువును తన మేడకు తీసుకువెళ్లాడు. తన మేడనిండా పేర్చి తీర్చిన వెలలేని వస్తు సామగ్రినీ, ఆభరణాలనూ, తన భోగ భాగ్యాలనూ ఒకటొకటిగా సాధువుకు చూపించి వివరంగా తన గొప్పలు చెప్పుకున్నాడు. చివరకు – 'ఇందులో మొత్తం మీద మీకు చాలా గొప్పగా కనిపించిన విశేషం ఏమిటి' అని పెద్దమనిషి సాధువును అడిగాడు. అందుకు సాధువు 'ఇంత బరువును మోయగలశక్తి భూమికి ఉండడమే విశేషం' అని జవాబిచ్చాడు.



14. గొప్ప చెప్పుకోవటంలో గొప్పేం ఉంది?

ప్రతిభ ఉంటే ఆ ప్రతిభను పెంపొందించుకోవడం కోసం ప్రయత్నించడంలో తప్పేమీ లేదు. అయితే లేని గొప్పతనాన్ని ఆపాదించుకుంటేనే ఇబ్బంది. 'నా అంతటి వాణ్ణి నేను', 'మాకు సాటి మేమే' అని అనుకోవడంలో అహంకారం పాలుకన్నా అజ్ఞానం పాలు ఎక్కువని జ్ఞానులు అంటూ ఉంటారు.

'కొందరు గొప్పవాళ్లుగా పుడతారు. కొందరు గొప్పవాళ్లుగా రూపొందుతారు. కొందరికి గొప్పతనం కట్టబెడతారు' అనే అర్థం వచ్చే సూక్తి ఒకటి ఆంగ్ల భాషలో ఉంది. గొప్పతనం, తక్కువతనం అనేవి పుట్టుకనుబట్టికాక మనిషి ప్రవర్తన బట్టి వస్తుందని గొప్పవాళ్లు కొందరు ఎప్పుడో చెప్పారు.

నారాయణగురు కేరళకు చెందిన సంస్కర్త. ఆధ్యాత్మికతనూ సంఘ సంస్కరణనూ జోడించి విశేష కృషిచేసినవారు. ఒకసారి ఆయన ఒక రైలుబండిలో ప్రయాణం చేస్తుంటే ఎదురుగా కూచున్న పెద్దమనిషి 'మీ కులం ఏమిటి' అని అడిగాడట. 'చూస్తే తెలియనిది చెబితే మాత్రం ఎట్లా తెలుస్తుంది' అన్నారట నారాయణ గురు. ఎంతో గొప్ప సమాధానం అది.

ఉన్నది ఉన్నట్టుగా చెప్పడం స్వభావోక్తి. లేనిది ఉన్నట్టుగా చెప్పటం – అతిశయోక్తి. అలంకారంగా కల్పనలలో అతిశయోక్తి ఎంతో కొంత బాగుండ వచ్చునేమో కాని జీవితంలో అతిశయోక్తుల వినియోగం ఇబ్బందులకు దారితీయవచ్చు.

ప్రబంధ కవులు చేసిన నాయికా వర్ణనల ఆధారంతో తలిసెట్టి రామారావుగారు ప్రబంధ సుందరి ఎట్లా ఉంటుందో బొమ్మ గీసి చూపించారు. చేపల వంటి కనులు, దొండ పండ్ల వంటి పెదవులు ఇట్లా అంగాంగ వర్ణనల ఆధారంగా రూపొందిన ఆ బొమ్మను చూస్తే కూరగాయలూ వగైరా కనిపిస్తాయి కాని కవులు ఊహించిన సౌందర్యం కనిపించదు.

ఉన్నది ఉన్నట్టుగా చెబితే లాభం ఉండదని ప్రాచీన కవులు చాలామంది – చిల్లర ప్రభువులు కూడా త్రిలోకాధిపతులేమో అని అనుమానం కలిగించే స్థాయిలో గొప్పగా పొగడడం కనిపిస్తుంది.

కాన్యూట్ అని ఒక రాజు ఉండేవాడట. ఆయన చుట్టూ ఆయన గొప్పలు చెప్పేవాళ్లు గుమికూడి ఉండేవారు. ఒకసారి వాళ్లెవరో సముద్రాన్ని కూడా రాజుగారు శాసించగలరంటే తాను గలనో లేనో ఋజువు చేయడానికి రాజుగారు సముద్రతీరాన కూచుని సముద్రాన్ని ఆగిపొమ్మని శాసించినా సముద్రం ఆ శాసనానికి లోబడలేదనీ ఆ రాజుగారు కూడా తక్కిన మనుషుల వంటి వారేననీ మరీ అంత గొప్పవాడు కాడనీ తేలిందట.

అసలు మనుషులు గొప్పలు ఎందుకు చెప్పుకోవాలి? గొప్పతనం సాధించడం కోసం ప్రయత్నించడం తప్పా?

ఎవరికయినా ఏ మంచి విషయంలోనయినా - ప్రతిభ ఉంటే ఆ ప్రతిభను పెంపొందించుకోవడం కోసం ప్రయత్నించడంలో తప్పేమీ లేదు. అయితే లేని గొప్పతనాన్ని ఆపాదించుకుంటేనే ఇబ్బంది వచ్చేది.

'నా అంతటి వాణ్ణి నేను', 'మాకు సాటి మేమే' అని అనుకోవడంలో అహంకారం పాలుకన్నా అజ్ఞానం పాలు ఎక్కువని జ్ఞానులు అంటూ ఉంటారు. గొప్పలు చెప్పుకోవడంలో తమ తక్కువతనం గురించిన తెలివిడి ఉండడం కూడా కారణం కావచ్చు.

న్యూనతా భావం ఆధిక్యభావంగా ప్రకటమయ్యే సందర్భాలు తరచుగా కనిపిస్తూనే ఉంటుంది. 'నా తీరే వేరు' - 'నాకు ఫలానా మంత్రిగారు తెలుసు' - 'ఫలానా రచయిత పుస్తకానికి ఏ పేరుపెట్టాలో ముందు నన్నే అడిగాడు' - 'మా ఆఫీసులో ఎవరికయినా ఏదయినా అనుమానం వస్తే నన్నే అడుగుతారు' - మా ఫ్లాట్లలో ఎవరు చీరలు కొనడానికి వెళ్లినా నన్ను వెంట తీసుకోనిదే పోరు' - 'వాళ్లకు నాణ్యమైన చీరలు ఏవో నేను చెప్పాల్సిందే' - 'నా గురించి నేను చెప్పుకోకూడదు కానీ నా అంతటి పండితుడు ఈ కాలేజీలోనే కాదు ఈ విశ్వవిద్యాలయం మొత్తంమీద ఎవరూ లేరు' - ఇలా రకరకాలుగా తమ గురించి చెప్పుకునే వాళ్లు చాలామంది. కొందరికి - తమకు రావలసినంత గుర్తింపూ, గౌరవం రాలేదనీ, రావడం లేదని బాధగా ఉంటుంది. అటువంటి వాళ్లు - పాపం - అప్పుడప్పుడూ తమ శక్తి సామర్థ్యాల గురించి తమకూ ఇతరులకూ కూడా గుర్తు చేసే ప్రయత్నంలో గొప్పలు చెప్పుకుంటూ ఉంటారు.

ముక్తాయింపు:

రామకృష్ణ పరమహంస గారి దగ్గరికి ఒక యోగి వచ్చాడట. తాను ఎన్నో ఏళ్లు శ్రమించి నీళ్లమీద నడిచే శక్తి సంపాదించాననీ, తేలికగా నదిని ఈ గట్టునుంచి ఆ గట్టుదాకా నడిచి దాటగలననీ చెప్పాడట. 'నదిని దాటడానికి అంత శ్రమ ఎందుకు? పావలానో పరకో ఇచ్చి పడవ ఎక్కి దాటవచ్చుకదా' అన్నారట పరమహంస.



15. పొగడ్తలకు లొంగుతారా?

ఈ చొక్కా బాగుందా, ఈ చీర బాగుందా అని తక్కిన వాళ్లను అడగడం వల్ల ఎంతమంది నిష్పక్షపాతమైన సమాధానం కోసం ఎదురు చూస్తున్నారని ప్రశ్నించుకుంటే చిత్రమైన సమాధానాలు వస్తాయి. చాలామంది తమ అలంకరణల గురించీ, తాముచేసిన పనుల గురించీ తక్కినవారి అభిప్రాయాలను అడుగుతున్నప్పుడు వారు కోరేది మెచ్చుకోళ్లు మాత్రమే. కొందరు అడిగి చెప్పించుకొనే అభిప్రాయాలు అనుకూలంగా లేకపోతే అలుగుతూ కూడా ఉంటారు.

‘కవిత చెప్పి ఉభయ కవిమిత్రు నొప్పింప అరిది బ్రహ్మకునైన’ అని ప్రాచీనకవి కవిత్వం చెప్పి ఉభయకవి మిత్రుడయిన తిక్కన గారిని ఒప్పించడం కష్టమని వ్రాసుకొన్నాడు. కొందరు సంధి దీయకుండా ఉభయ కవిమిత్రు నొప్పింప అని చదివి వారిని నొప్పించడం ఎవరికయినా కష్టమనీ తనకది సాధ్యపడిందని కవి అంటున్నారనీ చమత్కరించడానికి ప్రయత్నించారు. ఏదయినా ఎవరి చేతనయినా ఒప్పించడానికి ప్రయత్నం అవసరం కదా మరి!

ఒప్పించడంలాగా మెప్పించడం కూడా కష్టమే. అభిప్రాయ భేదం ఉన్నచోట ఒప్పించడానికి ప్రయత్నించవలసి రావచ్చు. చాలామంది మెచ్చుకోవడానికి వెనుకాడుతుంటారు. కనుక దానికీ ప్రయత్నం అవసరమే.

మానవజాతి మనుగడ అంతా – మన గురించి తక్కినవాళ్లు ఏమనుకుంటున్నారో తెలుసుకోవడం మీదే ఆధారపడి ఉంటుందనిపిస్తుంది. చిన్నతనంలో తల్లితండ్రుల మెప్పుకోసం ప్రయత్నాలు సాగుతాయి. బడిలో పాఠాలు చెప్పే పంతుళ్ల పంతులమ్మల మెప్పుకోసం ప్రయత్నాలు జరుగుతాయి. యౌవనంలో తమసాటి ఈడువారు తమను మెచ్చుకోవాలనిపిస్తుంది. పెళ్లయ్యాక జీవిత సహచరులు మెచ్చుకోవాలని ఉంటుంది. ఇలా మెప్పుల కోసం పాకులాడటం అనంతంగా సాగుతూ ఉంటుంది.

ప్రాచీన జానపద కథలలో రాజకుమారి మాయ అద్దం ముందు నిలబడి ‘అద్దమా అద్దమా ప్రపంచంలోనే అందరికన్నా అందంగా ఉండే రాజకుమారి ఎవరమ్మా’ అంటే, అద్దం ‘ఇంకెవరమ్మా నువ్వేకదా ఆ అందాల రాశి’ అంటే రాజకుమారి

సంతోషానికి పట్టపగ్గాలుండవు. అదే ఆ అద్దం 'ఆ అందగత్తె ఇంకెవరమ్మా నీ చెల్లెలే' అనో 'పొరుగు రాజ్యం రాజకుమారి' అనో చెబితే కథ తిరిగే మలుపులు వేరేగా ఉంటాయి. అలాగే రాజకుమారి అద్దాన్ని 'ప్రపంచంలోనే అందరికన్నా తెలివయిన అమ్మాయి ఎవరు' అని అడిగితే సమాధానాలు ఇంకో రకంగా ఉండవచ్చు.

'ఈ చొక్కా బాగుందా', 'ఈ చీర బాగుందా' అని తక్కిన వాళ్లను అడగడంవల్ల ఎంతమంది నిష్పక్షపాతమైన సమాధానం కోసం ఎదురు చూస్తున్నారని ప్రశ్నించు కొంటే చిత్రమైన సమాధానాలు వస్తాయి. చాలామంది తమ అలంకరణల గురించీ, తాముచేసిన పనుల గురించీ తక్కినవారి అభిప్రాయాలను అడుగుతున్నప్పుడు వారు కోరేది మెచ్చుకోళ్లు మాత్రమే. కొందరు అడిగి చెప్పించుకొనే అభిప్రాయాలు అనుకూలంగా లేకపోతే అలుగుతూ కూడా ఉంటారు.

'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు – నీ ఇచ్ఛయే కాక నాకేటి వెరపు' అన్నట్టు కొందరు ప్రవర్తిస్తూ ఉంటారు. మరికొందరికీ అలా ప్రవర్తించాలని ఉంటుంది కానీ తమ ప్రవర్తన సంఘ మర్యాదల కారణంగా ఆమోదయోగ్యం కాకపోవచ్చునన్న దిగులు ఉంటుంది.

'మన ఆనందం, మన దుఃఖం రెండూ మనమే నిర్ణయించుకోవాలి' అంటారు కొందరు. అవతలివాళ్ల మెప్పుకోసం ఎదురుచూడడంవల్ల మన ఆనందాన్నీ, దుఃఖాన్నీ నిర్ణయించే అధికారాన్ని వాళ్లకు ఇస్తున్నామని కొందరు మానసిక శాస్త్ర వేత్తల అభిప్రాయం. అవతలివాళ్లు అనుకూలంగా ప్రతిస్పందిస్తే ఆనందించడమూ, ప్రతికూలంగా ప్రతిస్పందిస్తే బాధపడడమూ చూస్తే మన ప్రవర్తనను ఇతరులు నిర్ణయిస్తున్నట్టే కదా! బాగా సన్నిహితంగా ఉండేవారూ హితం కోరేవారూ కటువుగా మాట్లాడవచ్చు. ఇచ్చకాలకోసం కొందరు అవతలివాళ్లను ఉబ్బేస్తూ ఉంటారు. అందు వల్ల మెచ్చుకుంటున్న వారూ, నొచ్చుకుంటున్న వారూ ఎవరో, వారిస్థాయి ఏమిటో తెలిసి ఆ అభిప్రాయాలను అందుకోవాలి.

మరి కొందరికి తమ గురించి మాట్లాడుకోవడానికి ఎటువంటి సంకోచమూ ఉండదు. అటువంటి వాళ్ల ప్రపంచంలో కేంద్ర బిందువులు వాళ్లే. 'నాకు ఏ పనయినా చేస్తే చక్కగా చేయాలండీ' అనో, 'ఆ సభలో నా ఉపన్యాసం బ్రహ్మాండంగా ఉందని అందరూ మెచ్చుకున్నారండీ' అనో, 'నేను ఒకసారి నిర్ణయం చేస్తే ఇంక దానికి తిరుగు ఉండదండీ. మీరు ఇంకెక్కడికీ వెళ్లనక్కరలేదు' అనో కొందరు తమ గురించి చెప్పుకుంటూ ఉంటారు. అటువంటి వారికి స్తుతి అంటే చాలా ఇష్టంగానే ఉంటుంది. అధికారంలో ఉన్న కొందరు తమ అధికారానికి లోబడి పనిచేస్తున్న వారిని తాము మెచ్చుకోవడం అరుదయినా వారు తమను మెచ్చుకొంటూ ఉండాలని

కోరుకుంటుంటారు. వారిని స్తుతిస్తే పనులు జరగడానికి అవకాశం ఎక్కువ ఉంటుంది.

మెప్పుల కోసం కొందరు ఏవేవో ప్రయత్నాలు చేస్తుంటారు. 'మెప్పుల కోసం అప్పులు చేయడం' తప్పని త్యాగరాజస్వామి ఒక కీర్తనలో హెచ్చరించారు. మెప్పు ఆకలి తీర్చదు. అది ఆర్థికంగా గిట్టుబాటు కాకపోవచ్చు. మెప్పువల్ల శాంతించేది అహంకారం ఒకటే కావచ్చు. మెప్పుల కోసం పాకులాడడం కూడా వ్యసనంగా మారవచ్చు. చాలా తక్కువమందికి మెప్పునూ, విమర్శనూ సమానంగా గ్రహించగల పరిపక్వత ఉంటుంది. ఆ పరిపక్వత ఉన్నవారు మెప్పులకోసం పాకులాడకపోవడం పరిపాటిగా కనిపిస్తుంది. మెప్పుకోసం ప్రయత్నించకూడదు. అది తనంత తానుగా లభిస్తే వినయంగా అందుకోగలగడం అందరికీ సాధ్యమయే విషయం కాదు.

ముక్తాయింపు:

ఒక సంగీత విద్వాంసుడు ఒకచోట బ్రహ్మాండంగా పాట కచేరి చేశాడు. ఒక పెద్దమనిషి విద్వాంసుడి దగ్గరికి వచ్చి 'నాలుగేళ్లనాడు మీ పాట విన్నాను. అప్పటికీ ఇప్పటికీ – మీ సంగీతం బాగా అభివృద్ధి అయింది' అన్నాడు. అందుకు – 'అప్పటికీ ఇప్పటికీ మీ జ్ఞానం కూడా బాగా అభివృద్ధి అయింది' అని విద్వాంసుడు సమాధాన మిచ్చాడు.



16. మంచి చేస్తే మెచ్చుకుందాం

కుటుంబ జీవితంలో మెప్పుకు విశేష స్థానం ఉంది. భార్య భర్తనూ, భర్త భార్యనూ ఇచ్చకాలకోసం కాక నిజంగా అడపాదడపా మెచ్చుకోవడం మంచిదట. పిల్లల విషయంలో వాళ్లు తప్పు చేసినప్పుడు దండించడం ఎంత ముఖ్యమో వాళ్లు మంచి పనులు చేసినప్పుడు మెచ్చుకోవడం అంతే అవసరం. మెప్పు పిల్లలలో ఆత్మ స్థైర్యాన్ని పెంచుతుంది. వాళ్లలోని అవగుణాలను తగ్గిస్తుంది.

చాలాకాలం క్రితం ఒక పెద్ద అధికారి ఉండేవాడు. ఆయన భార్య పండితురాలు అనిపించుకోవాలనీ, కవయిత్రి అనిపించుకోవాలనీ చాలా తాపత్రయపడుతూ ఉండేదట. ఆమెకు తోచినట్లు ఆమె ఏదో రాస్తూ ఉండేది. అధికారితో పని ఉన్నవాళ్లు కొందరు దాన్ని ప్రచురించడమూ మొగమాటం కొద్దీ మరికొందరు మెచ్చుకోవడమూ జరుగుతూ ఉండేదట. కొన్నిసార్లు ఆమె రాసినవి ఆమెకే అర్థంకాని పరిస్థితి ఉన్నా- ఆమె భర్త అధికారం దృష్ట్యా తక్కినవారు ఆమె రచనలలో లేని అర్థాలు వెదకి మరీ మెచ్చుకొంటూ ఉండేవారు.

మనుషులకున్న రకరకాల బలహీనతలలో మెప్పుకోసం, గొప్పకోసం పాకు లాడడం ఒకటి. పాతకాలంలో కొందరు రాజులు తమను రోజూ పొగడడం కోసం జీతాలిచ్చి ఉద్యోగులను నియమించుకునేవారు. నేటికీ మన దేశంలోని కొన్ని ప్రాంతాలలో ఎవరయినా మరణిస్తే - డబ్బులు తీసుకుని ఏడ్చే సంప్రదాయం ఉంది. చచ్చిపోయిన వాళ్ల గోరంత గొప్పను కొండంతలుగా వర్ణించి ఏడవడంలో ఎంత నైపుణ్యం ఉంటే అంత కూలి గిట్టుతుంది. కార్య సాధనకోసం పొగడడం అన్నది అనాదిగా వస్తున్న ఆచారం. స్తుతికి పొంగిపోయి వరాలిచ్చి దేవతలు ఇరుకునపడిన కథలు పురాణాలలో కనిపిస్తాయి.

స్తుతులు రకరకాలుగా ఉంటాయి. పైఅధికారుల మన్ననకోసం కొందరు కింది ఉద్యోగులు ప్రతిరోజూ భజన గోష్ఠులు నిర్వహిస్తూ ఉంటారు. ఉన్నత పదవులలో ఉన్నవారి ప్రాపకం కోసం, చిన్న ఫలితాల నుంచి పెద్ద ఫలితాల దాకా సాధించడం కోసం రకరకాల సందర్భాలలో రకరకాల మనుషులు రకరకాలుగా స్తుతులు చేస్తూ ఉంటారు. స్తుతి - ఆంగికం కావచ్చు. వాచికం కావచ్చు. కొన్నిసార్లు ఆర్థికమూ కావచ్చు.

కొందరికి స్తుతి గిట్టదు. 'ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా!' అని ప్రాచీన కవి సమకాలీన కవులు మెచ్చకపోవడాన్ని విమర్శించాడు. ఆధునిక యుగంలో మెచ్చుకోలు తెలియజేయడానికి ఎన్నో పద్ధతులు. సన్మానాలు చేయవచ్చు. శాలువలు కప్పవచ్చు. సన్మాన పత్రాలు చదవవచ్చు. ఏనుగులు ఎక్కించ వచ్చు. 'మావటివాళ్లకు రోజూ ఏనుగు ఎక్కే గౌరవం లభిస్తూ ఉంటుంది కదా' అంటే అది వేరే విషయం.

ఈ రోజులలో డబ్బుంటే సాధించలేనిది ఏదీ లేదు అని చాలామంది అభి ప్రాయం. మనకు ఎవరూ సన్మానం చేయకపోతే మనమే చేయించుకోవచ్చు. చిన్న సన్మానం ధర వేరు. పెద్ద సన్మానం ధర వేరు. సన్మాన సంచిక వేయిస్తే అదనం. సన్మానాలు చేయడం లాభసాటి వ్యాపారాలలో ఒకటి అని ఋజువుచేసిన సన్మాన ధనులు చాలామంది.

మనను ఎవరు మెచ్చుకున్నా పొగడక పోయినా ఏంచెయ్యాలి. 'పాడు ఊళ్లో పొగిడేవాళ్లు లేరు. నాకు నేనే పొగుడుకుంటాను' అన్నాడట ఎవరో పెద్దమనిషి. 'ఆత్మస్తుతీ పరనిందా అర్థాపేక్షా లేని మహానుభావుడిని. నాకూ రూపాయి. శుద్ధ శుంఠ వాడికీ రూపాయా' అని మరొక పెద్దమనిషి ఎప్పుడో వాపోయాడట. ఆత్మస్తుతి ఆత్మహత్య వంటిదని ప్రాచీనుల అభిప్రాయం. తనలోని గుణాలు తాను చెప్పుకుంటే అది – ఆత్మస్తుతీ, పొగడుకోవడం, గొప్పలు చెప్పుకోవడం అంటే ఎలా అని కొందరు విచారిస్తూ ఉంటారు. ప్రత్యామ్నాయంగా కొందరు ఒక బృందంగా ఏర్పడి ఒకరి నొకరు మెచ్చుకొంటూ, పొగడుతూ ప్రశంసించుకొంటూ ఉంటారు.

తమకంటె వయసులో చిన్నవారినీ, తమ పిల్లలనూ మెచ్చుకోకూడదని పెద్దలు అంటూ ఉంటారు. తండ్రి మెచ్చలేదని అలిగి అకృత్యం తలపెట్టబోయిన మహాకవి భారవి ఆ పాపపరిహారం కోసం అత్తవారింట అవమానాల పాలయిన కథ చాలా మందికి తెలిసిందే. పొగడడానికీ పొగిడించుకోవడానికీ ఒక స్థాయి ఉండాలి. 'వసిష్ఠుని వాక్కున బ్రహ్మర్షి అనిపించుకోవలె' అని విశ్వామిత్ర మహర్షి – చివరికి ఆమాట అనిపించుకునేదాకా ప్రయత్నం మానలేదని పురాణ కథలు పేర్కొంటాయి.

ఆధునిక శాస్త్రవేత్తలు కూడా – మెచ్చుకోళ్ల అవసరాన్ని గుర్తించారు. ప్రధానంగా కుటుంబ జీవితంలో మెప్పుకు విశేష స్థానం ఉందంటారు వారు. భార్య భర్తనూ, భర్త భార్యనూ ఇచ్చకాలకోసం కాక నిజంగా అడపాదడపా మెచ్చుకోవడం మంచి దట. పిల్లల విషయంలో వాళ్లు తప్పు చేసినప్పుడు దండించడం ఎంత ముఖ్యమో, వాళ్లు మంచి పనులు చేసినప్పుడు మెచ్చుకోవడమూ అంతే అవసరమట. మెప్పు పిల్లలలో ఆత్మస్థైర్యాన్ని పెంచుతుంది. వాళ్లలోని అవగుణాలను తగ్గిస్తుంది. మెప్పుకు

నోచుకోక ఎప్పుడూ తిట్లకూ దెబ్బలకూ గురి అయ్యే పిల్లలలో మానసికమైన ఒత్తిడి బాగా ఉంటుంది. అది వాళ్ల వ్యక్తిత్వం సక్రమంగా రూపుదిద్దుకోవడానికి ఆటంకమవుతుంది. అయితే పిల్లలను మెచ్చుకొనేటప్పుడు తప్పనిసరిగా కొన్ని పరిమితులను పాటించాలని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. పరిమితి దాటిన మెప్పు పిల్లలలో అహం భావాన్నీ, ఎవరినీ లెక్కపెట్టని ప్రవృత్తినీ పెంచుతుందట. ఇళ్లలోనే కాదు. కార్యాలయాలలోకూడా మంచిని మెచ్చుకోవడం అవసరం. కొన్ని కార్యాలయాలలో ఉద్యోగులు తప్పులు చేస్తే మెమోలు గుప్పిస్తారు. బాగా పనిచేస్తే మాటవరసకయినా మెచ్చుకోరు. మెప్పు - ప్రోత్సాహకంగా పనిచేస్తుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. మనిషికి తన విలువను గ్రహించడానికి తోడ్పడుతుంది.

ముక్తాయింపు:

ఒక వాణిజ్యవేత్త ఒక పుస్తకం ప్రచురించాడు. గడ్డమూ, మీసమూ భారీగా పెంచిన ఒక పెద్ద రచయిత ఆ పుస్తకాన్ని ఆకాశానికి ఎత్తుతూ మెచ్చుకోలుగా ఒక పెద్దపీఠిక రాశాడు. ఒక విమర్శకుడు రచయితను అడిగాడు: ఆ పుస్తకాన్ని అంతగా ఎందుకు మెచ్చుకోవలసి వచ్చిందని. 'మనలో మాట. నేను రాసిన పుస్తకాన్ని నేనే మెచ్చుకోకుంటే ఇంకెవరు మెచ్చుకోవాలి?' గుంభనగా అన్నాడు రచయిత.



17. మొగమాటానికి పోతే

"ఈ నగ మీకు చాలా బాగుంటుంది. కావాలంటే మీ మెడకు పెట్టుకుని ఈ అద్దంలోకి చూడండి" అనగా విని, ఉంగరం కొనడానికి పోయి కంఠాభరణం కొనడానికి మొగమాటం కారణం కావచ్చు. మొగమాటం కొద్దీ అక్కరలేని వస్తువులు పోగు చేసుకునేవాళ్ళుచాలామందే కనిపిస్తుంటారు. ఏ పొరుగువాళ్ల ఇంటికో వెళ్లినప్పుడు మొగమాటంతో అర్ధాకలితో అరకొరగా తినేవాళ్ళు కొందరయితే, మొగమాటం కొద్దీ వడ్డించినదంతా తమకు ఇష్టం లేకున్నా తిని ఇబ్బందుల పాలయ్యే వాళ్లు కొందరు.

'ముఖం చూస్తే తెలియదా మోకాళ్లవాపు' అని తెలుగు సామెత ఒకటి ప్రశ్నిస్తుంది. ముఖం చూస్తే మోకాళ్ల వాపు సంగతి తెలిసినా తెలియకపోయినా కొన్ని సందర్భాలలో ముఖం లక్షణాలను బట్టి కొన్ని రోగాల నిర్ధారణ చేయవచ్చునని ఇటీవల వైద్య శాస్త్ర పరిశోధకులు కొందరు అభిప్రాయం వెలిబుచ్చారు.

'ముఖం మనిషికి సూచిక' అని పండితులు అంటూ ఉంటారు. ఏ మనిషి ముఖం ఆ మనిషికే ప్రత్యేకం. ప్రపంచంలో ఒకే పోలికలో ఏడుగురు ఉంటారని అంచనాకూడా ఉంది. కవలలయినా ముఖం తీరులో మార్పులు ఉండవచ్చు.

కనుముక్కు తీరు బాగుంటే అందమని భారతీయుల ఊహ. చైనా వారి దృష్టిలో కనుతీరూ ముక్కుతీరూ అందానికి సూచికలు కాకపోవచ్చు. ముక్కూ మొగం తెలియనివారు - అపరిచితులు. ఇక పరిచయం సంగతికి వస్తే - కొందరితో ముఖ పరిచయం మాత్రమే ఉంటుంది. పరిచితులే అయినా కొందరిని చూసి చాలామంది ముఖం చాటు చేసుకోవడం, ముఖం ముడుచుకోవడం, ముఖం గంటు పెట్టుకోవడం, ముఖంవేలాడ్చుకోవడం చేస్తూ ఉంటారు. కొన్ని సందర్భాలలో ముఖం చెల్లదు. మరి కొన్ని సందర్భాలలో ముఖం మొత్తుతుంది. అవమానంతో ముఖం వెలవెల బారుతుంది. నల్లబడుతుంది. అటువంటప్పుడు అవతలివారి ముఖం ఎలా చూడడం అనిపిస్తుంది. కొందరు తిడితే ముఖం వాస్తుంది. కొందరికి ఆకలితోనూ ముఖం వాస్తుంది. కొందరు మెచ్చితే ముఖం ఇంతో అంతో అవుతుంది. కొందరికి ముఖప్రీతి మాటలు ఇష్టం. కొందరికి ఏమాటయినా ముఖంమీద అనడం అలవాటు.

ముఖానికి సంబంధించిందే- మొగమాటం కూడా. మొగమాటానికి మొగమోట, మొగమోటమి అనే రూపాలూ ఉన్నాయి. మొగమాటం అంటే ముఖాన్ని చూచి చూపించే దాక్షిణ్యం అని పండితులు అర్థం చెబుతారు. దక్షిణహస్తం అంటే కుడిచేయి. ఆదరణ విషయంలో కుడిచేతి ఆదరణకూ ఎడమచేతి ఆదరణకూ తేడా ఉండడంవల్లనేమో వలపక్షం అనే మాట వాడుకలోకి వచ్చింది.

మొగమాటం అనేది చనువును బట్టి చేసే బలవంతమని పదబంధ పారిజాతం చెబుతుంది. మొగమాటం అంటే కాదనలేక పోవడం. కాదనవలసినచోట అవుననడం మొగమాటం.

మొగమాటం వల్ల లాభాలకన్నా నష్టాలే ఎక్కువ అని అనుభవజ్ఞులు అంటారు.

"ఈ నగ మీకు చాలా బాగుంటుంది. కావాలంటే మీ మెడకు పెట్టుకుని ఈ అద్దంలోకి చూడండి" అనగా విని, ఉంగరం కొనడానికి పోయి కంఠాభరణం కొనడానికి మొగమాటం కారణం కావచ్చు. మొగమాటం కొద్దీ అక్కరలేని వస్తువులు పోగుచేసుకునేవాళ్లు చాలామంది కనిపిస్తుంటారు. ఏ పొరుగువాళ్ల ఇంటికో వెళ్లినప్పుడు మొగమాటంతో అర్ధాకలితో అరకొరగా తినేవాళ్లు కొందరయితే - మొగమాటం కొద్దీ వడ్డించినదంతా తమకు ఇష్టం లేకున్నా తిని ఇబ్బందుల పాలయ్యేవాళ్లు కొందరు.

మరికొందరు మొగమాటం కొద్దీ తమ వస్తువులు తక్కినవాళ్లకు అరువు ఇచ్చి అవస్థలు పడుతూ ఉంటారు. 'పట్టుచీర అరువు ఇచ్చి పీట పట్టుకుని తిరిగిందట' అని సామెత ఒకటి విమర్శిస్తుంది. మొగమాటం పెట్టడంలో కొందరు సిద్ధహస్తులు. వయసునూ, గుణగణాలనూ ప్రత్యేకతలనూ పొగిడి కార్యసాధన చేసుకునేవాళ్లూ ఊరిపేరుమీదా వాడ పేరుమీదా బాదరాయణ సంబంధ బాంధవ్యాల పేర మొగమాటానికి గురిచేసే వాళ్లూ ఎప్పుడో ఒకప్పుడు తారసపడుతూనే ఉంటారు.

ఆర్కే నారాయణ్ కథ ఒక దాంట్లో సంగీతం నేర్చుకుంటున్న కూతురున్న మిత్రుడి ఇంటికి చుట్టపుచూపుగా వెళ్లిన మందభాగ్యుడి వృత్తాంతం ఉంది. మిత్రుడు మా అమ్మడు సంగీతం బాగా పాడుతుంది వినమని మొగమాటం పెడతాడు. అమ్మడి సంగీతం ధాటికి మింగలేక కక్కలేక సతమతమైపోతాడు ఇవతలి పెద్దమనిషి.

వర్ధమాన కవి పండితులు -పెద్ద రచయితల దగ్గరికీ మహా కథకుల దగ్గరికీ వెళ్లి తమ రచనలు ఇచ్చి అభిప్రాయాలూ పీఠికలూ అడుగుతూ ఉంటారు. మొగమాటం కొద్దీ అభిప్రాయాలు వ్రాసే వాళ్లున్నట్టే గడుసుగా వ్రాసే వాళ్ళూ ఉంటారు. 'ఈ పొత్తము ఎడనెడ పరిశీలించితిని. నా పరికించిన మేర ఈ రచన బాగుగనే ఉన్నట్లు తోచుచున్నది. కాలాభావము వలన పొత్తమంతయు చదువ లేమికి కదుం

గడు వగచుచున్నాడను' అని వ్రాసిన ఒకానొక ప్రాచీన పండిత కవిని ఇక్కడ మొగమాటం లేకుండా స్మరించవలసి ఉంది.

కాదనలేక అవుననడం సబబుకాదని మానసిక శాస్త్రవేత్తలు అంటారు. మరి కాదనడం ఎలా? అవతలివారు మన ఆప్తులో పై అధికారులో అయితే వారికి కాదని చెప్పడం ఎలా? కాదనలేక ఔనని ఆ కష్టనష్టాలను మౌనంగా భరించడం ఎలా? మానవ వ్యవహారాలలో వ్యక్తిత్వాన్ని నిలుపుకోవడం కోసమూ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవటం కోసమూ ఆయా పరిస్థితులను సరిగా బేరీజు వేసుకొని ఔననీ, కాదనీ తేల్చి చెబుతుండాలి. ఆలోచించక అన్నిటికీ ఔననటమూ సబబు కాదు. అన్నిటినీ కాదనడమూ సబబు కాదు.

ముక్తాయింపు:

చెన్నపురిలో ఒకసారి సాలూరు రాజేశ్వరరావుగారు ఒక దసరా ఉత్సవాలలో సంగీత కచేరీ చేస్తుండగా, రచయిత ఒకరు ఆ కచేరీలో తానూ పాడతానన్నారు. రాజేశ్వరరావుగారు 'ఇప్పుడు మన ఫలానాగారు పాడతారండీ' అన్నారు. ఫలానా గారు తాము కల్యాణి రాగంలో ఒక పాట వినిపిస్తామన్నారు. పాట అయ్యాక రాజేశ్వరరావుగారు 'ఫలానాగారు బాగా పాడారండీ! కానీ వారు పాడింది కల్యాణి కాదండీ' అన్నారు.



18. ఉపగ్రహాలుగా మారితే ఉపద్రవమే

కొందరు రకరకాలుగా గొప్పతనం ఆపాదించుకుంటూ ఉంటారు. 'నేనూ మంత్రిగారూ ఒకే కాలేజీలో చదివాం. కాకపోతే ఒకే క్లాసులో కానీ ఒకే సంవత్సరంలో కానీ చదవలేదు' అని అంటుంటారు. కొందరు గొప్పవాళ్ల చుట్టూ ఉపగ్రహాల లాగా పరిభ్రమిస్తూ ఉంటారు. కొన్నిసార్లు ఈ ఉపగ్రహాల ఉపద్రవం ఎంతదాకా వెదు తుందంటే - వాళ్లు తామే ఆ గొప్ప వాళ్లమన్న భ్రమలో పడిపోతుంటారు.

ఏది గొప్ప? ఏది కాదు? 'కడివెడంత గుమ్మడి కాయ అయినా కత్తిపీటకు లోకువ' అన్నారు పెద్దలు. 'ఈ చిన్నగీత పెద్దగీత కావాలంటే ఏం చేయాలి' అని అయ్యవారు శిష్యుడిని అడిగారు. 'ఆ చిన్నగీత పక్కనే ఇంకొక చిన్నగీత గీస్తే సరి' అన్నాడట శిష్యుడు.

గొప్పతనం, తక్కువ తనం అన్నవి సాపేక్షమైనవి. ఎవరి గొప్పతనం వాళ్లదే. చిక్కు ఎక్కడ వస్తుందంటే కొందరికి తమ గొప్పే తప్ప పొరుగు గొప్ప పట్టదు. కొందరు ఉత్తములు తమ గొప్పను గుర్తించినట్టే పొరుగువారి గొప్పనూ గుర్తిస్తూ ఉంటారు.

గొప్పతనం అన్నది పుట్టుకను బట్టి వచ్చేదికాదు. మనిషి మనిషిగా ప్రవర్తించి మనిషిగా జీవించినప్పుడూ మంచి మనిషిగా గుర్తింపు పొందినప్పుడూ గొప్ప మనిషి కావచ్చు. అయితే గొప్పవాళ్లుగా పేరుపొందిన వారందరూ గొప్ప మనుషులా అంటే చెప్పడం కష్టం.

తమ తమ రంగాలలో గొప్పవాళ్లుగా పేరు గడించిన వాళ్లలో కూడా ఏదయినా లోపం ఉండవచ్చు. కొందరు కళాకారుల వ్యక్తిగత జీవితం – ఎట్లా జీవించకూడదో చెప్పడానికి ఉదాహరణగా పనికిరావచ్చు. గుండెలు పిండేలా సంగీతం వినిపించే పెద్దమనిషి రోజూ భార్యను హింసిస్తూ ఉండవచ్చు. అందుకే కొందరు 'కళాకారుల కళల గొప్పతనాన్ని అభిమానించాలి. కాని కళాకారుల వ్యక్తిగత జీవితాల జోలి కళా స్వాదనానికి అక్కరలేదు' అంటూ ఉంటారు.

కొందరికి గొప్పలు చెప్పుకోవడం చాలా ఇష్టం. గొప్పలు చెప్పుకోవడం అనే పదబంధంలోనే లేనిది ఉన్నట్టుగా తోపింప చేయడం అనే అర్థం ఇమిడి ఉంది.

తాను కానిది తాను అయినట్టు చెప్పుకోవడమే కదా గొప్ప చెప్పుకోవడం అంటే? స్వ రూప జ్ఞానం అన్నది అలవడడానికి చాలా శ్రమపడాలి. చాలామంది మనుషులు తమను దేహబద్ధులైన జీవులుగా భావించడంవల్ల ఆత్మజ్ఞానం వారికి అందుబాటులో లేకుండా పోతున్నదనీ, మనిషికీ మనిషికీ మధ్య వైరుధ్యమూ, అన్యత్వ భావమూ ఏర్పడుతున్నదనీ వేదాంతులు చెబుతారు.

స్వ రూప జ్ఞానం స్వభావ జ్ఞానం లేనప్పుడు – కొందరికి గొప్ప చెప్పుకోవడం సంతోషం కలిగించవచ్చు.

ఒక రచయిత్రి భర్త ఆమె రాసిన రచనలను తీసుకుని పత్రికల వారి దగ్గరికీ, ప్రచురణ కర్తల దగ్గరికీ వెళ్లి 'మేము ప్రస్తుతం ఈ కథ రాశాం – ఈ నవల రాశాం– ఇదివరలో రాసిన కథలకన్నా తేడా తెలిసేలా రాశాం' అని చెబుతూ ఉండేవాడు. మొదటిసారి ఆయన మాటలు వినేవారికి బహుశా ఆయనా ఆయన భార్యా కలిసి జంట కవిత్వం చేస్తున్నారేమో అని అనుమానం కలగవచ్చు. అయితే ఆయన దృష్టిలో ఆ భేదం లేదు. ఆయనది అభేద వాదం.

కొందరు రకరకాలుగా గొప్పతనం ఆపాదించుకుంటారు. 'ఫలానా రచయిత గారి అత్తవారిల్లూ మా అత్తవారిల్లూ ఒక్క వీధిలోనే' అని ఒకరు అంటే 'నేనూ ఫలానా మంత్రిగారూ ఒకే కాలేజీలో చదివాం. కాకపోతే ఒక క్లాసులో కానీ, ఒకే సంవత్సరంలోకానీ చదవలేదు' అని మరొకరు అనవచ్చు. కొందరు గొప్పవాళ్ల చుట్టూ ఉపగ్రహాల లాగా పరిభ్రమిస్తూ ఉంటారు. కొన్నిసార్లు ఈ ఉపగ్రహాల ఉప ద్రవం ఎంతదాకా వెదుతుందంటే– వాళ్లు తామే ఆ గొప్పవాళ్లమన్న భ్రమలో పడిపో తుంటారు. పువ్వులను కట్టే దారానికీ గౌరవం లభించడం లోకసహజమే కదా!

ఒక ధ్యేయం సాధించడం కోసం ప్రయత్నించడం మంచిదే. అయితే ధ్యేయాన్ని సాధించగల శక్తి సామర్థ్యాలు తమకు ఉన్నాయా అని పరిశీలించి చూసుకోవాలి. ఊహల్లో జీవించడం – మానసిక రుగ్మత. లేని గొప్పలు చెప్పుకోవడం కూడా రుగ్మతే. గొప్పలు చెప్పుకోవడం వల్ల ఆ చెప్పుకొనేవారికి కలిగే సంతోషం తాత్కాలికమైనదే. అన్నిటికన్నా గొప్ప విషయం – మనిషికి మనిషిగా గుర్తింపు రావడం. సామాన్యులు మాన్యులై అసామాన్యులు కావడానికీ, మనిషి మనీషి కావడానికి వీలుందనీ అందుకు ప్రయత్నించడమే మానవ వికాసానికి నాంది అనీ పెద్దలు చెప్పారు.

ఫలానా సుబ్రహ్మణ్యంగారిని ఫలానా పాణిగారి దగ్గరికి నేనే తీసుకువెళ్లి పరి చయం చేశాను. అందువల్లే ఆయన ఈరోజు ఇంత గొప్ప గాయకుడు అయ్యాడు అని ఒక రచయిత మరొక రచయితతో అన్నాడు. 'బాబ్బాబు. నీకు పుణ్యం ఉంటుంది. నన్నూ ఎవరికయినా పరిచయం చేసి గాయకుణ్ణి చెయ్యవూ' అని అడి

గాడట రెండవ రచయిత. 'నువ్వు పాడలేవు కదా' అన్నాడట మొదటి రచయిత. 'నువ్వు పరిచయం చేసేస్తే గాయకుడు కావడం ఎంతసేపు' అన్నాడు రెండో రచయిత.

ముక్తాయింపు:

ఆకాశవాణిలో చాలాకాలం పనిచేసి అమరావతి కథల రచయితగా ప్రసిద్ధి పొందిన శంకరమంచి సత్యంగారు ఒక కథ చెప్పేవారు. ఆ కథ ఆకాశవాణిలో కార్టూన్‌గా ప్రసారమై ప్రసిద్ధి కెక్కింది.

అనగనగా ఇద్దరు పెద్ద మనుషులు. ఇద్దరికీ గొప్పలు చెప్పుకోవడం ప్రవృత్తి.

ఒకానొక రోజున పెద్ద మనుషులు ఇద్దరూ ఒకరికొకరు తారసపడ్డారు. 'ఏం ఈ మధ్య కనబడ లేదు' అని మొదటి పెద్ద రెండవ మనిషిని అడిగాడు.

'నాకు జ్వరం వచ్చింది' అన్నాడు రెండవ పెద్ద. 'అయితేనేం నాకు నూట ఆరు డిగ్రీల జ్వరం వచ్చింది ఆమధ్య' అన్నాడు మొదటి పెద్ద.

'నాకేం తక్కువ వచ్చిందా? నాకూ తెర్మామీటర్ పగిలిపోయేంత జ్వరం వచ్చింది' అన్నాడు రెండవ పెద్ద.

మాటా మాటా పెరిగింది. చివరికి మొదటి పెద్దమనిషి అన్నాడు – 'నీ గొప్పే నీదా. నీకే గొప్ప జబ్బులు వస్తాయా. నీ జబ్బుకన్నా గొప్ప జబ్బు నాకు రాకపో తుందా! నేన్నీకు చెప్పకపోతానా' అన్నాడట.



19. అనుకరణా అక్కరకు వస్తుంది

కొన్నిరకాల కీటకాలు ఆకర్షణీయంగా కనబడడానికి వేరే కీటకాల లాగా కనిపించడానికి ప్రయత్నిస్తాయి. ఆ అనుకరణ వాటికి తగిన తోడును వెదుక్కోవడానికి వీలు కల్పిస్తుంది. కట్టెపురుగు నీటిమీద కట్టెపుల్లలాగా తేలుతూ పోతుంటుంది. అనుకరణ దానికి ప్రాణరక్షణ కల్పిస్తుంది. ధ్రువ ప్రాంతాలలోని ఎలుగుబంటి చలి కాలంలో మంచు రంగులో ఉండి, మంచు కరిగిన తర్వాత మట్టిరంగులో ఉండి - తన పరిసరాల రంగును అనుకరిస్తూ ఉంటుంది.

'అనుకరణలను చూసి మోసపోకండి' అని చాలామంది తాము తయారుచేసిన వస్తువుల గురించి ప్రకటించుకుంటూ ఉంటారు. 'అనుకరణ ఉత్తమమైన ప్రశంస' అంటుంది ఆంగ్లభాషలో ఒక సూక్తి. ఒక వస్తువుకానీ, ఒక పద్ధతికానీ, ఒక పనికానీ బహుళ ప్రచారమూ, ఆదరణ పొందితే – వెంటనే దాని అనుకరణ మొదలవుతుంది అనిపిస్తుంది. ఒకరకమైన కథలో తక్కిన హంగులతో ఒక చలనచిత్రం విజయవంత మైతే – వెంటనే ఆ మూసలో పది చిత్రాలు తయారవుతాయి. చలన చిత్రాలకు పేర్లు పెట్టడంలోనూ అనుకరణ కనిపిస్తుంది.

అనుకరణ అన్నది మానవులకు పరిమితమైనది కాదు. కీటక జాతులూ, పక్షులూ, జంతువులూ, చివరికి కొన్నిరకాల వృక్షజాతులూ అనుకరణను అవలంబి స్తుంటాయి (కీటకాలలో కనిపించే అనుకరణ ప్రవృత్తి వాటి మనుగడకు సాయపడు తుంది. జంతువులు కొన్నిటిలోని అనుకరణ – వాటి రక్షణకు తోడ్పడుతుంది. వృక్షజాతులలోని అనుకరణ వాటి పునరుత్పత్తికి సాయపడుతుంది.)

కొన్నిరకాల కీటకాలు ఆకర్షణీయంగా కనబడడానికి, వేరు కీటకాలలాగా కని పించడానికి ప్రయత్నిస్తాయి. ఆ అనుకరణ – వాటికి తగిన తోడును వెదుక్కోవడానికి వీలు కల్పిస్తుంది.. కట్టెపురుగు అనే ఒక రకం పురుగు నీటిమీద కట్టెపుల్లలాగా తేలుతూ పోతుంటుంది. అనుకరణ దానికి ప్రాణరక్షణ కల్పిస్తుంది. ధ్రువ ప్రాంతాల లోని ఎలుగుబంటి చలికాలంలో మంచు రంగులో ఉండి, మంచు కరిగిన తర్వాత మట్టి రంగులో ఉండి – తమ పరిసరాల రంగును అనుకరిస్తూ ఉంటుంది.

జంతువుల ప్రవర్తన గురించీ, పక్షుల ప్రవర్తన గురించీ విశేష పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు - వాటిలో కనిపించే అనుకరణశక్తి గురించి ఎన్నో విశేషాలు తెలుసుకున్నారు. ఒక ఎలుకను ఒక బోనులో పెట్టి - వంకర టింకర దారుల వెంబడి వెళ్లి అది ఆ బోనులో దాచిన ఆహారాన్ని అందుకోగలదా అని పరిశోధన జరుపుతూ - బోనులోని ఎలుకను బయటినుంచి గమనించడానికి మరొక ఎలుకను పెట్టారు. ఈ రెండవ ఎలుకను బోనులో పెట్టినప్పుడు అది మొదటి ఎలుకను అనుక రించడం గమనించారు.

జపాన్‌లో ఒకానొక సముద్రతీరంలోని అడవిలో ఉండే మకాక్ జాతి కోతులను పరిశీలించడానికి వాటిని అడవిలోంచి మైదాన ప్రాంతాలలోకి వచ్చేలా చేయాలను కున్నారు. కోతులను ఆకర్షించడానికి సముద్రతీరాన చిలగడ దుంపలనూ, గోధుమ గింజలనూ పడవేశారు. కోతులకు ఇసుక అంటిన దుంపలనూ, గోధుమ గింజలనూ తినడం కష్టమనిపించింది. ఒకపిల్ల ఆడకోతి దుంపలను నీటిలో కడిగింది. ఒక పడియలో నిల్చిన నీళ్లలో గోధుమ గింజలను పడవేసింది. ఇసుక కిందికి జారి గింజలు నీటిమీద తేలాయి. ఆ కోతి సంతోషంగా దుంపలనూ, గింజలనూ తిన్నది. అంతే. మందలోని తక్కిన కోతులు ఆ ఆడకోతిని అనుకరించడం మొదలు పెట్టా యట. చివరికి మందలో బిగ్రబిగుసుకుని ఉండే పండు మగకోతులు కూడా అను కరణకు పూనుకున్నాయట. కొన్నిరకాల పక్షులు పాడుతూ ఉంటాయి. ఆ పాటలు కూడా అనుకరణతో నేర్చుకోలేక, కారణాంతరాలవల్ల ఏ పక్షి కూనకయినా వినికిడి శక్తి తగ్గితే - దాని కూత, పాట వేరుగా ఉంటాయి.

ఇక మనుషుల సంగతికి వస్తే - పిల్లలు తల్లితండ్రులను అనుకరిస్తూ పెరుగు తారు. మాటతీరు, ప్రవర్తన నేర్చుకోవడానికి అనుకరణ ఆలంబన అవుతుంది. ఆరునెలల శిశువులు చేతులు ఎత్తడం, నవ్వడం, ఏదో మాటలాడడానికి ప్రయత్నిం చడం అన్నీ అనుకరణలే. ఆ తర్వాత శిశువులు పెరుగుతున్న సంస్కృతి, భాష, వాతావరణం తగిన అనుకరణలకు దారితీస్తాయి. ఏది చేస్తే నొచ్చుకుంటారో, ఏది చేస్తే మెచ్చుకుంటారో తెలుసుకుని - అందుకు తగిన అనుకరణలూ చేస్తారు. అనుకరణ - సామాజిక ప్రవర్తనను నిర్ణయిస్తుంది.

పిల్లలు - ఆటలద్వారా, అనుకరణ ద్వారా తమంత తాము ఏదయినా పనులు చేయడం ద్వారా - నేర్చుకునే విద్య సార్థకంగా ఉంటుందని జర్మనీకి చెందిన ఫ్రిడ్‌రిక్ ఫ్రోబెల్ అనే విద్యావేత్త 'కిండర్ గార్టెన్' - 'బాలలతోట' పేరిట కొత్తరకం బడికి పునాదులు వేశారు. పిల్లలు తల్లిదండ్రులను అనుకరించడమూ తక్కిన పిల్లలను అనుకరించడమూ - పెరుగుదలలో భాగాలే. అయితే కొందరు పెద్దలూ, పెరిగిన

పిల్లలూ తక్కినవారిని అనుకరించడానికి తాపత్రయ పడినప్పుడే ఇబ్బందులు వస్తుంటాయి. 'అక్కన్న మాదన్న అందలమెక్కితే సాటికి సరప్ప చెరువుగట్టు ఎక్కాడు' అన్న పాతకాలం కథ అర్థంలేని అనుకరణ గురించి చెప్పేదే. పులికి చారలు సహజం. నక్క తాను పులిలాగా కనిపించాలని వాతలు పెట్టుకోవడం అసహజం.

ధ్వని అనుకరణ ఒక కళ. దాన్ని సాధించడానికి ఎంతో కృషి అవసరం. అయితే ఎందరి గొంతుకలను అనుసరించినా సొంత గొంతుకను కాపాడుకోవడం అవసరం. శ్రీరాముడి గొంతుకను మారీచుడు అనుకరించడంవల్ల రామాయణ కథ – మలుపు తిరిగింది.

ఒక్కోసారి అనుకరణ అసలుకన్నా బాగుంటుందనిపిస్తుంది. ప్రసిద్ధ నటుడు చార్లీచాప్లిన్ వేష భాషలను అనుకరించేవారికి ఒక పోటీ పెట్టారట. సరదాగా ఆ పోటీకి చాప్లిన్ కూడా వెళ్లాడట. అసలు చాప్లిన్‌కు మొదటి రెండు బహుమతులలో ఏదీ రాలేదు. అసలుకన్నా అనుకరణ సాధించిన గెలుపు అది. మంచిని అనుకరించ డమూ, అనుసరించడమూ మంచిదే.

ఉదాత్తులైన మహా పురుషులను అనుకరించడం ఉత్తమమని పెద్దలు చెబుతారు. అయితే ఇటీవల ఆ మహాపురుషులను కాక ఆ మహాపురుషుల పాత్రలను ధరించే నటుల వ్యక్తిత్వాలను అనుకరించడం ఎక్కువయిందని – పరివ్రాజకులు ఒకరు అభి ప్రాయపడ్డారు.

ముక్తాయింపు:

చలనచిత్ర నేపథ్య గాయకుడిగా అభివృద్ధిలోకి రావడానికి ప్రయత్నిస్తున్న ఒక గాయకుడు ఒక పెద్ద గాయకునిలాగా ఒక చెవిని చేత్తో మూసుకుని పాడుతూ తాను ఆ గాయకుడి స్థాయిలో పాడుతూ ఉన్నాననుకునేవాడు. ఒకసారి ఈ వర్ధమాన గాయకుడు ఒక సంగీత దర్శకుడి దగ్గరకి వెళ్లాడు. 'నేను ఆయనను అనుకరిస్తూ పాడగలను. మీరేమంటారు?' అన్నాడు. సంగీత దర్శకుడు- 'మీరు ఆయనను అనుక రిస్తూ పాడగలమని అనుకుంటున్నారని అంటాను' అని అక్కడి నుంచి లేచి చక్కా పోయాడు.



20. ఏది సహనం? ఏది అసహనం?

మనలోని లోపాలను మనం సహించడం పొరపాటు. మనపట్ల అసహనమూ, ఇతరులపట్ల సహనమూ ఉండాలి కదా! మనచుట్టూ ఎంతో వైవిధ్యం ఉంది. తేడాలుగా కనిపించేవి వైవిధ్యంలోని రాగాలే. రంగులే. సహనం పాటించవలసిన చోట అసహనం చూపడం, అసహనం చూపవలసిన చోట సహనం పాటించడం రెండూ సరయినవి కావు.

'చెల్లియొ చెల్లకో తమకు చేసిన ఎగ్గులు సైచిరందరున్' అనే పద్యం చాలా మందికి తెలిసినదే. ఈ పద్యపాదంలో సైచు అని ఒక పదం ఉంది. సైచు అంటే సహించు అని అర్థం. సహించడం అంటే ఓర్చుకొనడం, భరించడం అనీ అర్థాలు చెప్పవచ్చు. ఓర్పుకు భూదేవిని ఉదాహరణగా చెబుతారు.

పుడమి తల్లి తనమీది జీవజాలం ఎంతగా తనను హింసించినా భరిస్తూ వస్తున్నది. ఇళ్లు కట్టడానికి భూమిని తవ్వుతుంటారు. పంటలకోసం భూమిని దున్నుతుంటారు. నడవడమూ, పరుగెత్తడమూ ఇలాంటివేకాక భూమి మీది జీవరాసులు చేసే కార్యకలాపాలు ఎన్నో. జీవరాశి అంతా పుడమి తల్లికి సంతానమే. ఒకసారి ఒక భక్తుడు అన్నం కూడా తినకుండా తాము వద్దన్నపని చేస్తుంటే షిరిడీ సాయిబాబా గారు ఆ భక్తుడిని అతికష్టంమీద భోజనానికి పంపి – అతను వచ్చేదాకా అతను చేసిన పనిలో జోక్యం కలిగించుకోబోమని మాట కూడా ఇచ్చారు. ఆ భక్తుడు భోజనం చేయకపోతే బాబాగారు ఎందుకు బాధపడాలి అని మరొక భక్తుడు ఆయనను అడిగితే బాబాగారు – 'బిడ్డ మన కాలిమీద మల విసర్జన చేస్తే బిడ్డను నరుక్కొంటామా, కాలిని నరుక్కొంటామా. సహించవలసిందే' అన్నారట.

సహించడం అన్నది మానసికం కావచ్చు. భౌతికం కావచ్చు. శిశుపాలుడు చేసిన వంద తప్పులు సహిస్తానని శ్రీకృష్ణుడు శిశుపాలుడి తల్లి అయిన తన మేనత్తకు మాట ఇచ్చాడని పురాణ కథలు పేర్కొంటాయి.

ఏది సహించాలి? ఎంతదాకా సహించాలి?

భూమిమీద కాలుష్యం పెరుగుతూ పోవడాన్ని భూమి సహించలేకపోతున్నదన డానికి ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ఫ్లోరో క్లోరో కార్బన్స్ అనే రసాయనాల

మూలంగా భూమి పర్యావరణాన్ని కప్పిన ఓజోన్ పొరలో రంధ్రం ఏర్పడిందని కనుగొన్నారు.

సగటు మనిషి శరీరం – సహన శక్తికి కొన్ని హద్దులు ఉన్నాయి. ఎక్కువ వేడిమినీ, ఎక్కువ చలినీ ఓర్చుకోవడం కష్టం. అలాగే ఎక్కువ వెలుగును చూడడం కష్టం. పెద్ద మోతలను వినడం కష్టం. బరువు మోయడానికీ, లాగడానికీ ఏ మనిషి హద్దు ఆ మనిషిదే. శరీరంలోని సహన శక్తికి పరీక్షలు పెడితే ఆరోగ్యం పాడవుతుంది. ప్రకృతి తన సహనానికి పరీక్ష పెట్టినప్పుడు మానవజాతి దాన్ని ఎదుర్కోవడానికి తగిన సమాధానాలు వెదుక్కుంటూనే ఉన్నది. ఎండనుంచీ, చలినుంచీ రక్షించుకునే మార్గాలున్నాయి. అయితే ప్రకృతిసిద్ధమైన సమస్యలకు ప్రకృతికి విరుద్ధమైన పద్ధతుల ద్వారా సమాధానాలు అన్వేషించడం మానవజాతి అప్పుడప్పుడూ చేస్తున్న పొరపాటు.

కొందరు ప్రకృతికి విరుద్ధంగా కనిపిస్తారు. ఎండలు మండిపోతున్నా దుప్పటి కప్పుకుని నిద్రపోయేవారూ, చలి ఎముకలు కొరుకుతున్నా చొక్కా గుండీలు తీసి నడిచే వీరులూ అరుదుగానయినా కనిస్తూనే ఉంటారు. కొందరు యోగాభ్యాసం ద్వారా వేడినీ, చల్లదనాన్నీ ఏ సాధనాల అవసరం లేకుండా సహించడం సాధ్యమేనంటారు. ఆ యోగ సాధనకు అవసరమైన శ్రమను శరీరం సహించాలి కదా అని మరికొందరు అంటూ ఉంటారు. 'మా రోజుల్లో రాళ్లు' తిని అరిగించుకునే వాళ్లం' అని పాతకాలం వాళ్లు కొందరు అంటుంటారు. 'మేమయినా అంతేకదా జీతం రాళ్లు తెచ్చుకుని తింటున్నాం. పైగా ఈ రోజుల్లో చాలామంది రాళ్లల్లో బియ్యం కలిపి అమ్ముతుంటారు' అని ఆధునికులు కొందరు అసహజంగా జవాబివ్వవచ్చు.

సహనశక్తికి గట్టి పరీక్షలు పెడితే శరీరమూ, మనసూ కూడా చిత్రంగా ప్రవర్తిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక పెద్ద మనిషిని ఒక గదిలో మూడువారాలపాటు బంధించి ఒక పరిశీలన జరిపారు. మూడువారాలపాటు ఒంటరిగా ఆ గదిలో గడిపిన ఆ మనిషికి రాత్రింబగళ్ల గురించిన జ్ఞానం మందగించింది. తెలియని దిగులు ఆవరించింది. కొన్ని సర్కస్‌లలో జంతువులచేత విన్యాసాలు చేయించడానికి వాటిని ఎంతగానో హింసిస్తారట. వాటి సహన శక్తిని దెబ్బతీశాక వాటిచేత వాటికి అసహజమైన విన్యాసాలు చేయిస్తారన్నమాట. నేరాలు ఒప్పించడానికి అనుమానితులను హింసించే అలవాటు కొన్ని దేశాలలో ఉంది. ఈ హింస సహనానికి పెట్టే పరీక్షే. గుండెమీద ఏనుగును మోసినవారూ, పళ్ల బిగువున రైలుబళ్లు ఆపినవారూ కూడా చిన్న ఒత్తిడికి మానసికంగా కుంగిపోవచ్చు.

మనలోని లోపాలను మనం సహించడం పొరపాటు. మనపట్ల అసహనమూ ఇతరులపట్ల సహనమూ ఉండాలి కదా! మనచుట్టూ ఎంతో వైవిధ్యం ఉంది.

తేడాలుగా కనిపించేవి వైవిధ్యంలోని రాగాలే. రంగులే. సహనం పాటించవలసిన చోట అసహనం చూపడం, అసహనం చూపవలసినచోట సహనం పాటించడం రెండూ సరయినవి కావు.

ముక్తాయింపు:

అనగనగా ఒక పెద్ద నటికి పెద్ద గాయనిగా కూడా పేరు ఉండేది. ఆ నటి నటిస్తున్న చిత్రంలో ఆమె నాయకునితో కలిసి అభినయించవలసిన యుగళ గీతం ఆమెతోబాటు పాడడానికి ఒక కొత్త గాయకుడిని తీసుకువచ్చారు. రికార్డింగు మొదలయింది. పదిహేను సార్లు నటీమణి తప్పులు పాడడంవల్ల పాట రికార్డింగు ఆపివేయవలసి వచ్చింది. పదహారవసారి పాట మొదలు పెట్టగానే- అప్పటికే అలసి పోయిన గాయకుడి గొంతు జీరబోయింది. దాంతో పాట ఆగిపోయింది. 'అందుకే కొత్తవాళ్లతో పాడడమంటే నాకు చిరాకు' అని నటీమణి అతి సహనం ప్రదర్శించింది!



21. సలహాలను సరిగా అంచనా వేయాలి

సలహాలవల్ల ప్రధానంగా అందేది పరిజ్ఞానం. అయితే ఈ పరిజ్ఞానానికి దేశ కాల పరిమితులు ఉంటాయి. అందువల్ల ఎవరు ఏ సలహా చెప్పినా ఆ సలహాను జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకున్న తర్వాత ఆ సలహాను అమలుచేస్తే వచ్చే కష్టనష్టాల గురించి జాగ్రత్తగా అంచనా వేసుకోవాలి. కొన్ని సలహాలు ఆచరణ సాధ్యం కాకపోవచ్చు. కొన్ని సలహాలు లేనిపోని కష్టాలు తీసుకురావచ్చు.

'ప్రపంచంలో అన్నిటికన్నా సులువైన పని ఏది' అని అడిగితే పండితులొకరు– 'సలహాలు ఇవ్వడం' అని బదులు చెప్పారు. సలహాలు ఇవ్వడం అంత సులభమైనదా అని అడిగితే అవునని చెప్పేవాళ్లు, కాదని చెప్పేవాళ్ల కన్నా ఎక్కువ ఉండవచ్చు. సలహాలు చెప్పడం ఎందువల్ల సులభం అంటే సలహాలు ఇచ్చేవారు ఆ సలహాలను అమలుచేయవలసిన పనిలేదు కదా! పైగా అడిగేవాడు చెప్పేవాడికి లోకువ అని పెద్దలు చెప్పనే చెప్పారు.

అన్నీ తెలిసిన వాళ్లూ లేరు. ఏదీ తెలియని వాళ్లూ లేరు అనీ పెద్దలే చెప్పారు. అందరికీ అన్నీ తెలియవు కనుకనే తల పనిచేయకపోతే మోకాలితో నయినా ఆలోచించమన్నారు. మంచిమాట పిల్లలు చెప్పినా వినాలన్నారు. అందరికీ అన్నీ తెలియవు కనుకనే తెలియని విషయాన్ని తెలిసిన వాళ్లనడిగి తెలుసుకోమన్నారు. ఎవరికి ఎంత తెలుసో తెలిస్తే ఫరవాలేదు కానీ అట్లా తెలియనప్పుడు వచ్చే ఇబ్బందులు ఏమిటి? సలహాలు ఎవరుపడితే వాళ్లు ఇచ్చేయడమేనా? సలహాలు ఇవ్వడానికి అర్హతలు ఏవయినా ఉన్నాయా?

చాలా ఏళ్ల క్రితం ఒక పత్రికవాళ్లు ముంబై మహానగరంలో ఒక కిక్కిరిసిన రైలుపెట్టెలో ఒక మనిషిని కడుపునొప్పి అభినయించమని చెప్పి, పెట్టెలో సాటి ప్రయాణీకులు ఇచ్చిన సలహాలు నమోదుచేస్తే – రకరకాల సలహాలు వినవచ్చాయట.

కొందరు ఇళ్లల్లో ఎట్లా ఉంటారో తెలియదు కానీ, పదిమందిలోకి వచ్చినప్పుడు మాత్రం చాలా ఉత్సాహంగా సలహాలు ఇస్తూ ఉంటారు. బస్సుల్లో, రైళ్లల్లో ప్రయాణాలు చేస్తున్నప్పుడు చాలామంది 'పరిపాలన ఎలా ఉండాలి' అనే విషయం దగ్గరి

నుంచి 'ప్రయాణ సౌకర్యాలు ఎట్లా మెరుగుపరచాలి' అనే విషయందాకా రకరకాల విషయాల గురించి సలహాలు ఇవ్వగలరు.

సలహాలు ఇచ్చేవారిని బట్టీ, తీసుకునే వారిని బట్టీ వాటి ఫలితాలూ ఉంటాయి. అయితే సలహాలు ఇచ్చేవారికి కర్తృత్వం ఉండదు. కనుక ఫలితాలన్నీ వాటిని పాటించేవారే అనుభవించాలి.

ఆధునిక యుగంలో సలహాలు, సంప్రదింపులు శాస్త్రీయంగా సాగుతూ ఉన్నాయి. పరిశ్రమలు ఎలా నడపాలి, యాజమాన్యం ఎలా ఉండాలి, ఏ రకం చదువులు చదవాలి, డబ్బు ఎక్కడ మదుపు చేయాలి, విదేశ యాత్రలు చేయడానికి ఏం చేయాలి, కొత్తగా వ్యాపారం మొదలు పెట్టడానికి ఏం చేయాలి – ఇలా వేర్వేరు విషయాల గురించి సలహాలు చెప్పడానికి ఎందరో నిపుణులు ఉన్నారు. సలహాలు ఇవ్వడానికి ప్రత్యేకమైన సంస్థలూ ఉన్నాయి.

అలాగే ప్రసార మాధ్యమాలలో రకరకాల సమస్యల గురించి సలహాలు ఇచ్చేందుకే రూపొందించిన కార్యక్రమాలు, శీర్షికలూ ఉన్నాయి. వృత్తి, ఉద్యోగాల గురించీ, వైద్యం గురించీ వినిమయదారుల కష్టనష్టాల గురించీ అన్ని వయసుల వారికీ అనువైన సలహాలను ఇవ్వడం, ప్రసార మాధ్యమాలు చేస్తున్న సేవలో భాగమే. కథలు ఎలా వ్రాయకూడదు, కవిత్వం ఎలా వ్రాయకూడదు ఏం చేస్తే కథకు ఆరోగ్యం చేకూరుతుంది వగైరా సలహాలు ఇచ్చే పత్రికలూ ఉన్నాయి.

సలహావల్ల ప్రధానంగా అందేది పరిజ్ఞానం. అయితే ఈ పరిజ్ఞానానికి దేశ కాల పరిమితులు ఉంటాయి. అందువల్ల ఎవరు ఏ సలహా చెప్పినా ఆ సలహాను జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకున్న తర్వాత ఆ సలహాను అమలుచేస్తే వచ్చే కష్టనష్టాల గురించి జాగ్రత్తగా అంచనా వేసుకోవాలి. కొన్ని సలహాలు ఆచరణ సాధ్యం కాకపోవచ్చు. కొన్ని సలహాలు లేనిపోని కష్టాలు తీసుకురావచ్చు. అందుకే సలహాలవల్ల లభించే పరిజ్ఞానానికి ఆధునిక యుగంలో ఎంతో విలువ ఉంది. సలహాలకు ఆయా సందర్భాలను బట్టి ఆర్థికమూ, సామాజికమూ, సాంస్కృతికమూ, మానసికమూ అయిన ప్రయోజనాలు ఉండవచ్చు.

ఉచితంగా సలహాలు ఇవ్వడం అనుచితమని కొందరు అంటుంటారు. సలహాలు సామాన్యంగా సమానస్థాయిలో కానీ పైస్థాయి నుంచి కిందిస్థాయికి కానీ ప్రసరిస్తుంటాయి. కిందిస్థాయి నుంచి పైస్థాయికి ప్రసరించడానికి 'నేను తమకు చెప్పగలిగిన వాణ్ణికాను' వగైరా స్తుతి పాఠాలతో సలహా ఇచ్చే సంప్రదాయం ఒకటి ఉంది.

ప్రసిద్ధ పంజాబీ రచయిత్రి అమృతా ప్రీతం ఒక ప్రముఖ రచయితను తమ జీవిత చరిత్ర వ్రాయడం గురించి సలహా అడిగితే – ఆ రచయిత 'మీ జీవితం

గురించి వ్రాయడానికి విశేషం ఏముంటుంది – మొత్తం అంతా ఒక రెవిన్యూ స్టాంపు వెనుక రాసేయవచ్చు' కదా అని జవాబు చెప్పేవాడట! అమృతాప్రీతం తమ ఆత్మ కథను 'రసీదీ టికెట్' (రెవిన్యూ స్టాంపు) పేరిట 1976లో ప్రచురించారు.

ముక్తాయింపు:

ఒక వర్ధమాన రచయిత శ్రీశ్రీ దగ్గరికి వెళ్లి 'ఈ రచనలో మరికొంత నిప్పులు చెరగమంటారా' అని సలహా అడిగితే 'వైసీ వెర్సా – అటుది ఇటు చేయండి' అని సలహా ఇచ్చారట శ్రీశ్రీ.



22. పొదుపు అవసరమే... కానీ

పొదుపు అంటే విలువయిన వనరుల వినియోగంలో పాటించవలసిన అదుపు అని మహాత్ముల విశ్వాసం. మంచి పనులు చేయడానికి మనిషి శక్తి సామర్థ్యాలకు అదుపు ఉండవలసిన అవసరం లేదుకాని చాలామంది మనుషులు తమ శక్తిసామర్థ్యాలను మంచి పనులకోసం సంపూర్ణంగా వినియోగిస్తున్నట్టు కనిపించరు. అదుపుతప్పిన బండ్లలాగే అదుపుతప్పిన జీవితాలుకూడా తల్లకిందులు కావచ్చు.

'మీ కుటుంబంలోని అందరూ తప్పకుండా చేసే పనులు అని ఏవయినా ఉన్నాయా' అని ఒక పత్రికవారు మన దేశంలోని అతి సంపన్న కుటుంబం ఒక దానికి చెందిన వారిని అడిగారు. అందుకు ఆ కుటుంబ సభ్యులు 'మేము ఎప్పుడు ఏ గదిలో నుంచి బయటికి నడుస్తున్నా ఆ గదిలో మరెవరూ లేకపోతే - గదిలోని విద్యుత్ దీపాలూ, పంకాలూ అన్నీ ఆపి బయటికి నడుస్తుంటాము' అని చెప్పారు. అంటే విద్యుచ్ఛక్తి దుర్వినియోగం కాకుండా పొదుపుగా వాడడం ఆ కుటుంబ లక్షణం అని చెప్పుకోవచ్చు. చాలా కార్యాలయాలలో నిర్మానుష్యమైన గదులలో దీపాలు వెలుగుతూ, పంకాలు అతి వేగంతో తిరుగుతూ కనిపిస్తుంటాయి.

'నీళ్లాటని ఇంట నిధులాటవు' అని పెద్దవాళ్లు ఏనాడో చెప్పారు. అంటే నీళ్లను వ్యర్థం చేసే ఇంట డబ్బు వ్యర్థమవుతూ ఉండవచ్చునని హెచ్చరిక. నీరు మానవ జాతికి లభించిన పెద్దవరం. ఇంకా మనదేశంలో కనీసం రెండు మూడు కిలోమీటర్లు నడిచి వెడితే తప్ప తాగడానికి నీళ్లు దొరకని కుగ్రామాలు కొన్ని ఉన్నాయన్నప్పుడు తేలికగా దొరుకుతున్నందుకు నీళ్లను విచ్చలవిడిగా దుబారా చేయడం సమం జసమా? ఆలోచించాలి.

రానున్న శతాబ్దాలలో వేర్వేరు దేశాలమధ్య నీటి వనరుల కారణంగా తగాదాలు రావచ్చునని భవిష్య శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రాణాధారమైన నీటిని అతి జాగ్రత్తగా వాడుకోవలసి ఉంది.

రెండువేల సంవత్సరాల క్రితం - మానవ ప్రవర్తన ఎలా ఉండాలో నిర్దేశిస్తూ తమిళ జ్ఞాని తిరువళ్లువర్' తిరుక్కురళ్ అనే మహత్తరమైన రచన చేశారు. వళ్లువర్ గురించి ఒక కథ చెబుతారు. రోజూ ఆయన భోజనానికి కూచునే ముందు తన

పక్కన ఒక పుల్లను ఉంచుకొనేవారట. భోజన సమయంలో – చిందిన మెతుకులను పుల్ల సాయంతో తీసుకునేవారట. అలా అన్నం వృథా కాకుండా చూసేవారట. అక్షరాలలో అనల్ప ప్రతిభ అనడానికి తిరుక్కుఱళ్ రచనే ఉదాహరణగా చెప్పవచ్చు. రెండు పంక్తుల కుఱళ్‌లో జీవిత సత్యాలను తేలికగా చెప్పగలిగారు తిరువళ్లువర్. తమిళనాడుకే చెందిన ఈ.వి.రామస్వామి 'పెరియార్'గా ప్రసిద్ధులు. స్వాతంత్ర్య సమరయోధులు. అస్పృశ్యతా నివారణ కోసం కేరళలోని వైకంలో సత్యాగ్రహం సాగించి దేశం దృష్టిని ఆకర్షించినవారు. సంఘ సంస్కర్తగా నాస్తిక దార్శనికులుగా పేరు గడించారు. పెరియార్ పొదుపరిగా ప్రసిద్ధులు. పొడుగు. చేతుల చొక్కా కుట్టించుకొన్న పెద్దమనిషి ఆ చొక్కా చేతులను పైకి మడచుకొని ఏదో పనిచేస్తూ ఉంటే పెరియార్ అడిగారట – 'మడుచుకోవడం తప్పనిసరి అయినపుడు పొట్టిచేతుల చొక్కా కుట్టించుకొని బట్ట పొదుపు చేసి ఉండవచ్చుకదా' అని.

మహాత్మాగాంధీ గారి పొదుపు గుణం కూడా ప్రసిద్ధమే. ఒకసారి ఆయన తమ దగ్గర కొత్తగా కుదిరిన టైపిస్టుగారిని ఒక ఉత్తరం టైపు చేయమన్నారు. టైపు చేయడంలో తేడాలు వచ్చి ఉత్తరం వంకరటింకరగా తయారయింది. టైపిస్టు మరొకసారి ఉత్తరం మరొక కార్డుమీద టైపు చేసి ఇస్తాననంటే గాంధీజీ కాలమూ, వస్తువూ రెండూ వృథా కావడం తమకు ఇష్టంలేదని టైపిస్టు టైపు చేసిన ఉత్తరం కింద 'ఇది నా కొత్త టైపిస్టు పనితనం' అని రాసి, సంతకం పెట్టి ఆ ఉత్తరాన్ని పంపించేయమన్నారట.

పొదుపు అంటే విలువయిన వనరుల వినియోగంలో పాటించవలసిన అదుపు అని మహాత్ముల విశ్వాసం. మంచి పనులు చేయడానికి మనిషి శక్తి సామర్థ్యాలకు అదుపు ఉండవలసిన అవసరం లేదు కాని చాలామంది మనుషులు తమ శక్తి సామర్థ్యాలను మంచి పనులకోసం సంపూర్ణంగా వినియోగిస్తున్నట్టు కనిపించరు. అదుపు తప్పిన బండ్లలాగే అదుపు తప్పిన జీవితాలు కూడా తల్లకిందులు కావచ్చు.

కొందరు డబ్బు విషయంలో పాటించే పొదుపును తక్కిన విషయాలలో పాటించరు. కొందరు తమ డబ్బు విషయంలో పాటించే పొదుపు తక్కిన వాళ్ల డబ్బు విషయంలో పాటించరు.

కొందరు తమ ప్రాణంకన్నా మిన్నగా డబ్బును ప్రేమిస్తారు. పిసినిగొట్లుగా తయారవుతారు. కోటీశ్వరులుగా ఉన్నా కడుపునిండా తినని వాళ్లూ, ఒక జత దుస్తులనే – అవి ఉతికితే పాడవుతాయన్న భయంతో ఉతక్కుండానే రోజుల తరబడి తొడుక్కొన్న వాళ్లు – తొడుక్కొంటే అరిగిపోతాయని చెప్పులు చేతబట్టుకుని తిరిగిన వాళ్లు – పిసినిగొట్టు తనానికి ఉదాహరణలుగా చరిత్రలో కనిపిస్తుంటారు. పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు వ్రాసిన ఒక నాటకంలోని ఒక పిసినిగొట్టు పాత్ర

కావాలంటే తనకు నాలుగు దెబ్బలు తగలనియ్యమనీ ఒక్క కాణీ డబ్బు మాత్రం అడగవద్దనీ చెబుతుంది. కొందరు ఆనపకాయలను అట్టే పోనిచ్చి ఆవగింజల విష యంలో అతిజాగ్రత్త వహిస్తూ ఉంటారు. పిల్లలను ముద్దుచేస్తే చెడిపోతారని కొందరు తల్లిదండ్రులు ప్రేమాభిమానాలు చూపించడంలో అదుపు పాటిస్తుంటారు. అతి సర్వత్ర వర్జనీయమే కాని – అసలుకే మోసం వచ్చే పనులు చేయడం పొసగదు కదా!

ముక్తాయింపు:

అనగనగా ఒక గృహస్థు ఉండేవాడు. ఏదయినా ఖర్చు చేయవలసి వస్తే పది సార్లు ఆలోచించి ఆ ఖర్చు మానేయడాకి ప్రయత్నించడం ఆయన లక్షణం. ఆ గృహస్థు భార్య ఒకసారి తాను తన పుట్టింటికి వెళ్లి తన తల్లిదండ్రులనూ, చుట్ట పక్కాలనూ చూసిరావాలని ఉందని ఊరికి వెళ్లి రావడానికి ప్రయాణం ఖర్చుల కోసం భర్తను డబ్బు అడిగింది. డబ్బు విలువ గురించి ఆమెతో ఉపన్యసించిన భర్త ఆమె ప్రయాణం మానుకోవడంవల్ల ఆ ఖర్చు కలిసి వస్తుందని సలహా ఇచ్చాడు. వారం తర్వాత భార్య భర్తతో – 'మీ మాట సబబేనండీ. అందుకే మా వాళ్లనే ఇక్కడికి రమ్మని ఉత్తరం వ్రాశాను. వాళ్లు వచ్చే ఆదివారం బయలుదేరి ఇక్కడికి వస్తున్నట్లు ఉత్తరం వ్రాశారు' అని చెప్పింది.



23. మార్పు అంటే భయమా?

మార్పు అంటే చాలామందికి భయం. కొందరు నిర్భయంగా ఇళ్లు మారుతూ ఉంటారు. ఉద్యోగాలు మారుతూ ఉంటారు. కొందరు తమ ఇళ్లనో, వ్యాపార కేంద్రాలనో ఎప్పుడూ కడుతూ కొడుతూ నిత్యనూతనంగా మార్పులు చేస్తూ ఉంటారు. కొందరయితే జీవితంలో మార్పులు రావాలని తమచుట్టూ భౌతికమైన మార్పులు చేసుకొంటూ ఉంటారు.

'గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్' అనే ఆంధ్ర మహాభారతంలోని పంక్తికి కొందరు యథాశక్తి తమతమ వ్యాఖ్యానాలు చేస్తూ ఉంటారు. ప్రపంచం మారిపోతున్నదనీ, పాతకాలంలో ఉన్నట్టు లేదనీ కొందరు విమర్శిస్తూ ఉంటారు. కాలం ఎవరికోసమూ ఆగదు. కాలంతోపాటు వచ్చే మార్పులనూ ఎవరూ ఆపలేరు. కాలం మనుషులలోనూ మనుషుల చుట్టూ ఉన్న పరిస్థితి గతులలోనూ మార్పులు తెస్తుంది. కొన్ని మార్పులు మేలుచేసేవి కావచ్చు. కొన్ని అంతగా మేలుచేసేవి కాక పోవచ్చు. కాని కాల పరిణామ క్రమంలో వచ్చే మార్పులను అడ్డుకోవడం సాధ్యపడే పనికాదు.

మార్పు సహజమైనదే. చూస్తూ ఉండగా పిందె కాయై, పండయి రాలిపోతుంది. పసిపిల్లలుగా ఉన్నవారే కాలగతిలో వృద్ధులై ప్రపంచం నుంచి నిష్క్రమిస్తూ ఉంటారు. కొన్ని మార్పులు నెమ్మదిగా వస్తాయి. ఉప్పెనలాగా వచ్చే మార్పులు కొన్ని.

ఇటీవలి కాలంలో శాస్త్ర సాంకేతిక రంగాలలో వచ్చిన మార్పులవల్ల జీవన గతులలో మార్పులు వచ్చాయి. వృత్తి ఉద్యోగాల విషయంలో మార్పులు వచ్చాయి. వస్తాయి.

ఎన్నో ఉద్యోగాలు ఆ ఉద్యోగాలు చేసేవారికి భద్రత, నిశ్చింత అలవాటు చేశాయి. ఉద్యోగ భద్రత కొన్నాళ్ల తర్వాత ఉండకపోవచ్చు. కొన్ని దేశాలలో కొన్ని ఉద్యోగాలలోనూ, వృత్తులలోనూ కొనసాగాలంటే ఎప్పటికప్పుడు ఆయా రంగాలలో వస్తున్న మార్పులకు తగినట్టు శిక్షణ పొంది అవసరమైన పరీక్షలలో ఉత్తీర్ణులు కావాలి. ఆ ఉత్తీర్ణత పొందిన తర్వాత ఆ ఉద్యోగంలోనో, వృత్తిలోనో ఉండాలంటే నిర్ణీత కాలపరిమితి తర్వాత మళ్లీ తప్పనిసరిగా పరీక్షలలో ఉత్తీర్ణులు కావాలి.

మార్పు అంటే చాలామందికి భయం. కొందరు నిర్భయంగా ఇళ్లు మారుతూ ఉంటారు. ఉద్యోగాలు మారుతూ ఉంటారు. కొందరు తమ ఇళ్లనో, వ్యాపార కేంద్రా

లనో ఎప్పుడూ కదుతూ కొదుతూ నిత్యనూతనంగా మార్పులు చేర్పులు చేసుకొంటూ ఉంటారు. కొందరయితే జీవితంలో మార్పులు రావాలని తమచుట్టూ భౌతికమైన మార్పులు చేస్తూ ఉంటారు. కొందరు తమ వయసు పెరగడంతో వస్తున్న మార్పులను తట్టుకోలేరు. కొందరికి భౌతికమైన మార్పులన్నా భయమే. మరి కొందరికి భౌతికమైన మార్పుల విషయంలో భయం ఉండదు కానీ తమ ప్రవర్తననో, పద్ధతినో, ఆలోచననో మార్చుకోవాలంటే భయం. ఏళ్ల తరబడి చేసుకున్న అలవాట్లను మార్చు కోవాలంటే భయం. పెద్దలు కొందరు భగవద్గీత మనిషిలో జరుగుతున్న పోరాటాన్ని సాంకేతికంగా వివరిస్తున్నదని వ్యాఖ్యానించారు. ఏళ్ల తరబడి అలవడ్డ లక్షణాలు బంధువులలాగా కనిపించే శత్రువులనీ పేర్కొన్నారు.

కొన్ని సంస్థలలో ఉద్యోగులను ఒక కుర్చీ నుంచి మరొక కుర్చీకి, ఒక స్థలం నుంచి మరొక స్థలానికీ మారుస్తూ ఉంటారు. ఇలా మార్చడం వల్ల ఏ వ్యక్తీ ఒకే కుర్చీలోకానీ, ఒకే స్థలంలోకానీ పాతుకుపోయే ప్రమాదం ఉండబోదని పాలనా సూత్రం. కుర్చీలో కూచునే వ్యక్తి మారడంతో ఆ సంస్థలో పద్ధతులు మారడానికి ఎంత వీలుంటుందో మారకపోవడానికీ అంతే వీలుంటుంది.

జీవితంలో మార్పులు తప్పనిసరి అని తెలిసినప్పుడు వాటిని ఎదుర్కోవడం ఎలాగా? మానసిక శాస్త్రవేత్తలు కొన్ని సూచనలు చేశారు. వాటిలో మొదటిది - వస్తున్న మార్పు ఎలాంటిదో తెలుసుకోవడం. ఆ మార్పు తనకేకాక తన చుట్టూ ఉన్నవారికీ వర్తించే పక్షంలో వారందరూ ఆ మార్పు తీరుతెన్నుల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి. అవసరమైన చర్యలు తీసుకోవాలి. వృత్తి ఉద్యోగాలకు సంబంధించిన మార్పులయితే ఆ మార్పుల గురించి తగిన శిక్షణ పొందాలి. కొన్ని మార్పులతోపాటు సమస్యలూ వస్తాయి. ఆ సమస్యలను ఎదుర్కోగల శక్తి సామర్థ్యాలూ పెంచుకోవాలి.

కొన్ని మార్పులు - కొన్ని జీవితాలను అస్తవ్యస్తం చేసేస్తూ ఉంటాయి. 'ఓడలు బండ్లౌను, బండ్లు ఓడలౌను' అనే సామెత అటువంటి స్థితిని గుర్తుచేస్తుంది. ఏ మార్పు వచ్చినా తబ్బిబ్బు కాకుండా ఉండగల స్తిమిత ప్రజ్ఞ అలవాటు చేసుకోగల గాలి. 'పట్టి చంపేవేళను పట్టము కట్టేవేళ అట్టునిట్టు చలించని ఆతడే సుఖి' అన్నారు తాళ్లపాక అన్నమాచార్యులు.

ముక్తాయింపు:

విరివిగా జానపద చిత్రాలు తీసిన ఒక దర్శకుడు తన కొత్త చిత్రం ఎలా ఉందో చెప్పమని ఒక విమర్శకుణ్ణి అడిగారు. విమర్శకుడు "మీరు రెండేళ్ల క్రితం తీసిన ఫలానా చిత్రంకథ ఏమీ మార్చకుండా అలాగే తీసినట్టున్నారు. పైగా నాయికా నాయకులూ వాళ్లే" అన్నాడు. "కథ మార్చకపోవడం ఏమిటి? అందులో నాయికా నాయకులు పావురాలుగా మారతారు. ఈ సినిమాలో చిలుకలుగా మారుతారుకదా!" అన్నాడు దర్శకుడు.



24. జాగ్రత్త - అతి జాగ్రత్త

అజాగ్రత్త వల్ల చాలా పొరపాట్లు, సమస్యలూ కలిగినట్లే అతి జాగ్రత్తవల్ల కూడా ఇతోధికంగా పొరపాట్లు, సమస్యలూ కలగవచ్చు. తక్కిన జీవులందరికీ రాత్రి అయినా యోగికి అది పగలే అని ఆధ్యాత్మిక వేత్తలు అంటారు. మెలకువగా ఉండడం అంటే ఊరికే కళ్లు తెరుచుకుని ఉండడం కాదు. జ్ఞానంతో మెలకువగా ఉండడమే అసలయిన జాగరూకత.

కొన్ని మాటల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మాటవరసకు మాట అనే మాటనూ, జాగ్రత్త అనే మాటనూ తీసుకుందాం. ఏమాటకు ఆమాట చెప్పు కొంటే మాట అనే మాటకు ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క అర్థం ఉంటుంది. 'నా మాటకు తిరుగులేదు' 'నామాట చెల్లుబడి కాదు' 'మాట పడడం ఇష్టంలేదు' వంటి వాక్యాలలో మాటకు సందర్భాన్ని బట్టి అర్థం మారుతుంటుంది. ఏ పనిచేసినా, ఏ మాట అనినా జాగ్రత్త అవసరమని పెద్దలు అంటుంటారు.

మాటలోంచి జాగ్రత్తలోకి వస్తే – జాగ్రత్త అనే మాటను సాధారణంగా అయితే మెలకువ అని అర్థం చెప్పుకోవాలి. 'దొంగలున్నారు జాగ్రత్త' అని చాలాచోట్లలో హెచ్చరికలు కనిపిస్తుంటాయి. అత్తవారింటికి వెడుతున్న కూతురికి తల్లి జాగ్రత్తలు చెప్పడం, కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న తమ పిల్లలకు తల్లిదండ్రులు జాగ్రత్తలు చెప్పడం వంటి సందర్భాలలో జాగ్రత్త సూచన కావచ్చు. హెచ్చరిక కావచ్చు. ఎవరి జాగ్రత్తలో వాళ్లు ఉండాలి కదా మరి!

అభద్ర వాతావరణంలో సుభద్రంగా ఉండడానికి చాలా జాగ్రత్తలు అవసరమని కొందరు అతి జాగ్రత్తపరులు హెచ్చరిస్తూ ఉంటారు. ముందుజాగ్రత్త చర్యలు తీసు కోవడంవల్ల చాలా లాభాలుంటాయని అనుభవజ్ఞులు చెబుతూ ఉంటారు. నిత్య జీవితంలో మనకు చాలా సందర్భాలలో జాగ్రత్త, అజాగ్రత్త, అతి జాగ్రత్తలకు సంబం ధించిన సంఘటనలు ఎదురవుతూనే ఉంటాయి.

జానపద కథలలో మాంత్రికుల ప్రాణాలు వాళ్ల దగ్గర ఉండవు. ఏ ఏడు సము ద్రాల అవతల ఉండే ఏడో ద్వీపంలోని ఏడంతస్తుల మేడలో ఏడో అంతస్తులోని ఏడవ గదిలో ఉండే ఏడవ భోషాణం పెట్టెలోని ఏడవ సొరుగులోగానీ, ఏ పాతాళ

గృహంలోనో నిప్పులు కక్కే భల్లూకాల కాపలాలో ఉన్న కుంకుమ భరిణెలోనో ఉన్న మాంత్రికుల ప్రాణాల కోసం జానపద వీరులు సాహసాలు చేసిన కథలెన్నో.

తక్కిన జీవులందరికీ రాత్రి అయినా యోగికి పగలే అనీ ఆధ్యాత్మిక వేత్తలు అంటారు. మెలకువగా ఉండడం అంటే ఊరికే కళ్లు తెరుచుకొని ఉండడం కాదు. జ్ఞానంతో మెలకువగా ఉండడమే అసలయిన జాగరూకత.

కొన్ని వ్యవస్థలలో చాలా జాగ్రత్తలు ఉంటాయి. డబ్బుతో లావాదేవీలు జరిపే చోట్ల ఆ డబ్బు ఉంటే భద్రమైన గదిని తెరవడానికి ఒక జత తాళం చెవులు అవసరం. అవి ఇద్దరి దగ్గర ఉంటాయి. ఇద్దరూ కలిసి జాగ్రత్తగా తెరిస్తే తప్ప గదిని తెరవడం కుదరదు.

అజాగ్రత్తవల్ల చాలా పొరపాట్లు, సమస్యలూ కలిగినట్లే, అతి జాగ్రత్త వల్ల కూడా ఇతోధికంగా పొరపాట్లూ సమస్యలూ కలుగవచ్చు. మాటల విషయమే చూస్తే రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్నప్పుడు జపానువారు పంపిన ఒక లేఖను ఎవరో ఆంగ్లంలోకి అజాగ్రత్తగా అనువదించడంవల్ల చాలా నష్టం జరిగిందని రాచమల్లు రామచంద్రారెడ్డిగారు పేర్కొన్నారు.

అజాగ్రత్త అనువాదాలకు కొదవేమీ లేదు. ఇందుగలదందులేదంటూ అవి కనిపిస్తుంటాయి. వినిపిస్తుంటాయి.

అతిజాగ్రత్తతో ప్రవర్తించేవాళ్లు ఏ ఊరికో ప్రయాణమవుతూ రైలు టికెట్లు మరిచిపోవచ్చు. అనవసరమైనవన్నీ పట్టించుకొని అవసరమైనవి మరచిపోవచ్చు. ఒక కార్యాలయంలో పనిచేసే ఒక పెద్ద మనిషికి ఎవరయినా ఏదయినా పనిచెబితే వెంటనే ఒక కాగితం ముక్కమీద రాసుకుని జాగ్రత్తగా జేబులో పెట్టుకునేవాడు. మరొక కార్యాలయంలో ఒక అధికారి ఉండేవాడట. ఆయన కార్బన్ ఉంచి టైపుచేసిన ప్రతులను కూడా అతిజాగ్రత్తగా సరిచూసి అసలులో ఉన్నది ప్రతిలోనూ ఉన్నదా లేదా చూసేవాడట. ఆయననే ఒకసారి కార్యాలయంలో ఇరవై ముప్ఫై ఏళ్లనాటి పాత ఫైళ్లు పేరుకుపోయి ఉన్నాయి ఏంచేయమంటారు అని సలహా అడిగితే వాట న్నిటికీ ప్రతులు తీసుకుని ఫైళ్లను నిర్మూలించమని అతిజాగ్రత్తగా సలహా చెప్పాడట.

అతిజాగ్రత్తవల్ల అనుమానాలు వస్తుంటాయి. దాంతో చేసిన పనే మళ్లీ చేయ వలసి రావడంకానీ ఆ చేస్తున్నప్పుడు తప్పులు చేయడంకానీ జరగవచ్చు.

ముక్తాయింపు:

ముల్లా నసీరుద్దీన్ గురించి చాలా కథలు వ్యాప్తిలో ఉన్నాయి. వాటిలో ఒక అతి జాగ్రత్త కథ ఉంది.

నసీరుద్దీన్ ఒక పిల్లవాడి చేతికి ఒక గాజు జాడీ ఇచ్చి దాన్ని పొరుగింటి వాళ్లకు జాగ్రత్తగా ఇచ్చి రమ్మన్నాడట. పిల్లవాడు జాడీ తీసుకుని వెళ్లబోతుంటే వాణ్ణి ఆపి. జాడీ అవతల పెట్టించి పిల్లవాడిని కొట్టడం మొదలు పెట్టాడట. పక్కనే ఉన్న పెద్దమనిషి నసీరుద్దీన్‌ను అడిగాడట – పిల్లవాణ్ణి ఎందుకు కొడుతున్నావని. “పిల్లవాడు జాడీ పగలగొట్టిన తర్వాత కొడితే ప్రయోజనం ఏమిటి? అందుకనే జాగ్రత్తగా ముందే కొడుతున్నాను” అన్నాడట నసీరుద్దీన్.



25. సమయస్ఫూర్తి

కొన్ని రకాల తుమ్మెదలకు రోజూ ఒక నిర్ణీత సమయానికి ఆహారం ఇస్తుంటే కొన్నాళ్ల తర్వాత అవి ఆ వేళకే ఆహారానికి వస్తుంటాయని తేలింది. చెన్నపురి సమీపంలోని పక్షితీర్థం క్షేత్రానికి కొన్నేళ్ల క్రితం దాకా మధ్యాహ్నం రెండు డేగలు వచ్చి ఆహారం స్వీకరించి పోతుండేవి. మన దేశానికి సైబీరియా నుంచి వలసవచ్చే పక్షుల సంగతి చాలామందికి తెలిసిందే.

అనగనగా ఒక పండితుడు ఉండేవాడు. ఆయనకు అంతగా పండితుడుకాని ఒక కొడుకు ఉండేవాడు. పండితుడు తన పలుకుబడితో కొడుకుకు ఒక ఉద్యోగం సంపాదించి పెట్టాడు. పండితుడి కొడుకును చాలామంది ఎగతాళి చేస్తూ ఉండే వారు. ఎవరయినా తనను ఏదయినా అంటే దాన్ని అలాగే తండ్రికి చెప్పుకొనేవాడు. 'వాడు అలా అంటే నీవు ఇలా అని ఉండవలసింది' అని తండ్రి కొడుకుకు చెప్పే వాడు. పండితుడి కొడుకు - తనను మాటలన్నవారిని మళ్లీ కలుసుకున్నప్పుడు - 'నీవు అప్పుడు అలా అన్నావు కదా అది మా నాన్నకు చెప్పాను ఆయన ఇలా అన మన్నాడు' అని చెప్పేవాడు. అంటే పండితుడి కొడుకుకు సమయస్ఫూర్తి లేదని చెప్పుకోవాలన్నమాట.

ప్రాచీనులైన తెలుగు నిఘంటువులలో సమయస్ఫూర్తి అనేమాట కనిపించదు. సమయం వేరు. స్ఫూర్తి వేరు. సమయానికి స్ఫురించడం అనే అభిప్రాయం నుంచి సమయస్ఫూర్తి పుట్టి ఉండవచ్చు. (ఎలా పుడుతుంది అని అడగకండి. ఇప్పటికిప్పుడు స్ఫురించిన వివరణ ఇది!) సమయస్ఫూర్తికి సంగతీ సందర్భమూ కలిసిరావాలి. సమయమూ అనువైనదై ఉండాలి.

అస్త్రాల ప్రయోగం సమయానికి స్ఫురణకు రాకపోవడంవల్ల కర్ణుడు మహా భారత యుద్ధంలో పరాజయం పొందాడు.

సమయం అనే మాటకు కాలం అనే అర్థం ఉంది కదా! భూమి తనచుట్టూ తాను తిరుగుతూ ఉండడంవల్ల - సూర్యుడు తూర్పున ఉదయించి పడమట అస్త మిస్తున్నట్టు అనిపిస్తుంది. రెండు ఉదయాల మధ్య తేడా ఒకరోజు. ఈ రకం కాల

మానాన్ని భ్రమణ కాలం అంటారు. ఇలాగే రకరకాల పద్ధతులలో కాలాన్ని కొలవ దానికి గతిశీలకాలం, పరమాణుల కాలం వంటి పద్ధతులున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా బ్రిటన్‌లో గ్రీనిచ్‌లోని గడియారం చూపే కాలం ప్రాతిపది కగా గ్రీనిచ్ సగటు కాలప్రమాణం (Greenwich Mean Time) 1928దాకా ప్రమా ణంగా పాటించేవారు. అప్పట్లో రోజు మిట్ట మధ్యాహ్నం 12 గంటలకు మొదల య్యేది. 1884లో ఈ విధానం మొదలయింది. ప్రపంచం మొత్తాన్నీ 24 కాల విభా గాలుగా విభజించారు. 1925 నుంచి – రోజు అర్ధరాత్రి 12 గంటలకు మొదలు కావాలని నిర్ణయించారు. ఈ తేడాలవల్ల గందరగోళం రాకుండా 1928 నుంచి అంతర్జాతీయ ఖగోళ సంస్థవారు విశ్వకాల ప్రమాణం (యూనివర్సల్ టైమ్) పాటిం చాలని సూచించారు. దీన్ని క్లుప్తంగా UTC అంటారు. మన భారతీయ పంచాంగ పద్ధతి ప్రకారం-రోజు సూర్యోదయంతో మొదలవుతుంది. మన జాతీయ పంచాంగం ప్రకారం మన శక సంవత్సరం ప్రతి ఏడాదీ మార్చినెల 21న మొదలవుతుంది. లీపు సంవత్సరం అయితే శక సంవత్సరం మార్చి 20న మొదలవుతుంది. కాని మన రైల్వేవారి పద్ధతిలో అర్ధరాత్రి పన్నెండు తర్వాత రోజు మారుతుంది. అంటే అర్ధరాత్రి 12 తర్వాత తేదీ మారుతుందన్నమాట. ఈ వివరం తెలియక మనం రైల్వేస్టేషన్‌కు వెడితే మనం ఎక్కవలసిన రైలు ఒక జీవితకాలం ముందే వెళ్లిపోయి ఉంటుంది!

క్రీస్తుశకం పేరిట కాలాన్ని పేర్కొనడం 1477 ఏళ్ల క్రితం – అంటే క్రీస్తుశకం 525వ సంవత్సరంలో మొదలయింది. దాన్ని డయనోసియస్ ఎక్సిగోరస్ అనే అయన మొదలు పెట్టాడు. జూలియస్ సీజర్ కాలంలో అంటే క్రీస్తుపూర్వం ఒకటవ శతాబ్దంలో జూలియన్ కాలెండర్ మొదలయింది. 1582 నుంచి ప్రస్తుతం వాడుకలో ఉన్న గ్రెగేరియన్ కాలెండర్ వాడుకలోకి వచ్చింది. గ్రెగేరియన్ కాలెండర్ ప్రకారం సగటు సంవత్సరంలో 365.2425 రోజులుంటాయి.

సమయస్ఫూర్తితో మొదలుపెట్టి చాలా సమయం– సమయం గురించే మాట్లాడు కున్నట్టున్నాం. త్రేతాయుగంలోని రైవతకుడనే రాజు తన కుమార్తె రేవతికి తగిన వరుడు ఎవరో కనుక్కోవడానికి బ్రహ్మలోకానికి వెళ్లాడు. బ్రహ్మ దర్శనం కోసం ఒకరోజు కాచుకున్నాడు. బ్రహ్మ దర్శనం అయేలోగా – అంటే బ్రహ్మలోకం కాల మానం ప్రకారం ఒకరోజు గడిచేలోగా – త్రేతాయుగం పోయి ద్వాపరయుగం వచ్చే సిందట. బ్రహ్మ సూచన మేరకు రైవతకుడు తన కుమార్తెను శ్రీకృష్ణుడి అన్నగారయిన బలరాముడికి ఇచ్చి పెళ్లిచేశాడని పురాణ కథ!

జంతువులలోనూ, చెట్లలోనూ కూడా సమయానికి సంబంధించిన స్ఫురణ ఉంటుందని శాస్త్రవేత్తలు నిరూపించారు. సముద్రంలోని ఒకరకం జంతువు అలల

ఆటుపోట్లకు తగ్గట్టు సంకోచించడమూ వ్యాకోచించడమూ చేస్తుంటుందనీ, దాన్ని సముద్రంలోంచి తెచ్చి ఒక పెద్ద తొట్టిలో పెట్టినా దాని పద్ధతిలో మార్పురాలేదని తెలిసింది.

కొన్నిరకాల తుమ్మెదలకు – రోజూ ఒక నిర్ణీత సమయానికి ఆహారం ఇస్తుంటే– కొన్నాళ్ల తర్వాత అవి ఆ వేళకే ఆహారానికి వస్తుంటాయని తేలింది. చెన్నపురి సమీపంలోని పక్షితీర్థం క్షేత్రానికి కొన్నేళ్లక్రితం దాకా మధ్యాహ్నం రెండు డేగలు వచ్చి ఆహారం స్వీకరించి పోతుండేవి. మన దేశానికి – సైబీరియా నుంచి వలసవచ్చే పక్షుల సంగతి చాలామందికి తెలిసిందే! పిల్లులకూ కుక్కలకూ ఒక తేడా ఉందని చెబుతారు. ఒక నిర్ణీత సమయానికి తిండి పెట్టడం అలవాటు చేస్తే – పిల్లులు ఆ సమయానికి వచ్చి తిండి పెడితే తింటాయట. పెట్టకపోతే వెళ్లిపోతాయట. కుక్కలు– తిండి పెట్టేదాకా అక్కడే ఉంటాయట!

ముక్తాయింపు

అనగనగా ఒక ఊళ్లో ఒక దొడ్డ ఇల్లాలు ఉండేది. ఆవిడ ఎవరి ఇంటికయినా వస్తుందంటే భయపడేవారట. ఆవిడ అవతలి వాళ్ల సమయంతో నిమిత్తం లేకుండా గంటల తరబడి తిష్ఠవేసి అనవసరమైన కబుర్లు చెబుతూ విసిగిస్తూ ఉండేదట. ఒకసారి ఒక పొరుగింటి గృహిణి ఆ దొడ్డ ఇల్లాలు వస్తూ ఉండడం గమనించి – ఆవిడను త్వరగా పంపించే ఉపాయం చూడమని కూతురికి చెప్పి తాను ఒక మూల గదిలో దాక్కుందట. అలా దాక్కుని కాసేపు నిద్రకూడా పోయిందట. మెలకువ వచ్చాక కూతుర్ని 'ఆ పీడ వెళ్లిపోయిందా' అని అడిగిందట. అప్పటికి మూడు గంటల నుంచీ దొడ్డ ఇల్లాలి పోరు భరిస్తున్న ఆ కూతురు 'అబ్బే ఆవిడ ఎప్పుడో వెళ్లిపోయారు. ఇప్పుడు నేను మాట్లాడుతున్నది మన పొరుగింటి అత్తయ్యగారితో' అని సమయ స్ఫూర్తితో జవాబిచ్చిందట!



26. స్నేహాల విషయంలో

దుర్జనులతో చెలిమి ఉదయం పూట నీడలాగా మొదట ఎక్కువగా ఉండి క్రమంగా తరిగి పోతుంది. సజ్జనులతో చెలిమి మధ్యాహ్నం నీడలాగా మొదట తక్కువగా ఉండి క్రమంగా పెంపొందుతుంది. వ్యక్తిత్వ వికాసానికి మంచి స్నేహితులు అవసరం. మంచిని పెంచుకోవడానికీ, మంచిని పంచుకోవడానికి స్నేహం కావాలి. యువప్రాయంలో ఉన్నవారు స్నేహాల విషయంలో చాలా జాగ్రత్త వహించాలి.

'మీ స్నేహితులెవరో చెప్పండి మీరెవరో చెబుతాను' అని ఆంగ్లంలోని ఒకసూక్తి హెచ్చరిస్తుంది. స్నేహితం అనే మాటలో స్నేహం అనే మాట హితం అనే మాట కలగలిసి పోయినట్టు కనిపిస్తాయి. స్నేహం అంటే అట్లా కలిసిపోయి ఉండటం అన్నమాట. అయితే స్నేహితులందరూ హితులు కారు. కాలేరు. 'స్నేహం అంటే జారిపోతున్న వలువను అప్రయత్నంగా పట్టుకొని ఎగగట్టే చేతిలాగా ఉండాలి' అని రెండువేల ఏళ్ల నాటి తమిళ దార్శనికులు తిరువళ్లువర్ చెప్పారు. అడగకుండానే అవసరానికి అక్కరకు రావడం స్నేహ ధర్మాలలో ఒకటి. స్నేహమనే మాటకు చమురు అనే అర్థమూ ఉంది. మరి చమురు జిడ్డు పట్టినంత గట్టిగా ఉంటుంది కదా కొందరి స్నేహం!

హితులు వేరు స్నేహితులు వేరు అన్నట్టే, స్నేహితులలోనూ సన్నిహితులు వేరే ఉంటారు. చెలిమికి కలిమిలేములు, వయసు వంటివి అవరోధాలు కావు. కుబేరుడితో పరమేశ్వరుడి చెలిమి, శ్రీకృష్ణుడితో కుచేలుడి చెలిమి, కర్ణుడితో దుర్యోధనుడి చెలిమి వంటి అపురూపమైన స్నేహాల ముచ్చట్లు పురాణేతిహాసాలలో కనిపిస్తాయి. దూరం కూడా చెలిమికి అడ్డంకి కాదని మన కవులు సూర్యుడికీ పద్మాలకూ చంద్రుడికీ కలువపువ్వులకూ ఉండే చెలిమి గురించి వర్ణించారు. అయినవాళ్లు అంతరంగంలోనే ఉంటారనీ సినిమా కవులూ పాటలు రాస్తుంటారు.

స్నేహం ఎలా పెరగాలి ఎలా పెంచుకోవాలి అనే దాని మీద కూడా ప్రాచీనులు కొన్ని గొప్ప సూచనలు చేశారు. దుర్జనులతో చెలిమి ఉదయం పూట నీడలాగా మొదట ఎక్కువగా ఉండి క్రమంగా తరిగిపోతుందట. సజ్జనులతో చెలిమి మధ్యాహ్నం నీడలాగా మొదట తక్కువగా ఉండి క్రమంగా పెంపొందుతుందట.

కలిమికి అందరూ మిత్రులేననీ లేమికి మిత్రులు ఉండరనీ పెద్దలు చెప్పారు. కందుకూరి వీరేశలింగం పంతులుగారు తమ రాజశేఖరచరిత్ర నవలలో కలిమి లేములు కథానాయకుడు రాజశేఖరుడుగారి స్నేహితులలో తెచ్చిన మార్పుల గురించి వివరంగా చెప్పారు. కలిమి అన్నది డబ్బే కానక్కరలేదు. ఒక హోదా కానీ ఒక పదవి కానీ కావచ్చు. ఆ హోదా ఆ పదవీ పోతే అప్పటిదాకా నిత్యదర్శనాలు చేసిన స్నేహితులు అకస్మాత్తుగా అంతర్ధానమైపోతారు.

చాలామందికి చాలమందితో పరిచయాలు ఉండవచ్చు. పరిచితులందరూ స్నేహితులని కొందరు పొరబడుతూ ఉంటారు. తమకు స్నేహితులమని చెప్పుకునే వారు నిజంగా స్నేహితులా, కాదా కనుక్కోవడానికి ఒక హాస్యరచయిత ఒక చిట్కా చెప్పారు. ఒకటి – 'మీకు చెబుతున్న ఈ విషయం అతి రహస్యం ఎవరికీ చెప్పకండి' అని చెప్పడం. రెండవది పెద్ద మొత్తం చేబదులు అడగడం. రహస్యం అని చెప్పినది బట్టబయలయినా, అవసరమని అడిగినపుడు డబ్బు అందకపోయినా స్నేహం విషయంలో జాగ్రత్త పడాలని ఆ రచయిత సూచన. ఈ చిట్కా బహుశా హాస్యం కోసం చెప్పినదిగా భావించాలేమో!

డబ్బు కారణంగా స్నేహితుల మధ్య గొడవలు రాకూడదు. కాని వస్తుంటాయి. చలన చిత్రరంగంలో ఇద్దరు పెద్దమనుషులు. ఇద్దరికీ మధ్య వృత్తిపరమైన సంబంధ బాంధవ్యాలు ఉండేవి. ఒకాయనకు డబ్బు అవసరమై రెండవ ఆయనను అడిగితే ఆయన 'మన స్నేహాన్ని డబ్బుతో పాడు చేసుకోవడం నాకు ఇష్టం లేదు' అని చెప్పాడట. ఎప్పుడో అక్కరకు వస్తారని స్నేహాలు చెయ్యడం సాధ్యం కాదు కదా!

'అతిపరిచయాత్ అవజ్ఞా' అని సంస్కృతంలో ఒక సూక్తి కనిపిస్తుంది. అతి పరిచయంవల్ల అంటే చనువు ఎక్కువయితే అవమానాలు ఎదురు కావచ్చునని సూచన. ప్రధానంగా స్థాయికి తగని స్నేహాల వల్ల ప్రమాదం ఉంటుందని ఈ సూక్తి హెచ్చరిస్తుంది. నిలకడలేని మనుషుల చెలిమి శత్రుత్వం కన్నా కీడు చేస్తుందనీ పెద్దలు అన్నారు.

అరమరికలు లేని స్నేహం, ఆత్మీయమైన స్నేహం అరుదుగా లభిస్తుంది. ఎవరికయినా ప్రాణమిత్రులు అని చెప్పుకోదగినవారు చాలా తక్కువ మందే ఉంటారు. మనసు విప్పిమాట్లాడుకోగలగడానికీ మమతలు పంచుకోవడానికి మనుషులుగా విలువలు పెంచుకోవడానికీ స్నేహం పనికివస్తుంది.

ఒక్కొక్క స్నేహితుడూ ప్రపంచంనుంచి జారిపోతుంటే తనలో కొంత కొంత భాగం తరిగిపోతున్నట్టు అనిపిస్తుందని ఒక కవి పుత్రుడు అన్నాడు. ఎంతమంది చుట్టూ ఉన్నా చాలామంది మనుషులు ఒంటరిగానే ఉంటారు. ఈ ఒంటరితనం

మనిషిని కుంగదీస్తుంది. మనిషి పూర్తిగా వికసించడానికి అడ్డుతగులుతుంది. వ్యక్తిత్వ వికాసానికి మంచి స్నేహితులు అవసరం. మంచిని పెంచుకోవడానికీ మంచిని పంచుకోవడానికి స్నేహం కావాలి. యువప్రాయంలో ఉన్నవారయితే స్నేహాల విష యంలో చాలా జాగ్రత్త వహించాలి. తమ పిల్లల స్నేహితులెవరో, వాళ్ల గుణగణా లేమిటో తల్లిదండ్రులకు తెలిసి ఉండాలని మనస్తత్త్వ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఒక కృష్ణుడి చెలిమి ఒక కుచేలుడికి కలిమి కావచ్చు. ఒక దుర్యోధనుడి చెలిమి ఒక కర్ణుడిని కుంగదీయవచ్చు. అందుకే కాబోలు ఒక పెద్దమనిషి 'భగవంతుడా నా స్నేహితులనుంచి నన్ను నువ్వు రక్షించు- నా శత్రువులనుంచి నన్ను నేనే రక్షించు కుంటాను' అన్నాడట.

ముక్తాయింపు:

అనగనగా ఒక కార్యాలయంలో ఒక పెద్దమనిషి పనిచేస్తూ ఉండేవాడు. చాలామంది ఎప్పుడు పడితే అప్పుడు వచ్చి ఆయనకోసం పడిగాపులుగాచి మరీ ఆయనతో మాట్లాడిపోతుండేవారు. ఇంతమంది ఆయనకోసం రావడం సహోద్యోగు లకు చాలా ఆశ్చర్యం కలిగిస్తుండేది. ఒకరోజు ఒకాయన పెద్దమనిషితో 'మీకు చాలామంది స్నేహితులు ఉన్నట్టున్నారు. ఎంతోమంది వస్తుంటారు సార్ మీకోసం' అన్నాడు. పెద్దమనిషి చిద్విలాసంగా నవ్వి 'వీళ్లంతా నా స్నేహితులే. నాకు డబ్బు అప్పిచ్చినవాళ్లు' అన్నారట.



27. అంచనాలు తారుమారు కావచ్చు

వైజ్ఞానికంగా ఎంత అభివృద్ధి సాధించినా మనిషి చందమామను చేరడం అసాధ్యం అని ఒక శాస్త్రవేత్త పేర్కొన్నారు. మనిషి చందమామ మీద అడుగుపెడతాడని మహాకవి శ్రీశ్రీ ఎప్పుడో భవిష్యవాణి పలికారు. శాస్త్రవేత్త మాట ఫలించలేదు కాని కవి వాణి ఫలించింది. ఐసాక్ ఆసిమోవ్ తమ వైజ్ఞానిక కాల్పనిక సాహిత్యంలో మర మనుషుల గురించి వ్రాసిన భవిష్యవాణి కూడా ఫలించింది.

'జీవితమంతా కష్టనష్టాల సుఖదుఃఖాల బేరీజు వేసుకోవడంతో సరిపోతున్నది' అని కొందరు విసుక్కొంటూ ఉంటారు. ఇట్లా జీవించితే బాగుంటుందనీ ఇట్లా ప్రవర్తిస్తే బాగుంటుందనీ అనుకుంటుంటాము. అయితే 'అంచనా వేరు అసలు సిసలు అనుభవం వేరు' అని జీవితం పదేపదే గుర్తుచేస్తూ ఉంటుంది.

అంచనా తెలుగుమాట కాదని నిఘంటువులు చెబుతున్నాయి. నిఘంటువు అనేది కూడా నిఘంటు అనే సంస్కృతం మాటనుంచి పుట్టినదే కదా!

'పెళ్లి చేసి చూడు ఇల్లు కట్టి చూడు' అని మనవాళ్లు చాలా రోజుల నుంచి హెచ్చరిస్తూనే ఉన్నారు. చాలా సందర్భాలలో అంచనాలన్నీ తారుమారు అవుతూనే ఉంటాయి. ఐదేళ్లలో అమలు జరపాల్సిన పది కోట్ల ప్రణాళిక – పదేళ్లకు సాగి వందకోట్లు కావాలనవచ్చు. వందమంది కోసం వండిన వంట రెండు వందల మందికి సర్దవలసి రావచ్చు.

ప్రతి మనిషికీ తన గురించిన అంచనా ఉంటుంది. భవిష్యత్తు గురించిన అంచనాలలో అనుకున్నవన్నీ అనుకొన్నట్టు జరగవు. కొన్నిసార్లు అనుకోనివి జరుగుతాయి. చాలా తక్కువసార్లు అనుకొన్నవి జరుగుతాయి.

1957లో ఒక శాస్త్రవేత్త వైజ్ఞానికంగా ఎంత అభివృద్ధి సాధించినా మనిషి చందమామను చేరడం అసాధ్యం అని పేర్కొన్నారు. మనిషి చందమామ మీద అడుగు పెడతాడని మహాకవి శ్రీశ్రీ ఎప్పుడో భవిష్యవాణి పలికారు. శాస్త్రవేత్త మాట ఫలించలేదు కాని కవి వాణి ఫలించింది. మనిషి చందమామ మీద – చంద్రుడి రోజయిన సోమవారం నాడు అడుగు పెట్టాడు. ఐసాక్ ఆసిమోవ్ తమ వైజ్ఞానిక

కాల్పనిక సాహిత్యంలో మరమనుషుల గురించి వ్రాసిన భవిష్యవాణి కూడా ఫలించింది. భవిష్యత్తు గురించి శాస్త్రీయంగా అంచనా వేయడానికి భవిష్యశాస్త్రం అనే కొత్త శాస్త్ర శాఖ కూడా రూపొందింది. భవిష్యశాస్త్రం జ్యోతిషం కాదు.

మనిషి జీవితానికి ఉన్నట్టే మనిషి అంచనాలకు కూడా పరిమితులు కనిపిస్తాయి.

1829లో అమెరికాలోని న్యూయార్క్ రాష్ట్రంలో గవర్నర్‌గా ఉన్న మార్టిన్ వాన్ బురెన్ అప్పటి అమెరికా అధ్యక్షుడు ఆండ్రూ జాక్సన్‌కు రైలు బండ్ల గురించి ఒక ఉత్తరం వ్రాశారు. 'ఈ రైలు బండ్లను గంటకు 15 మైళ్ల అతి వేగంతో – అంటే 24 కిలోమీటర్ల వేగంతో – లాగే ఇంజన్లు ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు కలిగించడంతోబాటు భయంకరంగా చప్పుడు చేస్తూ వెడుతుంటాయి. దారి వెంబడి పంటలకు నిప్పంటుకొనే ప్రమాదంతోబాటు పాడి పశువులూ, స్త్రీలూ పిల్లలూ బెదిరిపోయే ప్రమాదమూ ఉంది. పరమాత్మ మనుషులు ఇంత ప్రాణాంతకమైన వేగంతో ప్రయాణం చేయాలని ఆశించలేదు' అని వ్రాశారు. ఆ తర్వాత బురెన్ అమెరికా అధ్యక్షులు కూడా అయ్యారు.

ఇంగ్లండులోని ఒక పత్రిక 1825లో రైలుబండ్లు గుర్రపుబండ్లకన్నా రెట్టింపు వేగంతో వెళ్లగలవు అనడం సమంజసంగా లేదని వ్రాసింది. లండన్ విశ్వవిద్యాలయ కళాశాలలో ప్రకృతి సిద్ధాంత ఖగోళశాస్త్ర శాఖల ఆచార్యులు అతివేగంగా రైళ్లలో ప్రయాణం చేయడం సాధ్యం కాదు. ఎందుకంటే ఆ వేగంవల్ల ప్రయాణికులకు ఊపిరి ఆడకపోవచ్చు అని సెలవిచ్చారు.

రైలు తర్వాత మోటార్‌కార్లు వచ్చాయి. వంద ఏళ్ల క్రితం ఒక ఆంగ్లపత్రికవారు కారు ధర తగ్గవచ్చేమో కాని సైకిళ్లు వాడినంత విరివిగా కార్లు వాడడం కుదరదు అని పేర్కొన్నారు. అమెరికాలో ఒక పెద్దమనిషి కారు మఖలో పుట్టి పుబ్బలో మాడిపోయే రకానికి చెందినదని, గుర్రం కన్నా మంచి వాహనం లేదని సలహా ఇచ్చాడు. ఒక ఇల్లాలు కారుకంటె స్నానాలతొట్టి కొనడం మంచిదని తన స్నేహితురాలికి సలహా ఇచ్చారు.

ఆర్విల్ రైట్, విల్బర్ రైట్ అనే సోదరులిద్దరు విమానాన్ని ఆవిష్కరించారన్నది చాలామందికి తెలిసిందే. అయితే విల్బర్ రైట్ ఆర్విల్ రైట్‌తో 1901లో 'మరో యాభై ఏళ్ల దాకా మనిషి విమానంలో ఎగరడం అసంభవం' అన్నారట! ఆ తర్వాత రెండేళ్లకు 1903లో ఆ ఇద్దరు సోదరులూ విజయవంతంగా విమానంలో గగన విహారం చేశారు.

మళ్లీ ఒకసారి రోదసిలోకి. 'రోదసిలో ప్రయాణం అర్థంలేని మాట' అని ఇంగ్లండ్‌కు చెందిన ఒక ఖగోళ శాస్త్రవేత్త 45 ఏళ్ల నాడు అభిప్రాయపడ్డారు. ఆ

తర్వాత రెండేళ్లకు అప్పటి సోవియట్ యూనియన్ రోదసిలోకి ఉపగ్రహాన్ని పంపింది. అక్కడినుంచి చరిత్ర మారిపోయింది. ఆంగ్ల ప్రభుత్వం అంతరిక్ష పరిశోధనల గురించి సలహాలు ఇవ్వడానికి ఒక సంఘాన్ని నియమించింది. ఆ సంఘంలో ఈ ఖగోళ శాస్త్రవేత్తగారికి కూడా సభ్యత్వం లభించింది!

భవిష్య దర్శనం చేసే వారితో కొన్ని లాభాలూ నష్టాలూ ఉన్నాయి. అయితే 'నేను అప్పుడే చెప్పాను గదా' అని గొప్పలు చెప్పుకోవచ్చు. కాకుంటే పరిస్థితుల ప్రభావం అలా ఉందని దాటేయవచ్చు. ఎన్నికల ఫలితాలను ముందుగానే అంచనా వేసి ఫలానా రాజకీయ పక్షంవారు గెలుస్తారని ఇదమిత్థంగా చెప్పలేమని ఇటీవలి చాలా ఎన్నికలు నిరూపించాయి.

ముక్తాయింపు:

'మా అబ్బాయి నా అంచనా తారుమారు చేశాడు. ఇప్పుడేం చేయాలో తెలియడంలేదు' అని ఒక పెద్దమనిషి తన మిత్రుడితో ఒకరోజు పొద్దున్నే వాపోయాడు. మిత్రుడు సానుభూతి ఒలికిస్తూ 'ఏంటీ మీవాడు పరీక్ష తప్పాడా' అని పరామర్శించాడు.

'తప్పడం ఏమిటి? పాసయి కూచుంటే! ఎలాగూ తప్పుతాడు కదా అని ఈ మధ్యే ఉన్న డబ్బంతా జల్సాగా ఖర్చు పెట్టాను కదా!' అన్నాడు పెద్దమనిషి.



28. ఆచితూచి మాట్లాడదాం

> **ఏదిపడితే అది తింటే శరీర ఆరోగ్యం చెడుతుంది. ఏది పడితే అది అంటే మనిషి విలువ తరిగిపోతుంది. అనని మాటలకే మనం అధికారులం తప్ప అనిన మాటలకు మనం అధికారులం కాము. ఆచితూచి అడుగువేసి నడవడం ఎంత ముఖ్యమో ఆచితూచి మాటాడ్డం అంతే ముఖ్యం. త్రికరణ శుద్ధి అంటే - ఆలోచనకూ, మాటకూ, చేతకూ పొంతన ఉండేలా ప్రవర్తించడం.**

'పెదవి దాటితే పృథివి దాటుతుంది' అని తెలుగులో సామెత ఒకటుంది. అట్లాగే 'నాలుక దాటితే నరకం' అని మరొక సామెత ఉంది. పెదవి దాటితే పృథివి దాటుతుంది అన్నది మాటలకు సంబంధించింది. నాలుక దాటితే నరకం అన్నది మనం తినే తిండికి సంబంధించింది. దాన్ని మాటలకూ అన్వయించుకోవచ్చు.

అనని మాటలకే మనం అధికారులం తప్ప అనిన మాటలకు మనం అధికారులం కాము. నరం లేని నాలుక ఏ మాటయినా మాటాడుతుందని కొందరు విమర్శిస్తూ ఉంటారు. ఆచితూచి అడుగువేసి నడవడం ఎంత ముఖ్యమో – ఆచితూచి మాటాడ్డం అంతే ముఖ్యం. త్రికరణశుద్ధి అంటే – ఆలోచనకూ మాటకూ చేతకూ పొంతన ఉండేలా ప్రవర్తించడం. కొందరు అనుకొన్నది చెప్పరు. చెప్పేది అనుకోరు. చాలామంది ఆలోచించి మాట్లాడరు. 'మా ఆవిడ ఏదయినా కొనేముందు విచారించమంటూ ఉంటుంది. నేను కొన్న తర్వాత విచారిస్తూ ఉంటాను' అని ఆధునిక కవి ఒకరు చమత్కరించారు. ఇది మాటలకూ అన్వయిస్తుంది. అనేముందు విచారించి – అంటే– బాగా ఆలోచించి– అనాలి. కాలుజారితే తీసుకోవచ్చు కాని నోరు జారితే తీసుకోలేము కదా! ఇక అటువంటప్పుడు అన్న తర్వాత విచారించక తప్పదు. ఒక మాట మరొక మాటకు దారితీస్తుంది. మాటకు మాట తెగులు. నీటికి నాచు తెగులు.

ఈ సందర్భంలోనే నాలుక దాటితే నరకం అనే సామెతను ప్రస్తావించుకోవాలి. తినే తిండి రుచి నాలుకకు పరిమితం. నాలుక దాటి లోపలికి వెళ్లిన ఆహార విషయంలో రుచి ప్రమేయం లేదు. ఈ సామెతను మాటలకు అన్వయిస్తే కొన్ని మాటలు అన్న తర్వాత నరకయాతన అనుభవించవలసి ఉంటుంది. కొందరి మాటలు లాలిస్తాయి. సంతాపాన్ని తగ్గించి సంతోషాన్ని కలిగిస్తాయి. హనుమంతుడు మాటల

విలువ తెలిసి ఏది ఎలా మాట్లాడాలో తెలిసిన పండితుడని పెద్దలు చెబుతుంటారు. అశోకవనంలోని సీతమ్మతో మాటాడిన తీరూ ఆమె గురించి ఆందోళన పడుతున్న రాముడికి 'చూచితి సీతను' అని చెప్పి ఉపశమనం కలిగించిన తీరూ ఇందుకు ఉదాహరణలు. కొందరి మాటలు కాలుస్తాయి. పదేపదే గుర్తుకు వచ్చి వేధిస్తాయి. 'నిప్పు తగిలిన గాయంలోతు మానవచ్చు. నోరు కాల్చిన గాయం గురుతు మాసిపోదు' అని తమిళజ్ఞాని తిరువళ్లువర్ పేర్కొన్నారు.

ఏది పడితే అది తింటే శరీర ఆరోగ్యం చెడుతుంది. ఏది పడితే అది అంటే మనిషి విలువ తరిగిపోతుంది.

భాషా శాస్త్రవేత్తలు మాట్లాడడాన్నీ భాషనూ - చాలా క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి అక్షరమూ ప్రతి ధ్వని పుట్టే స్థానాన్నీ నోటిలో దాని ఉత్పత్తికి ఉపయోగపడే కరణాలనూ వాటి ఉత్పత్తికి అవసరమైన ప్రయత్నాన్నీ గుర్తించారు. మాట సశబ్దమూ నిశ్శబ్దమూ కావచ్చు. ఆరోగ్యంగా ఉండే ప్రతి మనిషి స్వరపేటికలోనూ రెండు స్వర తంత్రులు ఉంటాయి. వాటి కదలికవల్ల మాట పుదుతుంది. స్వర తంత్రులకూ జబ్బులు రావచ్చు. ప్రతి మనిషికీ అనువైన శ్రుతి ఒకటి ఉంటుంది. ఆ శ్రుతిలో మాటాడినా పాడినా ఇబ్బంది లేదు. కొందరు ఇతరుల గాత్రాల అనుకరణకు పూనుకొంటుంటారు. అటువంటి వారిలో వారి అనువైన శ్రుతి దెబ్బతిని అందువల్ల స్వర పేటికలో సమస్యలు తల ఎత్తవచ్చు. కొందరిలో ఈ రకమైన స్వర దురుపయోగంవల్ల స్వరతంత్రుల మీద వాపు వచ్చి శస్త్రచికిత్స ఒకటే పరిష్కార మార్గం కావచ్చు. కొందరిలో ఒక తంత్రి కదిలి మరొకటి కదలని స్థితి రావచ్చు. మరికొందరిలో పుట్టకురుపు వంటి వ్యాధులవల్ల స్వరపేటిక పూర్తిగా తీసివేయవలసి రావచ్చు. మహాకవి కృష్ణశాస్త్రికి ఎదురయిన స్థితి అది. తమకు శస్త్రచికిత్స చేసిన వైద్యుని ఉద్దేశించి 'మాట తీసుకుని మౌనం ఇచ్చావు' అని రాసుకోగలిగారు శాస్త్రిగారు. 'మాట సింగారం మౌనం బంగారం' అనీ పెద్దలన్నారు కదా! 'మాట ముత్యం మాట మృత్యువు' అని కన్నడంలోని సామెత హెచ్చరిస్తుంది. మాట పడకుండా మాట రాకుండా మాట విలువ తెలిసి మాటాడడం అందరికీ సాధ్యపడే విషయం కాదు.

ముక్తాయింపు:

ఒకాయన ఒక పార్కులో కూచుని ఉండగా ఇంకొక ఆయన ఆయన దగ్గర కూచొని గంటసేపు చాలా విషయాలు మాట్లాడాడు. అట్లా మాట్లాడి మాట్లాడి చివరకు - 'ఇంతసేపు నేను మాట్లాడిన వాటిని బట్టి మీకేం తెలిసింది' అని అడిగాడు. 'విషయమంటూ ఏమీ లేకపోయినా మీరు గంటల తరబడి మాట్లాడగలరనీ, మీకు కొన్ని అక్షరాలు పలకడం రాదనీ తెలిసింది' అన్నాడు మొదటి ఆయన.



29. ఏ వాడ చిలక ఆ వాడ మాటలు పలుకుతుంది

పాల్ఘాట్ మణి అయ్యర్ ప్రముఖ మృదంగ విద్వాంసులు. తబలా విద్వాంసులైన ఉస్తాద్ అల్లా రఖా గారికీ మణి అయ్యర్ గారికీ ఒక శాస్త్ర విషయం గురించి చర్చించుకోవాలని కోరిక పుట్టింది. ఒకరి భాష మరొకరికి రాదు. వాళ్ల భాషా సమస్య తీర్చడానికి వాళ్ల వాద్యాలు పనికివచ్చాయి. ఒకరి భావం మరొకరికి తేలిగ్గా అర్థం అయింది.

'ఏ వాడ చిలుక ఆ వాడ మాటలు మాటాడుతుంది' అని ఒక నానుడి. చిలుకలు ఏ మాటలు నేర్పితే ఆ మాటలు మాటాడుతాయి. ఎవరి మాటలనో అప్పజెప్పేవారిని చిలుక పలుకులు పలుకుతున్నారని విమర్శిస్తూ ఉంటారు. మాటలు అన్నీ సంకేతాలే. ఒక్కొక్కమాటకు ఒక్కొక్క అర్థం. పలుకుతున్న తీరునుబట్టి మాటలోని వ్యంగ్యాన్నిబట్టి అర్థం మారుతూ ఉంటుంది. ఏ వాడ చిలుక ఆ వాడ మాటలు మాటాడినట్లే మనుషులు కూడా తాము పెరిగిన వాతావరణంలోని భాషను మాటాడుతారు. ఒక ప్రాంతంలోని ప్రజలు ఒకే భాష మాట్లాడినా – ఒకే భాష మాట్లాడే ఏ ఇద్దరూ ఒకే రకంగా మాటాడరని భాషా శాస్త్రవేత్తలు చెబుతుంటారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్న ప్రతి మనిషికీ బాల్యం నుంచే భాష అలవడుతుంది. పసిపిల్లలు ఒక ఏడాది నుంచి రెండేళ్ల వయసులో మాట్లాడడం నేర్చుకోవడంలో ఎంతో అభివృద్ధి సాధిస్తారు. ఒక నెల నిండిన శిశువులకు శబ్దాలను అర్థం చేసుకునే శక్తి ఉంటుంది. 4 నుంచి 6 నెలల ప్రాయంలోని శిశువులు ఆ – ఈ– ఊ – అంటూ అచ్చులను పోలిన చప్పుళ్లు చేస్తూ ఉంటారు. 11–12 నెలల ప్రాయంలో హల్లులతో కూడిన అమ్మ – అత్త – దాదా – నాన వంటి పదాలు పలుకుతారు. ఈ హల్లుల మాటలు – పిల్లలు పెరిగే భాష వాతావరణాన్ని బట్టీ ఉంటుంది. శిశువులు తొలిమాటలు పలికేలోపే వారికి ఎన్నో కొన్ని మాటలు అర్థం అవుతూ ఉంటాయి. ఒక లెక్క ప్రకారం వారు పలికే మాటలకు మూడురెట్ల మాటల పరిజ్ఞానం వాళ్లకు ఉంటుంది. ఏడాది నిండిన మామూలు శిశువులు అమ్మ – పాలు – నాన్న – ఫో – వద్దు– కుక్క ఇలా రకరకాల చిన్న పదాలు పలుకుతుంటారు. 18 నెలల ప్రాయంలో దాదాపు 50 పదాల పరిజ్ఞానం కలుగుతుంది. ఒక చిన్న మాట – ఒక వాక్యానికి అన్వ

యించేలా ఉండవచ్చు. పాలు అంటే ఇప్పుడు పాలు తాగవచ్చా అని అర్థం కావచ్చు. కొన్నాళ్లకు రెండు పదాల వాక్యాలు – నాన్న వెళ్లు – బొమ్మ ఏది వంటివి పలికేస్తాయి రావచ్చు. పిల్లలు అలా క్రమంగా మూడేళ్ల వయసు నిండేసరికి సగటున రోజుకు రెండు కొత్తమాటలు నేర్చుకుని దాదాపు వెయ్యిపదాల పరిజ్ఞానం సంపాదిస్తారని శాస్త్రవేత్తల అంచనా.

ప్రపంచంలో ఎన్నో వేల భాషలున్నాయి. భాషల పుట్టుక గురించి రకరకాల సిద్ధాంతాలున్నాయి. వీటిలో కొన్ని భాషలకు లిపి లేదు. కొన్ని భాషలు కాలగర్భంలో కలిసిపోయాయి. రాకపోకలు అంతగా లేని ప్రాచీన కాలంలో ఒక ప్రాంతం నుంచి వచ్చి ఒక్కొక్కచోట విడిపోయిన మనుషులు తమ తమ భాషలను రూపొందించు కున్నారని ఒక సిద్ధాంతం ఉంది.

అయితే ఇప్పటి పరిస్థితులలో ఏ ఒక్క భాషనూ ప్రపంచంలోని భాషలన్నిటికీ తల్లి అని చెప్పడం కష్టం. పోలికలను బట్టి, భౌగోళిక స్థితిగతులనుబట్టి భాషలను ప్రస్తుతం వాడుకలో ఉన్న కొన్ని కుటుంబాలుగా విభజించారు. ఈ భాషా కుటుం బాల విషయంలోనూ ఒక భాష తక్కిన భాషలకు మూల భాష అని చెప్పడం కుద రడం లేదు.

ఒకరి భాష మరొకరికి అర్థం కాకపోవడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని కొందరు కొత్తభాషలు సృష్టించే ప్రయత్నాలు చేశారు. 1887లో పోలండ్‌కు చెందిన డాక్టర్ ఎల్.ఎల్.జామెన్ హాఫ్ అనే పండితుడు ఎస్పరాంటో అనే కొత్తభాషను సృష్టించాడు. ఇలాగే మరికొందరు పండితులు వొలపక్, ఇంటర్ లింగ్వా, నోవియల్, ఇంటర్ గ్లాసా వంటి కొత్త భాషలు సృష్టించినా – అవి ఎక్కువకాలం మనలేదు. ఎస్పరాంటో మొదట ఎందరినో ఆకర్షించినా ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఒక లక్ష మందికి ఈ భాషతో పరిచయం ఉందని అంచనా. ఈ భాష ప్రధానంగా ఐరోపాలోని కొన్ని దేశాలకు పరిమితం. రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో జపాన్, చైనా దేశాలలో ఈ భాషకు కొంత ప్రాధాన్యం కలిగింది.

చాలా జంతువులు, పక్షులు తమలో తాము సంకేత భాషలో మాటాడుతున్నట్టు అనిపిస్తుంది. కొన్ని జంతువులకు మానవభాష కొంతమేరకు అర్థం అవుతుందట. కోతులకూ, మనుషులకు ఉన్నట్టు నోరూ గొంతూ ఉన్నా వాటికి మాట్లాడే సౌకర్యం లేదు.

మామూలు మనుషులు మాటాడే భాష కాక శాస్త్ర సాంకేతిక పరిభాష వేరుగా ఉంటుంది. ఈ పరిభాష కాక కొందరు ప్రత్యేక బృందాలవారు, వేర్వేరు కార్యాల యాలవారు వారి వారి ప్రత్యేక భాషలు మాట్లాడుతూ ఉంటారు. కొన్ని కుటుంబా

లలో ప్రత్యేక పదాల వాడుక ఉంటుంది. ఉదాహరణకు ఆంగ్లభాషలోని ఇ.ఓ. అనే పొడి అక్షరాలు ఒక కార్యాలయంలో Executive Officer అనీ, మరొకచోట Extension Officer అనీ, ఇంకొకచోట Educational Officer అనీ ఉండవచ్చు. పిల్లలు సరదాగా క భాష, త భాష వాడుతూ ఉంటారు. కంప్యూటర్లలో వాడకానికి రకరకాల భాషలు ఉన్నాయి. వేద శాస్త్రవేత్తలు - తమకు అర్థం అయ్యే తీరులో వేదాలలోని మంత్రాల ముక్కలు వాడుతూ ఉంటారని జరుక్ శాస్త్రిగారు ఒక పెద్ద వ్యాసం రాశారు. వయందేవస్య భోజనం అనే మంత్ర భాగంలో వయందేవస్య అంటే భోజనం అని అర్థం చేసుకోవాలన్నమాట.

పాల్ఘాట్ మణి అయ్యర్ ప్రముఖ మృదంగ విద్వాంసులు. తబలా విద్వాంసులైన ఉస్తాద్ అల్లా రఖాగారికీ మణి అయ్యర్ గారికీ ఒక శాస్త్ర విషయం గురించి చర్చించు కోవాలని కోరిక పుట్టింది. ఒకరి భాష మరొకరికి రాదు. వాళ్ల భాషా సమస్య తీర్చడానికి వాళ్ల వాద్యాలు పనికివచ్చాయి. ఒకరి భావం మరొకరికి తేలిగ్గా అర్థం అయింది. కొందరికి ఒక్క భాషే కుదురుగా రాదు. ప్రసిద్ధ రచయిత మల్లాది రామ కృష్ణ శాస్త్రిగారిని ఎవరో మీకెన్ని భాషలు వచ్చునని అడిగారట. శాస్త్రిగారు తమచేత ఉన్న విసనకర్రలోని ఒక్కొక్క అంచు వెంబడి ఒక భాష రాస్తూ వస్తే - విసనకర్ర రెండోవైపుకు తిప్పవలసి వచ్చిందట.

ముక్తాయింపు:

అనగనగా ఒకసారి ఒక అబ్బాయి మల్లాది రామకృష్ణ శాస్త్రి గారితో చాలాసేపు మాట్లాడుతూ ఉండడాన్ని పెద్దమనిషి ఒకాయన గమనించాడట. ఆయన కుతూహలం ఆపుకోలేక - ఆ పిల్లవాడిని 'మీరిద్దరూ ఏం మాట్లాడుకున్నారు' అని అడిగారట. ఆ పిల్లవాడు 'తెలుగు' అని బదులు చెప్పాడట.



30.మాటల అర్థాలు

వింతలేనిదే ఆవులింత పుట్టదని ఒక సామెత. ఆ పెద్ద మనిషి ఆవులిస్తున్నాడు అని తెలుగులో ఉంటే ఒక పండితుడు దాన్ని మరొక భాషలోకి ఆ పెద్దమనిషి గోదానం చేస్తున్నాడని చమత్కారంగా అనువదించాడట. చమత్కారం సంగతి ఏమయినా భాష మాత్రం హత్యకు గురయిందని భాష తెలిసినవారు బాధ పడవచ్చు.

'విన్నపాలు వినవలె వింత వింతలు పన్నగపు దోమతెర పైకెత్తవేమయ్యా' అని తాళ్లపాక అన్నమాచార్యులు శ్రీ వేంకటేశ్వర స్వామికి విన్నవించుకున్నాడు. విన్నపాలు కిందిస్థాయి నుంచి పైస్థాయికి చేసేవి. గోల్కొండ కోటలో ఒక ఏర్పాటు కనిపిస్తుంది. పాలిత ప్రజలు కోటలోని పాలకులకు విన్నవించుకోవడానికి ఒక నాలుగు స్తంభాల మధ్య లోగిలిలో నిలబడి మాట్లాడాలి. ఆ మాటలు – పైన మేడమీది పాలకులకు వినిపించేవట. పాలకులు పాలితులకు కనిపించకపోయినా పాలితులు పాలకులకు కనిపించేవారు. వినిపించే వారు. విన్నవింతలు వాళ్లు వినిపించుకునే వారో కారో తెలియదు. వింతల మాట ఎట్లా ఉన్నా విన్నవించుకోవడానికి తగిన మాటతీరు ఉండాలి. వింత లేనిదే ఆవులింత పుట్టదని ఒక సామెత. ఆ పెద్ద మనిషి ఆవు లిస్తున్నాడు అని తెలుగులో ఉంటే ఒక పండితుడు దాన్ని మరొక భాషలోకి ఆ పెద్దమనిషి గోదానం చేస్తున్నాడని చమత్కారంగా అనువదించాడట. చమత్కారం సంగతి ఏమయినా భాష మాత్రం హత్యకు గురయిందని భాష తెలిసినవారు బాధ పడవచ్చు. మాటకు అర్థం తెలియకుండా వాడితే భాష హత్యకు గురి అవుతుందా? ఆ మాటకు వస్తే ఎన్నో మాటల అర్థాలు తెలియకపోవడంవల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురవుతూ ఉంటాయి. పండితుడు వేరు పండితమ్మన్యుడు వేరు. త్వష్ణుడనే ప్రజాపతికి ఇంద్రుడిమీద కోపం వచ్చి ఇంద్రుడిని చంపేవాడు పుట్టడం కోసం యజ్ఞం చేశాడట. మధ్యలో మంత్రం తప్పు చదవడంతో అర్థం మారి ఇంద్రుణ్ణి చంపేవాడు కాక ఇంద్రుడిచేత చచ్చేవాడు పుట్టాడట.

అందువల్ల మాటలను చంపకుండా – తెలిసి మాట్లాడాలి. ఇందులో నిఘంటువులు ఎంతో సాయం చేస్తారు.

ప్రపంచం మొత్తంమీద ఎంతో ప్రసిద్ధి గడించిన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం వారి ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ డిక్షనరి నిర్మాణానికి మాటల హంతకుడు కాని ఒక మానవ హంతకుడు సాయం చేశాడంటే ఆశ్చర్యంగా ఉంటుంది. 1858 జనవరిలో నిఘంటు

నిర్మాణం మొదలయినా అది 12 సంపుటాలలో వెలువడడానికి 70 ఏళ్లు పట్టింది. అంటే 1928 నాటికి నిఘంటువు పూర్తయింది. డాక్టర్ జాన్ మర్రే అనే పండితుడు నిఘంటువు సంపాదకుడుగా నియమితుడయ్యాడు. ఆయన 1879లో నిఘంటు నిర్మాణానికి సాయం కోరుతూ విన్నపం ముద్రించాడు. ఆ విన్నపం ప్రతి చూసి 1880లో డాక్టర్ మర్రేకు కెప్టన్ విలియం చెస్టర్ మైనర్ అనే పెద్ద మనిషి ఉత్తరం వ్రాశాడు. 1899లో మర్రే - మైనర్‌ను కలుసుకున్నప్పుడు - మర్రే దిగ్భ్రాంతికి గురి అయ్యాడట. ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులోని మాటలలో దాదాపు మూడువంతులు మైనర్ సమకూర్చినవేనట. మైనర్ అమెరికా సైన్యంలో వైద్యాధికారిగా పనిచేస్తూ మతిభ్రమ ణానికి గురి అయ్యాడు. అమెరికా నుంచి ఐరోపాకు పారిపోయాడు. తనను చంప డానికి ఎవరో కుట్రపన్నుతున్నారన్న భ్రమతో 1872లో ఒక కార్మికుణ్ణి కాల్చి చంపేశాడు.

మైనర్ మానసిక స్థితిని గమనించిన న్యాయస్థానం వారు ఆయన - నేర ప్రవృత్తిగల మానసిక రోగుల కోసం నెలకొల్పిన ఆవాసంలో యావజ్జీవ శిక్ష అనుభ వించాలని నిర్ణయించారు. దాదాపు 20 సంవత్సరాలపాటు మైనర్ - మర్రేకు ఆంగ్ల పదాలు, వాటి అర్థాలు, వాటి ఆకరాలు వివరిస్తూ ఉత్తరాలు వ్రాశాడు. 1915లో మర్రే మరణించేదాకా మైనర్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగుతుండేవి. 1920లో మైనర్ మరణించాడు.

అన్నట్టు మర్రే- తమ ఉద్యోగ జీవితాన్ని లండన్‌లోని చార్టెర్డ్ బాంక్ ఆఫ్ ఇండి యాలో గుమస్తాగా పనిచేయడంతో మొదలుపెట్టారు. మైనర్ శ్రీలంకలోని జాఫ్నాకు దగ్గరి మణిప్పేలో జన్మించారు.

నిఘంటు నిర్మాణం అనేది చాలా పెద్దపని. ఒక భాషలో మాటకు అర్థం చెప్ప డానికి ఇంకో భాషలో మాట అవసరం కావచ్చు. ముర్గీ అనే హిందీ పదానికి కోడి అని అర్థం. పార్వతీ పరమేశ్వరుల కుమారుడయిన కార్తికేయస్వామిని - తమిళంలో మురుగన్ అంటారు. ఆయన ధ్వజంలో - అంటే జండాలో కోడి ఉంటుంది. మురు గన్‌కూ ముర్గీకీ సంబంధం ఏదయినా ఉందా?

పని అంటే గుర్తుకు వచ్చింది. తమిళం పనిలో తెలుగువని చేస్తే మలయాళం పని వస్తుందట. తెలుగు పని తెలిసిందే. తమిళంలో పని అంటే చలి, మంచు. మలయాళంలో పని అంటే జ్వరం.

ముక్తాయింపు:

ఒక పెద్దమనిషి ఇంకో పెద్దమనిషిని ఆరేళ్ల తర్వాత కలుసుకున్నాడట. కలుసుకోవడం కలుసుకోవడంతోనే - ఆ పెద్ద మనిషిని ఎడాపెడా కొట్టాడట. గొడవ న్యాయస్థానానికి వెళ్లింది. న్యాయమూర్తి కొట్టిన పెద్దమనిషిని అడిగాడట - ఎందుకు కొట్టావని. కొట్టిన పెద్ద మనిషి చెప్పాడట - ఆరేళ్లముందు అన్నమాటకు అర్థం ఈ మధ్యే తెలిసిందని.



31. వెనక మాట్లాడితే వెతలే

కొన్ని సందర్భాలలో అవతలి మనిషి స్థాయిని బట్టిగానీ, బలాన్ని బట్టిగానీ ఆ మనిషి ముందు మాట్లాడే వీలూ ధైర్యమూ చాలా మందికి ఉండదు. మరికొన్ని సందర్భాలలో అవతలివాళ్లతో పోల్చుకోవడంవల్ల వచ్చే న్యూనతాభావం వల్లకూడా వాళ్ల వెనుక మాట్లాడుతూ ఉండవచ్చు. చాలా సందర్భాలలో మన అంచనాలకు భిన్నంగా అవతలి వాళ్లు ప్రవర్తించినపుడు వాళ్ల గురించి మాట్లాడుకోవడమూ అనవాయితీగా కనిపిస్తుంది.

అనగనగా ఒక పెద్ద మనిషి ఉండేవారు. ఆయనను ఎవరయినా చూడడానికి వెడితే ఆ అతిథుల మీద ఎక్కడలేని ప్రేమాభిమానాలు ఒలకబోసేవారు. ఆ అతిథులు అటు వెళ్లగానే – వాళ్ల వెనుక వాళ్లను తక్కువ చేసి మాట్లాడేవారు. ఆయనకు ఎవరయినా ఫోన్ చేసినా అంతే. ఆయన ఫోన్‌లో ప్రేమ ఒలికిస్తూ మాట్లాడుతూనే తమ ముందు ఎవరయినా ఉంటే– ఫోన్‌కు చెయ్యి అడ్డంపెట్టి అవతలి మనిషి గురించి ఇవతలి శ్రోతలతో నిందాపూర్వకంగానూ మాట్లాడేవారు. తన ముందు లేని వ్యక్తుల గురించి తన ముందున్న వ్యక్తులతో చెడుగా మాట్లాడడం ఆయన జీవ లక్షణంగా కనిపించేది.

'ముందొక మాట వెనుకొక మాట' – చాలామందిని పట్టిపీడించే జబ్బు. కనిపించినప్పుడు పొగడకున్నా కనిపించనప్పుడు తెగడకుండా ఉంటే చాలు. ఏ ఇద్దరయినా కలుసుకున్నప్పుడు అక్కడ లేని మూడో మనిషి గురించి ఎందుకు మాట్లాడాలి?

చాలామందికి తమ విషయాల గురించికన్నా తక్కిన వాళ్లకు సంబంధించిన విషయాల గురించి ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. ఈ ఆసక్తికి స్త్రీ పురుష వివక్షలేదు. ఇరుగూ పొరుగూ, కార్యాలయం అన్న తేడా ఉండదు. 'పొరుగింటి వాకిట ఏరోజు ఏ ముగ్గు పెట్టారు, 'ఎదురింటావిడ కట్టుకొన్న చీర కొత్తదా పాతదా', 'ఫలానా గుమాస్తా గారు అధికారి గదిలోకి ఎన్నిసార్లు వెళ్లివచ్చారు', 'ఫలానా అయ్యగారు ఆఫీసు వేళల్లో ఎన్నిసార్లు బయటికి వెళ్లారు', 'ఫలానా అమ్మడుగారు ఎన్ని ఉదయాలు ఆలస్యంగా వచ్చారు' అని అడిగితే కొందరు టకటకా జవాబులు చెప్పగలరు.

ఒక కార్యాలయంలోని ఉద్యోగులలో ఒక వింత ప్రవర్తన కనిపించేదట. ప్రతి ఒక్కరూ అవతలి వాళ్ల గురించిన వివరాలు క్షుణ్ణంగా తెలిసి ఉంచుకోవడమే ఆ కార్యాలయోద్యోగుల ప్రత్యేకత. 'వచ్చేవారం పని ఒత్తిడి ఉంటుంది. అందువల్ల సెలవు ఇవ్వడం కుదరదు' అని అధికారి ఏ ఉద్యోగికయినా చెబితే ఆ ఉద్యోగి వెంటనే గడచిన ఆరు నెలలలో పని ఒత్తిడి ఉన్న సందర్భాలలో తక్కిన ఉద్యోగులు ఎన్నిసార్లు, ఎన్ని రోజులు సెలవు తీసుకొన్నదీ గణాంక వివరాలు చెప్పి తనపట్ల అన్యాయం జరుగుతున్నదని చెప్పే సందర్భాలు ఆ కార్యాలయంలో కోకొల్లలు.

ఇట్లా తక్కిన వారి గురించి అవసరమున్నా లేకున్నా అనవసరమైన సమాచార సేకరణ చేయడంవల్ల - ఆ సమాచారాన్ని పది మందితో పంచుకోవాలనుకొని తాప త్రయపడుతూ ఉంటారు. గోరంతలు కొండంతలుగా ఊహించుకొని చెంచాడు చక్కెర పాకాన్ని ఊది ఊది పీచు మిఠాయి చేసినట్టు - ఆవగింజంత విషయానికి ఆనప కాయ ఆకారం కల్పించడం కొందరి ప్రవృత్తి. కళ్లతో చూసినదీ, చెవులతో విన్నదీ అబద్ధం కావచ్చునని ప్రాచీనులు చెప్పనే చెప్పారు.

కొన్ని సందర్భాలలో అవతలి మనిషి స్థాయిని బట్టిగానీ, బలాన్ని బట్టిగానీ ఆ మనిషి ముందు మాట్లాడే వీలూ, ధైర్యమూ చాలా మందికి ఉండదు. మరికొన్ని సందర్భాలలో అవతలి వాళ్లతో పోల్చుకోవడంవల్ల వచ్చే న్యూనతాభావంవల్ల కూడా వాళ్ల వెనుక మాట్లాడుతూ ఉండవచ్చు. చాలా సందర్భాలలో మన అంచనాలకు భిన్నంగా అవతలి వాళ్లు ప్రవర్తించినపుడు వాళ్ల గురించి మాట్లాడుకోవడమూ ఆన వాయితీగా కనిపిస్తుంది.

మరికొందరు సమయానుకూలంగా పదిమంది ఉన్నచోట పొగడి, చాటుగా తిడుతూ ఉంటారు. మరికొందరు అధికారుల ప్రాపుకోసం అవతలివాళ్ల గురించి చెబుతూ ఉంటారు.

ఒకసారి ఒక పెద్ద మనిషి ఇద్దరు మిత్రులను విందుకు పిలవడానికి వెళ్లాడట. పెద్ద మనిషి ఆ ఇద్దరిలో ఒక మిత్రుడింటికి వెళ్లినప్పుడు ఆయన అక్కడ లేని రెండవ వ్యక్తిని ఒకానొక నాలుగు కాళ్ల జంతువుతో పోల్చాడట. రెండవ ఆయన ఇంటికి వెళితే ఆయన అక్కడ లేని మొదటి మిత్రుణ్ణి మరొక నాలుగు కాళ్ల జంతువుగా వర్ణిం చాడట. ఇద్దరినీ విందుకు పిలిచిన పెద్దమనిషి - ఆ విందు రోజున ఆ మిత్రులిద్దరికీ వారు పరస్పరం పరోక్షంగా ఏమన్నదీ చెప్పాడట. కలుసుకొన్నప్పుడు కావలించుకొని కనబడనప్పుడు కత్తులు దూయడం, నిందలు వేయడం ఎంత తప్పో ఆ మిత్రులకు గట్టిగా చెప్పాడట.

'ఎవరయినా ఒక మేలు పొందితే మనమూ ఆ మేలు పొందడానికి ప్రయత్నిం చాలి. ఈర్ష్యతో వాళ్లమీద అపవాదులు కల్పించడం, నిందలు వేయడం తగదు' అని శిరిడీ సాయిబాబా గారు భక్తులను హెచ్చరించేవారు. మన గురించి మనం ఆలో చించుకోవడం మానేసి మరొకరి గురించి ఆలోచించడం అనవసరమని మానసిక శాస్త్రవేత్తలూ హెచ్చరిస్తుంటారు.

ముక్తాయింపు:

'మీరు ఇన్ని రోజులు సెలవు పెడితే నాకు చాలా ఇబ్బంది' అని ఒక అధికారి తన దగ్గర పని చేసే ఉద్యోగితో అన్నాడట.

'ఇబ్బంది ఉండదు సార్.... నాపని ఎట్లాగూ, నా పక్క సీటులో వారికి అప్ప గించారు కదా!' అన్నాడట ఉద్యోగి ఆదుర్దాగా.

'పని గురించి కాదు బాబూ.... మీరు సెలవు పెడితే నాకు ఆఫీసులో అందరి గురించి వార్తలు తెలిసేదెట్లా.....' అన్నాడట అధికారి.



32. తనతో తాను మాట్లాడుకోవడం

'నేను ఈ పని సమయానికి చేయగలను. ఎటువంటి సమస్యలు ఎదురయినా ఎదుర్కొనగలను' అనుకోవడం తమ పట్ల తాము విశ్వాసం ప్రదర్శించే ధోరణి. తమ శక్తి సామర్థ్యాల గురించి సరయిన అంచనా వేసుకొని - 'నేను ఈ పని చేయగలను' అనుకోవడం అహంభావ ధోరణి కాదు. 'సమస్యలు ఎదురయినా ఎదుర్కోగలను' అనడంలో వాస్తవిక దృక్పథం ఉంది.

'అంతగట్టిగా ఎవరితో మాట్లాడుతున్నావు' అని ఒకాయన తన మిత్రుణ్ణి అడిగాడట. 'నాతోనే లేవయ్యా' అన్నాడట ఆ మిత్రుడు.

ఎవరితో వారు మాట్లాడుకోవడం అన్నది చిత్రంగా అనిపించినా ఎవరికివారు తమతో మాట్లాడుకోవడం అన్నది నిరంతరం జరిగే ప్రక్రియే అని మనస్తత్వ శాస్త్ర వేత్తలు అంటారు. అయితే వాళ్ల మరొక హెచ్చరికా చేస్తున్నారు. ఎవరయినా తమతో ఏం మాట్లాడుతున్నారు అన్నది ముఖ్యంగా చూడాలట.

మనుషులు మరెవరితోనూ మాట్లాడకుండా మౌనంగా ఉన్నప్పుడూ ఈ తమతో మాట్లాడుకోవడం సాగుతూనే ఉంటుందనీ వాళ్లు తేల్చారు.

మన నాటకాలలో 'స్వగతం' అనీ 'ఆత్మగతం' అనీ సూచనలుంటాయి. అంటే పాత్ర తనలో తాను మాట్లాడుకోవడం అన్నమాట. తనలో తాను మాట్లాడుకోవడం అంటే తనతో తాను మాట్లాడుకోవడమే. మనస్తత్త్వ శాస్త్రరీత్యా ప్రతి మనిషిలోనూ మూడు 'స్వ'రూపాలు ఉంటాయట. సహజసిద్ధంగా మనిషికి ఉండే లక్షణాలు, శక్తి సామర్థ్యాలు మొదలైన వాటికి సంబంధించిన సహజ స్వరూపం ఒకటి. ప్రతి మనిషి తననూ, తనకున్న శక్తి సామర్థ్యాలనూ అంచనా వేసుకోవడానికి నేర్చుకొన్న విధానాలు – రెండవ స్వరూపాన్ని నిర్దేశిస్తాయి. ఇది మనిషి ఆలోచనా శక్తిని బట్టి అలవరచుకొన్న స్వరూపం. ఈ స్వరూపం సహజ స్వరూపానికి తగ్గట్టుగా ఉండాలి కాని చాలా సందర్భాలలో అట్లా ఉండదు. ఈ రెండూ కాక మనిషికి తన జీవితాన్ని తాను ఎన్నుకొనే మార్గాలలో జీవించే స్వరూపమూ ఉంటుంది. అంటే తన సహజ స్వరూపంలో ఉండే కొన్ని లక్షణాలను పెంపొందించుకునే వీలుంటుంది.

వేదాంతులు తనను తానే ఉద్ధరించుకోవాలని చెబుతుంటారు. దీన్నే కొందరు చమత్కారంగా మనుషులు తమకు తామే మంచి మిత్రులు కావచ్చు. మంచి శత్రువులూ కావచ్చునన్నారు. తనతో మాట్లాడుకోవడం ద్వారా ఒక మనిషి అవసరమైన

స్వ సహాయం పొంది తన శక్తి సామర్థ్యాలకు వన్నె పెట్టుకోవడానికి వీలుంది. అలాగే తనను తాను కించపరచుకొని తన శక్తి సామర్థ్యాలను తక్కువచేసి తనకు తానే ఆటంకమూ కావచ్చు.

'నాకు తెలుసు. నేనీ పని సమయానికి పూర్తి చేయలేను. నేనెప్పుడూ ఇంతే' అని అనుకోవడం తమను తాము తగ్గించుకొనే ధోరణి.

'నేను ఈ పని సమయానికి పూర్తి చేయగలను. ఎటువంటి సమస్యలు ఎదురయినా ఎదుర్కొనగలను' అనుకోవడం తమపట్ల తాము విశ్వాసం ప్రదర్శించే ధోరణి. తమ శక్తి సామర్థ్యాల గురించి సరయిన అంచనా వేసుకొని 'నేను ఈ పని చేయగలను' అనుకోవడం అహంభావ ధోరణి కాదు. 'సమస్యలు ఎదురయినా ఎదుర్కోగలను' అనడంలో వాస్తవిక దృక్పథం ఉంది.

సర్వసాధారణంగా తమలోనో తమతోనో మాట్లాడుకునే వాళ్లు - గతం గురించే ఎక్కువగా ఆలోచిస్తూ ఉంటారట. 'నేను అలా చేసి ఉండకూడదు. నేను ఆ మాట అని ఉండకూడదు,' 'నేను అక్కడికి వెళ్లి ఉండకూడదు,' 'నేను ఇట్లా చేసి ఉండాల్సింది,' 'నేను ఆ మాటకు ఇట్లా జవాబు చెప్పి ఉండాల్సింది' అనుకోవడం అంతా గతానికి సంబంధించినవే కదా!

అయితే ఇట్లా కాకుండా స్వగతం చెప్పుకుంటున్నప్పుడు జరిగిన సంభాషణను, సంఘటనను యథాతథంగా నెమరువేసుకొని తమ ప్రవర్తన ఎట్లా ఉందో అంచనా వేసుకోవచ్చు.

అలాగే భవిష్యత్తు గురించీ స్వగతం చెప్పుకోవచ్చునట. ప్రధానంగా తమకు ఆందోళన కలిగించే సన్నివేశం గురించి కళ్లుమూసుకొని ఆలోచిస్తూ ఆ పరిస్థితులలో తాము నిలకడగా ఎట్లా ప్రవర్తించవచ్చో చెప్పుకోవచ్చునట. కావాలంటే ఆ దృశ్యం గురించి రాసుకోవచ్చునట.

స్వగతం - అంటే తనలోనే గట్టిగా ఆలోచించడమన్న మాట. తమ గురించి తాము సరిగా అంచనా వేసుకోవడానికీ - ఎదురు కాగల సన్నివేశాలలో తాము ఎట్లా ప్రవర్తించాలో తెలుసుకోవడానికీ ఇట్లా మాట్లాడుకోవడం పనికి వస్తుంది.

ముక్తాయింపు:

చాలా ఏళ్లక్రితం ఒక ఊరు. ఆ ఊళ్లో ఒక ఇల్లు. ఆ యింట్లో అత్తాకోడళ్లూ రోజూ కొట్లాడుకుంటూ, అరుచుకుంటూ ఉండేవాళ్లు. ఒకసారి కోడలు పుట్టింటికి వెళ్లింది. అయినా అత్త అరుస్తూ ఉండడం వినిపించి - ఇరుగు పొరుగున ఉన్న అమ్మలక్కలు విషయం ఏమిటో కనుక్కుందామని వెళ్లారు. 'ఎవరి మీదమ్మా అట్లా కేకలు వేస్తున్నావు' అని అడిగారు. 'నా మీదే. నా కోడలు ఊళ్లోలేని ఈ వారం రోజులు నాకు పొద్దెట్లా పోతుంది. అలవాటు తప్పిపోతే ఎలా?' అని మరింత గట్టిగా అరిచిందట ఆ అత్తగారు.



33. శ్రద్ధగా వింటున్నామా?

మనిషి మెదడు ఆలోచించే వేగంకన్నా మనిషి మాటాడే వేగం తక్కువ. ఈ ఎక్కువ తక్కువల వల్ల వినిపించుకోవడంలో తేడా వస్తుంది. ఉదాహరణకు ఒక తరగతిలో 40 మంది విద్యార్థులు ఉన్నారనుకుందాం. ఉపాధ్యాయులు చెప్పే పాఠాన్ని ఆ నలభైమంది వినిపించుకునే తీరులో తేడా ఉంటుంది. ఏకాగ్రత - ఏ విషయం పట్లనయినా శ్రద్ధ చూపడం ఒక్కొక్కరిలో ఒక్కొక్కతీరుగా ఉంటుంది.

'వినదగునెవ్వరు చెప్పిన' అన్నారు పెద్దవాళ్లు. కొందరు - చెప్పేవాళ్లు చెప్ప వలసిన తీరులో చెబితే తప్ప వినరట. మరికొందరు ఎంతచెప్పినా ఏం చెప్పినా విని పించుకోరట. చెవులో ఇల్లు కట్టుకుని పోరితే తప్ప కొందరికి ఇవతలివాళ్ల అభి ప్రాయం తలకెక్కని పరిస్థితులు ఉంటాయి. ఏదయినా పని జరగాలంటే అది జరి పించగలవారి చెవిని ఒకమాట పడవేయవలసి ఉంటుంది – అని కార్యసాధకులు అభిప్రాయపడుతూ ఉంటారు.

మన చుట్టూ ఎన్నో చప్పుళ్లు. వాటిలో చెవులు వినగలిగినవీ, వినలేనివీ ఉంటాయి. ఆరోగ్యంగా ఉన్న చెవులు – చెవులు వినగలిగిన అన్నిరకాల చప్పుళ్లనూ వినగలిగి ఉన్నా – ఆ వినడం స్థాయిలో తేడా ఉంటుంది. ఈ తేడాకు కారణం పర ధ్యానమో, దృష్టీ మనసూ మరెక్కడో ఉండడమో కారణాలు కావచ్చు. మనసు చేసే మాయవల్లా వేర్వేరు శారీరక మానసిక కారణాలవల్ల వినే చప్పుళ్ల స్థాయిలో తేడాలు తెలియవచ్చు.

తీవ్రమైన సమాధి స్థితిలో ఉన్న రామకృష్ణ పరమహంసకు ఒకసారి ఒక పెద్ద చప్పుడు వినిపించిందట. ఏ గునపమో పడినట్టు అనిపించిన ఆ చప్పుడు ఒక సూది పడడంవల్ల ఏర్పడిన చప్పుడేనట. చెవులలో వచ్చే కొన్ని రకాల జబ్బులవల్ల అసలు ఏ చప్పుళ్లూ వినిపించకపోవడం జరగవచ్చు. టిన్నైటస్ అనే జబ్బువల్ల చెవిలో తీవ్రమైన హోరు వినిపిస్తూ ఉంటుంది. వినే మాటలను విపరీతంగా అర్థం చేసుకునే పరిస్థితీ ఎదురవుతూ ఉంటుంది. వద్దు అన్నది మొద్దు అని వినిపించుకోవచ్చు. అత్త అన్నది చెత్త అని వినిపించుకోవచ్చు.

ఇష్టమైన వంటకాలు తినాలనుకునేటట్టే ఇష్టమైన విషయాలే వినాలనుకోవడం మానవ బలహీనతలలో ఒకటి. కొందరు విద్యార్థులకు తరగతిలో పాఠం జోలపాట లాగా వినిపిస్తుంది. కొన్ని సమావేశాలలో కొందరు వక్తలు మాటాడుతూ ఉంటే – శ్రోతలలో చాలామంది అది పగలూ రాత్రీ అనే బాధ లేకుండా నిద్రలోకి జారిపోతూ ఉంటారు.

వినడానికి ఏ ప్రయత్నమూ అక్కరలేదు. మన ప్రమేయం లేకుండా చుట్టూ జరిగే కార్యకలాపాల చప్పుళ్లు మనకు వినిపిస్తూ ఉంటాయి. అయితే వాటిలో ఎన్ని విషయాలు మనం వినిపించుకుంటున్నామన్నదే ప్రశ్న. వినిపించుకోవడానికి ప్రయత్నం అవసరం. మనిషి మెదడు ఆలోచించే వేగం కన్నా మనిషి మాటాడే వేగం తక్కువ. ఈ ఎక్కువ తక్కువలవల్ల వినిపించుకోవడంలో తేడా వస్తుంది. ఉదాహరణకు ఒక తరగతిలో 40 మంది విద్యార్థులు ఉన్నారనుకుందాం. ఉపాధ్యాయులు చెప్పే పాఠాన్ని ఆ నలభైమంది వినిపించుకునే తీరులో తేడా ఉంటుంది. ఏకాగ్రత – ఏ విషయం పట్లనయినా శ్రద్ధచూపడం ఒక్కొక్కరిలో ఒక్కొక్కతీరుగా ఉంటుంది. కొందరికి ఒకసారి వింటే చాలు. విన్నది విన్నట్టు అప్పగించే శక్తి ఉంటుంది. మరి కొందరికి రెండుసార్లు వింటే చాలు. ఒకసారి విని అప్పజెప్పగలవారిని ఏక సంథాగ్రాహులు అంటారు.

13వ శతాబ్దంలో గోపాల నాయకుడనే తెలుగు వాగ్గేయకారుడు ఉండేవాడు. అల్లా ఉద్దీన్ ఖిల్జీ గోపాలనాయకుడి కీర్తివిని ఆయనను తన ఆస్థానానికి ఆహ్వానించాడట. గోపాల నాయకుడు ధ్రువా గానంలో నిపుణులు. ఆయన తన అద్భుతమైన గానం వినిపించాడట. అయితే సుల్తాను సభలోని సంగీత విద్వాంసుడయిన అమీర్ ఖుస్రూ గోపాల నాయకుడి గానాన్ని మరుగున ఉండి విన్నాడు. ఆ విద్వాంసుడు గోపాల నాయకుడి గానాన్ని తాను తిరిగి వినిపించి గోపాల నాయకుడి గానంలో కొత్తదనం లేదని దబాయించాడట. ఆ తర్వాత తాను ఏకసంథాగ్రాహిగా ఆ గానాన్ని విని తిరిగి పాడినట్టు ఒప్పుకున్నాడట.

ఏకాగ్రత ఉంటే వినిపించుకోవడానికీ విన్నదానిని గుర్తుపెట్టుకోవడానికీ వీలుంటుంది.

అన్నట్టు చెవులతో చూడడానికికూడా వీలవుతుంది. పుట్టుకతో దృష్టి లోపంతో పుట్టిన వాళ్లలో చెవులు చాలా చురుకుగా పనిచేస్తుంటాయి.

'రంగులు వినడం' అనే ఒక పరిస్థితి ఉందని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. కొందరు– కొన్ని శబ్దాలు వింటే తమకు కొన్నిరంగులు గుర్తుకు వస్తాయని చెబుతూ ఉంటారు. అలాగే కొందరు సంగీత విద్వాంసులు కొత్తరాగాలు విన్నపుడు తమకు కొన్నిరకాల

రంగులు గుర్తుకు వస్తుంటాయంటారు. కొందరు కవులుకూడా కొన్ని శబ్దాలలో రంగులను ఊహించుకోగలరు. సినెస్తీషియా అనే స్థితిలో ఒకటో రెండో జ్ఞానేంద్రియాల కార్యకలాపాలు కలగాపులగం అయిపోతాయి. ఈ స్థితి కొన్ని మందుల వాడకంవల్ల కానీ, కొన్ని రకాల మానసిక రుగ్మతలవల్లగాని రావచ్చు. ఈ స్థితిలోని రోగులకు తాము వింటున్నామో, చూస్తున్నామో తెలియదట.

ముక్తాయింపు:

'నేను ఇంతసేపటినుంచీ అరుస్తుంటే అలా గుడ్లప్పగించి చూస్తూ కూచుంటావేమిటి' అని భర్త భార్యను కోపంగా అడిగాడు. 'కళ్లు మూసుకుని కూచుంటే నిద్రపోతున్నానని అనుకుంటారేమోనని..' అని ఆ యిల్లాలు అక్కడినుంచి లేచి చక్కాపోయింది.



34. వినడం వేరు - వినిపించుకోవడం వేరు

వినడం చాలా కష్టమైన పని. జాగ్రత్తగా వింటున్నప్పుడు కొందరిలో శరీరం ఉష్ణోగ్రత కొద్దిగా పెరగవచ్చునని, రక్తప్రసరణ వేగంగా జరగవచ్చుననీ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఎన్ని రణగొణ ధ్వనుల మధ్యనయినా జాగ్రత్తగా వినగలగడం ఒక కళ. కొందరికి కొన్ని మాటలు వింటేనే తీవ్రమైన ఒత్తిడి కలుగుతుందట. అత్తగారు, ఇల్లుగలాయన, పన్ను, పై అధికారి వంటి మాటలు కొందరిలో ఒత్తిడి కలిగిస్తాయని పాశ్చాత్య మానసిక శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

'వినే వాళ్లుంటే చెప్పే వాళ్లుంటారు' అన్నారు పెద్దలు. అయితే ఎవరయినా ఎవరు చెప్పినా ఎందుకు వినాలి? ఎంత వినాలి? ఎవరు చెప్పినదయినా మనం ఎంత వింటున్నాం? ఎంత వినగలుగుతున్నాం?

వినడం వినిపించుకోవడం వేర్వేరు విషయాలు. కొందరు విన్నా విననట్టుం టారు. కొందరు వినకుండా వింటున్నట్టుంటారు. మరికొందరు వినిపించుకోకుండా ఉంటారు. కొందరికి చెప్పినట్టు వినేవాళ్లంటే ఇష్టం. మరికొందరికి ఇతరుల గురించి తమకు చెప్పేవాళ్లంటే ఇష్టం.

తమకు ఆసక్తికరమైన విషయాలు వినడానికే ఎక్కువమంది ఇష్టపడతారు. ఆసక్తిలేని విషయం ఎంత గొప్పదయినా కొందరికి వినే కోరికుండదు. 'ఈ విషయం నాకు ఇష్టమైంది కాదు' అనుకుంటే వినిపించుకోవడం కష్టం అంటారు శాస్త్రవేత్తలు. కొందరు అవతలివాళ్లు మాట్లాడే విషయాలు ఎంతో జాగ్రత్తగా వింటారు. మనకు రెండు చెవులూ ఒక నోరూ ఉన్నది– ఎక్కువగా వినడానికీ తక్కువగా మాట్లాడడానికీ అని ఒక పెద్ద మనిషి చమత్కరించాడు.

ఆసక్తిలేని మనుషులు ఉండవచ్చుకానీ ఆసక్తికరం కాని విషయం లేదని మరొక పెద్దమనిషి అభిప్రాయపడ్డాడు.

కొందరు అవతలివారి ఆకారాన్నిబట్టి వాళ్ల తెలివితేటలను అంచనా వేసే ప్రయత్నాలు చేస్తుంటారు. ఆకారం బాగా లేదనీ, గొంతు బాగా లేదనీ ముందే నిర్ణ యిస్తే– వినవలసినవి వినే అవకాశం తప్పిపోవచ్చు. కొందరికి అద్భుతమైన గాత్ర సంపద ఉండవచ్చు. అయితే మాట్లాడగలిగే శక్తి ఉండకపోవచ్చు.

వినడానికీ విని గుర్తు పెట్టుకోవడానికీ చాలా పద్ధతులున్నాయి. వక్తలు చెప్పే అభిప్రాయాలలో కీలకమైన వాటిని గుర్తించటం ఒక పద్ధతి. కొందరు వక్తలు తమ అభిప్రాయాలను మధ్యమధ్య పునరుద్ఘాటిస్తూ ఉంటారు. అందరికీ ఆ అలవాటు ఉండదు. పైగా కొన్ని సందర్భాలలో - అధికారులు, ఉన్నతస్థాయిలో ఉన్న వ్యక్తులు ఒక్కసారే చెబుతూ ఉండవచ్చు. మళ్లీ అడిగే వీలుండదు. అందువల్ల వాళ్లు మాట్లాడుతున్నప్పుడు జాగ్రత్తగా వినాలి. మామూలు సంభాషణలలో సగటున 25 శాతం మంది మాత్రమే ఎదుటివాళ్ల అభిప్రాయాలు గ్రహించగలుగుతున్నారని శాస్త్రవేత్తల అంచనా.

కొందరు అధికారుల దగ్గర పనిచేసే ఉద్యోగులు - అతి శ్రద్ధగా ఒక పుస్తకం చేతబట్టుకొని అధికారుల ప్రవచనాలన్నిటినీ జాగ్రత్తగా రాసుకుంటూ ఉంటారు. అవి ఎంత పాటిస్తారు అన్నది వేరే విషయం. ఒక్కోసారి ఈ రాతపని యాంత్రికమయ్యే వీలూ ఉంటుంది. ఉత్తమ పత్రికా విలేకరులుగా పేరు తెచ్చుకున్నవారు సభలకూ, సమావేశాలకూ వెళ్లి జాగ్రత్తగా విని జాగ్రత్తగా వార్తలు రాయగలుగుతున్నారంటే అందుకు ఎవరికివారు రూపొందించుకొనే ప్రత్యేక విధానాలే కారణాలు.

వినడం చాలా కష్టమైన పని. జాగ్రత్తగా వింటున్నప్పుడు కొందరిలో శరీరం ఉష్ణోగ్రత కొద్దిగా పెరగవచ్చుననీ రక్తప్రసరణ వేగంగా జరగవచ్చుననీ శాస్త్రవేత్తలు గుర్తించారు.

ఎన్ని రణగొణ ధ్వనుల మధ్యనయినా జాగ్రత్తగా వినగలగడం ఒక కళ. ఏకాగ్రతతో వినడానికి చాలా కృషిచెయ్యాలి. వినడం జాగ్రత్తగా అభ్యసించవలసిన విద్య అన్నారు ఒక శాస్త్రవేత్త. ఈ అభ్యాసం శ్రమతోగానీ సాధ్యంకాదు. కొందరికి తీవ్రమైన అభిప్రాయాలు ఉంటాయి. ఆ అభిప్రాయాలకన్నా భిన్నమైన అభిప్రాయాలు విన్నప్పుడు - తీవ్రమైన ప్రతిక్రియ చెలరేగుతుంది. దాంతో ఆ శ్రోత వెనకబడి ఆలోచనల్లో మునిగిపోవచ్చు. వేరే ఆలోచనలు పెట్టుకోకుండా విని ఆ తర్వాత ఆలోచించవచ్చునంటారు కొందరు. కొందరికి కొన్ని మాటలు వింటేనే తీవ్రమైన ఒత్తిడి కలుగుతుందట. అత్తగారు, ఇల్లుగల్లాయన, పన్ను, పై అధికారి వంటి మాటలు కొందరిలో ఒత్తిడి కలిగిస్తాయని పాశ్చాత్య మానసిక శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

మానసికమైన ఒత్తిడికి గురికాకుండా వినడం అలవాటు చేసుకోవాలనీ వాళ్లు సూచించారు.

ఇటీవలి కాలంలో నగరాలలోని పిల్లలు ఎంతో వేగంగా మాట్లాడుతూ ఉండడం గమనించవచ్చు. వాళ్లు మాట్లాడే వేగంతో పోటీపడే వేగంతో వినడం అందరికీ వీలయ్యేది కాదు.

కొందరు ఆలోచించినంత వడిగా మాట్లాడలేరు. అదీ ఒక సమస్యే. కొందరు ఆలోచిస్తూ ఆచితూచి మాట్లాడుతారు. వాళ్ల మాటలు వింటూ వాళ్లకు సమాధానాలు చెప్పడమూ కొందరికి సమస్యే.

ముక్తాయింపు:

అనగనగా ఒక పెద్ద సినిమా నటుడికి ఒక పెద్ద రచయిత ఒక కథ చెబుతానన్నాడు. నటుడు సరేనన్నాడు. రచయిత ఒకరాత్రి నటుడికి కథ చెప్పాడు. ఆయన కథ చెప్పినంత సేపూ పక్కనే ఒక సహాయ దర్శకుడు కూచుని కథ రాసుకున్నాడు. రచయిత రెండు గంటలసేపు కథ - మాటలు, పాటలూ, స్టంటులూ అన్నీ తనే చెప్పి పాడీ చేసీ చూపించి నటుడిని ముగ్ధుణ్ణి చేశాడు. నటుడికి కథ నచ్చింది. పొద్దున్నే నటుడు ఒక నిర్మాతనూ, దర్శకుడినీ పిలిపించాడు. సహాయ దర్శకుడు కథ వినిపించమన్నాడు. ఆయన వినిపించాడు. కథంతా విని నటుడు 'ఇదేం కథ' అన్నాడు. 'నిన్న విన్నదే సార్' అన్నాడు సహాయ దర్శకుడు. 'నిన్న బాగుందే' అన్నాడు నటుడు. 'ఆ రచయిత కథ బాగా వినిపిస్తాడు సార్' అన్నాడు దర్శకుడు.



35. విని రాసుకోవడం

రాసుకోవడానికి ఉపయోగిస్తున్న పుటను రెండు భాగాలుగా విభజించు కోవాలి. పుట ఎడమ భాగంలో ఐదారు సెంటీమీటర్ల ఖాళీ వదలిపెట్టి పుటను నిలువుగా రెండు భాగాలుగా విభజించుకోవాలి. విషయాలను కుడిభాగాన రాసుకుని ఎడమ భాగాన్ని గుర్తు తెచ్చుకోవడానికి వీలయిన సూచనలు రాసుకోవడానికి అనువుగా వాడుకోవాలి.

టేపు రికార్డర్లు వాడుకలోకి రానికాలం నాటి మాట. ఒక నాయకుడు ఒక బహిరంగ సభలో ఒక విద్దూరమైన అభిప్రాయం చెప్పారని వదంతి చెలరేగింది. నాయకుడు తాను అట్లా మాట్లాడలేదన్నాడు. ఋజువు కావాలంటే ఆ సభలో ఉండిన ఫలానా విలేకరిగారిని అడగమన్నాడు. ఆ విలేకరిగారిని అడగగా ఆయన నాయకుడు వదంతుల్లో పేర్కొన్నట్టు మాట్లాడలేదని చెప్పారు. ఏ సభకు వెళ్లినా ఎవరిని కలుసు కున్నా – తాను విన్నదాన్ని విన్నట్టుగా అక్షరం పొల్లుపోకుండా రాయగలిగే ఆ విలేకరి నేర్పు ఆ నాయకుడికి సాయపడింది.

కొందరు విలేకరులు తాము విన్న విషయాలను సూచనల రూపంలో అక్షర బద్ధం చేసి ఆ తర్వాత వాటిని విస్తరించి వార్తలుగా రాస్తూ ఉంటారు. కొందరు శీఘ్ర లిపి (Short Hand) పద్ధతిలో విన్నది విన్నట్టు రాసుకుని – ఆ తర్వాత విస్తరించి రాసుకుంటూ ఉంటారు.

తరగతులలో పాఠాలు వినే విద్యార్థులు కూడా– పాఠాలకు సంబంధించిన సూచనలు (Notes) రాసుకోవడానికి రకరకాల పద్ధతులు పాటిస్తూ ఉంటారు. పాఠాలు వినడంలో ఒక చిక్కు ఉంది. పాఠం చెప్పే వారు పాఠం చెప్పే వేగానికి నాలుగురెట్ల వేగంతో వినేవారు ఆలోచించగలరన్నదే ఆ చిక్కు. ఇందువల్ల పాఠం పరధ్యానంగా వినడం, విన్నది సరిగా రాసుకోకపోవడం, ఆ రాసుకున్నది మళ్లీ చదివితే అర్థం కాకపోవడం – మొదలయిన ఇబ్బందులన్నీ వస్తాయి.

జాగ్రత్తగా విని జాగ్రత్తగా రాసుకోవడం అన్నది చాలా శ్రమపడితే కాని సాధ్యం కాదు. విని రాసుకోవడానికి రకరకాల పద్ధతులు పాటించవచ్చునని పెద్దలు అనుభవ పూర్వకంగా కొన్ని సూచనలు చేశారు.

కార్నెల్ పద్ధతి అని ఒకటుంది. రాసుకోవడానికి ఉపయోగిస్తున్న పుటను రెండు భాగాలుగా విభజించుకోవాలి. పుట ఎడమ భాగంలో ఐదారు సెంటీమీటర్ల ఖాళీ వదలిపెట్టి పుటను నిలువుగా రెండు భాగాలుగా విభజించుకోవాలి. విషయాలను కుడిభాగాన రాసుకొని ఎడమ భాగాన్ని గుర్తు తెచ్చుకోవడానికి, వీలయిన సూచనలు రాసుకోవడానికి అనువుగా వాడుకోవాలి. అవసరమైనచోట్ల సంక్షిప్త రూపాలు వాడినా, విషయాలు స్పష్టంగా రాసుకోవాలి. తరగతి అయ్యాక ముఖ్యమైన మాటలు, అభిప్రాయాలు గుర్తుంచుకొనే ప్రయత్నం చేస్తే- పాఠం అంతా గుర్తు చేసుకోవచ్చు. ఇట్లా పునర్విమర్శ చేసుకుంటే- పాఠం బాగా అర్థమవుతుందట. ఈ పద్ధతేకాక ముగ్గు పద్ధతి ఒకటి. వృక్ష శాఖా పద్ధతి ఒకటీ కూడా ఉన్నాయి. చుక్కలను కలిపి ముగ్గు పెట్టినట్టు పాఠంలోని ముఖ్యమైన విషయాలు గుర్తుపెట్టుకొని ఆ బిందువుల ఆధారంతో మొత్తం పాఠాన్ని నెమరువేసుకోవచ్చు. అలాగే చెట్టుకు కొమ్మలు విస్తరించినట్టు - ప్రధాన విషయం, ఆ విషయానికి పోషకమైన విషయాలు గుర్తుంచుకోవచ్చు.

డాక్టర్ సామ్యుయెల్ జాన్సన్ 18వ శతాబ్దికి చెందిన ఆంగ్ల పండితుడు. సాహిత్య చరిత్రకారుడుగా, నిఘంటు కర్తగా పేరెన్నికగన్నవాడు. జాన్సన్‌ది విలక్షణమైన వ్యక్తిత్వం. ఆ వ్యక్తిత్వం గురించి ప్రపంచానికి తెలియజెప్పినవాడు జేమ్స్ బాస్వెల్. బాస్వెల్ పరిశీలనాదృష్టి ఎంతో నిశితమైనది. ఆయన జ్ఞాపకశక్తి కూడా అపూర్వమైనది. ఇరవై సంవత్సరాలపాటు జాన్సన్‌తో కలిసి మెలిసి తిరగడం ద్వారా- జాన్సన్ గురించి ఎన్నో విషయాలు బాస్వెల్‌కు తెలిశాయి. తాము కన్నవీ విన్నవీ జాగ్రత్తగా రాసిపెట్టుకున్న బాస్వెల్ - జాన్సన్ జీవిత చరిత్రను ప్రచురించారు. ఆ పుస్తకం నేటికీ ఆ కాలాన్ని కళ్లకు కట్టినట్టు చూపించగలుగుతున్నదంటే బాస్వెల్ పరిశ్రమ ఎటువంటిదో ఊహించుకోవచ్చు.

బాస్వెల్ రాసిన జాన్సన్ జీవితచరిత్ర - జాన్సన్ మరణించిన ఒక ఏడాది గడిచిన తర్వాత ప్రచురితమైంది.

మహేంద్రనాథ గుప్త అనే 'మ' - శ్రీరామకృష్ణ పరమహంసను తాము సందర్శించిన ప్రతిసారీ జరిగిన వాటిని డైరీలలో రాసుకున్నారు. సూచనల రూపంలో రాసుకున్న వాటిని ఆయన విస్తరించి రాశారు. 1882లో రామకృష్ణులను మొదట సందర్శించిన 'మ' - రామకృష్ణులు సమాధి చెందిన పదకొండు సంవత్సరాల తర్వాత తమ నోట్సు ఆధారంగా 'శ్రీ రామకృష్ణ కథామృత' పేరిట వంగ భాషలో రెండు కరపత్రాలు ప్రకటించారు. 'ఆ సంభాషణలు అచ్చం శ్రీ రామకృష్ణులు మాట్లాడుతున్నట్టే ఉన్నాయి' అని ప్రశంసలు పొందడంతో, శ్రీ రామకృష్ణుల సంభాషణలను చిన్న పుస్తకాల రూపంలో ప్రకటించసాగారు. ఆ పరంపరలో చివరిది 1932లో వెలువడింది.

ప్రతి సన్నివేశంలోనూ రామకృష్ణులు ఎక్కడ కూచున్నారు, ఏ దుస్తులు ధరించారు, ఆ సన్నివేశంలో తక్కిన వారెవరున్నారు మొదలయిన వివరాలు కళ్లకు కట్టినట్టు రాయడం 'మ' ప్రత్యేకత. 46 ఏళ్ల తర్వాత కూడా ఆ దృశ్యాలు ఆయన మనసులో అప్పుడే చూసినంత కొత్తగా ఉండేవంటే - 'మ' ఏకాగ్రత ఎంత తీక్షమైనదో తెలుసు కోవచ్చు.

ఇలాగే తర్వాతి రోజులలోనూ రమణ మహర్షి వంటి మహనీయుల సంభాషణ లను విని - గ్రంథస్థం చేసిన వారు అన్నారు.

వింటున్న విషయంపట్ల శ్రద్ధ, ఆసక్తి, ఏకాగ్రత ఉండే - ఏ విషయమైనా ఎన్నేళ్ల తర్వాతనయినా గుర్తుండాలి.

ముక్తాయింపు:

అనగనగా ఒక కార్యాలయంలో ఒక అధికారి ఉండేవాడు. ఆయనకు తన వాక్చాతుర్యం మీద చాలా నమ్మకం ఉండేది.

ఆయన ఒకరోజు ఒక ఉపన్యాసం ఇవ్వవలసి రాగా తానా ఉపన్యాసం ఆశువుగా ఇస్తాననీ తన దగ్గర పనిచేసే ఒక ఉద్యోగిని తన ఉపన్యాసం వింటూ నోట్సు రాసుకోమనీ పురమాయించాడు. రెండురోజుల తర్వాత ఆ ఉద్యోగి తాను రాసిన నోట్సు సాయంతో ఉపన్యాసం పాఠం రాసుకొచ్చి అధికారికి ఇచ్చాడు. ఆ ఉపన్యాస పాఠం చదివి - 'అదేమిటో ఒక్కముక్కా అర్థం కావడం లేదు' అన్నాడు అధికారి. 'మీరు చెప్పింది చెప్పినట్టు రాసుకొచ్చాను' అన్నాడు ఉద్యోగి.



36. చెప్పడం -చెప్పించుకోవడం

చరిత్ర పుటలు తిరగవేస్తే చెప్పడాలూ, చెప్పించుకోవడాలూ కోకొల్లలు కనిపిస్తాయి పనికావడానికి ఒకటి. పనికాకుండా చేయడానికి మరొకటి. సాగడానికి ఒకటి. ఆగడానికి ఇంకొకటి. అర్హతలు ఉన్నవారికి ఉత్తరాలూ చెప్పించుకోవడాలూ లేకుండా అవకాశాలు వస్తుంటాయి. ఇప్పట్లో పనులుకావడానికి ఉత్తర, దక్షిణ విధానాలు రెండున్నాయని కొందరు కార్యసాధకులు అంటూ ఉంటారు.

'నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ' అని భద్రాచల రామదాసు రాముల వారికి చెప్పమని సీతమ్మకు విన్నవింత చేసుకున్నాడు. కొన్ని పనులు కావడానికి చెప్పించుకోవడం అవసరం అనే అభిప్రాయం అనాది నుంచి వస్తున్నట్టు కనిపిస్తుంది. చెయ్యడానికీ చేయించడానికీ ఇవ్వడానికీ ఇప్పించడానికీ చెప్పడానికీ చెప్పించడానికీ కొన్ని అర్హతలూ, పరిమితులూ ఉంటాయి. 'ప్రేరణంబున ఇంచుక్కగు' అంటుంది ఒక వ్యాకరణ సూత్రం. అంటే 'చెప్పు' అనే మాట ప్రేరణార్థకంలో 'చెప్పించు' అని అవుతుందన్నమాట. కొన్నిసార్లు ప్రేరణ ఎక్కువయితే పని ఇంచుకే అవుతుంది.

చరిత్ర పుటలు తిరగవేస్తే చెప్పడాలూ, చెప్పించుకోవడాలూ కోకొల్లలు కనిపిస్తాయి. పనికావడానికి ఒకటి. పని కాకుండా చేయడానికి మరొకటి. సాగడానికి ఒకటి. ఆగడానికి ఇంకొకటి. పాత కావ్య పురాణాలలో ఏ అస్త్రానికి ఏ అస్త్రం విరుగుడుగా పనిచేస్తుందో ఏ అస్త్రానికి ఏ ప్రయోజనం ఉందో వివరించే సన్నివేశాలు ఉన్నాయి. అష్టాదశ పురాణాలలో ఒకటయిన అగ్ని పురాణంలో రకరకాల సాధనాల గురించిన వివరాలు కనిపిస్తాయి. ఇక అస్త్రాల మాటకువస్తే విరాటుడి ఆవులను మళ్లించడానికి వచ్చిన అర్జునుడు – కౌరవ సేనమీద సమ్మోహనాస్త్రం వేశాడట. సమ్మోహనాస్త్రం అన్ని వేళలా పనిచేయదు. నిప్పులు చెరిగే ఆగ్నేయాస్త్రానికి నీళ్లు చిమ్మే వారుణాస్త్రం విరుగుడు. బుసలు కొట్టే నాగాస్త్రానికి బలిష్ఠమైన గరుడాస్త్రం విరుగుడు. చెప్పవలసిన వాళ్లు చెబితే తెరుచుకోని తలుపులుకూడా తెరుచుకుంటాయని విజ్ఞులు కొందరు అంటుంటారు.

చెప్పడంలో పద్ధతులున్నాయి. అర్హులయిన వారికి తగిన గౌరవం కల్పించడానికి అవసరమయినచోట అవసరమైన ప్రమేయం కల్పించుకోవడం అరుదుగా జరుగుతుంటుంది. అటువంటి అరుదైన సంఘటనలు ఒకటి రెండు (ఇటువంటి సందర్భాలలో - చెప్పినవారి విలువా, ఆ చెప్పిన మాటల విలువా పెరుగుతాయి). 1893లో షికాగోలో జరిగిన ప్రపంచ మత సమ్మేళనంలో పాల్గొని వివేకానంద స్వామి భారతీయ ఆధ్యాత్మిక సంపద గురించి చేసిన ఉపన్యాసం చరిత్ర ప్రసిద్ధి గడించింది. కాని ఆ సమ్మేళనంలో పాల్గొనడానికి వివేకానందులకు మొదట అవకాశం చిక్క లేదట. ఆచార్య జె.హెచ్.రైట్ (WRIGHT) అనే పెద్దమనిషి సమ్మేళనం కార్యకర్తలకు స్వామి గురించి చెప్పవలసి వచ్చిందట.

గాంధీ మహాత్ముడి ఆదర్శాలతో ప్రభావితులైన వినోబా భావే తల్లిదండ్రులకు చెప్పకుండా ఇల్లువిడిచి గాంధీజీ సబర్మతీ ఆశ్రమంలో చేరారు. అప్పటికి ఆయన వయసు 21 సంవత్సరాలు. వినోబా భావే గురించి ఆయన తల్లిదండ్రులకు గాంధీజీయే చెప్పవలసి వచ్చింది. "మీ అబ్బాయి నా దగ్గరే ఉన్నారు. ఎన్నో ఏళ్లు ఓపికతో శ్రమిస్తే తప్ప నాకు అలవడని కార్యదీక్షా వైరాగ్య ప్రవృత్తీ మీ అబ్బాయికి ఇంత చిన్న వయసులోనే అలవడ్డాయి" అని గాంధీజీ వినోబా తండ్రికి వ్రాశారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి పాండిత్యానికి ముగ్ధులయిన అలనాటి ఆంగ్ల పాలకులు ఆయనకు ప్రశంసా పూర్వకంగా 'నైట్' హోదా కల్పించాలని ఆశించారు. రాధాకృష్ణన్ గారికి ఆ హోదా కల్పించడం గురించి అభిప్రాయం చెప్పమని అప్పటి గవర్నర్ జనరల్ ఇర్విన్ ఆనాటి బెంగాల్ గవర్నర్‌కు రాశారు. "పోలీసుల రికార్డులన్నీ ఆయనకు వ్యతిరేకంగా ఉన్నాయి. అయినా ఆయనంటే నా కిష్టం" అని ఆ గవర్నర్ గారు చెప్పాడట.

టైగర్ వరదాచారిగారని గొప్ప కర్ణాటక సంగీత విద్వాంసులు ఒకరు ఉండే వారు. ఆయన శిష్యులలో ప్రముఖులు కీర్తిశేషులు ఎం.డి.రామనాథన్. రామనాథన్ గారు ఎక్కడయినా ఉద్యోగం సంపాదించడానికి వీలుగా ఉంటుందని గురువుగారిని తమకు ప్రశంసాపత్రం వంటి ఉత్తరం రాసి ఇమ్మని అడిగారట. 'నీవు వెళ్లి గొంతు విప్పి పాడితే టైగర్ వరదాచారి శిష్యుడివని గుర్తిస్తారు. మళ్లీ ఉత్తరం ఎందుకు?' అన్నారట టైగర్.

అర్హతలు ఉన్న వారికి ఉత్తరాలూ చెప్పించుకోవడాలూ లేకుండా అవకాశాలు వస్తుంటాయి. ఇప్పట్లో పనులు కావడానికి ఉత్తర దక్షిణ విధానాలు రెండున్నాయని కొందరు కార్యసాధకులు అంటూ ఉంటారు. కొందరికి ఉత్తరం చాలు. మరి కొంద రికి ఉత్తరం కన్నా దక్షిణ ఉత్తమంగా కనిపించవచ్చు.

ముక్తాయింపు:

అనగనగా ఒక చిన్న ఊరు. ఆ ఊళ్లో ఒక పెద్ద మనిషి. ఆ ఊళ్లోనే మరొక చిన్న మనిషికి జబ్బుచేస్తే పెద్ద మనిషి - దగ్గరి పట్టణంలోని వైద్యుడి దగ్గరికి వెళ్ల మన్నాడు. చిన్న మనిషి చేతికి వైద్యుడికి ఇమ్మని ఒక ఉత్తరమూ ఇచ్చాడు. నాలుగు రోజుల తర్వాత చిన్న మనిషి పెద్ద మనిషికి కనిపించాడు. 'డాక్టర్‌గారి దగ్గరికి వెళ్లావా? నేను పంపానని చెప్పావా, నా ఉత్తరం ఇచ్చావా, ఆయన ఏమన్నారు' అని ప్రశ్నల వర్షం కురిపించాడు. చిన్న మనిషి - 'వెళ్లాను. మీరు ఇమ్మన్నారని ఉత్తరం ఇచ్చాను' అన్నాడు. 'అయితే ఆయన ఏమన్నాడు' పెద్ద మనిషి అడిగాడు ఆత్రంగా. 'ఫీజు మొత్తం ముందే ఇచ్చేయమన్నారు' అన్నాడు చిన్న మనిషి.



37. ప్రశ్నించడం కూడా కళే

జీవితంలో అన్నిటికన్నా ముఖ్యమైన ప్రశ్నలు కొన్ని ఉన్నాయి. ఎందుకు అనే ప్రశ్న నేర్పిన తమ తండ్రిగారికి గోపీచంద్ తమ 'అసమర్థుని జీవయాత్ర' నవలను అంకితం చేశారు. మొక్కుబడిగా అడిగే కొన్ని అర్థంలేని ప్రశ్నలూ ఉంటాయి. ఇప్పుడేనా రావడం, ఇప్పుడే నిద్రలేచారా వంటివి నిత్యమూ ఎదురయ్యేవే.

త్యాగరాజ కృతులు చాలా వాటిలో ప్రశ్నలు విరివిగా కనిపిస్తూ ఉంటాయి. జ్ఞాన మొసగరాదా, నిధి చాలా సుఖమా, సుఖి ఎవ్వరో, ఆడమోడి గలదా రామయ్యా, నగుమోము కనలేని నా జాలి తెలిసి నను బ్రోవగ రాదా, బ్రోచే వారెవరే, పలుకవ దేమిరా దైవమా, ఎందు దాగినాడో, ఎవరని నిర్ణయించేదిరా నిన్నెట్లారాధించేదిరా, మరి వేరే దిక్కెవరయ్యా రామ, తెరతీయగ రాదా, మోక్షము కలదా – ఇలా త్యాగరాజ స్వామి అడిగిన ప్రశ్నలు ఎన్నో.

త్యాగరాజ స్వామి శ్రీరామచంద్రుడిని ఇన్ని ప్రశ్నలడిగితే – రాములవారు అడిగిన ప్రశ్న గురించిన కథ ఒకటి ఉంది. రాములవారు ఒక ఋషి ఆశ్రమానికి వెళ్లారట. అలికిడి విన్న ఋషి ఎవరని అడిగితే రాములవారు 'నేనే' అన్నారట. 'నేను అంటే ఎవరు' అని ఋషి అడిగారట. అది తెలుసుకోవడానికే వచ్చానని రాముల వారు చెప్పారట. ఈ కథలోని సత్యాసత్యాల మాట ఎట్లా ఉన్నా ఆలోచించగల ప్రతి మనిషీ ఎప్పుడో ఒకప్పుడు ఏవో కొన్ని ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించడం తప్పదు. అన్ని ప్రశ్నలకూ సమాధానాలు ఎందుకు ఉండవో ఎవరు చెప్పగలరు?

భగవద్గీతలో పరిప్రశ్న అని ఒక పదం ఉంది. జ్ఞాన సముపార్జన కోసం శిష్యుడు గురువును తరచి తరచి ప్రశ్నించడమే పరిప్రశ్న అని పెద్దలు అంటారు. గురువుకు ఏం తెలుసో తెలుసుకోవడానికికాక తన అజ్ఞాన నివృత్తికోసం శిష్యుడు ప్రయత్నించా లన్నది మన ప్రాచీనుల అభిప్రాయం. తెలియనిది తెలుసుకోవడం కోసం ప్రశ్నిం చడం పురోగతికి గుర్తు.

మహాభారతంలోని అరణ్యపర్వంలో యక్షప్రశ్నల వృత్తాంతం ఉంది. ఒక కొల నులో నీటికోసం వెళ్లిన నకులుడు, సహదేవుడు, అర్జునుడు, భీముడు – ఆ తటా

కంలో నీరు తీసుకునేముందు తన ప్రశ్నలకు సమాధానాలు చెప్పమనే యక్షుడిని కాదని కొలనునీరు తాగి వివశులై పడిపోతారు. అప్పుడు తమ్ములను వెతుక్కుంటూ వెళ్లిన ధర్మరాజు యక్షుడి ప్రశ్నలకు సమాధానాలు చెబుతాడు. ఆ యక్షుడు యమధర్మ రాజే. ఆయన ధర్మరాజు ధర్మనిరతికి మెచ్చి అభిమత వరాలిచ్చి అనుగ్రహిస్తాడు. యక్ష ప్రశ్నలలో 'దినకరు నెయ్యది నడపును మొనసి నిద్రించియును గన్ను మూయ దెద్ది' మొదలయిన ప్రశ్నలెన్నో కనిపిస్తాయి. ధృతరాష్ట్రుడి ప్రశ్నలకు సనత్సుజాతుడు చెప్పిన సమాధానాలకు సంబంధించిన సనత్సుజాతీయం గొప్ప వేదాంత గ్రంథంగా ప్రసిద్ధి గాంచినది. చాలా ఉపనిషత్తులలో చాలా ప్రశ్నలు, సమాధానాలు ఉన్నా ప్రశ్నోపనిషత్తు అని ఒకటి ప్రత్యేకంగా ఉంది.

ప్రశ్నోపనిషత్తు అనే ఉపనిషత్తుకు ఆరు ప్రశ్నలను బట్టి ఆ పేరు వచ్చింది. అథర్వ వేదానికి చెందిన ఈ ఉపనిషత్తులో ప్రతి అధ్యాయమూ ఒక ప్రశ్నతో మొద లవుతుంది. సృష్టింపబడిన ప్రాణుల మూలకారణం, మానవ ప్రకృతి, ప్రాణ స్వభావ కారణాలు, మానవ ప్రకృతిలోని మానసికస్థితి, ప్రణవం, మానవుడిలోని పారమార్థిక తత్త్వం గురించిన ప్రశ్నలు స్థూల తత్త్వాల నుంచి సూక్ష్మ తత్త్వాలవైపుదారితీస్తాయి.

ఆదిశంకర భగవత్పాదులు 'ప్రశ్నోత్తర రత్నమాలిక' అనే అద్వితీయమైన రచన చేశారు.

తూర్పు ఇండియా కంపెనీవారు దక్షిణ భారతదేశాన్ని ఆక్రమించిన తరువాత 1801లో తిరుమల తిరుపతి దేవస్థానాలలో జరిగే పూజలు, ఉత్సవాలు, సేవలు మొదలయిన వాటి గురించిన వివరాలు కోరుతూ కొన్ని ప్రశ్నలు పంపారు. అప్పటి దేవస్థాన కార్యనిర్వాహకులు కంపెనీవారికి పంపిన సమాధానాలు 'సవాల్ – జవాబ్ పట్టీ'గా పేరు గడించింది. అందులో ఎన్నో విశేషాలు కనిపిస్తాయి.

రమణ మహర్షిగారు 'నేను ఎవరో' ప్రశ్నించి తెలుసుకోవాలనీ 'నేను ఎక్కడ ఆవిర్భవిస్తున్నదో' గమనించమనీ చెప్పేవారు. బంధంలో ఉన్న తాను ఎవరని విచా రించి తన యథార్థ స్వరూపం తెలుసుకోవడమే ముక్తి అనేవారు ఆయన.

ఇటీవల బడులలో విద్యార్థులు ప్రశ్నలు అడగడం లేదనీ మౌనంగా పాఠాలు వింటున్నారనీ విమర్శలు వినవస్తున్నాయి. పరీక్షలలో ఉత్తీర్ణులు కావడానికి అన్ని పాఠాలూ చదివేవారు కొందరయితే ఏ ప్రశ్నలు వస్తాయో ఊహించి అంతమటుకే చదివేవారు కొందరు. రాబోయే పరీక్షలలో రాదగిన ప్రశ్నలు ప్రచురించడమూ ఆన వాయితీ అయింది.

జీవితంలో అన్నిటికన్నా ముఖ్యమైన ప్రశ్నలు కొన్ని ఉన్నాయి. ఎందుకు అనే ప్రశ్న నేర్పిన తమ తండ్రిగారికి గోపీచంద్ తమ 'అసమర్థుని జీవయాత్ర' నవలను

అంకితం చేశారు. మొక్కుబడిగా అడిగే కొన్ని అర్థంలేని ప్రశ్నలూ ఉంటాయి. ఇప్పుడేనా రావడం, ఇప్పుడే నిద్రలేచావా వంటివి నిత్యమూ ఎదురయ్యేవే.

ముక్తాయింపు:

రోజూ ఆలస్యంగా వచ్చే భర్తను విధిగా రోజూ ప్రశ్నించే భార్య ఆ రోజు అతణ్ణి ప్రశ్నించలేదు. 'ఏం ఇవాళ నన్ను ప్రశ్నించడం లేదు' అని భర్త భార్యను అడిగాడు. 'మీరు చెప్పే సమాధానాల పట్టిక ఇది. ఇందులో ఈరోజు చెప్పే సమాధానం సంఖ్య ఏమిటో చెప్పండి' అని భార్య భర్త చేతికి చిట్టా ఇచ్చింది.



38. ప్రశ్నించడం నేర్చుకోండి

ప్రపంచంలో చాలామంది సూటిగా 'నాకు తెలియదు' అని చెప్పడానికి నామోషి పడతారని మానసిక శాస్త్రవేత్తల అంచనా. తెలియనప్పుడు తెలియదు అని ఒప్పుకోవడంవల్ల కలిగే ఇబ్బంది ఏమిటి? అయినవాళ్లూ, తమకన్నా వయసులో చిన్నవాళ్లు, సహోద్యోగులు మొదలయిన వాళ్ల ముందు 'తెలియదు' అని చెబితే తమ గౌరవానికి భంగం అనుకుని కొందరు ఇబ్బందుల పాలవుతూ ఉంటారట.

కొన్ని ప్రశ్నలకు ఇచ్చే కొన్ని సమాధానాలు జీవితం గతిని నిర్ణయిస్తాయి అంటే ఏదో తాత్త్విక ప్రబోధం చేస్తున్నట్టు అనిపించవచ్చు. అయితే కాస్త ఆ అభిప్రాయాన్ని నిశితంగా పరిశీలిస్తే జీవితంలో ప్రశ్నలకు ఉన్న ప్రాధాన్యం అర్థమవుతుంది. చదువు కుంటున్నప్పుడు చిన్న తరగతి నుంచి పై తరగతికి వెళ్లడానికి పరీక్షలలో ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. ఇష్టమైన వృత్తి విద్యాభ్యాసానికి మళ్లీ ప్రవేశ పరీక్షలలో ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. చదువుకొన్న తర్వాత ఉద్యోగాల కోసం అవసరాన్ని బట్టి వ్రాత పరీక్షలలో ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. ఆ తర్వాత ముఖాముఖి పరీక్షలో ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి.

ఇక్కడ చేసిన పనులకు అక్కడ అడిగితే సమాధానాలు చెప్పాలని కొందరు పెద్దలు పరలోక ప్రశ్నల గురించి గుర్తుచేస్తుంటారు.

ఏ గణిత శాస్త్రమో, భౌతిక శాస్త్రమో అయితే వాటికి సంబంధించిన ప్రశ్నలకు ఇదమిత్థమైన సమాధానాలు ఉండడానికి అవకాశం ఉంటుంది. జీవిత ప్రశ్నల విషయం అలాకాదు. తరగతి పరీక్షలయితే సమాధానం తెలియని ప్రశ్నలను ఎంపిక - ఛాయిస్‌లో వదిలేయవచ్చు. జీవితానికి సంబంధించిన ప్రశ్నలను ఎదుర్కొనక తప్పదు. వాయిదా వేస్తే ప్రశ్న మరింత జటిలం కావచ్చు.

నిత్యజీవితంలో కొన్ని ప్రశ్నలు ఎదురవుతూంటాయి. కొందరు సమాధానం ఆశించి ప్రశ్నలు అడగరు. ఏదో మాట్లాడాలి కనుక మాట్లాడుతున్నాం అన్నట్టు ఉంటాయి ఆ మాటలు. ఆ మాటలు చాలావరకు ప్రశ్నల రూపంలో ఉంటాయి. ఇప్పుడేనా రావడం - ఇంటినుంచేనా - ఈ మధ్య కనిపించడం మానేశారే - మీ

అబ్బాయి ఈ సారయినా పరీక్ష పాసయ్యాడా - మీ ప్రమోషన్ ఈ ఏడాదయినా వస్తుందా - ఇలా రకరకాల ప్రశ్నలు.

కొందరికి తమను ఎదుటివారు ప్రశ్నలు అడగడం లేదని బాధగా ఉంటుంది. 'ఈ చీర ఎక్కడ కొన్నారని అడగరేం' - 'నేను ఆ మాటంటే రామారావుగారు ఏమన్నారో తెలుసుకోవద్దా మీరు' - 'డైరెక్టరుగారు నన్నే ఎందుకు పిలిచారో తెలుసా' వంటి ప్రశ్నలు ఎదుటివారు అడగకున్నా, ప్రశ్నా తమదే, సమాధానమూ తమదే అనే తీరు కొందరిది.

షాండ్లర్ వాష్ బర్న్ అని ఒక పండితుడు ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా ఉండడం ఎలా అనే విషయంలో వ్యంగ్యం తొణికిసలాడేట్టు ఆంగ్లంలో ఒక సిద్ధాంత వ్యాసం వ్రాశాడు. ఆయన అభిప్రాయం ప్రకారం ఏ ప్రశ్ననయినా మూడు రకాలుగా ఎదుర్కోవచ్చునట. ప్రశ్నకు జవాబివ్వక పోవడం ఒక రకం. ప్రశ్నను సముచితంగా ఎదుర్కొనడం రెండవ రకం. ప్రశ్నవేసిన వ్యక్తితో సముచితంగా ప్రవర్తించడం మూడవరకం.

ఉదాహరణకు 'సోమవారం రాత్రి మీరు ఎక్కడికి వెళ్లారు' అన్నది ప్రశ్న అయితే 'ఆదివారం ఉదయం ఆరింటికే రైల్వేస్టేషనుకు వెళ్లాను' అని సమాధానం మొదలు పెట్టడం ఒక పద్ధతి. 'నా కొత్త పుస్తకం ఎట్లా ఉంది' అంటే 'అట్టమీద బొమ్మ గీసిం దెవరు?' అని ఎదురు ప్రశ్న అడగడం ఒక పద్ధతి. ప్రశ్నను దాటవేయడానికి మళ్లీ ఆ ప్రశ్నను తాము కూడా తమ పద్ధతిలో వివరణాత్మకంగా అడిగి - ప్రశ్నవేసిన మనిషిని తబ్బిబ్బు చేయవచ్చు.

'సోమవారం రాత్రి నేను ఎక్కడికి వెళ్లాను అంటే - మంగళవారం రాత్రి ఏం చేశానన్నదీ ఎక్కడికి వెళ్లానన్నది కాదు - సోమవారం ఉదయం కానీ, మధ్యాహ్నం కానీ, సాయంకాలం కానీ నేను ఏం చేశానన్నదీ ఎక్కడికి వెళ్లానన్నది కాదు. సోమవారం రాత్రి - నేను - ఎక్కడికి వెళ్లానని మీరు అడుగుతున్నారు. సోమవారం రాత్రి మీరు ఎక్కడికి వెళ్లారు?' అని అడిగితే అసలు ప్రశ్న అడిగిన మనిషి ఏం చెయ్యాలి?

ప్రశ్న దాటవేయడంలో కొందరికి అద్వితీయమైన ప్రతిభ ఉంటుంది. 'తప్పకుండా సమాధానం చెబుతాను. కాని ఇప్పుడు కాదు. సమయం వచ్చినపుడు మీరు ఎక్కడున్నా వెదుక్కుంటూ వచ్చి చెబుతాను' అనడం ఒక పద్ధతి. 'నాకు సమాధానం తెలుసు. కాని చెప్పను. చెబితే మీరు వినలేరు. విని భరించలేరు. మిమ్మల్ని బాధించడం నాకు ఇష్టంలేదు' అనడం మరొక పద్ధతి. ఒక వృద్ధ రాజకీయ నాయకుడు - ఎవరు ప్రశ్న అడిగినా సూటిగా సమాధానం చెప్పేవాడు కాదు. 'ఫలానా

విషయం గురించి మీ అభిప్రాయం ఏమిటి' అని అడిగితే, 'తెలుసుకుని మీరేం చేస్తారు' అన్నట్టు సమాధానం చెప్పాడట ఆయన.

సమాధానం చెప్పకపోవడం, దాట వేయడం, వీటికన్నా ప్రశ్న అడిగిన మనిషిని ఉబ్బించడం గొప్ప కళ అంటారు వాష్ బర్న్. ఉదాహరణకు – "ఈ ప్రశ్న మీరే అడగగలరు. ఇంత సునిశితంగా ప్రశ్న మామూలుగా ఎవరుపడితే వాళ్లు అడగలేరు. ఎంతో ప్రజ్ఞా పాటవాలు ఉంటే తప్ప ఇట్లా మాట్లాడడం సాధ్యం కాదు" అన్న తర్వాత ప్రశ్నించిన మనిషికి నూటికి తొంభై తొమ్మిది సందర్భాలలో తామడిగిన ప్రశ్న గుర్తు ఉండదని అనుభవజ్ఞుల మాట. మరికొందరు ప్రశ్న అడిగిన వారిమీద విరుచుకుపడుతూ ఉంటారు – 'ఏం ప్రశ్నండీ అది... తెలిసే అడుగుతున్నారా మీరు' అని...

ప్రపంచంలో చాలామంది సూటిగా 'నాకు తెలియదు' అని చెప్పడానికి నామోషీ పడతారనీ మానసిక శాస్త్రవేత్తల అంచనా. తెలియనప్పుడు తెలియదు అని ఒప్పు కోవడం వల్ల కలిగే ఇబ్బంది ఏమిటి? అయినవాళ్లూ తమకన్నా వయసులో చిన్న వాళ్లు, సహోద్యోగులు మొదలయిన వాళ్ల ముందు 'తెలియదు' అని చెబితే తమ గౌరవానికి భంగం అనుకుని కొందరు ఇబ్బందుల పాలవుతూ ఉంటారు.

ముక్తాయింపు:

అనగనగా ఒక దేశంలో ఒక రచయిత. ఆయన భార్య రచయిత్రి. పాఠకుల ప్రశ్నలకు ఆమె సమాధానాలు ఒక పత్రికలో వెలువడుతూ ఉండేవి. ఒకసారి ఒక పత్రికవాళ్లు రచయిత్రితో గోష్ఠి ప్రచురించాలనే ఉద్దేశంతో వెళ్లి ఆమెను రకరకాలుగా ప్రశ్నించారు. ఆమె చాలా నిలకడగా నిండుగా తెలివిగా సమాధానాలిచ్చింది. 'నా అనుమానం నిజమయింది' అన్నాడు పత్రిక పక్షాన ఆమెను ప్రశ్నిస్తున్న విలేకరి. 'ఏమిటి' అన్నది రచయిత్రి. 'పత్రికలో సమాధానాలు ఇచ్చేది మీ భర్తగారే కానీ మీరు కాదన్న నా అనుమానం నిజమయింది' అన్నాడు విలేకరి. 'ఎలా' అని అడిగింది రచ యిత్రి. 'నా ప్రశ్నలకు మీరు ఇచ్చిన సమాధానాలు స్పష్టంగా, సూటిగా, అర్థమయ్యేలా ఉన్నాయి కదా'... అన్నాడు విలేకరి.



39. నిర్ణయాలు తీసుకుంటున్నారా?

కొత్త సంవత్సరంలో ఈ ఫలానా ఫలానా నిర్ణయాలు అమలు చేయాలి అని చాలామంది చాలా ఉత్సాహంతో అనుకుంటూ ఉంటారు. ఈ ఏడాది డైరీ రాస్తాను అనుకున్న వాళ్లు కష్టపడి డైరీలు సేకరించి రెండు మూడు రోజులు రాసి ఆ తర్వాత మానేయవచ్చు. అన్నిటికన్నా కష్టమైనవి - అలవాట్లను మానుకోవడం లేదా మార్చు కోవడం.

'ఎవరని నిర్ణయించేదిరా నిన్నెట్లారాధించేదిరా' అని త్యాగరాజు శ్రీరాముడిని ప్రశ్నిస్తూ ఒక కృతి రచించారు. శ్రీరాముడు శివుడా మాధవుడా అని నిర్ణయించడం గురించి ఆ కృతిలో త్యాగరాజు ప్రస్తావించారు. పరతత్త్వమే శ్రీరాముడని త్యాగరాజు చాలా కృతులలో పేర్కొన్నారు. ఏది కృతి, ఏది కీర్తన అని నిర్ణయించే విషయంలో సంగీత సాహిత్య కోవిదుల మధ్య చర్చ సాగుతూ ఉంటుంది.

నిర్ణయాలు తీసుకోవడం, నిర్ణయించడం అనే మాటలు చాలా సందర్భాలలో వినిపించేవే అయినా కొత్త సంవత్సరాలు పుట్టినప్పుడు ఈ మాటలు తరచుగా విని పిస్తూ ఉంటాయి. ఎవరు పడితే వాళ్లు నిర్ణయాలు తీసుకోలేరు. తీసుకోకూడదు. కుటుంబాల సంగతి తీసుకున్నా, సంస్థల సంగతి తీసుకున్నా నిర్ణయాలు తీసుకొనే అధికారం అందరికీ ఉండదు. నిర్ణయాలను అమలు చేయవలసిన కర్తవ్యం చాలా మందికి ఉండవచ్చు.

చరిత్ర పుటలు ఒకసారి తిరగవేసి చూస్తే ఈ వైవిధ్యం బాగా అర్థమవుతుంది. ఆంగ్లేయులు మన దేశంలో నిలదొక్కుకోవడం మొదలుపెట్టిన తర్వాత మన దేశం లోని చాలామంది సంస్థానాధీశుల పక్షాన వాళ్లే 'నిర్ణయాలు తీసుకోవడం' మొదలు పెట్టారు. ఆంగ్లభాషలో ఒక సూక్తి ఉంది. 'సన్నాయి వారికి డబ్బులిచ్చేవారికే ఏ రాగాలు వాయించాలో నిర్ణయించే హక్కు ఉంటుంది' అని ఆ సూక్తిని తెలుగులో చెప్పుకోవచ్చు.

మంచికో చెడ్డకో మానవజాతి ఎప్పటికప్పుడు నిర్ణయాలు చేస్తూ ఉండాలి. పాలకులయితే విధాన నిర్ణయాలు కూడా చేస్తూ ఉండాలి. పిల్లలను ఏ బడిలో చేర్చాలి, రాత్రి ఏ కూర వండాలి, వచ్చే నెల జరగనున్న చుట్టాల పెళ్లిలో ఏం చదివించాలి, సెలవు పెట్టడానికి పై అధికారికి ఏం కారణం చెప్పాలి వంటి నిర్ణ యాలు ఎప్పటికప్పుడు చేస్తుండాలి అని అనుభవజ్ఞులు అంటుంటారు. కలవారి

కోడలు కలికి కామాక్షిని వాళ్లన్నలు వచ్చినప్పుడు వాళ్ల ఊరికి పంపే నిర్ణయం ఎవరు తీసుకోవాలో తెలియకపోవడం వల్ల మనకు క పాట మిగిలింది.

అమెరికాలో చాలా ఏళ్ల క్రితం ఒక ఊళ్లో ఒక పెద్దమనిషి ఆ ఊళ్లో వాళ్లు నిర్ణయాలు చేయడంలో ఆలస్యం చేస్తున్నారనుకొని పదిమంది గుమిగూడే 'హోటళ్ల' వంటి ప్రదేశాలలో 'అనుకున్న పని వెంటనే చేయండి, ఇంకా ఎందుకు ఆలస్యం' వంటి నినాదాలు అట్టలమీద వ్రాయించి పెట్టించాడట. ఆ పెద్దమనిషి 'మీరు అనుకున్న మంచి పని' అని నిర్దేశించక పోవడంవల్ల ఆ ఊళ్లో పరమ శాంత స్వభావుడని పేరుపొందిన ఒకాయన పక్కింటి ఆయనను కొట్టబోవడం వంటి చిత్రమైన సంఘటనలు కొన్ని జరిగాయట. మంచి నిర్ణయం అయితే త్వరపడాలనీ చెడ్డ పనులు చేయకూడదన్నది శాశ్వతమైన నిర్ణయం కావాలని, ఆ ఊరి వాళ్లు అనుభవం మీద నేర్చుకున్నారు.

ఎవరయినా నిర్ణయాలు చేసుకోవచ్చు. అయితే వాటిని అమలు చేయడం అందరికీ వీలుకాదు. పైగా – సాధ్యాసాధ్యాలు, మన శక్తి సామర్థ్యాలు, దేశ కాల పరిస్థితులు అన్నీ చూసుకోవాలి. కర్ణుడిలాగా దానాలు చేసి పేరు తెచ్చుకోవాలని దుర్యోధనుడు ప్రయత్నించి చతికిల పడ్డాడని కథ ఒకటి ప్రచారంలో ఉంది. ఉట్టి కెక్క గలిగితే ఆకాశం ఎక్కడం సాధ్యం కావచ్చు.

అయితే నిర్ణయాలు తీసుకోవలసినప్పుడు తీసుకోకపోవడమూ నిర్ణయాలు వాయిదాలు వేయడమూ సమస్యలకు పరిష్కారాలు కావు. నిర్ణయాలు చేయవలసిన వాళ్లు జాప్యం చేసినా పట్టించుకోకపోయినా సమస్యలురావచ్చు. కొన్ని నిర్ణయాలు జాగ్రత్తగా చేయవలసినవై ఉంటాయి. కనుక ఎంతో జాగ్రత్త అవసరం.

కొత్త సంవత్సరంలో ఈ ఫలానా ఫలానా నిర్ణయాలు అమలు చేయాలి అని చాలామంది చాలా ఉత్సాహంతో అనుకుంటూ ఉంటారు. 'ఈ ఏడాది డైరీ రాస్తాను' అనుకున్న వాళ్లు కష్టపడి డైరీలు సేకరించి రెండు మూడు రోజులు రాసి ఆ తర్వాత మానేయవచ్చు. అన్నిటికన్నా కష్టమైనవి అలవాట్లను మానుకోవడం లేదా మార్చుకోవడం. భగవద్గీతకు మానవ గుణగణాల పరంగా అర్థం చెప్పి – కురుక్షేత్ర సంగ్రామం వంటి సంగ్రామం మనిషిలో జరుగుతున్నదని పెద్దలు కొందరు చెప్పారు. 'చిన్నప్పటి నుంచి ఉన్న అలవాటూ, గుణమూ ఎలా మానుకోవడం?' అన్నది సమస్య. మొక్కగా ఉన్నప్పుడు వంచకుండా వదిలేస్తే చెట్టుగా ముదిరిపోతుంది. గోటితో తీస్తే అయిపోయి ఉండే పనికి గొడ్డలి అవసరమవుతుంది.

ముక్తాయింపు:

ప్రతి ఏడాదీ ఏదో ఒక నిర్ణయం అమలు చేయాలని ఉత్సాహపడే ఒక పెద్దమనిషిని మిత్రుడు అడిగాడు – 'ఈ నూతన సంవత్సర నిర్ణయం ఏమిటి' అని. 'ఈ ఏడాది ఏ నిర్ణయమూ చేయకూడదని నిర్ణయం తీసుకున్నాను' అని చెప్పాడు పెద్దమనిషి.



40.మంచి పనులకు ప్రతిరోజూ మంచిదే

ఆచారాలు, వ్యవహారాలు వడివడిగా మారిపోతున్న నేపథ్యంలో కాలాన్ని మంచిదనీ చెడ్డదనీ ఎలా చెప్పడం? మంచి పనులు చేయడానికి ప్రతిరోజూ మంచిదే. ఈ అభిప్రాయాన్ని ప్రాచీనులూ అంగీకరించారు. కాలం అనంతమే కాదు. అమూల్యం కూడా. అందుకే దాన్ని జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవాలి.

'అబద్ధాల పంచాంగానికి అరవై గడియలు త్యాజ్యం' అంటుంది తెలుగు సామెత ఒకటి. మన భారతీయ కాలమానం ప్రకారం రోజుకు 60 గడియలు. ఒక గడియ అంటే 24 నిమిషాల కాలప్రమాణం. త్యాజ్యం అంటే త్యజింప దగినది - వర్జింప తగినది. వర్జ్యం అని అర్థం. రోజంతా వర్జ్యమయితే చేసేందుకు ఏముంటుంది?

కాలం అనంతం. అయినా దాన్ని ప్రాచీనులు - క్షణం, గడియ వంటి విభాగాలుగా విభజించారు. కర్మాచరణకు వీలుగా కాలాన్ని సంవత్సరం, అయనం, ఋతువు, మాసం, పక్షం, దినం అని ఆరు భాగాలుగా పేర్కొన్నారు. ఇందులో సంవత్సరం మళ్లీ ఐదు రకాలు. చాంద్రం, సౌరం, సావనం, నాక్షత్రం, బార్హస్పత్యం. చాంద్రమాన సంవత్సరంలో ప్రతి మాసమూ శుద్ధ పాడ్యమితో అంటే అమావాస్య తరువాతి రోజున మొదలై అమావాస్యతో ముగుస్తుంటాయి. 354 రోజుల చాంద్రమాన సంవత్సరంలో 12 మాసాలుంటాయి. అధికమాసం వచ్చే సందర్భాలలో 13 మాసాలుంటాయి. ఈ చాంద్రమాన సంవత్సరాలకే ప్రభవ విభవ మొదలయిన 60 పేర్లు. సౌరమాన సంవత్సరానికి 364 రోజులు. 12 మాసాలు. మేషం మొదలయిన 12 రాసులలో సూర్యుడి గతిని సౌరమానం పాటిస్తుంది. సావన సంవత్సరానికి 360 రోజులు. అశ్విని మొదలు రేవతిదాకా 27 నక్షత్రాలలో చంద్రుడి గతిని బట్టి నక్షత్ర మాసం - ఉంటుంది. ఈ నక్షత్రమాస సంవత్సరంలో 324 రోజులు. బార్హస్పత్య సంవత్సరం - మేషం మొదలయిన 12 రాసులలో ఒక రాశిలో బృహస్పతి గడిపే కాలం. ఇది 361 రోజులు.

ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలలో చాంద్రమాన సంవత్సరాన్ని పాటించడం ఆచారంగా వస్తున్నది. చైత్ర శుద్ధ పాడ్యమి నుంచి సంవత్సరం మొదలవు తుంది. గుజరాత్‌లో సంవత్సరాది దీపావళి అమావాస్య తర్వాత మొదలవుతుంది.

కార్తీక శుక్ల పాడ్యమి నుంచి మొదలయ్యే ఆ సంవత్సరానికి కార్తికాది అంటారు. సౌరాష్ట్రలోని కొన్ని భాగాలలో సంవత్సరం ఆషాఢ శుక్ల పాడ్యమి నుంచి మొదలవుతుంది. త్రిపుర, అస్సాం, పడమటి బెంగాల్, తమిళనాడు, కేరళ ప్రాంతాలలో సౌరమాన సంవత్సరాన్ని పాటించినా పండుగలు మొదలైన వాటికి చాంద్రమానాన్ని పాటిస్తారు.

సగటున సౌరమాన సంవత్సరం చాంద్రమాన సంవత్సరం కన్నా 10.8893 రోజులు ఎక్కువగా ఉంటుంది. మన ప్రాచీనులు - సౌర చాంద్రమానాల లెక్కలు కట్టి - చాంద్ర మానంలో 33 నెలల కొకసారి అధికమాసం వస్తుందని తేల్చారు. అధికమాసం వచ్చిన చాంద్రమాన వత్సరంలో 383 నుంచి 384 రోజులు ఉండ వచ్చు. ఒక మాఘ మాసం తప్ప తక్కిన వాటిలో ఏదయినా 19 సంవత్సరాల కొక సారి అధికమాసం కావచ్చు. సాధారణంగా అధికమాసం - ఫాల్గుణ ఆశ్వయుజ మాసాల మధ్య వస్తుంటుంది.

మన ప్రాచీనులు 6 ఋతువులను పేర్కొన్నా - మనకు అనుభవంలో ఉన్నది - ఎడతెగని ఎండాకాలం. ఎముకలు కొరికే చలికాలం. ఎప్పుడో ఒకప్పుడు వానా కాలం.

వేదాంగ జ్యోతిషంలో యుగం అనే మాటకు 5 ఏళ్లు అనే అర్థం ఉన్నా కాలక్రమాన యుగమంటే ఎక్కువ కాలపరిమితి అనే అర్థం వ్యాప్తిలోకి వచ్చింది. భారతీయ కాలమాన ప్రకారం ఒక మహాయుగంలో 43 లక్షల 20 వేల ఏళ్లుంటాయి. కృతయుగం, త్రేతాయుగం, ద్వాపర యుగం, కలియుగం 4, 3, 2, 1 అనే నిష్పత్తిలో ఉంటాయి. కలియుగం 4,32,000 ఏళ్లు. ద్వాపరం దానికి రెట్టింపు. త్రేతాయుగం - కలికన్నా మూడు రెట్లు. కృతయుగం కలియుగం కన్నా నాలుగు రెట్లు.

71 మహాయుగాలు కలిస్తే ఒక మన్వంతరం అవుతుంది. రెండు మన్వంతరాల మధ్య ఒక కృతయుగ కాలంతో సమానమైన సంధ్య ఉంటుందట. అలా 14 మన్వంతరాలకు 15 సంధ్యలుంటాయి. ఆ మన్వంతరాలూ సంధ్యలూ కలిస్తే ఒక కల్పం. అంటే ఒక కల్పంలో - వేయి మహాయుగాలు ఉంటాయి. ప్రస్తుతం శ్వేత వరాహ కల్పంలో ఆరు మన్వంతరాలు గడిచి - ఏడవదయిన వైవశ్వత మన్వంతరం నడుస్తున్నదని పంచాంగాలు పేర్కొంటున్నాయి.

ఉగాది రావడంతో కొత్త పంచాంగాలు వస్తాయి. ఉగాదినే చాలామంది యుగాది అనీ అంటుంటారు. ఐదు అంగాలు ఉన్నది పంచాంగం. పంచాంగం - తిథి, నక్షత్రం, వారం, యోగం, కరణం అనే ఐదు అంగాల గురించి ప్రస్తావిస్తుంది.

చంద్రకళల పెరుగుదల తరుగుదలలనుబట్టి తిథుల నిర్ణయం జరగగా నిరయన చంద్రుడు ఉండే నక్షత్రాన్ని బట్టి నక్షత్ర నిర్ణయం జరుగుతుంది. యోగాలు మొత్తం 27. కరణాలు 11. వీటన్నిటిని గణించే పద్ధతులున్నాయి. తిథి వార నక్షత్రాల గురించేకాక పంచాంగాలు సూర్యోదయ అస్తమయాల వివరాలు, గ్రహణాల వివరాలు మొదలయినవి పేర్కొంటాయి. పంచాంగాల రూపకల్పన కష్టమైన పని.

మన గ్రామీణ జీవితంలో పంచాంగం పాత్ర విశిష్టమైనది. మన వ్యవసాయ కార్యకలాపాలను నిర్దేశించే కార్తెల తీరు తెన్నులను పంచాంగాలు తెలుపుతూ రావడం ఆనవాయితీ. కొందరు వ్యవసాయ కార్యకలాపాలను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ పంచాంగాలు కూడా రూపొందించారు.

మామూలు పంచాంగాలలో ఇంకా రకరకాల విశేషాలు కనిపిస్తాయి. అందులో కొన్ని - ఇప్పటి కాలానికి అనవసరమని అనిపించవచ్చు. కాగా మారుతున్న నేటి కాలంలో పంచాంగం పాత్ర పరిమితం. ఆచారాలు వ్యవహారాలు వడివడిగా మారి పోతున్న నేపథ్యంలో కాలాన్ని మంచిదనీ చెడ్డదనీ ఎలా చెప్పడం? మంచి పనులు చేయడానికి ప్రతి రోజూ మంచిదే. ఈ అభిప్రాయాన్ని ప్రాచీనులూ అంగీకరించారు. కాలం అనంతమే కాదు. అమూల్యం కూడా. అందుకే దీన్ని జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవాలి.

ముక్తాయింపు:

అనగనగా ఒక సిద్ధాంతి ఉండేవాడు. ఆయన భార్య, తల్లీ ఎప్పుడూ దెబ్బలాడుతూ ఉండేవారు. అటువంటి పరిస్థితే ఉన్న ఒక పెద్దమనిషి సిద్ధాంతి దగ్గరకు వచ్చి - 'అయ్యా, నా స్థితి ఎప్పటి నుంచి మారుతుంది? నాకు ప్రశాంతి ఎప్పుడు చేకూరుతుంది?' అని అడిగాడు. అందుకు సిద్ధాంతి - 'మీకు ప్రశాంతి కావాలంటే స్థాన చలనం అవసరం' అన్నాడు. 'అంటే ఊరు విడిచి పొమ్మంటారా' అని అడిగాడు పెద్ద మనిషి. కాదు. 'వాళ్లు ఇంట్లో కొట్లాడితే మీరు ఇంటి బయట ఉంటే చాలు' అన్నాడు సిద్ధాంతి.



41. కాలం విలువ మారదు

డబ్బు విలువ ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క రకంగా ఉండవచ్చు. కాని కాలం విలువ అన్నిదేశాలలోనూ ఒకటే. ఎవరికయినా రోజుకు 24 గంటలే. గడచిపోయిన క్షణం తిరిగి రాదు. కాలం లెక్కగణిత శాస్త్రానికి లొంగనిది. కాలమే ధనం అన్నారు. రోమ్ నగర నిర్మాణం ఒక రోజులో పూర్తికాలేదు.

'తిండికి తిమ్మరాజు – పనికి పోతరాజు' అనే సామెత తిండి తినడానికి ముందుకు వచ్చే మనిషి పని చేయడానికి ముందుకు రాని స్థితిని వర్ణిస్తుంది. ఈ సామెతకు దగ్గరి చుట్టం – 'కడి అంటే నోరు తెరిచి కళ్లెం అంటే నోరు మూసినట్టు' అనే సామెత. కడి అంటే ముద్ద అని అర్థం. అనగనగా ఒక గుర్రం. ఆ గుర్రం తిండి అంటే నోరు తెరుస్తుంది. పనికోసం కళ్లెం బిగించడానికి వస్తే నోరు తెరవకుండా బిగించుకొంటుందట. 'తిండికి ముందెత్తు పనికి వెనకెత్తు' అనే సామెతా ఉంది. చేతికి మట్టి అంటనిదే నోటికి మజ్జిగ అంటదు – కై కెసరాదరే బాయ్ మొసరు అంటుందొక కన్నడ సామెత. చేసుకున్నవారికి చేసుకున్నంత. కాలమూ కర్మమూ కలిసి రావాలి అంటుంటారు చాలామంది. అంటే కాలయాపన చేయకుండా పని చేయాలన్నమాట.

కర్మ అంటే విధి అనుకుంటూ ఉంటారు. ప్రకృతిలో ప్రతి క్రియకూ అంటే ప్రతి పనికీ – ఒక ప్రతిక్రియ ఉంటుందని విజ్ఞాన శాస్త్రం పేర్కొంటుంది. భగవద్గీతలోని కర్మయోగం– క్రియాశీలానికి సంబంధించినదే. కాలమూ కర్మమూ కలిసి రావాలంటే కాలం విలువ ఎరిగి పనిచేయాలనీ చెప్పుకోవచ్చు.

ఒక లాడం కొట్టకపోవడం వల్ల, యుద్ధంలో ఓటమి ఎదురయిందని ఒక పాతకాలం కథ చెబుతుంది. తన గుర్రానికి ఒక కాలి లాడం ఊడి పోయిందని ఒక రాజు గుర్తించాడు. కాని ఆ లాడం కొట్టించే పనిని వాయిదా వేశాడు. ఇంతలో యుద్ధం ముంచుకొచ్చింది. లాడం లేకపోవడంతో – రాజు గుర్రం అనుకున్నంత వడిగా కదలలేకపోయింది. రాజు వెనకబడడంతో సైనికులూ వెనకబడ్డారు. రాజు శత్రువుల చేతికి చిక్కాడు. యుద్ధంలో ఓడిపోయాడు.

కాలం విలువా పని విలువా ఎటువంటివో చెప్పడానికి ఎందరెందరి అనుభవాలో మనకు అక్కరకు వస్తాయి. జపాన్‌లో కార్మికులకు కాలం విలువపట్ల ఉన్న గౌరవం అసాధారణమైనది. అక్కడి కార్మికులు యజమానులలాగా ఆలోచిస్తూం టారంటారు. ఒకసారి ఒక కర్మాగారంలో పనిచేస్తున్న ఒక కార్మికుడు తన యజమాని

దగ్గరికి వెళ్లి – తాను పనిచేస్తున్న పద్ధతివల్ల తాను రూపొందించే ప్రతి వస్తువు నిర్మాణంలోనూ తొమ్మిది సెకండ్ల నష్టం వస్తుందనీ – ఆ నష్టం రాకుండా ఏదయినా కొత్త పద్ధతి కనుగొంటే బాగుంటుందనీ చెప్పాడట. కాలంపట్ల ఉన్న ఈ దృష్టివల్ల ఒకోసారి విపరీతాలూ జరగవచ్చుననడానికి జపాన్‌లోనే కొన్నేళ్ల క్రితం జరిగిన ఒక సంఘటన ఉదాహరణ. ఎనిమిది గంటలలోగా పిల్లలు బడిలోకి ప్రవేశించాలన్న నియమం ఉండడంవల్ల – ఎనిమిది గంటలకు సరిగా బడి వాకిట ఉన్న ఉక్కు ద్వారాలను మూసేస్తూ ఉండగా ఆలస్యం అవుతుందేమోనన్న భయంతో పరుగులు తీస్తూ వచ్చిన పసిపిల్లలు చాలామంది ఆ ద్వారాల మధ్య చిక్కి అకాల మరణం పాలయ్యారట. కాలానికి విలువ ఇవ్వాలి. దానికి మానవత్వపు పరిమితులు పాటించాలి.

డబ్బువిలువ ఒక్కొక్కదేశంలో ఒక్కొక్క రకంగా ఉండవచ్చు. కాని కాలం విలువ అన్ని దేశాలలోనూ ఒకటే. ఎవరికయినా రోజుకు 24 గంటలే. గడచిపోయిన క్షణం తిరిగిరాదు. కాలం లెక్క గణిత శాస్త్రానికి లొంగనిది. కాలమే ధనం అన్నారు. రోమ్ నగర నిర్మాణం ఒక రోజులో పూర్తికాలేదు అన్నారు. కాలం చెల్లిన మందులు తిన కూడదు. కాలం చేయడం, కాలం తీరడం, కాలం మీరడం, కాలం కలసి రావడం మొదలయిన పదబంధాలలో ఒక్కొక్కదానికి ఒక్కొక్క అర్థం. జీవితం అంటే ఊరికే కాలం గపడం కాదు.

ఒక పెద్ద మనిషికి ఆధ్యాత్మికత మీద మనసు మళ్లి శ్రీరామకృష్ణ పరమహంస దగ్గరికి వచ్చాడట. వచ్చి తనకు వెంటనే ముక్తిని ప్రసాదించే మార్గం సూచించమని కోరాడట. రామకృష్ణులు ఆ పెద్ద మనిషి ఏం చేయగలడో అడిగారట. తాను ఏమీ చెయ్యనన్నాడట ఆయన. ఏ పనీ చేయడం తనకు ఇష్టం ఉండదనీ చెప్పాడట. ఏమీ చేయనివాడికి రామకృష్ణులయినా ఏమి చేయగలరు?

సోమరితనం కొందరికి జీవలక్షణం. తన గూడు చెదరిపోతున్నా పట్టుదలతో పదే పదే గూడు అల్లుకుంటున్న సాలీడును చూసిన మనిషికి కర్తవ్యదీక్ష అంటే ఏమిటో తెలిసిందని చెప్పే వృత్తాంతం చాలామంది చదివే ఉంటారు. పనిచేయ వద్దంటే కొంతమంది – తమకు బూజుపట్టినా కదలకుండా ఎలా ఉండగలుగు తుంటారు?

ముక్తాయింపు:

ఒక ఇంట్లో ఒక సోమరి పిల్లవాడు ఉండేవాడట. తండ్రికీ తల్లికీ ఆ పిల్లవాణ్ణి ఎలా దారిలో పెట్టాలో తెలిసేది కాదట. ఒకసారి తండ్రి తన కొడుకుకు మర్నాడు పొద్దునే బయలుదేరి పొరుగూరికి వెళ్లి ఫలానా పనిచేసి రమ్మని చెప్పాడట. మర్నాడు మధ్యాహ్నమైనా పిల్లవాడి జాడ లేదు. అప్పుడు తండ్రి తన భార్యతో – 'ఈ పిల్లవాడు ఏమయ్యాడో ఏమో! ఎక్కడయినా పడి నిద్రపోతున్నాడేమో' అన్నాడు. 'మీరు ఇలా అంటారని తెలుసు. అందుకే నేను పొద్దున నుంచీ ఈ తలుపు వెనకే దాక్కుని ఉన్నాను' అన్నాడట ఆ సుపుత్రుడు.



42. ఏ పని ఎప్పుడు చేయాలి?

అందరికీ తమకు ఇష్టమైన పనులే చేసే వీలుండదు. ఉద్యోగ ధర్మం వల్లకానీ, వృత్తిధర్మం వల్లకానీ ఇష్టంలేని పనులు చేయవలసి రావచ్చు. ఇష్టంలేని పని ముందు చేసేయడం మంచిదని మనస్తత్వ శాస్త్రవేత్తల సలహా. అయితే అన్ని పనులూ ఒక్కసారే చేయడం సాధ్యంకాదు కనుక ఏది ఎప్పుడు చేయాలో చూసుకోవాలి. ఎప్పుడు కష్టపడి పని చేయనక్కరలేదో తెలుసుకోవడం అవసరం.

'ఎప్పుడు చేయవలసిన పని అప్పుడే చేయాలి. వాయిదాలు వేయకూడదు' అని కొందరు పెద్దలు హితబోధ చేస్తూ ఉంటారు. మరికొందరు 'ఏ పనయినా బాగా ఆలోచించి చేయాలి. ఆలోచించకుండా చేయకూడదు' అంటారు. చాలా మంది 'ఏదయినా పని ఎందుకు చేయాలి' అని ఆలోచిస్తూ ఉంటారు. కొందరయితే లాభం లేని పని చేయకూడదన్న నిర్ణయంతో ఉంటారు. చేయడం చేయకపోవడం ఒక వైపు. చేస్తే ఏది ముందుచేయాలి, ఏది వెనుక చేయాలి అనేది మరొకవైపు.

పొలం దున్నవలసినప్పుడు దూరదేశాలకు పోయి కోతల వేళకు తిరిగివస్తే ప్రయోజనం ఏముంటుంది?

'ఏది ముందుగా చేయాలి, ఏది తరువాత చేయాలి' అనేది తెలుసుకోవాలంటే– ముందు ఏమేం చేయాలో తెలిసి ఉండాలి. దాంతోబాటు ఏది ఎప్పుడు చేయాలో నిర్ణయించుకోవాలి. ఈ కార్యాచరణ ప్రణాళిక అన్నది ఎవరో పెద్ద ఉద్యోగస్థులో వ్యాపారవేత్తలో మాత్రం అనుసరించడానికి కుదురుతుంది అనుకోనక్కరలేదు. నిత్య జీవితంలోనూ ఈ రకమైన ప్రణాళికను ఎంతో కొంత అమలుచేసి జీవితాన్ని మరింత సుఖంగా నడుపుకోవచ్చు.

'పనులు చేయడానికి కాలం సరిపోవడం లేదు. చాలా పనులుండడం వల్ల ఏకాగ్రత దెబ్బతింటున్నది' అంటూ కొందరూ, 'ఇదేమంత ముఖ్యమైన పనికాదు తర్వాత చేసుకోవచ్చు,' 'నేను అనుకుంటే పది నిమిషాలలో చేసేయగలను' అను కొంటూ కొందరూ పనులు చేయకుండా దాటవేస్తూ ఉంటారు. మరికొందరికి కొత్తగా ఏదయినా పని చేయాలంటే జంకుగా ఉంటుంది.

మనమే చేయాలి తప్పదు అనే స్థితి ఉన్నప్పుడు ఆ పని చేసేస్తే పోతుంది కదా అంటారు కొందరు.

మరి ఈ సమస్యలకు పరిష్కారం ఏమిటి అంటే ప్రయత్నిస్తే పరిష్కారం దొరక వచ్చు.

ఒక పద్ధతి - మనం చేయవలసిన పనులన్నిటి చిట్టా తయారు చేసుకోవడం. అందులో అవసరాన్ని బట్టి 'ఏది ముందు చేయాలి, ఏది వెనుక చేయాలి' గుర్తించాలి. 'ఈనెలలో ఏం చేయాలి,' 'ఈ వారంలో ఏం చేయాలి,' 'ఈరోజు ఏం చేయాలి', 'ఈ పూట ఏం చేయాలి' అని ఆలోచించాలి. అప్పుడు 'ఇప్పుడు ఏం చేయాలి,' 'ఏం చేస్తున్నామో' తెలుస్తుంది. ఏ కొందరికో తప్ప అందరికీ తాము అనుకున్న పనులన్నీ అనుకున్నట్టు ఆచరణలో పెట్టడం సాధ్యంకాకపోవచ్చు. ఇందుకు అనుకోకుండా ఎదురయ్యే సన్నివేశాలు, మన కాలం మన ఆధీనంలో ఉండకపోవడం వంటి కార ణాలు ఉండవచ్చు. చాలాసార్లు పనిమధ్య అంతరాయం కలిగితే మళ్లీ ఆ పని సంతృప్తికరంగా పూర్తి చేయడం ఇబ్బంది కావచ్చు. ఇందుకు ఏ పనినయినా ఇంత సేపట్లో చేసేయాలి అనే ప్రణాళిక అవసరం కావచ్చు.

చాలా కాలంగా పేరుకు పోయిన పనులు ఏమిటో గుర్తిస్తే ముందు వాటిని ఎంతత్వరగా చేసేయాలో పరిశీలించవచ్చు. పేరుకు పోయిన పని ఒక పూటలోనో ఒక రోజులోనో తెమిలేది కాకపోతే, ప్రతిరోజూ ఎంతో కొంత సేపు దానికోసం కేటాయించాలి. పనులు పేరుకు పోవడానికి కారణాలు ఏమిటో గుర్తించాలి. గడచిన వాటిగురించి ఆలోచించకుండా వర్తమానం గురించి, భవిష్యత్తు గురించి ఆలోచిం చడంవల్ల గతం బరువును తగ్గించుకొని ముందంజ వేసే వీలుంటుంది.

అందరికీ తమకు ఇష్టమైన పనులే చేసే వీలుండదు. ఉద్యోగ ధర్మంవల్ల కానీ, వృత్తి ధర్మంవల్లకానీ ఇష్టంలేని పనులు చేయవలసి రావచ్చు. ఇష్టంలేని పనిముందు చేసేయడం మంచిదని మనస్తత్వ శాస్త్రవేత్తల సలహా. ఒకసారి ఎవరో ప్రసిద్ధ హాస్య రచయిత మార్క్ ట్వైన్‌ను సలహా అడిగారట: 'కష్టమైన పని ముందుచేయాలా, ఇష్టమైన పని ముందు చేయాలా' అని. 'రెండు కప్పలను మింగక తప్పని స్థితివస్తే ముందు పెద్ద కప్పను వీలయినంత త్వరగా మింగాలి' అని మార్క్‌ట్వైన్ సలహా ఇచ్చారట. అయితే అన్ని పనులూ ఒక్కసారే చేయడం సాధ్యంకాదు కనుక ఏది ఎప్పుడు చేయాలో చూసుకోవాలి. ఎప్పుడు కష్టపడి పని చేయనక్కరలేదో తెలుసు కోవడం అవసరం. అలాగే ఎప్పుడు కష్టపడి పని చేయాలో తెలిసి ఉండటం ఇంకా అవసరం. పనులు చేయలేకపోవడానికి చేతగానితనంకన్నా పనులు దాటవేయడమే కారణమని ఒక శాస్త్రవేత్త పేర్కొన్నారు.

ముక్తాయింపు:

'ఇన్ని రోజులుగా ఈ పని ఎందుకు చేయలేదు' అని పెద్ద అధికారి చిన్న అధికారిని అడిగాడు. 'ఎట్లా చేయాలో తెలియలేదు. అందువల్లే' అన్నాడు చిన్న అధి కారి. 'ఆ సంగతి అప్పుడే ఎందుకు చెప్పలేదు' అని అడిగాడు పెద్ద అధికారి. 'మీరు ఇప్పుడే కదా అడుగుతున్నారు - అందుకని' అన్నాడు చిన్న అధికారి.



43. తీరిక వేళల్లో...

తమ తీరిక వేళలను తక్కినవాళ్లకు ఉపయోగపడేలా చూసుకొనే నిస్వార్థ పరులూ ఉన్నారు. ఆస్పత్రులలో ఒంటరిగా ఉండే రోగులను పరామర్శించడానికి వెళ్లి వాళ్లకు సాయపడేవాళ్లూ, కంటి చూపులేని విద్యార్థులకు పాఠాలు చదివి వినిపించేవాళ్లూ, పండుగలు తమ కుటుంబం వారితో కాక అనాథ బాలబాలికలతో జరుపుకునేవారూ ఇలా సేవాతత్పరులూ ఉన్నారు.

కొందరికి తాము చేసే పని ఇష్టం ఉండదు. మరి కొందరికి పనిచేయడం ఇష్టం ఉండదు. కొందరు తమ ప్రవృత్తికి తగని వృత్తిలో ఉన్నా తీరికను బట్టి తమకు ఇష్టమైన పనులు చేయడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. కొందరు తీరిక చేసుకొని తమకు ఇష్టమైన పనులు చేస్తూ ఉంటారు. నిఘంటువుల్లో ఉబుసు అని ఒక మాట కనిపిస్తుంది. ఆ మాటకు పనిలేని కాలము అనే అర్థమూ కనిపిస్తుంది. ఉబుసు అనే మాటకు ఊసు, వృత్తాంతం, సమాచారం అనే అర్థాలూ ఉన్నా పనిలేనికాలం అనే అర్థంలో అది ఉబుసుపుచ్చు, ఉబుసుపోక అనే రూపాల్లో కనిపిస్తుంది. ఉబుసు పుచ్చడం అంటే కాలక్షేపం చేయడం.

మాదయగారి మల్లనగారి రాజశేఖర చరిత్రములో 'నీకుబుసు పుచ్చున్ నెచ్చెలిం బోలె యీ రాచిల్కన్ గయి కొమ్ము' అని ఉబుసు పుచ్చడం గురించిన ప్రస్తావన ఉంది. కళాపూర్ణోదయంలో 'ఓ చిలుక చెలువ యుబుసుపోదు కథ యొక్కటి చెప్ప వుగా' అని చిలుకను కథ చెప్పమనే ఉబుసుపోని వృత్తాంతం కనిపిస్తుంది.

ఉబుసుపోకకూ ఉల్లాసానికీ తీరిక వేళలను సద్వినియోగం చేసుకోవడానికీ ఎన్నో మార్గాలున్నాయి. తమ తీరిక వేళలను తక్కిన వాళ్లకు ఉపయోగపడేలా చూసుకొనే నిస్వార్థపరులూ ఉన్నారు. ఆస్పత్రులలో ఒంటరిగా ఉండే రోగులను పరామర్శించడానికి వెళ్లి వాళ్లకు సాయపడే వాళ్లూ, కంటి చూపులేని విద్యార్థులకు పాఠాలు చదివి వినిపించేవాళ్లూ, పండుగలు తమ కుటుంబం వారితోకాక అనాథ బాల బాలికలతో జరుపుకునేవారూ – ఇలా సేవాతత్పరులూ ఉన్నారు. సరదాగా స్టాంపులు, నాణాలు, అగ్గిపెట్టెలు, సబ్బు పెట్టెలు, గడియారాలు, జడ సూదులు, కలాలు, కత్తులు, దీపాలు, సీసాలు, టోపీలు, పీపాలు, గ్రామఫోను రికార్డులు, కారులు, పట్ట

కారులు ఇలా ఎన్నెన్నో సేకరించే వారున్నారు.

అయితే ఉబుసుపోక కోసం చిత్ర విచిత్రమైన పనులుచేసే వాళ్లూ లేకపోలేదు. తీరిక వేళలలో కాలక్షేపంకోసం చేయవలసిన పనులను కొందరు ప్రధానమైన పనిగా పెట్టుకోవడమూ కనిపిస్తుంది. ఇది రికార్డుల యుగం. రికార్డులు సాధించడం, అధిగమించడం, సృష్టించడం ధ్యేయంగా పెట్టుకొని వింతలూ విడ్డూరాలు చేసేవారు కొందరు. 'నవ్విపోదురు గాక నాకేటిసిగ్గు నా ఇచ్ఛయే గాక నాకేటి వెరపు' అనే తీరులో తమకు తోచినట్టు ప్రవర్తించేవారు కొందరు.

ఒకాయన గంటల తరబడి పాములతో గడిపి ఒక రికార్డు సృష్టించాడు. మరొక పెద్దమనిషి 15 సంవత్సరాలు కష్టపడి తన ఎడమచేతి గోళ్లను దాదాపు169 సెంటీమీటర్ల పొడవు పెంచాడు. 20 ఏళ్ల క్రితం ఒక వైద్య విద్యార్థి 15 గంటలబాటు న్యూయార్క్‌లోని ఒక హోటలులోని వెయ్యి తలుపుల కీళ్ల మరలకు చమురుపోస్తూ పుట్టినరోజు జరుపుకున్నాడు. ఆగకుండా మూడురోజులబాటు టైపుచేసిన వాళ్లు, ఆగకుండా గంటల తరబడి మాట్లాడిన వాళ్లూ ఉన్నారు. ఏడేళ్ల పిల్లవాడు ఇంట్లో పడుకోక అరుబయట గుడారంలో నెలల తరబడి పడుకొని రికార్డు సృష్టించాడు. శ్రీలంకలో ఒక పోలీసాయన రెండువారాలబాటు నిద్రపోకుండా ఉండి ఒక రికార్డు సృష్టించాడు. మరొకాయన రెండోకాలు నేలమీద పెట్టకుండా ఒంటికాలిమీద నిలబడి చూపించాడు. రెండు భవనాల మధ్య కట్టిన తాడుమీద మూడురోజులు నిలబడ్డాడు ఒకాయన.

షికాగోలో ఒకావిడకు పియానోను వేళ్లతో కాకుండా ముక్కుతో వాయించడం ఉబుసుపోక. మస్బా ఆయెర్ అనే నటుడు పియానో మెట్లమీద ఏ ఆపిల్ పండునో దొర్లిస్తూ సంగీతం వినిపించే ప్రయత్నం చేసేవారు. కొన్నేళ్ల క్రితం అమెరికాలోని అట్లాంటా నగరంలోని ఒక పెద్దమనిషి పనిలేని ఒకానొక సందర్భంలో నుదుటిమీద వేళ్లతో కొట్టుకుంటూ కూచున్నాడట. అలా నెత్తిన కొట్టుకుంటూ ఉంటే ఆయనకు తన తల తబలాలాగా పనిచేస్తూ చక్కగా దరువులు వినిపిస్తూ ఉన్నదని అనిపించింది. వేళ్లతోనేకాక మెత్తని సుత్తులతో బాదినా తన తల తాళాలు పలికించడం గమనించి తీరిక దొరికినప్పుడల్లా తల కొట్టుకునే పనిచేసేవాడట. ఈ తలబాదుడు సంగీతం విని గుండెలు బాదుకున్న చూపరులు ఉన్నారు.

మరొక పెద్ద మనిషికి గడియారాలు చేయడం సరదా. ఏదో నేరం చేస్తే ఆ పెద్ద మనిషిని చెరసాలలో పడవేశారు. అక్కడ ఖైదీలు పళ్లు తోముకుని పారేసిన బ్రష్‌లతో ఆయన ఒక గడియారం చేసి పడేశాడు! మరొక పెద్ద మనిషి వికారంగా ఉండే మనుషుల ఛాయాచిత్రాలు సేకరించే సరదాతో ఇంటినిండా ఆ బొమ్మలు పెట్టుకొని

మతిస్తిమితం కోల్పోయి మేడమీది నుంచి కిందికి దూకేశాడట! ఇంకో పెద్ద మనిషికి పిట్టల గూళ్లు సేకరించడం సరదా అట. ఆయన వెయ్యికిపైగా గూళ్లను సేకరించాడట.

ముక్తాయింపు:

'ఈ కేసెట్ల సీడీల యుగంలో కూడా నా దగ్గర ఇంకా ఇన్నివేల గ్రామఫోన్ రికార్డులు ఉన్నాయి అంటే మీకేం తెలుస్తున్నది' అని ఒకాయన తనను చూడడానికి వచ్చిన మిత్రుణ్ణి సరదాగా అడిగాడు. 'మీ దగ్గర ఇంకా గ్రామఫోను ఉంది అని తెలుస్తున్నది' అన్నాడు మిత్రుడు - ఇంకా సరదాగా.



44. మీరు సేకరిస్తున్నదేమిటి?

ఎవరి సేకరణ వారికి ఆనందం. తమకోసం వస్తువులు సేకరించడం ఒక ఎత్తు. స్వార్థం లేకుండా సాంస్కృతిక దృష్టితోనో, చారిత్రక దృష్టితోనో వస్తుసామగ్రి సేకరించడం మరొక ఎత్తు. మారుమూల ప్రాంతాల నుంచి చారిత్రక ఆధారాలను తిరుపతికి తరలిస్తూ ఆ ప్రయత్నంలో జబ్బుపడిన మహాపండితులు వేటూరి ప్రభాకర శాస్త్రిగారి నిస్వార్థ సేవతో పోల్చగల సేవచేసిన వారు ఏ కొందరో.

మైసూరు విశ్వవిద్యాలయం ఆవరణలో జానపద వస్తుప్రదర్శనశాల ఒకటి ఉంది. గ్రామీణ జీవితానికి సంబంధించిన వస్తు సామగ్రి, సంగీత వాద్యాలు, దుస్తులు ఇలా రకరకాల వస్తువులను ఆ ప్రదర్శనశాలలో సేకరించి ఉంచారు. ఆ ప్రదర్శన శాలలో బొంత ఒకటి ఉంది. ఆ బొంతలో రంగు రంగుల దుస్తుల ముక్కలు కలిపి కుట్టారు. ముత్తవ్వగారి చీరలోని ముక్క ఒకటి,. నాయనమ్మ చీరలోని ముక్క ఒకటి. తాతగారి పంచలోని ముక్క ఒకటి, మనవడి చొక్కా ముక్క ఒకటి, మనవరాలి పట్టు పావడలోని ముక్క ఒకటి, ఇట్లా వేర్వేరు తరాలకు చెందిన వ్యక్తులనూ కుటుంబ జీవన సారస్వాన్నీ, మమతానురాగాలను గుర్తుచేసే ఆ బొంతకు విలువ ఇంత అని ఎవరు చెప్పగలరు?

'గంతకు తగిన బొంత' అని తీసిపారెయ్యవచ్చు. గంత అంటే కొన్ని నిఘంటువుల్లో స్పష్టమైన అర్థం కనిపించదు. కళ్లకు గంతలు కట్టుకోవడం అని విడిగా ప్రయోగం కనిపిస్తుంది. గంత అంటే చిరిగిపోయిన వస్త్రం అని అర్థం. తమిళభాషలో కంద్తై అని ఒక మాట ఉంది. కంద్తై అన్నా చిరిగిపోయిన వస్త్రమే. చిరిగిపోయిన బట్టలను పారేసి స్టీలు గిన్నెలు సేకరించడం కొందరికి ఇష్టం. కొందరు తమ పిల్లలు నెలల పిల్లలుగా ఉన్నప్పటినుంచి పెద్దయ్యేదాకా వాడిన దుస్తులూ, పుస్తకాలూ, వస్తువులూ అన్నీ జాగ్రత్తగా దాస్తూ ఉంటారు. ఇదీ ఒక రకమైన సేకరణే.

ఎవరి సేకరణ వారికి ఆనందం. మహాభారతంలో ఉత్తర – కౌరవుల మీదికి దండెత్తడానికి వెడుతున్న ఉత్తర కుమారుణ్ణి కౌరవ వీరుల తలపాగా కుచ్చులు తెచ్చిమ్మని కోరుతుంది. తాను సేకరించిన బొమ్మలకు కట్టడానికి అవి కావలసి వచ్చాయట ఆమెకు.

కొంత వికారమైన సేకరణలు చేసేవాళ్లూ చరిత్రలో లేకపోలేదు. తన దోపిడికి గురి అయినవాళ్ల వేళ్లను సేకరించి మాలగా వేసుకున్న అంగులీమాలుడు బుద్ధదేవుని దయవల్ల మారిన కథ ప్రసిద్ధమే.

పాశ్చాత్య దేశాలలో వింత వింత వస్తువులు సేకరించే వారున్నారు. ఒక పెద్ద మనిషికి పాయిఖానా తొట్టెలు సేకరించడం సరదా అట.

వస్తువుల సేకరణ అంతసులభమైన పనేం కాదు. దూరప్రయాణాలు చేయ వలసిరావచ్చు. శ్రమ పడవలసి రావచ్చు. డబ్బు ఖర్చుకావచ్చు. కొన్నిసార్లు కొన్ని వస్తువులకోసం ఆ వస్తువులు ఉన్న వ్యక్తులను బతిమాలవలసి రావచ్చు. బుజ్జగించ వలసి రావచ్చు.

తమకోసం వస్తువులు సేకరించడం ఒక ఎత్తు. స్వార్థం లేకుండా సాంస్కృతిక దృష్టితోనో చారిత్రక దృష్టితోనో వస్తుసామగ్రి సేకరించడం మరొక ఎత్తు. మారు మూల ప్రాంతాల నుంచి చారిత్రక ఆధారాలను తిరుపతికి తరలిస్తూ ఆ ప్రయత్నంలో జబ్బుపడిన మహాపండితులు వేటూరి ప్రభాకర శాస్త్రిగారి నిస్వార్థ సేవతో పోల్చగల సేవచేసిన వారు ఏ కొందరో. మారుమూల ప్రాంతాల నుంచి తెలుగు గ్రంథాలు సేకరించి తెలుగు సాహిత్య దీపం ఆరిపోకుండా కాపాడిన బ్రౌను దొరను ఎలా మరచిపోగలం? తనముందు మెకంజీ వంటివారు భారతదేశపు కాగితాలపై ఇంగ్లాండులో తయారైన సిరాతో పుస్తకాల ప్రతులు తయారు చేయించారనీ - అవి పదికాలాలపాటు ఉండాలనే ఉద్దేశంతో ఇంగ్లండులో తయారయిన కాగితాలపై ఇండియన్ ఇంకుతో ప్రతులు రాయించి భద్రపరిపించామని బ్రౌన్ పేర్కొన్నారు. సాలార్‌జంగ్ వంటి వ్యక్తుల కృషి - నేటికీ కనువిందు చేస్తూనే ఉంది కదా!

ఎవరి సేకరణ వారికి ఆనందం - అని ముందే అనుకొన్నాం.

ముక్తాయింపు:

ఫ్రాన్స్ దేశంలో ఒక ఊళ్లో ఒక ఇంట్లో ఒక ముసలమ్మ ఉండేదట. లంకంత కొంపలో ఒక్క మనిషీ ఎలా ఉంటుందో అని ఇరుగూ పొరుగూ అనుకుంటూ ఉండే వాళ్లట. ఆ యింటినుంచి భరించడానికి వీలుగాని దుర్గంధం వస్తూ ఉంటే - ఇరుగూ పొరుగూ ముసలమ్మకు ఏమయిందో చూద్దామని వెళ్లారట. వెడితే వాళ్లకు ఒక గొప్ప విషయం తెలిసిందట- ముసలమ్మ కొన్నేళ్లనుంచీ ఇంట్లో పోగయిన చెత్తను అలాగే భద్రంగా సేకరించి ఉంచిందని.



45. అలవాటులో పొరబాటు

ఎందుకు చేస్తున్నామో తెలియకుండా యాంత్రికంగా పనిచేయడం చాలామంది అలవాటు. గానుగెద్దు గానుగ చట్రంలో తిరుగుతూ ఉన్నా అందువల్ల ఉపయోగం ఉంటుంది. ఒకసారి అలవాటయిన పని మానడమంటే కష్టం. 'సిగరెట్టు అలవాటు మానేయడం చాలా సులభం. నేను ఇదివరలో చాలాసార్లు మానేశాను' అని మహాకవి శ్రీశ్రీ ఒకసారి చమత్కరించారు.

అనగనగా ఒక ప్రభుత్వం వారి భవనం. ఆ భవనంలో ఉండే అధికారి హోదాను బట్టి ఆ భవనంలో బోలెడంత మందీ మార్బలమూ. ఆ భవనంలోని మందీ మార్బలంలో చాలామంది రక్షణోద్యోగులు కాపలా పనిచేస్తూ ఉంటారు. భవనంలోని కాపలా పనులలో ఒక పని తోటమెట్ల కాపలా పని. ఎన్నో ఏళ్ల నుంచి ఈ తోటమెట్ల కాపలా పని సాగుతూ ఉండగా కొత్తగా ఆ భవనంలోకి ఉద్యోగ రీత్యా వచ్చిన ఒక చిన్న అధికారికి ఈ తోటమెట్ల కాపలా పని ఏమిటో అర్థం కాలేదు. అక్కడ కాపలా కాయకపోతే భద్రతకు వచ్చిన లోటు ఏమీ లేదు. అయినా అక్కడ కాపలా కాస్తూనే ఉన్నారు. ఎందుకు ఈ కాపలా పని అని అడిగితే ఎవరూ సమాధానం చెప్పలేకపోయారు. రక్షణోద్యోగులలో అందరికన్నా పెద్దవాడయిన పెద్ద మనిషిని అడగగా తాను చేరి 20 ఏళ్లయిందనీ అంతకు ముందునుంచీ ఆ కాపలాపని అలవాటులో ఉందని చెప్పాడు. అధికారి ఈ అలవాటు పని ఏమిటో పాతకాగితాలు, దస్తావేజులు తిరగవేయగా వేయగా ఆయనకు అసలు సంగతి తెలిసింది. 25 ఏళ్ల క్రితం ఎప్పుడో ఆ తోటమెట్లకు రంగులు పూశారు. అటువైపు వచ్చేవారు ఆ పూసిన రంగులను తాకి చేతులకూ దుస్తులకూ రంగు అంటించుకోకుండా హెచ్చరించడానికి ఏర్పడిన తోటమెట్ల కాపలా పని అలా అలవాటుగా కొనసాగుతూ వస్తున్నదని తెలిసి అధికారి నెత్తి నోరూ కొట్టుకున్నాడట...

ఎందుకు చేస్తున్నామో తెలియకుండా యాంత్రికంగా పనిచేయడం చాలామంది అలవాటు. గానుగెద్దు గానుగ చట్రంలో తిరుగుతూ ఉన్నా – అందువల్ల ఉపయోగం ఉంటుంది.

ముందు వెడుతున్న మేక ఏదిచేస్తే వెనుకగా వస్తున్న మేకలు దాన్ని అనుసరించ దాన్ని మేకదాటు అలవాటు అంటారు. చాలా ఏళ్ల క్రితం ఒక నగరంలో ఒక పరిశీలన చేశారు. జనసమ్మర్దం ఎక్కువగా ఉన్న ఒక బజారులో ఒకాయనను తల పైకెత్తి ఆకాశంవైపు చూస్తూ కాసేపు నిలబడమని చెప్పారు. ఆ మనిషిని చూసి చాలామంది అలా తల ఎత్తి ఆకాశంవైపుచూస్తూ నిలబడ్డారనీ ఎవరికి తోచిన కల్పనలు వాళ్లు చేసుకున్నారనీ పరిశీలనవల్ల తేలింది. అదే నగరంలో మరొక బజారులో ఒక మనిషి మూర్ఛ అభినయించి కింద పడిపోతే – అటుపక్క వెడుతున్న వాళ్లెవరూ పట్టించుకోలేదట.

ఒక పెద్దమనిషికి బస్సులో ప్రయాణం చేసి దిగిపోగానే టికెట్టును నలిపి రహదారిమీద పడవేయడం అలవాటు. ఆ పెద్ద మనిషి – తెలియక – పాపం పరిశుభ్రతను పాటించే ఒక విదేశానికి వెళ్లాడు. వెళ్లి బస్సు ఎక్కాడు. దిగి టిక్కెట్టును నలిపి కింద పారేశాడు. వెంటనే ఒక రక్షక భటుడు దారిమీద అపరిశుభ్రత పాటించినందుకు పెద్దమనిషి దగ్గర జరిమానా వసూలు చేశాడు. చేసి పెద్దమనిషికి రసీదు ఇచ్చాడు. పెద్ద మనిషి అలవాటుగా ఆ రసీదును నలిపి పడేశాడు. ఆ తర్వాత ఏమయింది? రక్షక భటుడు ఏం చేశాడు? మిగతా వెండి – తెరపై చూడవలసిందే.

ఒకసారి అలవాటయిన పని మానడమంటే కష్టం. 'సిగరెట్టు అలవాటు మానేయడం చాలా సులభం. నేను ఇదివరలో చాలాసార్లు మానేశాను' అని మహాకవి శ్రీశ్రీ ఒకసారి చమత్కరించారు.

జీన్ హెన్రీ ఫేబర్ ఫ్రాన్స్ దేశానికి చెందిన జీవశాస్త్రవేత్త. ఆయన చేసిన ఒక ప్రయోగం గురించి ఇటీవల ఒక ప్రముఖ పత్రిక ఒక వార్తను ప్రచురించింది.

ఫేబర్ – గొంగళి పురుగుల గుంపు ఒక దాన్ని గమనించాడు. ఆ గొంగళి పురుగులకు ఊరేగింపుగా వెళ్లడం అలవాటు. ఎలా? ప్రతి గొంగళి పురుగూ అర మోడ్చిన కన్నులతో ముందు వెడుతున్న గొంగళి పురుగును అంటుకొని ముందుకు సాగుతూ ఉంటుంది. ఫేబర్ గొంగళి పురుగుల గుంపును ఒక పెద్ద పూలకుండీ అంచుమీదికి చేర్చాడు. ఒక పురుగును మరొకటి అనుసరించి వెళ్లేలా వాటిని ఒక వలయంగా ఏర్పాటు చేశాడు. అంతే. గొంగళి పురుగులు ఒకదాన్ని వెంబడించి మరొకటి ఆ అంచు చుట్టూ తిరుగుతూ ఊరేగింపు కొనసాగించాయి. కాసేపటికి విసుగుపుట్టి ఈ తిరుగుడు మానేస్తాయని ఎదురుచూసిన ఫేబర్‌కు ఆశ్చర్యం కలిగిందట. ఏడురాత్రులూ ఏడు పగళ్లూ అవి అలవాటు ప్రకారం అలా తిరుగుతూనే ఉన్నాయట. ఆ పక్కనే వాటికి కనిపించేలా ఆహారాన్ని అందుబాటులో ఉంచినా అలిసిపోయేదాక అవి తిరుగుతూనే ఉన్నాయట. శ్రమ ఒకటే సాధన కాదు అని అవి నిరూపించినట్టు కనిపిస్తుంది.

అలవాట్ల వల్ల లాభాలూ, నష్టాలూ కూడా ఉంటాయి కదా మరి! తెలుగు చలనచిత్రాలలో ఒక అలవాటు కనిపిస్తూ ఉండేది. అది ఆ చిత్రంలోని కుటుంబం వారికి కుటుంబ గీతం పాడుకునే అలవాటు. ఆ అలవాటువల్ల కథ అవసరం కొద్దీ చెట్టుకొకరూ పుట్టకొకరూ అయిన కుటుంబ సభ్యులంతా కుటుంబగీతం సాయంతో పతాక సన్నివేశం వచ్చేసరికి కలిసిపోయే సదుపాయం ఉంటుంది.

ముక్తాయింపు:

అనగనగా ఒక కార్యాలయం. ఆ కార్యాలయంలో ఒక పెద్ద అధికారి. వారి మాటంటే ఆ కార్యాలయోద్యోగులందరికీ హడలు. ఒకరోజు అధికారి పదుగురు ఉద్యోగులతో కార్యాలయ కార్యక్రమాల గురించి చర్చిస్తూ ఒక ఉద్యోగిమీద కొంచెం కోపంగా నోరుచేసుకున్నారు. ఆ ఉద్యోగి కళ్లు తేలవేసి గుండె పట్టుకుని సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే ఆ ఉద్యోగిని వైద్యశాలకు తరలించారు. అధికారికి ఆందోళన కలిగింది. ఆ ఉన్నతాధికారి తన తర్వాతి అధికారిని పిలిచి – 'నా మూలంగానే ఆ మనిషి అలా పడిపోయాడంటారా' అని అడిగారు. అందుకు ఆ అధికారి 'అవును' అన్నాడు. దాంతో ఉన్నతాధికారికి ఇతోధికంగా కోపంవచ్చి 'అవునూ అంటారు ఏమిటండీ' అని అడిగారట. అందుకు ఆ సహాయాధికారి 'అవునండీ. తమరు ఇక్కడికి వచ్చినప్పటి నుంచి తమరు ఏం చెప్పినా అవును అనడం నాకు అలవాటయి పోయిందండీ' అన్నాడట అలవాటుగా.



46. మనసుపెట్టి పనిచేస్తేనే ఫలితం

అన్యమనస్కంగా పనిచేసినప్పుడు పని సరిగా ఉండదు. యాంత్రికంగా చేసినా అంతే. అయితే జీతం కోసం ఉద్యోగం చేసినా ఆ పని హాయిగా చేయవచ్చు. చేస్తున్న పనిపట్ల శ్రద్ధ అన్నది ఉద్యోగం స్థాయిని బట్టీ తీసుకుంటున్న జీతాన్ని బట్టీ ఉండదు. కొన్ని కార్యాలయాలలోని తోటపని వారు ప్రతి కొమ్మతో రెమ్మతో మాట్లాడుతూ కార్యాలయానికి రంగులు, వాసనలూ అద్దుతూ ఉంటారు.

ఏ మంచి పనయినా మనసు పెట్టి చేస్తే రాణిస్తుంది అని పెద్దలు చెబుతూ ఉంటారు. మనసుపెట్టి పని చెయ్యడానికి మనస్కరించాలి. మనసుండాలి. మనసు కావాలి.

మనసుపెట్టి పనిచేయడం అంటే చేస్తున్న పనిని ఆనందంగా హాయిగా చేయడం అన్నమాట. చాలామందికి పని అంటేనే వెగటు. మరి అటువంటప్పుడు ఆనందంగా పనిచేయడం ఎలా సాధ్యం?

'అరుచితో పనిచేయడం అసాధ్యం' అని ప్రసిద్ధ పరిశోధకులు కీర్తిశేషులు బంగి గోపాలరెడ్డి (బంగోరె) పదే పదే అంటూ ఉండేవారు. బంగోరె పత్రికా రచయితగా జీవితం ప్రారంభించి పరిశోధకులుగా నిగ్గుతేలారు. మనసుపెట్టి పరిశోధనలు సాగించారు. 'కొండను తవ్వి ఎలుకను పట్టేది కాదు నా తీరు. ఎలుకను దువ్వి కొండను కొల్లగొట్టాలనుకోవడం నాకిష్టం' అనేవాడు ఆయన. బ్రౌన్ తెలుగు భాషకు చేసిన సేవగురించి ఎన్నెన్నో విశేషాలు బంగోరె తెలియచెప్పారు.

మనసుపెట్టి పనిచేయాలి అన్నది ఉద్యోగాలకు వర్తించదని కొందరు అంటూ ఉంటారు. చేస్తున్న పని అభిరుచికి తగ్గది అయితే ఫరవాలేదు. అభిరుచికి తగ్గది కాకపోతే ఏం చేయాలి? ఇష్టం లేకుండా పనిచేయడం ఎలాగా! చేస్తున్న ఉద్యోగం పట్ల ఆసక్తి పెంచుకోవడం ఎలా అని కొందరు అడిగితే ఉద్యోగాన్ని నిమిత్త మాత్రంగా చేయడం ఒప్పు కదా? అని మరికొందరు అంటారు. నెల నెలా జీతం తీసుకుంటున్నప్పుడు జీతానికి తగినంత పనిచేస్తే చాలుకదా అని కొందరు వాదిస్తూ ఉంటారు.

అన్యమనస్కంగా పనిచేసినప్పుడు పని సరిగా ఉండదు. యాంత్రికంగా చేసినా అంతే. అయితే జీతం కోసం ఉద్యోగం చేసినా ఆ పని హాయిగా చేయవచ్చునని నిరూపించిన వారు ఎందరో.

ఆచంట జానకిరాంగారు 1937 నుంచి ఆకాశవాణితో ప్రత్యక్ష పరోక్ష సంబంధాలు కలిగి ఉన్నా 1938లో అప్పటి మద్రాసు కేంద్రంలో కార్యక్రమ నిర్వాహకులుగా చేరారు. తొలి రోజులలో తెలుగు కార్యక్రమాలతోబాటు ఆంగ్ల కార్యక్రమాల రూపకల్పనా చేశారు. తొలి తెలుగు రేడియో కార్యక్రమాల స్రష్టగా ఎంతో పేరు గడించారు. కొన్నాళ్లు వాణి పత్రికకు సంపాదకత్వం వహించారు. తరువాతి రోజుల్లో వాణి ముఖచిత్రాల కోసం తమ ఖర్చుమీద ప్రయాణాలు చేసి ప్రసిద్ధ చిత్రకారుల వద్దనుంచి చిత్రాలు తెచ్చేవారు.'నా చదువు నా శక్తి సామర్థ్యాలూ నా ఊహలూ నా ఆలోచనలూ నా సర్వమూ రేడియోకు అర్పించి ఉన్న నాకు రేడియోతో ఒక అవినాభావ సంబంధము ఏర్పడి ఉన్నది. నేనే రేడియో. రేడియోనే నేను' అని ఆయన రాసుకున్న మాటలు అక్షర సత్యాలు.

తమ తండ్రిగారు భిషగ్వరులు ఆచంట లక్ష్మీపతిగారు మద్రాసు కేంద్రం నుంచి ఒక ఆంగ్ల ప్రసంగాన్ని ప్రసారం చేయడానికి రాగా ఒక సంస్కృత సూక్తిని ఆంగ్లంలోకి అనువదిస్తూ వాడిన మాటలలో ఒకటి సందర్భోచితంగా లేదని సున్నితంగా చెప్పి మార్పించారు జానకీరాం.

1939లో జానకిరాం గారికి తిరుచ్చిరాపల్లి కేంద్రానికి బదిలీ అయింది. తమిళ భాష వచ్చినా వ్రాయడం తెలియని స్థితిలో తిరుచ్చికి వెళ్లిన జానకిరాం తమిళంలో నాటికలు వ్రాశారు. ప్రసంగాలు వ్రాశారు. ఒక నాటకంలో అభిమన్యుడి వేషం కూడా వేశారు. తమిళ సాహిత్య రచనలెన్నిటికో నాటక రూపాలు కల్పించారు. ఆ రోజులలోనే విశ్వనాథవారి 'ఏకవీర' నవలను తమిళంలో రేడియో నాటికగా వినిపించారు. జానకిరాంగారు తిరుచ్చిలో ఉద్యోగం చేసిన తీరు ఎందరినో ఆకర్షించింది. ఆయనకు మళ్లీ మద్రాసుకు బదిలీ అయినప్పుడు రేడియో కేంద్రంలో పనిచేస్తున్న వారందరూ రైల్వేస్టేషను దాకా వచ్చి సాగనంపడం ఒక ఎత్తయితే ఇద్దరు ఉద్యోగులు జానకిరామ్‌గారు ప్రయాణం చేసే రైలుపెట్టెను రకరకాల పువ్వులతో పువ్వుల దండలతో నందనవనంగా అలంకరించడం మరొక ఎత్తు!

జానకిరామ్ వ్రాసిన 'సాగుతున్న యాత్ర' అనే ఆత్మకథలో ఇటువంటి సంఘటనలు ఎన్నో కనిపిస్తాయి.

చేస్తున్న పనిపట్ల శ్రద్ధ అన్నది ఉద్యోగం స్థాయినిబట్టీ తీసుకుంటున్న జీతాన్ని బట్టీ ఉండదు. కొన్ని కార్యాలయాలలో తోట పనివారు ప్రతి కొమ్మతో రెమ్మతో

మాట్లాడుతూ కార్యాలయానికి రంగులు వాసనలూ అద్దుతూ ఉంటారు. కొందరు వాహన చోదకులకు తాము నడిపే బండ్లు మిలమిలా మెరుస్తూ ఉంటే తప్ప తోచదు. మన దేశ ప్రముఖులెవరో ఫ్రాన్స్‌లోని ఒక హోటలులో బసచేయడానికి వెళ్లినపుడు ఒక పెద్దమనిషి ఎదురువచ్చి ప్రముఖుడి చేతిపెట్టె అందుకుని గదిదాకా తెచ్చాడట. తమరు ఇక్కడ ఏం చేస్తుంటారని అడిగితే – తాను ఆ హోటలు మేనేజరునని చెప్పాడట ఆయన. మద్రాసు విశ్వవిద్యాలయంలో ఒక ఉద్యోగి – విద్యార్థులకు రకరకాల చదువుల గురించీ స్కాలర్‌షిప్ అవకాశాల గురించీ వివరాలు చెబుతూ ఎప్పుడూ హాయిగా పనిచేస్తూ కనిపించేవారు. ఆయనకు ఉద్యోగ విరమణ వయసు వచ్చినా – విద్యార్థులూ అధికారులూ ఆయనను ఉద్యోగ విరమణ చేయనివ్వలేదు! అందరికీ అభిరుచికి తగ్గ ఉద్యోగాలూ పనులూ దొరకవుకనుక చేస్తున్న పనిని శ్రద్ధగా చేయడానికి ప్రయత్నించడం మంచిది అని ఉద్యోగ శాస్త్రవేత్తలు అంటారు. అలా చేస్తూ ఉంటే కొన్నాళ్లకు అభిరుచి ఏర్పడి పని మరింత బాగాచేయడానికి వీలుంటుంది. అట్లా ఆత్మ సంతృప్తి ఏర్పడుతుంది.

ముక్తాయింపు:

అనగనగా ఒక కార్యాలయానికి ఆగంతకుడు ఒకాయన వచ్చాడు. వచ్చి ఆ కార్యాలయంలో ఒక బల్ల వెనుక ఏదో పోగొట్టుకున్న వాడిలాగా కనిపిస్తున్న ఉద్యోగి దగ్గరికి వెళ్లి 'అయ్యా! తమరిక్కడ ఏం చేస్తుంటారండీ' అని అడిగాడట. 'అదే నాకూ తెలియడం లేదండీ' అని చెప్పాడట ఉద్యోగి.



47. ఊరుకుంటే ఊరా? పేరా?

> **ఊరుకోవడం చాలాకష్టమైన పని. పని అలవాటయిన వాళ్లను ఊరు కోమనడం కన్నా పెద్దశిక్ష ఇంకొకటి లేదు. కొన్ని సంస్థలలో చాలా ఏళ్ల నుంచి పనిచేస్తున్న అధికారులను ఉద్యోగంలోనించి తీసెయ్యాలని సంకల్పించినప్పుడు - వాళ్లకు ఏ పనీ చెప్పకుండా ఊరికే ఉంచుతారట.**

'సుమ్మా ఇరుప్పదే సుగం' అని తమిళభాషలో ఒక ప్రాచీనోక్తి ఉంది. అంటే ఊరుకోవడం సుఖం అని అర్థం.

ఊరుకోవడం మానసిక స్థితి కావచ్చు. శారీరక స్థితి కావచ్చు. మానవ కార్యకలాపాలకు సంబంధించి త్రికరణాల గురించి చెబుతుంటారు. మనసు, వాక్కు కర్మ అన్నవి ఆ మూడూ. ఇందులో ఏ పని చెయ్యకుండా ఊరుకోవడం కొందరి కయినా అలవాటులో ఉండేదే. కొందరు శరీరం పనిచేస్తున్నా - అంటే నడుస్తూకానీ ఏ కుట్టుపనో చేస్తూ కానీ ఉన్నా - మాట్లాడకుండా ఉండగలరు. అయితే వాక్కూ కర్మా లేని ఊరకుండే స్థితిలో కూడా మనసును ఊరికే ఉంచడం అందరికీ సాధ్యపడే పనికాదు. అందుకే పెద్దలు మనసును కోతితో పోల్చారు. మనసు నిలకడగా ఉంచు కోగలగడం అందరికీ సాధ్యపడే పనికాదు.

ఊరుకోవడం చాలా కష్టమైన పని. పని అలవాటయిన వాళ్లకు ఊరుకోవడం కన్నా పెద్దశిక్ష ఇంకొకటి లేదు. కొన్ని సంస్థలలో చాలా ఏళ్ల నుంచి పనిచేస్తున్న అధికారులను ఉద్యోగంలోనుంచి తీసెయ్యాలని సంకల్పించినప్పుడు - వాళ్లకు ఏ పనీ చెప్పకుండా ఊరికే ఉంచుతారట. ఎన్నాళ్లు ఇట్లా ఊరికే ఉండడం, ఇంతకన్నా ఉద్యోగం మానేసి ఇంట్లో ఊరికే ఉండడం మంచిది కదా అనుకొని ఆ అధికారులు ఉద్యోగం మానేయవచ్చు. ఊరికే కూచున్నా జీతం వస్తున్నది కదా అని వాళ్లు ఊరుకుంటే యాజమాన్యంవారు చూస్తూ ఊరికే ఉండలేరు కదా!

'ఊరుకుంటే ఊరా పేరా' అని కొందరు ఏదో చెయ్యాలని అనుకుంటూ ఉంటారు. తీరా మొదలుపెట్టాక మొదలు పెట్టకుండా ఊరుకుని ఉంటే బాగుండేదనీ అనిపించవచ్చు.

పనిచేయకుండా ఊరుకోవడానికీ శక్తి అవసరం. విశ్రాంతిగా ఉన్న మనిషిలో సాగే జీవక్రియకు ఆ మనిషి బరువును బట్టి ఆ బరువులో ప్రతి గ్రాముకూ గంటకు 0.3 మిల్లీమీటర్ల ప్రాణవాయువు అవసరమని శాస్త్రవేత్తల అంచనా. కొద్దిగా వ్యాయామం చేసినా, నడిచినా రెట్టింపు ప్రాణవాయువు అవసరం. అదే పరుగుతీసినపుడు పదింతల శక్తి అవసరం.

పెంగ్విన్ పక్షులతో శాస్త్రవేత్తలు కొన్ని పరిశీలనలు జరిపారు. గుడ్ల నుంచి బయటపడ్డ పిల్ల పక్షులు - తమ మీద దాడిచేసే జంతువులను ఎదుర్కోవడానికి వీలుగా- వీలయినంత త్వరగా ఏపుగా పెరుగుతాయట. అందుకు త్వరత్వరగా ఆహారం తింటాయట. ఆ తిన్న ఆహారం త్వరగా జీర్ణమయి వాటి శరీరం బరువు పెంచుతుందట. ఆ పక్షులు కదిలితే శక్తి ఖర్చవుతుంది కనుక అవి వీలయినంతవరకు కదలకుండా ఉంటాయట. అలా ఊరుకోవడంవల్ల అవి బలంగా పెద్దగా ఎదుగుతాయట.

మరికొందరు శాస్త్రవేత్తలు కొండ చిలువలను పరిశీలించారు. బర్మాకు చెందిన ఒక రకం కొండ చిలువలు వారాల తరబడి కదలకుండా పడి ఉంటాయట. అవి వాటి శరీరాల బరువుతో సమానమైన ఆహారాన్ని తినగలవట. అవి ఎంత ఎక్కువ తింటే వాటి జీవక్రియ అంత త్వరగా జరుగుతుందట. ఆ తిన్న ఆహారం జీర్ణమవుతున్న దశలో అవి 44 రెట్ల శక్తిని ఖర్చు పెడుతున్నట్టు తెలిసింది. అయితే కొండ చిలువలు - పక్షులలాగా తక్కిన స్తన్య జంతువులలాగా ఉష్ణరక్తం కలవి కావు. అందువల్ల వాటికి శరీరం వేడిమిని ఒకే తీరులో ఉంచుకోవాల్సిన అవసరం లేదు. వాటికి కడుపునిండా ఆహారం దొరికినపుడు - ఆ ఆహారం జీర్ణం చేసుకోవడానికి చాలారోజులు తీసుకుంటాయి. అలాగే కొన్ని నెలలబాటు ఆహారం తినకుండానూ ఉండగలవు. అటువంటప్పుడు అవి కడుపు ముడుచుకుని పడి ఉంటాయి. ఇలా కడుపు ముడుచుకోవడంవల్ల శక్తి వృథా కాదు. కొండ చిలువలు పరుగులు తీసి ఆహారం కోసం వేటాడి శక్తి వృథా చేసుకోవు. కదలకుండా ఊరికే ఒకచోట పడి ఉండడమే వాటికి లాభదాయకమైన పని. ఈ కొండచిలువ వంటిదే చూపులేని టెక్సస్ సాలమండర్ అనే జాతి బల్లి కూడా. చీకటి గుహల్లో ఉండే ఈ బల్లి జాతికి చూసే శక్తి లేదు. ఇవీ కదలకుండా ఊరుకుంటాయి. చూపు ఎందుకులేదంటే - కంటి పాపలు మొదలయినవి కదలడానికి శక్తి కావాలి కదా. చూడకపోవడంల్ల ఆ శక్తి ఆదా అవుతుందన్నమాట.

ముక్తాయింపు:

'పొద్దున ఆఫీసుకు వచ్చినప్పటి నుంచి ఊరికే కూచోవడానికి ఎట్లా తోస్తుందయ్యా మీకు' అని పెద్ద ఉద్యోగి గారు చిన్న ఉద్యోగిగారిని అడిగారు. 'ఊరికే ఎక్కడ కూచున్నానండీ - అటెండెన్సులో సంతకం పెట్టానుగా' అన్నాడు చిన్న ఉద్యోగిగారు.



48. అతిగా పనిచేస్తే అనర్థమే

పరిమితులు తెలియకుండా వృత్తిలోనో, ఉద్యోగంలోనో లీనమయితే మొదట్లో మానసిక ఉల్లాసం, సంతృప్తి, ఆనందం సాధించామన్న గర్వం కలిగినా కాలక్రమాన విసుగు, అలసట, నిస్సత్తువ ఆవరిస్తాయి. ఎక్కువసేపు పనిచేయడం, శ్రమపడి పనిచేయడం వేరు. బాగా పనిచేయడం వేరు. అతిగా పనిచేయడంవల్ల వ్యక్తిగతంగానే గాక కుటుంబ స్థాయిలో, చేస్తున్న పనిలో ఆర్థిక స్థితిలో ఒడిదుడుకులు వస్తాయి.

పనిచేయాలి. పాటుపడాలి. పాటుపడితే సాపాటుకు కొదవ ఉండదు. పని దొంగలు ఉన్నట్టుగా పని దొరలు కూడా ఉంటారు. అంటే పనిచేయడం తప్ప జీవితంలో మరేదీ పనికిరాదన్న ఆలోచనతో పనిలో గడిపే వారన్నమాట. నగరాలలో జీవించేవారికి ఉదయం లేచినప్పటినుంచి రాత్రి పడుకునేదాకా ఎడతెరపి లేని పనులు. జీవితమంతా పరుగులే. ఒక సూర్యోదయాన్నో, సూర్యాస్తమయాన్నో, చెట్ల పచ్చదనాన్నో, పూల సొగసునో, కోయిల పాటలనో 'మంచి కవితనో' నాటకాన్నో ఆస్వాదించడానికి తీరుబాటు ఉండదు. మనదేశంలోనూ చాలామందిని ఏదయినా అడిగితే, 'ఎక్కడండీ పనితో బొత్తిగా తీరడం లేదు' అంటూ ఉంటారు.

'తాను చావాలి స్వర్గం చూడాలి' అంటుంది కన్నడ భాషలోని ఒక సామెత. అంటే తాను శ్రమిస్తే ఆ శ్రమ వల్ల స్వర్గం – అంటే సుఖం పొందవచ్చునని దాని భావం. అయితే కొందరు విశ్రాంతి తీసుకోకుండా పనిచేయాలని చెబుతుంటారు. అమెరికా, జపాన్ వంటి దేశాలలో కాలాన్ని కొన్ని సందర్భాలలో నిమిషాలలోకాక క్షణాలలో కొలిచి క్షణాలు వ్యర్థమవుతున్నాయని బాధపడుతూ ఉంటారు.

ప్రఖ్యాత శాస్త్రవేత్త, ఆవిష్కర్త థామస్ ఆల్వా ఎడిసన్ ఏ మనిషి విజయానికయినా ఆ మనిషి సహజ శక్తి ఒక శాతమూ, ఆ మనిషి పడే శ్రమ 99 శాతమూ సాయ పడతాయని చెప్పారు. విజయ సాధనకు కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం చాలా అవసరం. అయతే విజయసాధన పేరిట కుటుంబ జీవితాన్ని, స్నేహ సంబంధాలనూ దూరం చేసుకుంటూ ఉంటారు కొందరు. కొందరి జీవితమంతా వారి ఉద్యోగాలకో, వృత్తులకో పరిమితమవుతుంటాయి. అమెరికా వంటి దేశాలలోకొందరు తాము వారానికి 70, 80 గంటలు పనిచేస్తుంటామని చెబుతుంటారు. ఫ్రాన్స్‌లో చాలా సంస్థలు ఆగస్టులో పనిచేయవు. స్వీడన్‌లో ఉద్యోగులు – ఏడాదికి కనీసం ఐదు వారాల భాటు విశ్రాంతి తీసుకుంటూ ఉండాలని చెబుతారు.

మనదేశంలో అతిగా పనిచెయ్యడం అందరి సమస్య కాదు. అయితే ఇలా అతిగా పనిచేసే వారి సంఖ్య నానాటికీ పెరుగుతున్నది. మారుతున్న కాల పరిస్థితులకు అనుగుణంగా కొత్త సామర్థ్యాలు పెంచుకోవలసిన అవసరం ఏర్పడింది. ఏళ్ల తరబడి ఒకే సంస్థలో ఉద్యోగం చేసి పింఛను పుచ్చుకునే అవకాశాలూ ముందు ముందు తగ్గిపోవచ్చు. కాబట్టి నడివయసు మళ్లిన తర్వాత కూడా కొత్త చదువుల కోసం కొత్త ఉపాధి కోసం ప్రయత్నించవలసి ఉంటుంది.

ఎక్కువ పనిచేయకపోతే కుదరదు అనుకునేవారు - పని తప్ప మరొకటి తెలియని వారు చాలా ఇబ్బందులకు గురవుతారు. చేస్తున్న వృత్తినో ఉద్యోగాన్నో వదిలిపెట్టవలసి వస్తే ఆ తర్వాత ఏం చేయాలో తెలియని శూన్యమైన మనఃస్థితి ఏర్పడుతుంది. తాగుడులాగా కొందరికి తాము చేస్తున్న పని వ్యసనంగా మారుతుంది.

పనితప్ప మరొకటి తెలియకుండా పనికోసమే జీవించే ఉద్యోగ వ్యసన పరులను దాదాపు పదిరకాలుగా విభజించవచ్చునని మానసిక శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. పరిమితులు తెలియకుండా వృత్తిలోనో ఉద్యోగంలోనో లీనమయితే మొదట్లో మానసిక ఉల్లాసం, సంతృప్తి, ఆనందం సాధించామన్న గర్వం కలిగినా కాలక్రమాన విసుగు, అలసట, నిస్సత్తువ ఆవరిస్తాయి. ఎక్కువసేపు పనిచేయడం వేరు. శ్రమపడి పని చేయడం వేరు. బాగా పనిచేయడం వేరు. అతిగా పనిచేయడంవల్ల వ్యక్తిగతంగానే గాక కుటుంబ స్థాయిలో, చేస్తున్న పనిలో, ఆర్థిక స్థితిలో ఒడిదుడుకులు వస్తాయి. శారీరక స్థితిలో, మానసిక స్థితిలో తక్కినవారితో ప్రవర్తించే తీరులో మార్పులు వస్తాయి. చిరాకూ పరాకూ వస్తాయి. తమ గొప్పతనాన్ని తక్కినవాళ్లు అర్థం చేసుకోవడంలేదనే నిస్పృహ ఏర్పడుతుంది. రోజుకు 12 నుంచి 16 గంటల బాటు కొన్ని ఏళ్లు విశ్రాంతి ఎరుగక అతిగా పనిచేయడంవల్ల - జపాన్ దేశంలో చాలామంది అర్ధాంతరంగా మరణిస్తున్నారని తెలుసుకున్నారు. 40-50 ఏళ్ల మధ్య వయసుల వారు, అంతకుముందు ఎటువంటి అనారోగ్యం లేనివారు అకస్మాత్తుగా మరణించడానికి 'కరోషి' అనే అతిశ్రమ వల్ల కలిగే నీరసం కారణమని గ్రహించారు. జపాన్‌లోని కార్మికుల మరణాలకు కేన్సర్ తర్వాత ప్రధాన కారణం 'కరోషి' అని తేలింది. ఇందుకు అతిశ్రమ ఒకటే కాక శ్రమపడక తప్పని నిస్సహాయస్థితి కూడా కారణమని తేలింది.

పనీ పాటా రెండూ సమమైన పాళ్లలో ఉంటే జీవితం బాగుంటుంది. అందుకనే పెద్దలు అతిని వర్జించమన్నారు.

ముక్తాయింపు:

అనగనగా ఒక పెద్దమనిషి దగ్గరికి ఒక చిన్న మనిషి వచ్చాడు. వచ్చి 'సంస్థలో ఎంతమంది పనిచేస్తుంటారు' అని అడిగాడు. పెద్దమనిషి కొంచెంసేపు ఆలోచించి 'మా సంస్థలో ఉద్యోగులు ఎందరో చెప్పగలను గానీ ఎంతమంది పనిచేస్తున్నదీ చెప్పడం కొంచెం కష్టం' అన్నాడు-జాగ్రత్తగా.



49. కలిసి పనిచేసేటప్పుడు...

బృందంలో కలిసి పనిచేయడానికి తక్కిన వ్యక్తులపట్ల గౌరవ మర్యాదలు ఉండాలి. సహకార ప్రవృత్తి ఉండాలి. తక్కిన వ్యక్తుల అభిప్రాయాలను గుర్తించి గౌరవించే ధోరణి ఉండాలి. తమ వ్యవస్థ ఏదయినా ఆ వ్యవస్థ పట్లా, దాని మంచి లక్ష్యాల పట్లా ఆసక్తీ, శ్రద్ధా ఉండాలి. వ్యక్తికి బహువచనం శక్తి అని ఆధునిక కవి అన్నమాట అప్పుడే సార్థకమవుతుంది.

'నీవు దంచు. నేను పక్కలు ఎగరవేస్తుంటాను' అని మనకు ఒక సామెత ఉంది. పని ఒకరు చేస్తుంటే పక్కనే ఉండి శ్రమ పడుతున్నట్టు అభినయించడానికీ వీలుంటే ఆ పని తమ పర్యవేక్షణలో జరుగుతున్నట్టుకానీ, తామే చేస్తున్నట్టుకానీ కనిపించేట్టు చేయడానికీ చాలామంది ప్రయత్నిస్తూ ఉంటారు. చిన్న తరగతుల సాంఘిక శాస్త్ర పాఠాలలో మానవులు సంఘజీవులు వంటి వాక్యాలు ఉంటాయి. కలిసి ఉంటే కలదు సుఖం, ఐకమత్యమే బలం–ఇట్లా సూక్తులు చిన్నప్పటినుంచీ చదువుతూనే ఉంటాము. తన కొడుకులకు ఐకమత్యం బోధించడంకోసం కట్టెపుల్లల కట్ట తెప్పించి, కట్టెలు విడిగా ఉంటే వాటిని విరవడం సులభమనీ అవి ఒకకట్టలో ఉంటే వాటిని విరవడం కష్టమనీ చెప్పిన పెద్దమనిషి కథా చాలామంది చదివినదే.

ఇల్లయినా ఏదయినా సాంఘిక కార్యక్రమమయినా ఏ కార్యాలయంలో పని అయినా – ఒంటరిగా చేసే పనులూ తక్కినవాళ్లతో బాటుగా తప్ప చేయలేని పనులూ ఉంటాయి. ఒక బృందంగా ఏర్పడి పనిచేయగల నేర్పూ ఓర్పూ అందరికీ ఉండవు. సంగీత వాద్యగోష్ఠి అయినా సైనిక విన్యాసమయినా కలసికట్టుగా కొన్ని నియమ నిబంధనలకు లోబడి ప్రవర్తించకపోతే రక్తికట్టవు. మందితో కలిసి ఉండడమూ, మందిని నడిపించడమూ, మందితో నడవగలగడమూ అందరికీ సాధ్యపడే విష యాలు కావు. కొందరు మంద బుద్ధిని ప్రదర్శిస్తూ ఉంటారు.

1890 ప్రాంతాలలో మాక్స్ రింగెల్‌మన్ అనే ఫ్రెంచి వ్యవసాయ సాంకేతిక నిపుణుడికి అనుమానం ఒకటి వచ్చింది. మనుషులు విడిగా పనిచేసినప్పుడు బాగా పనిచేస్తారా, ఒక బృందంలో సభ్యులుగా ఉన్నప్పుడు బాగా పనిచేస్తారా అన్నదే ఆ అనుమానం. ఆయన తన దగ్గర చదువుకుంటున్న వ్యవసాయ విద్యార్థులను

పిలిపించాడు. డైనమో మీటర్ ఒక దానికి తాడు కట్టి ఆ తాడును ఆ విద్యార్థుల చేత లాగించాడు. మొదట ఒక్కొక్క విద్యార్థినే తాడును లాగమన్నాడు. ఆ తర్వాత ఏడు గురు విద్యార్థులను కలిసి ఆ తాడును ఒక్కసారిగా లాగమన్నారు. ఒక్కొక్కరే లాగి నప్పుడు సగటున ప్రతి ఒకరూ 85 కిలోగ్రాముల బరువు లాగారట. ఏడుగురూ కలిసి లాగినప్పుడు మొత్తం 450 కిలోగ్రాముల బరువు లాగారట. ప్రతి ఒకరూ 85 కిలోగ్రాముల చొప్పున లాగితే 'ఏడుగురూ కలిసి 595 కిలోగ్రాములు లాగవలసి ఉండగా 450 కిలోగ్రాముల బరువే ఎలా లాగారు అంటే ఎవరికివారు తమ శక్తి సామర్థ్యాలలో నాలుగింట మూడువంతులే వాడుతున్నారని తెలిసింది. ఈ పరిశీలన ఆ తర్వాత మరెన్నో పరిశోధనలకూ, సిద్ధాంతాలకూ దారితీసింది. ఒక బృందంలో సభ్యులై పనిచేయవలసి వచ్చినప్పుడు కొందరు తమ శక్తినంతా కేంద్రీకరించి పనిచేయరనీ వారు కొంత 'సంచార ప్రవృత్తి'లో ఉంటారనీ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇటీవల మరొకరకం పరిశీలన చేశారు. బరువైన వస్తువు ఒక దానికి ఒక తాడు కట్టారు. ఆ తాడును లాగవలసి ఉంటుందని ఏడుగురికి చెప్పారు. ఆ తర్వాత ఆ ఏడుగురి కళ్లకూ గంతలు కట్టారు. తాడును పట్టుకున్న మొదటివ్యక్తి తప్ప తక్కినవారు తాడు లాగలేదనీ తాడు గట్టిగా లాగుతున్నట్టు కేకలుపెడుతూ 'సంచార ప్రవృత్తి'లో శ్రమపడకుండా ఊరుకున్నారనీ తెలిసింది. ఆసక్తిలేని చోట శక్తి వినియోగంలో తేడా ఉంటుందనీ తెలిసింది.

బృందాలుగా కలిసి పనిచేస్తున్నప్పుడు మనుషులు ఎట్లా ప్రవర్తిస్తారో తెలుసు కున్న అనుభవంతో చాలా సంస్థల్లో పనిచేస్తున్న వారిని బృందాలుగా విభజిస్తూ ఉంటారు. ఆలోచన చేయగలవారు, సమస్యను అర్థం చేసుకుని పరిష్కారాలు చెప్ప గలవారు, పరిష్కార మార్గాలను పాటించడంలోని సాధ్యాసాధ్యాలు చెప్పగలవారు, పరిష్కార మార్గాన్ని అందరితోబాటు అమలు చెయ్యగలవారు ఇలా ఎందరో కావాలి.

కొన్ని బృందాలలో విమర్శక పాత్ర కూడా ఒకటి ఉంటుందట. ఆ వ్యక్తి పని - విమర్శిస్తూ ఉండడమే. అంటే పనిచేయడానికి ముందే దాని బాగోగుల గురించి దానికి ఎదురుకాగల విమర్శల గురించీ ముందే చర్చించే పని అన్నమాట. అయితే ఈ విమర్శకుల ఉద్యోగం కూడా బృందంలో ఒకరే చేయకూడదనీ ఆ పని వంతుల వారీగా జరుగుతూ ఉండాలనీ తెలుసుకున్నారు. అభిప్రాయ భేదాలు ఉంటే అరమరి కలు లేకుండా చర్చించుకోవడంవల్ల సరయిన పరిష్కారమార్గం కనుక్కోవడం సులభం అని ఆ అనుభవాలు పాఠాలు చెప్పాయి. అయితే అభిప్రాయ భేదాలను వ్యక్తిగతంగా తీసుకోకూడదనే వివేకమూ ఉండాలనీ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తుంటారు. బృందంలో కలిసి పనిచేయడానికి తక్కిన వ్యక్తుల అభిప్రాయాలను గుర్తించి గౌరవించే ధోరణి ఉండాలి. తమ వ్యవస్థ - అది కుటుంబం కావచ్చు లేదా కార్యాలయం

కావచ్చు – ఏదయినా ఆ వ్యవస్థ పట్ల దాని మంచి లక్ష్యాలపట్ల ఆసక్తీ శ్రద్ధా ఉండాలి. వ్యక్తికి బహువచనం శక్తి అని ఆధునిక కవి అన్నమాట అప్పుడే సార్థకమవుతుంది. 'నేను పదిరోజులు సెలవుపెట్టాను. నేను ఎక్కడ ఆపిన పని అక్కడే ఉంది' అని ఏ సంస్థలో అయినా పనిచేసే వ్యక్తి చెప్పుకుంటే – ఆ వ్యక్తిలోనూ, ఆ సంస్థలోనూ ఎవ రయినా లోపాలు ఉన్నాయేమో అని పరిశీలించవలసి ఉంటుందేమో!

ముక్తాయింపు:

'ఇంత జడివానలో మీ అబ్బాయి ఎక్కడికి వెడుతున్నాడు?' అని ఇరుగింటి రైతు పొరుగింటి రైతును అడిగాడు. 'మా యింట్లో వాళ్ల వంతుల లెక్క ప్రకారం ఇవాళ పొలానికి నీళ్లుపెట్టే వంతు వాడిదే కదా, మరి వెళ్లకపోతే ఎలా' అని అన్నాడు పొరుగింటి రైతు.



50. పురుగు నేర్పిన పాఠం

మనిషి సాంఘిక జీవి అని చెప్పినా సంఘంలో ఒంటరితనంతో జీవించేవారి సంఖ్య ఎక్కువ. మరణం జీవిత సమస్యలకు పరిష్కార మార్గం కాదు. సమస్యలను ఎదుర్కోవడానికి శారీరక శక్తి కన్నా మానసిక శక్తి చాలా అవసరం. దాదాపు ప్రతి ఆత్మహత్య, సమయానికి తగిన సహాయం అందకపోవడంవల్ల జరిగినదే కావచ్చు. 'నా జీవితం నా ఇష్టం' అనుకోవడం అర్థంలేని వాదం.

'ఆట ముగిసిన తర్వాత పావులన్నీ పెట్టెలోకి వెళ్లిపోతాయి' అని జర్మన్ భాషలో సామెత ఒకటుంది. సామెత చదరంగం గురించినదిగా కనిపించినా – అది చెప్పేది జీవితమనే చదరంగం గురించే. ప్రతి పుట్టుకా మరణంతో అంతం అయ్యేదే. మనిషి బతికి బట్టకట్టడానికి ఎన్నెన్నో బాలారిష్టాలూ, రోగాలూ, రొష్టులూ ఎదుర్కోవాలి. పసితనంలో కొన్నిరకాల కష్టాలు. పెద్దగా పెరిగితే మరికొన్ని రకాల కష్టాలు. లేదని బాధపడే వాళ్లు కొందరయితే ఉందని బాధపడేవాళ్లు మరికొందరు. కొందరికి ప్రతిరోజూ పండుగే. మరి కొందరికి ప్రతిక్షణమూ సమస్యే.

మరణం – ప్రకృతి సిద్ధంగా వస్తే ఫరవాలేదు. కాని ఇటీవలి కాలంలో ఆత్మ హత్యలు పెరుగుతున్నాయని గమనిస్తే చాలా బాధ కలుగుతుంది. ప్రపంచమంతటా ఇదే స్థితి. మనదేశంలో పరిస్థితీ బాధాకరంగానే ఉంది.

జాతీయ స్థాయిలో నేరాల వివరాలను విశ్లేషించే సంస్థ 1998లో మన దేశంలో ప్రమాదాలవల్లా ఆత్మహత్యలవల్లా సంభవించిన మరణాల గురించి ఒక నివేదిక ప్రచురించింది. లక్షమంది జనాభాలో దాదాపు 11 మంది ఆత్మహత్యలు చేసుకున్న వారని ఆ లెక్కలు చెబుతున్నాయి. పుదుచ్చేరిలో దాదాపు 50 మంది, కేరళలో దాదాపు 29 మంది, కర్ణాటకలో దాదాపు 21 మంది ఆత్మహత్యల బారిన పడినవారే.

పుట్టుక గురించీ, మరణం గురించీ వివిధమతాలవారి విశ్వాసాలు వేర్వేరుగా ఉన్నాయి. కొన్ని మతాలవారు పునర్జన్మ గురించి నమ్ముతారు. కొన్ని మతాలవారి దృష్ట్యా పునర్జన్మ లేదు. పునర్జన్మ సంగతి ఎలా ఉన్నా ఇప్పటి జన్మను అంతం చేసు కోవాలనే ఆలోచన మనుషులకు ఎందుకు కలగాలి?

జీవించడానికి కారణాలు అక్కరలేదని కొందరంటే మరణించడానికి కారణాలు అక్కరలేదని మరికొందరు అంటారు.

ఆధునిక జీవితంలో అభద్రత ఎక్కువయింది. ప్రపంచంలోని పోటీలను తట్టుకోవడం కష్టంగా ఉంది. ఆత్మహత్యకు ప్రేరేపించే కారణాలు ఎన్నో. ప్రపంచంలో ఇమడలేక పోవడానికి రకరకాల కారణాలు. వయసు, లింగ భేదం, సామాజికస్థాయి, ఆర్థిక స్థాయి మొదలయిన వాటితో నిమిత్తం లేకుండా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని నిపుణులు చెబుతున్నారు.

తీవ్రమైన జబ్బులతో బాధపడుతున్నవారికి తక్కిన వారినుంచి అందవలసినంత స్థాయిలో ఉపశమనం అందడంలేదు. ఎయిడ్స్ వంటి సమస్యల గురించిన అవగాహన పరిమితంగా ఉంది. వాటి గురించిన భయం ఎక్కువగా ఉంది. సమస్యల గురించి ప్రచారం జరుగుతున్నా బాధితుల గురించి పట్టించుకోవడం తక్కువ అనే విమర్శలూ ఉన్నాయి. శారీరక రుగ్మతలతో బాటు మానసిక రుగ్మతలతో బాధపడే వారి సంఖ్యకూ దేశంలో కొదవలేదు. దాదాపు నూటికి 15 మంది మానసికంగా క్రుంగిపోయి నిరాశా నిస్పృహలతో బాధపడుతూ ఉండవచ్చునని ఒక అంచనా. పంటలు పండలేదనీ, అప్పులు పెరిగిపోయాయనీ, పరీక్ష బాగా రాయలేదనీ, తల్లో తండ్రో తిట్టారనీ – ఇలా రకరకాల కారణాలు చెప్పి కొందరూ – గోరంత సమస్యలను కొండంతలుగా భావించుకొని కొందరూ – ఆత్మహత్య దారి పడుతున్నారు. తరతరాలుగా వస్తున్న వరకట్న సమస్య బారిని పడుతున్న ఆడపిల్లల వ్యథల కథలూ ఎన్నో. తమ శక్తి సామర్థ్యాల గురించి సరయిన అవగాహన లేకుండా పోటీలు తట్టుకోలేకపోయిన యువత సంఖ్యా ఎక్కువే. తగిన ఆదరణతో ఒక మంచిమాటతో ఒక నిండు జీవితాన్ని రక్షించవచ్చు. కొన్ని ప్రధాన నగరాలలో ఆత్మహత్యలను నిరోధించే లక్ష్యంతో ఫోనుద్వారా ఉపశమనమూ, ధైర్యమూ కలిగించే స్వచ్ఛంద సంస్థలూ, సంఘ సేవకులూ ఉన్నారు. పంచుకున్న దుఃఖం సగమవుతుంది. పంచుకున్న ఆనందం రెట్టింపవుతుంది.

'కష్టాలు మనుషులకు కాక మానులకు వస్తాయా' అనీ, 'మిన్ను విరిగి మీద పడినా చలించకూడదు' అనీ పెద్దలు చెప్పారు. 1998 నాటి లెక్కలు ఒక్కసారి పరిశీలిస్తే పురుషులలో ఆత్మహత్యలకు దారితీసిన సమస్యలు - అనారోగ్యం, కుటుంబ సమస్యలు, దారిద్ర్యం, దివాలా తీయడం, నిరుద్యోగం, ఉద్యోగ సమస్యలు అని తెలుస్తుంది. 22 వేల మంది అనారోగ్యం కారణంగానూ, 824 మంది ఉద్యోగ సమస్యల కారణంగానూ ఆత్మహత్యల పాలయ్యారు.

మనిషి సాంఘిక జీవి అని చెప్పినా సంఘంలో ఒంటరితనంలో జీవించే వారి సంఖ్య ఎక్కువ.

మరణం జీవిత సమస్యలకు పరిష్కార మార్గం కాదు. సమస్యలను ఎదుర్కొన డానికి శారీరక శక్తికన్నా మానసిక శక్తి చాలా అవసరం. దాదాపు ప్రతి ఆత్మహత్య - సమయానికి తగిన సహాయం అందకపోవడం వల్ల జరిగినదే కావచ్చు. 'నా జీవితం నా ఇష్టం' అనుకోవడం అర్థంలేని వాదం. మనిషి మరణానికి భయపడ కూడదు. అందుకని అర్ధాంతరంగా దాన్ని చేజేతులా కొని తెచ్చుకోనూ కూడదు.

జీవితంలో ఒడిదుడుకులూ, ఆటుపోట్లూ అన్నీ ఉంటాయి. అన్నిటినీ తట్టుకుని నిలబడి జీవించి చూపించడంలోనే మనిషి జీవితానికి సార్థకత. రాబర్ట్ బ్రూస్ అనే పెద్దమనిషి జీవితంలో ఎదురు దెబ్బలెన్నో తిని చనిపోవాలని అనుకున్నాడు. విరక్తితో తలదాచుకున్న చోట ఒక సాలీడు గూడు కనిపించింది. తాను అల్లిన గూడు ఎన్ని సార్లు చెదిరిపోయినా విడవకుండా తిరిగి గూడు అల్లుతున్న ఆ పురుగు అతనికి ఒక మంచి జీవిత పాఠం నేర్పింది. జీవితంలోని కష్టనష్టాలకు బెదరక గుండె నిబ్బరంతో ఎదుర్కొని నిలవాలి. నిలిచి పోరాడాలి. పోరాడి గెలవాలి.

•



51. త్యాగధనుల జాడలే సమ్మతి, నెమ్మది

నిరంతర రామనామ గానంతో తరించిన మహితాత్ములు త్యాగరాజస్వామి. మానవులలోనే మాధవుడిని దర్శించాలంటూ త్రికరణ శుద్ధిగా, నిస్వార్థంగా మన దేశ స్వాతంత్ర్యం కోసం పాటుపడిన మహాత్ములు గాంధీజీ. ఆ మహనీయులు వెలిగించిన ఆదర్శ జ్యోతులు రాగల తరాలవారికి కూడా వెలుగునిస్తాయి. సమ్మతినీ నెమ్మదినీ కలిగిస్తాయి.

'పాలరాతి మందిరం కట్టిన పాదుషా నీవు సామాన్యుల ప్రేమను చులకన చేశావు' అని ఒక కవిగారు షాజహాన్ చక్రవర్తి గురించి ఉర్దూలో కవిత రాశారు.

ఆత్మీయులైన వారి స్మృతి చిరస్థాయిగా ఉండాలని చాలామంది ఆశిస్తూ ఉంటారు. అందరూ పాలరాతి మేడలు కట్టనక్కరలేదు. పదిమందికీ పనికివచ్చే పని ఏదయినా చేసి ఆత్మీయులను గుర్తు చేసుకోవచ్చు. కొందరు అన్నదానం చేస్తుంటారు. మరికొందరు బట్టలు పంచుతారు. కొందరు ఏ వృద్ధాశ్రమానికోవెళ్లి అక్కడివారికి అవసరమైన సరంజామా చేకూరుస్తుంటారు.

కొందరు రాజకీయ కార్యకర్తలు తమ నేతల స్మృతిగా రక్తదానం చేస్తుంటారు.

జాతి సంస్కృతిని కళారంగాన్నీ జీవన విధానాన్నీ సుసంపన్నం చేసినవారి స్మృతిని నిలుపుకోవడం కోసం శిలా విగ్రహాలు నెలకొల్పడం ఇటీవలి ఆచారం. కొన్ని ప్రాచీన ఆలయాలలో పాతకాలం నాటి రాజులు కొందరి శిలావిగ్రహాలు వినమ్ర భావంలో కనిపిస్తాయి. చెన్నపురిలో ఒక గుడి కట్టించిన తెలుగు ప్రముఖులొకరు తాము సాష్టాంగంగా నమస్కరిస్తున్న భంగిమలో తమ శిలా విగ్రహం గర్భగృహం ముందున్న మండపంలో ఏర్పాటు చేసుకొన్నారు.

తమ చిన్నారుల స్మృతికోసం వైద్యశాలలు కట్టించిన వారున్నారు. పాఠశాలలు ఏర్పరచిన వారున్నారు.

కొన్ని సందర్భాలలో కొందరు తమ భక్తి ప్రపత్తులను స్మృతి చిహ్నాలు నెలకొల్పడం ద్వారా ప్రకటిస్తుంటారు. అటువంటి ఉదార చరితులలో ఒకరు బెంగుళూరు నాగరత్నమ్మ గారు.

బెంగళూరు నాగరత్నమ్మగారు మైసూరుకు చెందినవారు. సంగీత నాట్య కళలలో దిట్ట. ఆమె సాహిత్యాభ్యాసమూ చేసినవారు. 1878లో జన్మించిన నాగరత్నమ్మగారు మైసూరులో ప్రముఖ సంగీత విద్వాంసులయిన బిడారం కృష్ణప్పగారి దగ్గరా చెన్నపురిలో రామనాథపురం శ్రీనివాస అయ్యంగారు గారి దగ్గరా సంగీతం నేర్చుకున్నారు. చెన్నపురిలోని తిరువేంకటాచార్యులు గారి దగ్గర భరతనాట్యం అభ్యసించారు.

ఆమె 'గాన కళావిశారద'గా వాసికెక్కారు. కాలక్రమాన సంగీతం ద్వారా ఆర్జించినదంతా త్యాగరాజస్వామివారి అనుగ్రహం వల్లనేనని అనిపించగా తమ ఆస్తిపాస్తులు అన్నిటినీ త్యాగరాజస్వామివారి సేవకోసం వెచ్చించాలని అనుకొన్నారు. కలలో స్వామివారి సమాధి కనిపించగా, ఆ మరునాడే త్యాగరాజస్వామివారి సమాధి ఉన్న తిరువయ్యారుకు వెళ్ళారు. తిరువయ్యారులోని ఆ వాగ్గేయకారుడి సమాధి ఉన్న స్థితి ఆమెకు ఆందోళన కలిగించింది. ఆ వెంటనే త్యాగరాజ స్వామివారి సేవలో తమ జీవనం గడపాలని నిర్ణయించారు. వ్యయ ప్రయాసలకోర్చి కావేరీ నదీ తీరాన స్వామివారికి సమాధి మందిరం కట్టించారు. 1921 నుండి 1925 దాకా సాగిన నిర్మాణ కార్యక్రమం కోసం ఆమె తమ సర్వస్వమూ ధారపోశారు. ఇల్లూ వాకిలీ నగలూ అన్నీ అమ్మి సమాధిని సర్వాంగ సుందరంగా దిద్ది తీర్చారు.

త్యాగరాజ స్వామి శిష్యకోటిలో వారు పెద్ద బృందం అనీ చిన్న బృందం అనీ విడివిడిగా ఉండి స్వామివారి ఆరాధనోత్సవాలు విడివిడిగా నిర్వహిస్తూ ఉండేవారు. నాగరత్నమ్మగారి కృషివల్ల సంగీత విద్వాంసులందరూ కలసి తిరువయ్యారులో త్యాగరాజస్వామివారికి సంగీతాంజలి ఘటించే సంప్రదాయం మొదలయింది. ఆమెకు 'త్యాగ సేవాసక్త' అనే బిరుదూ లభించింది. ఆమె చివరిరోజులు తిరువయ్యారులోనే గడిపారు. 1952లో ఆమె మరణించినప్పుడు ఆమెకు త్యాగరాజ స్వామివారి సమాధి ఎదురుగా సమాధి ఏర్పరచారు. అక్కడే ఆ భక్తురాలి విగ్రహమూ ఉంది.

నాగరత్నమ్మగారు త్యాగరాజస్వామివారి సమాధికి ఒక నిర్దిష్టమైన రూపం కల్పించడంవల్ల అప్పటినుంచి ఇప్పటిదాకా సంగీతాభినులూ సంగీత విద్వాంసులూ అందరూ ప్రతి ఏటా త్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో చేసుకోవడానికి వీలుచిక్కింది.

నిస్వార్థ సేవాతత్పరతకు మారుపేరుగా నిలిచే కొందరిలో నాగరత్నమ్మ గారినీ చెప్పుకోవాలి.

పానుగంటి లక్ష్మీ నరసింహారావుగారి సాక్షి వ్యాసాలలో ఒక గ్రంథాలయ సభ గురించిన వృత్తాంతం ఉంది. గ్రంథాలయానికి సాహిత్య ప్రముఖుల పేరు ఎందుకు

పెట్టలేదని జంఘాల శాస్త్రి ఆ ఊరి పెద్దమనిషిని అడగగా – వాళ్లెవరూ తనకు ఆస్తి రాస్వివలేదు కదా వాళ్ల పేరు పెట్టి ఎందుకు గుర్తు చేసుకోవాలి అంటాడు ఆ పెద్ద మనిషి. సంకుచితమైన తత్త్వం ఇట్లా ఉంటుంది.

నిరంతర రామనామ గానంతో తరించిన మహితాత్ముడు త్యాగరాజస్వామి. మానవులలోనే మాధవుడిని దర్శించాలంటూ త్రికరణ శుద్ధిగా, నిస్వార్థంగా మనదేశ స్వాతంత్ర్యం కోసం పాటుపడి రామరామ స్మరణతో అసువులు వీడిన మహాత్ములు గాంధీజీ. ఆ మహనీయులు వెలిగించిన ఆదర్శ జ్యోతులు. రాగల తరాల వారికి కూడా వెలుగునిస్తాయి. సమ్మతినీ నెమ్మదినీ కలిగిస్తాయి.



52. పోప్ ఎంపికలో పొగపాత్ర

మన భారతీయ సంప్రదాయం ప్రకారం అగ్ని - పంచభూతాలలో ఒకటి. గ్రీకువారి సిద్ధాంతం ప్రకారం అగ్ని, జీవితానికీ సకల జీవరాశికి అత్యవసరమైన నాలుగు ప్రధాన అంశాలలో ఒకటి. తక్కిన మూడు - నీరు, భూమి, గాలి. నిప్పులేనిదే పొగరాదు అన్నది తర్కశాస్త్రంలోని తొలి సిద్ధాంతాలు తెలుసుకోవడానికి ప్రాతి పదికంగా పనికివచ్చే వాక్యం.

కొన్ని సందర్భాలలో కొందరికి మరికొందరిని చూస్తే ఒళ్లు మండుతుంది. మరి కొందరికి కడుపు ఉడికిపోతుంది. కొందరు ఏ కారణం లేకపోయినా తక్కిన వాళ్ల బాగును చూసి కళ్లల్లో నిప్పులు పోసుకుంటూ ఉంటారు. కొందరు మాటలతో అవతలివాళ్లను కాల్చుకు తినగలరు. కొందరు కళ్లతో కాలుస్తున్నట్టు చూడగలరు. చూచి రమ్మంటే కాల్చి వచ్చిన హనుమంతుడి సుందరకాండ కథ రామాయణంలోని రసవద్ఘట్టాలలో ఒకటి. మానవ జీవితంతో నిప్పు రకరకాలుగా పెనవేసుకుపోయి ఉంది. చారిత్రకంగా, సాంస్కృతికంగా, సాంఘికంగా నిప్పుకు మానవజాతి మను గడలో విశిష్టమైన స్థానం ఉంది.

మన భారతీయ సంప్రదాయం ప్రకారం అగ్ని - పంచభూతాలలో ఒకటి. గ్రీకు వారి సిద్ధాంతం ప్రకారం అగ్ని, జీవితానికీ సకల జీవరాశికి అత్యవసరమైన నాలుగు ప్రధాన అంశాలలో ఒకటి. తక్కిన మూడు నీరు, భూమి, గాలి.

వైదిక సంప్రదాయం ప్రకారం అగ్ని మానవులకూ దేవతలకూ మధ్య వారధి. యజ్ఞాలలో యాగాలలో వ్రేల్చిన హవిస్సులనూ, ఆహుతులనూ అగ్ని ఆయా దేవత లకు చేరుస్తాడని సంప్రదాయం. అగ్ని తేజస్సుకు సంకేతం. కన్ను చూడడానికి వీలు కల్పించే శక్తిగా ఆరగించిన తిండిని అరిగించుకోవడానికి అవసరమైన జఠర శక్తిగా - ఇలా అగ్నికి రకరకాల లక్షణాలు చెప్పారు. అన్నం అరగకపోతే అగ్ని మాంద్యం వచ్చిందేమోనని అనుమానిస్తూ ఉంటారు.

వెచ్చదనానికీ చల్లదనానికీ వివిధ సంస్కృతులలో వివిధ ప్రయోజనాలు ఉన్నాయి. మనం పదికాలాలపాటు చల్లగా ఉండాలని దీవిస్తూ ఉంటాము. పాశ్చా త్యులు తమ ఇళ్లకు వచ్చే వారికి వెచ్చని స్వాగతం పలుకుతుంటారు. మనది ఉష్ణ

మండల దేశం కావడమూ, వాళ్లవి ప్రధానంగా చలిదేశాలు కావడమూ ఈ తేడాలకు కారణాలు కావచ్చు. మన దేశంలోనే కాశ్మీర్ ప్రాంతంలో చలిని తట్టుకోవడానికి నిప్పుల కుంపటి 'సిక్రీ'ని రొమ్ముకూ, పొట్టకూ మధ్య కట్టుకోవడం ఆనవాయితీ.

ఈ నిప్పుల కుంపటి వాడకం ఎక్కువైతే పుట్టకురుపు వ్యాధి (కేన్సర్) రావచ్చునని వైద్యుల హెచ్చరిక. పెళ్లికాని ఆడపిల్ల సంరక్షణను తమిళ భాషలో కడుపులో నిప్పులు కట్టుకోవడంగా వర్ణిస్తుంటారు. మన రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలోని స్త్రీలు చుట్టను వెలిగించి నిప్పు ఉన్న భాగాన్ని నోటిలో పెట్టుకుని 'అడ్డ పొగ' కాలుస్తూ ఉంటారు. కాశ్మీరం వాళ్లూ నిప్పు కుంపటిలాగా ఈ అడ్డపొగ కూడా ఇది పుట్టకురుపుకు దారితీస్తుంది.

నిప్పులేనిదే పొగరాదు అన్నది తర్కశాస్త్రంలోని తొలి సిద్ధాంతాలు తెలుసుకోవ డానికి ప్రాతిపదికంగా పనికివచ్చే వాక్యం.

పొగవస్తే నిప్పు ఉన్నట్టు లెక్క. కేతలిక్ క్రైస్తవుల మతగురువు అయిన పోప్‌ను ఎన్నుకోవడానికి ఒక చిత్రమైన పద్ధతి పాటిస్తారు. ఒక పోప్ కాలంచేసిన తర్వాత మరొక పోప్‌ను ఎన్నుకోవడానికి నియమ నిబంధనల ప్రకారం కొందరు మత గురువులు ఒక చోట ఏకాంతంగా సమావేశమవుతారు. ఏకాభిప్రాయ సాధనకోసం- అవసరమైతే కొన్ని రోజులపాటు సమావేశం సాగుతుంది. పోప్ ఎన్నిక పూర్తికాగానే ఒక రకమైన గడ్డికి నిప్పంటిస్తారు. ఆ పొగను బట్టి పోప్ ఎన్నిక జరిగినట్టు తెలుసు కోవచ్చు.

నీటి ఆవిరి శక్తితో నడిచే రైలుబళ్లు పొగ వదులుతూ వెళ్లడంవల్ల వాటిని పొగ బండ్లు అన్నారు. ఎడతెరిపి లేకుండా ధూమపానం చేసే కొందరినీ పొగబండ్లు అంటూ ఉంటారు.

నిప్పుతో చెలగాటం తగదు. మన దీపమని ముద్దు పెట్టుకున్నా మూతిమీసాలు కాలుతాయని హెచ్చరిస్తుంది ఒక సామెత.

నిప్పు ఒక మంచి సేవకుడు కానీ ఒక చెడ్డ యజమాని కూడా కావచ్చునని ఆంగ్లంలోని ఒక సూక్తి గుర్తు చేస్తుంటుంది.

మనిషికి నిప్పు గురించి ఎప్పుడు తెలిసింది? ఒక అంచనా ప్రకారం 5 లక్షల ఏళ్ల ముందే మనుషులు నిప్పును ఉపయోగించారట. కొన్ని సంవత్సరాల క్రితం కీన్యాలోనూ, దక్షిణ ఆఫ్రికాలోనూ దొరికిన ఆధారాల ప్రకారం 142 లక్షల ఏళ్ల క్రితమే మానవజాతి నిప్పును ఉపయోగించి ఉండవచ్చన్న విశ్వాసం కుదిరింది. పదివేల ఏళ్ల ముందు దాకా మనిషికి నిప్పు చేయడం రాదని ఒక అభిప్రాయం ఉంది. నిప్పుచేయడానికి చెకుముకి రాళ్లను రాపిడికి గురిచేసే పద్ధతి ప్రపంచ వ్యాప్తం

గా అలవాటులో ఉండేది. ఎప్పటికప్పుడు అగ్గి చేసుకోవడం ఇబ్బందిగా ఉండడంవల్ల కొందరు అగ్గి నిరంతరంగా కొనసాగేట్టు చూసేవారు. నేటికీ కొన్ని సంప్రదాయ సిద్ధమైన కుటుంబాలలో నిరంతరాగ్నిహోత్రం కొనసాగుతూనే ఉంటుంది. పార్సీ మతస్థులు అగ్ని పూజ చేస్తుంటారు. ప్రాచీన రోమ్‌లో పవిత్రాగ్ని ఆరిపోకుండా కొందరు పవిత్ర కన్యలు కాపలా ఉండేవారు. గ్రీకువారు తాము ఎక్కడికి వలసవెళ్లినా తమతోబాటు పెస్టియాకు చెందిన పవిత్రాగ్నిని తీసుకు వెళ్ళేవారు.

అగ్గిపుల్లలకు గడచిన నూరేళ్లలో ప్రాచుర్యం పెరగడంతో నిరంతర అగ్నిహోత్ర ప్రజ్వలనం కొంత వెనకబడింది. అగ్గిపుల్లల రూపకల్పనలోనూ రాజకీయాలు ఎన్నో జరిగాయనీ ఎన్నిసార్లయినా వాడగల అగ్గిపుల్లలను ఒకరిద్దరు రూపొందించినా అవి కాలగర్భంలో కలిసిపోయాయనీ చెబుతుంటారు.

నిప్పుచేయడం వీలైన తర్వాత మట్టితో కుండలూ, ఆ తర్వాత లోహాలతో పాత్రలూ చేయడం మొదలయింది.

వ్యవసాయంలోనూ నిప్పుకు ప్రాధాన్యం లభించింది. పొలాలను శుభ్రం చేయ డానికి వాటికి నిప్పంటించి, ఆ వచ్చిన బూదిని ఎరువుగా వాడేపద్ధతి ప్రపంచంలోని చాలా ఉష్ణ మంచు దేశాలలోని ఆనవాయితీ.

అడవులు వాటంతట అవే అంటుకుని కాలిపోతూ ఉంటాయి. ఇటీవల ఆగ్నేయ ఆసియా దేశాలు కొన్ని కార్చిచ్చులవల్ల చాలా నష్టపోయాయి. నిప్పువాడకంవల్ల లాభించే పరిశ్రమలలో టపాకాయల పరిశ్రమ కూడా ఒకటి. బాణసంచా కాల్చడం అన్నది చాలా ఏళ్లనుంచీ వస్తున్న ఆచారం. బాణసంచా తయారుచేయడం చైనాలో మొదలయిందని కొందరి ఊహ. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా బాణసంచా ఎగుమతి చేసే దేశాలలో మన దేశం ప్రధాన స్థానం వహిస్తున్నది. తమిళనాడులోని శివకాశిలో చిన్నపిల్లల చేత టపాకాయలు చేయించడం పట్ల తీవ్రమైన ఆందోళనలు చెలరేగ డంతో అక్కడి సంస్థలు తాము ప్రస్తుతం పెద్ద వాళ్లచేతే టపాకాయలు చేయిస్తున్నా మని ప్రకటించుకుంటున్నాయి.

ముక్తాయింపు:

'పోయినేడాది దీపావళి పండగప్పుడు దాచిన టపాకాయలు ఇవి. ఒక టపా కాయ కూడా పేలడం లేదు' అని భర్త భార్యతో విసుగ్గా అన్నాడు. ఆ అతి జాగ్రత్త భర్త మాటలు విని – 'ఎలా పేలుతాయి? అన్ని పోయినేడాది పేల్చేసినవే కదా' అన్నది అతని భార్య.



53. గురు-శిష్య సంబంధం

మైసూరులోని లక్ష్మీపురంలో రాధాకృష్ణన్‌గారు ఉండే ఇంటి నుంచి రైల్వే స్టేషన్‌కు పెద్ద ఊరేగింపు బయలుదేరింది. ఆయన ఎక్కిన బండికి గుర్రాన్ని కట్టాక విద్యార్థులే ఆ బండిని స్టేషన్ దాకా తేరును లాగినట్టు లాగి తీసుకు వెళ్లారట. పోటీ కారణంగా చాలామందికి ఆ తేరులాగే అవకాశం లభించలేదట. ఈ ఊరేగింపు రైల్వే స్టేషన్‌ను చేరేలోగా మరికొందరు విద్యార్థులు స్టేషను చేరుకుని రాధాకృష్ణన్ గారు ప్రయాణం చేయవలసిన రైలు పెట్టెను అలంకరించడం మొదలుపెట్టారు.

ఆయన ఆ అబ్బాయికి పాఠాలు చెప్పాడు. కొన్నాళ్లకు ఆ అబ్బాయి ఢిల్లీ సింహాసనం అధిష్ఠించి చక్రవర్తి అయ్యాడు. పాఠాలు చెప్పిన అయ్యవారు 'ఢిల్లీకి పాదుషా అయినా అయ్యవారికి విద్యార్థే కదా' అని ఆ అబ్బాయికి ఒక ఉత్తరం వ్రాశారు. అందులో తాము శ్రీవారికి చిన్నతనంలో చదువు చెప్పిన వివరాలూ వ్రాశారు. అబ్బాయి అయ్యవారికి సమాధానం వ్రాశాడు – 'తమరు నాకు పనికి వచ్చే చదువు చెప్పలేదు. అక్కరలేనివన్నీ తలకెక్కించారు' అని. ఆ అయ్యవారి పేరు ఇక్కడ అప్రస్తుతం కానీ ఆ అబ్బాయి పేరు ఔరంగజేబు.

కొందరికి తాము ఫలానా వారి దగ్గర చదువుకొన్నామని చెప్పడం గౌరవం. మరికొందరికి తమ దగ్గర ఫలానా వారు చదువుకొన్నారని చెప్పడం ఆనందదాయకం.

ప్రాచీనకాలంలో దూరాలనూ, భారాలనూ లెక్కచేయకుండా విద్యాభ్యాసం కోసం గురువులను వెతుక్కుంటూ వెళ్లేవారు. ఆ గురువుతో తగిన రీతుల్లో విద్యార్థులను పరిశీలించి పరీక్షించి వాళ్లను శిష్యులుగా స్వీకరించేవారు. ఎవరి స్థాయిని బట్టి వాళ్లకు తగిన చదువు చెప్పేవాళ్ళు. మళ్లీ ఆధ్యాత్మిక విద్య, ఆధ్యాత్మిక గురుశిష్య సంబంధం వేరు. లౌకికమైన విద్యల సంగతి చూస్తే– సంగీతం వంటి కొన్ని విద్యలు నేర్వడానికి నేటికీ తగిన గురువులను ఆశ్రయించడం జరుగుతూనే ఉంది. మన సంగీత విద్వాంసులలో గురుభక్తి ఎంతో విశేషంగా కనిపిస్తుంది. త్యాగరాజ ఆరాధన వంటివి ఆ గురువుల యెడల శిష్యులకు గల భక్తి ప్రపత్తులకు గురుతులే. త్యాగరాజ స్వామి వారి వద్ద సంగీతం నేర్చే వారేకాక జ్యోతిషం నేర్చే శిష్యులూ ఉండేవారట.

80 ఏళ్లనాటి మాట. 1921లో సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు మైసూరు విశ్వ

విద్యాలయం నుంచి కలకత్తా విశ్వవిద్యాలయానికి తత్త్వశాస్త్ర ఆచార్యులుగా పదవి స్వీకరించడానికి బయలుదేరినప్పటి మాట. రాధాకృష్ణన్‌గారి తరగతిలో కూచొని ఆయన చెప్పే పాఠాలు వినడానికి ఆనాటి మైసూరు విద్యార్థుల మధ్య విపరీతమైన పోటీ ఉండేదట. ఆయన పాఠం చెప్పే పద్ధతీ ప్రత్యేకంగా ఉండేదని ఆయన తరగతిలో కూచుని పాఠాలు విన్న ప్రసిద్ధ కన్నడ రచయిత ఎ.ఎన్.మూర్తిరావు గారు పేర్కొన్నారు. తరగతిలోకి రాగానే పదిహేను నిమిషాలు విద్యార్థుల క్షేమ లాభాల విచారణ, వివిధ విషయాల గురించిన చర్చా ఉండేదట. ఒకసారి ఒక విద్యార్థి రైల్వే వ్యవస్థ గురించి విమర్శనాత్మకంగా మాట్లాడారట. దాంతో ఆ విద్యార్థికి రైల్వే సభ్యులు అని పేరు పెట్టారట రాధాకృష్ణన్ గారు. ఆ చర్చల్లో గురువుగారిని శిష్యులు ఏ ప్రశ్న అయినా అడిగే స్వాతంత్ర్యం ఉండేదట. కాఫీ, టీలలో ఏది మంచిది, కట్టుబాట్లు లేని స్వాతంత్ర్యం సాధ్యమా, గురువుగారు ఇంగ్లండుకు ఎందుకు వెళ్లలేదు – ఇలా ఏవేవో అడిగితే అన్నింటికీ చక్కగా విడమరిచి సమాధానాలు చెప్పేవారట. ఇంగ్లండుకు ఎందుకు వెళ్లలేదు అని అడిగితే 'వెడతాం. పాఠాలు చెప్పడానికి వెడతాం' అన్నారట ఆయన. అపూర్వమైన ఆ అధ్యాపకులు మైసూరునుంచి బయలుదేరుతుంటే – ఆయన విద్యార్థులు ఆయనకు వైభవోపేతమైన వీడ్కోలు చెప్పారు. మైసూరులోని లక్ష్మీపురంలో రాధాకృష్ణన్ గారు ఉండే ఇంటినుంచి రైల్వేస్టేషన్‌కు పెద్ద ఊరేగింపు బయలుదేరింది. ఆయన ఎక్కిన బండికి గుర్రాన్ని కట్టక విద్యార్థులే ఆ బండిని స్టేషన్‌దాకా తేరును లాగినట్టు లాగి తీసుకు వెళ్లారట. చాలా మందికి ఆ తేరులాగే అవకాశం లభించలేదట. ఈ ఊరేగింపు రైల్వేస్టేషన్‌కు చేరేలోగా మరి కొందరు విద్యార్థులు స్టేషన్ చేరుకుని రాధాకృష్ణన్‌గారు ప్రయాణం చేయవలసిన రైలు పెట్టెను అలంకరించడం మొదలుపెట్టారట.

అడుగడుగునా పువ్వులతో దేవాలయంలాగా అలంకరించారట ఆ రైలు పెట్టెను.

ఆ రోజు మైసూరు రైల్వేస్టేషన్‌లో జరిగినది అపూర్వమైన సంఘటన. బహుశా ఆ రైలు ఆలస్యంగా కూడా బయలుదేరి ఉండవచ్చు. తమ శిష్య బృందం వెల్లువలాగా తరలివచ్చి తమకు వీడ్కోలు చెప్పిన ఆ సంఘటన గుర్తుకు వచ్చినప్పుడల్లా రాధాకృష్ణన్‌గారు పులకించిపోయే వారట.

ప్రతి విద్యార్థికీ విద్యార్థినికీ నచ్చిన ఆదర్శ ఉపాధ్యాయులు ఉంటారు. ఆ గురువుల ప్రభావం శిష్యులమీద ఎంతోకొంత పడుతూనే ఉంటుంది. ఒక ఆదర్శం అలా తరతరాలు సాగి వస్తుంటుంది. మనకు పాఠాలు చెప్పని గురువులూ ఉంటారు. వారిని తరచూ దర్శిస్తూ ఉండాలట. అటువంటి ఉత్తములు ప్రత్యేకించి ఏ ఉపదేశమూ చేయకపోయినా వాళ్లు ఏం చెప్పినా చేసినా అదే ఉపదేశమవుతుంది అని సంస్కృత శ్లోకం ఒకటి పేర్కొంటుంది.

సంతః సదాభిగంతవ్యా యది నోపదిశం త్యపి
యాస్తు స్వైర కథాస్తేషాం ఉపదేశా భవంతి తాః



54. పేర్లు గుర్తుంటాయా?

ఇటీవల పేర్లు పెట్టుకోవడానికి వీలుగా 'పుట్టబోయే పిల్లలకు పనికివచ్చే పేర్లు' అనే పద్ధతిలో పేర్ల పుస్తకాలు ప్రచురిస్తున్నారు. తెలుగులో హలంతాలుగా పేర్లు పెట్టే ఆనవాయితీ లేదు. కాని ఇటీవల సునీల్, ఇంద్రనీల్, రంజిత్, అంకిత్, అర్పిత్, ఆకాశ్, రాజేష్, వినీత్, పునీత్ - వంటి పేర్లు పెట్టడం ఎక్కువయింది. ఈ హలంత నామాలు మగపిల్లలకే ఎక్కువగా పెడుతున్నట్టు కనిపిస్తున్నది.

'మీ ఊళ్లో పేరున్న వాళ్ళు ఎవరైనా పుట్టారా' అని ఒకాయన ఒక ఊళ్ళో, ఒక పెద్ద మనిషిని అడిగాడట. అందుకు ఆ పెద్దమనిషి 'మా ఊర్లో అందరికీ పుట్టిన తర్వాతే పేర్లు పెడుతుంటారండీ!' అని సమాధానం చెప్పాడట.

వ్యాకరణ శాస్త్రరీత్యా పేర్లు అనకూడదు. పేళ్లు అనాలి. పుట్టని బిడ్డకు పేరు పెట్టినట్టు అనే సామెతను అసంబద్ధమైన పనులు చేయడానికి నిదర్శనంగా చెబుతుంటారు.

పుట్టిన బిడ్డకు పేరు పెట్టడం ఒక కళ. మనవడు, మనవరాలు అనే అర్థాలలో తమిళంలో పేరన్ పేత్తి అనే మాటలు వాడుతుంటారు. పెయర్ అంటే పేరు. మనవడు, మనవరాలు అంటే తాత పేరునో, అమ్మమ్మ పేరునో, నాయనమ్మ పేరునో అందుకునే ముందుతరం వాళ్ళన్నమాట.

బిడ్డలకు ఏ పేరు పడితే ఆ పేరు పెట్టడానికి వీల్లేదు. భార్యాభర్త కూచుని కూడబలుక్కుని బిడ్డల పేర్లు నిర్ణయించాలి. కొన్ని సందర్భాలలో బిడ్డలు పుట్టడానికి ముందే ఆడపిల్లయితే ఫలానా పేరు, మగ పిల్లవాడయితే ఫలానా పేరు అని నిర్ణయించుకోవడమూ కద్దు. కొన్నిసార్లు బంధుమిత్రులంతా కూచుని నామకరణం చెయ్యడమూ కద్దు. తెలుగువాళ్లకు ఉన్నట్టు తక్కిన భారతీయ భాషా కుటుంబాల వారిలో ఏ కొందరికో తప్ప అందరికీ ఇంటిపేర్లు లేవు. కొన్ని భాషల వారి సంప్రదాయంలో రాజయ్యగారి భూమయ్య అన్నట్టుగా పేరు ఉంటే, రాజయ్యగారు భూమయ్యగారి తండ్రి అని గ్రహించవలసి ఉంటుంది. మన ప్రాచీన శాతవాహన చక్రవర్తులు తల్లుల పేర్లకు ప్రాధాన్యం ఇచ్చినట్టు కనిపిస్తుంది.

పేరు పెట్టడం సులభమైన పనికాదు. పేరు సరిగా ఎన్నుకోకపోతే భార్యాభర్తల మధ్య రగడ చెలరేగవచ్చు. మీవైపు వాళ్లకు ఇచ్చిన విలువ మావైపు వాళ్లకు ఇవ్వ లేదంటూ గొడవ పడవచ్చు.

ఒక కోడలికి అత్తగారంటే చాలా కోపంగా ఉండేదట. అందుకని ఆమె తన కూతురికి అత్తగారి పేరు పెట్టి రోజూ చెడతిడుతూ ఉండేదట.

ఇటీవల పేర్లు పెట్టుకోవడానికి వీలుగా 'పుట్టబోయే పిల్లలకు పనికివచ్చే పేర్లు' అనే పద్ధతిలో పేర్ల పుస్తకాలు ప్రచురిస్తున్నారు. తెలుగులో హలంత నామాలు పెట్టే అనవాయితీ లేదు. కాని ఇటీవల సునీల్, ఇంద్రనీల్, రంజిత్, అర్పిత్, ఆకాశ్, రాజేష్, వినీత్, పునీత్ - వంటి పేర్లు పెట్టడం ఎక్కువయింది. ఈ హలంత నామాలు మగపిల్లలకే ఎక్కువగా పెడుతున్నట్టు కనిపిస్తున్నది.

అత్యాధునికమైన పేర్లు పెట్టడం మంచిదే. అయితే ఆ ఆధునికమైన పేర్లు చిన్నతనంలో బాగున్నా పెద్దతనంలో బాగుండవని వాదించే వారూ కొందరున్నారు.

కొందరు తల్లిదండ్రులు పెట్టిన పేర్లు బాగులేదని పెద్దయ్యాక పేర్లు మార్చు కుంటూ ఉంటారు. కవులు, కళాకారులు - పెద్దలు పెట్టిన పేర్లు ఉండగా కలం పేర్లు, స్వేచ్ఛా నామాలు పెట్టుకుంటూ ఉంటారు. భాగవతుల శంకరశాస్త్రి అంటే గుర్తుపట్టలేని వారు కూడా 'ఆరుద్ర' అంటే వెంటనే గుర్తుపట్టేస్తారు.

కొందరికి వారి ప్రమేయం లేకుండా మారుపేర్లు వస్తుంటాయి. చాలా బళ్లలో పిల్లలు తమ అధ్యాపకులకు ముద్దుపేర్లు పెట్టుకుంటూ ఉంటారు. కొన్ని కార్యాలయా లలోనూ ఇటువంటి పేర్లు వాడుకలో ఉండవచ్చు.

ఈ ముద్దుపేర్లు చాలా సందర్భాలలో ఆ పేరు సూచించే వ్యక్తికి తప్ప తక్కిన అందరికీ తెలిసి ఉండవచ్చు.

ఈ ముద్దుపేర్లు వేరు. పిల్లలకు ఇళ్లలో పెట్టుకునే బుజ్జి, చిట్టి, పాప, బాబు, నాని, చిన్ని వంటి పేర్లు వేరు. అలాగే పొడుగు పేర్ల వాళ్లు వాడుకలో పొట్టి పేర్ల వాళ్లయి పోతూ ఉంటారు. సూర్యనారాయణ సూర్నాణగాని, సూరిగానీ కావచ్చు. భాస్కరం - బాబి కావచ్చు. పిలవడానికి సులువు కల్పించే పద్ధతి అది. తమిళ నాడులో ఊళ్ల పేర్లను కూడా పొట్టి చేసేస్తూ ఉంటారు. అలా కోయంబత్తూర్ కోవై అయింది. నాగపట్టణం నాగై అయింది. చెన్నపట్టణం చెన్నై అయింది.

తమ పిల్లలకేకాక తమ ఎరుకలో వాళ్లందరికీ చిత్రవిచిత్రమైన ముద్దు పేర్లు మారు పేర్లు పెట్టడం అమెరికాలో ఎక్కువ.

1824లో క్విన్సీ ఆడమ్స్ ఒక్క ఓటు ఆధిక్యంతో అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఆయనకు 'ప్రమాదరీత్యా అధ్యక్షుడు' అనే పేరు వచ్చింది. మార్తాజేన్ కేనరీ అన్న

ఆమె తమ 51వ ఏట మరణించారు. ఆమె సాహచర్యం చాలా మందిని బలితీసుకుందట. పన్నెండుసార్లు ఆమె పెళ్లాడితే – పదకొండు మంది భర్తలు మరణించారట. ఆమెకు 'విపత్తుల జేన్' – కెలామటీ జేన్ అని పేరు వచ్చింది. హొరేస్ గ్రీలి అనే పత్రికా రచయిత ఎర్రగా, బుర్రగా ఉండి పొడవైన తెల్లటి గడ్డంతో చిత్రంగా కనిపించేవాడట. ఆయన ముద్దు పేరు దయ్యం. ఒక రాజకీయవేత్త ఏ సందర్భంలో మాట్లాడినా తాను అమెరికాను ప్రేమిస్తున్నాను అనేవాడట. ఆయనకు 'ప్రేమపక్షి' అన్నది ముద్దుపేరు. ఒక అమ్మాయికి బోలెడంత ఆస్తి కలిసి వచ్చింది. అయితే ఆమె తల్లితో ఉండడానికి నోచుకోలేదు. ఆమెకు 'అతి పేద ధనవంత బాలిక' అనే పేరు వచ్చింది. జనరల్ యలిసెస్ ఎస్.గ్రాంట్‌కు 20 ముద్దు పేర్లు ఉండేవట. హ్యూయే పియర్స్ లాంగ్ అనే శాసన సభ్యుడు గట్టిగా అరిచి మాట్లాడేవాడట. ఆయనకు 'లూయిసియానా లౌడ్ స్పీకర్' అని పేరు వచ్చింది.

ముక్తాయింపు:

అనగనగా ఒక పెద్ద మనిషి, ఒక హాస్య రచయిత దగ్గరికి వచ్చి 'మీ ముఖం బాగా పరిచయమైనట్టే ఉందికానీ మీ పేరు మరిచిపోయానండీ' అన్నాడట. 'అయ్యో అలాగా.. ఇదుగోండి నా విజిటింగ్ కార్డు. నా పేరు గుర్తు రాగానే నాకు ఫోన్‌చేసి చెప్పండి' అన్నాడట హాస్యరచయిత.

55. బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్

'బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్' అని పాత సినిమాపాట నిశ్చలానందానికి సూచనలిస్తుంది. మనసులోని బాధ శారీరక రుగ్మతగా కనిపించే మనశ్శారీరక వ్యాధులూ ఉన్నాయి. బాధ ఏమిటో గుర్తించాలి. ఆ బాధకు పరిష్కార మార్గమేమిటో ఆలోచించాలి.

'నేను ఎన్నో వ్రణాలు కోశాను కానీ నా వ్రణం పెట్టినంత నొప్పి ఇంకే వ్రణమూ పెట్టలేదు' అని వైద్యులొకరు చెప్పారని ఒక పాత కథ చెబుతుంది. తలనొప్పీ, జ్వరమూ తనకు వస్తే తప్ప తెలియదు అని ఒక సామెత హెచ్చరిస్తుంది. అత్తవారింట ఉన్న కూతురిని చూడడానికి వచ్చిన తండ్రి ఆమెను అత్తింటి కాపురం ఎట్లా ఉందని అడిగితే ఆ అమ్మాయి. మోచేతి పుండు ఉన్నంత సుఖంగా ఉందని చెప్పిందట. కొన్నాళ్లకు ఆ తండ్రికి మోచేతికి దెబ్బతగిలింది. చేయి కదల్చినప్పుడల్లా భరించరాని నొప్పి పుడుతుంటే కోడలుగా తమ కూతురు పడుతున్న సుఖమేమిటో ఆ తండ్రికి తెలిసి వచ్చింది.

ఎవరి నొప్పి వారికే తెలుస్తుంది. మాటల్లో చెప్పలేనంత బాధగా ఉంది అనీ భరించలేనంతగా ఉంది అనీ చెప్పవచ్చు కానీ, ఇంత అని ఇదమిత్థంగా నొప్పి ఎంతో చెప్పడం కష్టం. నొప్పి శారీరకం కావచ్చు. మానసికం కావచ్చు. నిజంగానే ఎవరికైనా దెబ్బతగిలినా ఆ దెబ్బకూ ఆ దెబ్బ తగిలిన వ్యక్తి అనుభవిస్తున్న నొప్పికీ ప్రత్యక్షసంబంధం ఉండకపోవచ్చునని శాస్త్రవేత్తల అభిప్రాయం. గాయం తీవ్రత నొప్పిని నిర్ణయించకపోవచ్చునని వాళ్ల నిర్ధారణ. ఇందుకు ఒక ఉదాహరణ కూడా చెబుతారు. యుద్ధరంగంలో దెబ్బతినిన సైనికుడిని చికిత్సకోసం తరలిస్తే – యుద్ధం నుంచి ప్రాణాలతో బయటపడినందుకు అతను సంతోషపడుతూ తన శరీరానికి తగిలిన దెబ్బల గురించి పట్టించుకోకపోవచ్చునట. అదే ఏ పట్టణంలోనో ఉద్యోగం చేస్తున్న వ్యక్తిని వైద్యంకోసం ఆస్పత్రిలో చేర్పిస్తే ఆ వ్యక్తి అనుభవించే నొప్పి భరించరానిదిగా అనిపించవచ్చునట.

నొప్పి గురించిన అవగాహన ఒక్కొక్కరిలో ఒక్కొక్క రకంగా ఉండవచ్చు. చీమ కుడితే కొందరు గిలగిల లాడిపోతూ, విలవిల లాడిపోతూ ఉంటారు. మరికొందరు ముళ్ల పరుపుల మీద చిద్విలాసంగా పడుకుని ఫోటోలు తీయించుకోగలరు. మొక్కు బదుల కోసం చర్మంలోకి సూదులు గుచ్చుకుని చప్పరాలు కట్టుకునే వాళ్లూ, దవడ లలో నుంచో, నాలుకలోనుంచో వాడి సూదులో, చువ్వలో గుచ్చుకునే వాళ్లూ ఆ నొప్పిని ఎలా భరించగలుగుతున్నారు?

నొప్పి ఉన్నట్టు తెలియడం ఒక ఎత్తు. ఆ నొప్పి తీవ్రత ఏమిటి. దాన్ని ఎంత దాకా భరించవచ్చు. నొప్పిని భరించే శక్తిని పెంచుకోవచ్చా అనే విషయాలు తెలుసు కోవడం కోసం నొప్పిని కొలవడంకోసం దాదాపు 50 ఏళ్లకు పైగా పరిశోధనలు సాగుతున్నాయి. హిమాలయాలు ఎక్కే విదేశీయులకన్నా వాళ్లతోబాటు మంచు కొండల్లో నడిచే షెర్పాలలో నొప్పి భరించే శక్తి ఎక్కువ అని తేల్చారు. అమెరికాలోని శాస్త్రవేత్తలు మనుషులకు వచ్చే నొప్పులను 78 విశేషణాలతో వర్ణించవచ్చుననీ, 20 రకాలుగా విభజించవచ్చుననీ వివరించారు.

ప్రసవ వేదన అతి తీవ్రమైన బాధ అని, మూత్రపిండాలలో రాళ్లు ఉంటే వచ్చే నొప్పికూడా భరించలేనిదనీ తెలుసుకున్నారు. అయితే ఏ నొప్పి తీవ్రత దానిదే. ఒక నొప్పితో ఇంకొక నొప్పిని పోల్చడం కష్టం. మెదడుకు సంబంధించిన కొన్నిరకాల జబ్బులున్న వారికి నొప్పులు తెలియవు. కొన్ని సందర్భాలలో శస్త్రచికిత్సవల్ల ఏ వేలో, పాదంలో భాగమో తొలగించినా ఆ రోగులలో ఆ తొలగిపోయిన శరీరభాగంలో నొప్పి ఉన్నట్టు అనిపించే సందర్భాలూ ఉంటాయి.

శరీరంలో ఏ భాగంలోనయినా నొప్పి పుడితే – శరీరం మనను హెచ్చరిస్తున్న దని గ్రహించాలంటారు శాస్త్రవేత్తలు. అందుకే నొప్పిని అశ్రద్ధ చేయకూడదు. మత్తు మందు ఇచ్చి శస్త్ర చికిత్సలు చేయడం ఆధునిక వైద్యవిధానంలో వచ్చిన విప్లవాత్మక మైన మార్పు.

తమ చేతికి పుట్టకురుపు వచ్చినప్పుడు రమణ మహర్షి ఏ మత్తుమందూ తీసుకోకుండా దానికి శస్త్ర చికిత్స చేయించుకోవడం చాలామందిని ఆశ్చర్యపరిచింది. ఇటీవల పాశ్చాత్య స్త్రీ ఒకరు మత్తుమందు సాయం లేకుండా సంపూర్ణ స్పృహతో కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్నారు.

'బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్' అని పాత సినిమా పాట నిశ్చలానందానికి సూచన లిస్తుంది. మనసులోని బాధ శారీరక రుగ్మతగా కనిపించే మనశ్శారీరక వ్యాధులూ ఉన్నాయి. బాధ ఏమిటో గుర్తించాలి. ఆ బాధకు పరిష్కార మార్గమేమిటో ఆలోచించాలి.

ముక్తాయింపు:

అనగనగా ఒక కార్యాలయంలో ఒకాయనకు అక్షరాలను అవి మహాప్రాణాలయినా ఒత్తి పలకడం ఇష్టం ఉండదు. అలా ఒత్తడంవల్ల అక్షరాలకు నొప్పి కలిగించడమే అవుతుందని ఆయన నమ్మకం. అదే కార్యాలయంలోని మరొకాయన ఎప్పుడూ భాధ అంటూ ఉంటాడు. బాధలోని మొదటి అక్షరానికి ఒత్తు లేదంటే – తన భాధ అంత ఎక్కువగా ఉందని వివరిస్తుంటాడు. అటువంటి ఆ కార్యాలయంలో ఒకాయనకు ఒకరోజు అతి తీవ్రమైన తలనొప్పి వచ్చింది. మరొక కార్యాలయంలో పనిచేసే ఆయన మిత్రుడు ఆ సంగతి తెలిసి ఎకాయెకిని తన మిత్రుడి దగ్గరికి వచ్చాడు. 'నాకు చాలా సంతోషంగా ఉందిరా' అన్నాడు. 'నాకు తలనొప్పి వస్తే నీకు సంతోషం ఎందుకు' అన్నాడు తలనొప్పి బాధితుడు. 'ఈ కార్యాలయంలో ఇన్నేళ్లుగా ఉద్యోగంలో ఉన్నా నీకు ఇంకా తలనొప్పి వస్తున్నదంటే నీకు తల ఉన్నట్టే కదా' అన్నాడు అతని మిత్రుడు. తలనొప్పి బాధితుడు రెండు చేతులతో తల బాదుకోపోయి – నొప్పి సంగతి గుర్తువచ్చి రెండు చేతులూ జోడించి మిత్రుడికి భారంగా దండం పెట్టాడు.



56. వయసుకు తగ్గ వస్త్రధారణ

ఇటీవలి కాలంలో వస్త్రధారణ గురించిన అభిప్రాయాలు ఎంతో మారి పోయాయి. వయసుకూ, స్థాయికీ తగిన వస్త్రధారణ చేయాలి. కాస్త ఎక్కువ ధర చెల్లించి అయినా కొంత బాగుండే దుస్తులు కొనుక్కోవాలన్నది నేటి వస్త్రధారణ సూత్రాలలో ముఖ్యమైనది. ఉన్న దుస్తులు జాగ్రత్తగా చూసుకోవడం, విచిత్రమైన ఫేషన్ల జోలికి పోకపోవడం, కొన్న తరువాత విచారించకుండా ముందే విచారించి కొనడం తక్కిన వస్త్రసూత్రాలు.

'ఆళ్‌పాది ఆడైపాది' అని తమిళంలో ఒక సామెత ఉంది. ఆ సామెతకి మనిషి సగం, దుస్తులు సగం అని ఏ ముక్కకు ఆ ముక్క అర్థం చెప్పుకోవచ్చు. ఏ మనిషి నయినా చూడగానే ఆ మనిషి తొడుక్కున్న దుస్తులను బట్టి ఆ మనిషిని అంచనా వేస్తారనీ, మనిషి దుస్తులను బట్టి సగం అభిప్రాయం ఏర్పడుతుందని నానుడి సూచన. అంటే దుస్తులను బట్టి వ్యక్తులను అంచనా వెయ్యవచ్చా అనే ప్రశ్న వస్తుంది. కాని చాలా సందర్భాలలో దుస్తులు వ్యక్తుల గురించి భ్రమలు కలిగిస్తాయి. అపో హలూ కలిగిస్తాయి. ఒక పరిశోధన – మనుషులను, వారి దుస్తులను బట్టి నూటికి యాభైపాళ్లు అంచనా వేస్తుంటారని పేర్కొన్నది. నాటకాలలో పాత్రధారులు తొడు క్కొన్న దుస్తులను బట్టి – వాళ్లు ధరిస్తున్న పాత్రల గురించి తెలుసుకోవడానికి వీలవు తుంది. కాని నిత్యవ్యవహారంలో దుస్తులను బట్టి వ్యక్తులను నూటికి నూరుపాళ్లు సరిగా తెలుసుకోవడానికి వీలుచిక్కదు. దుస్తులు మనిషి విలువను తెలుసుకోవడానికి అన్ని వేళలా సాయపడవు.

వస్త్రధారణలో ఎప్పటికప్పుడు మార్పులు వస్తూ ఉంటాయి. అలాగే ఋతువు లను బట్టి వస్త్రధారణ మారుతూ ఉంటుంది కదా! వేసవిలో ఉన్ని దుస్తులూ, చలి కాలంలో నూలుదుస్తులూ తొడుక్కోవడం ఇబ్బంది. మన దేశంలోని అడుగు బడుగు ప్రజల దీనస్థితిని చూసి చలించిన మహాత్మాగాంధీ వారిలాగానే కొల్లాయిగుడ్డ కట్టు కోవడం మొదలుపెట్టారు. విమర్శలను లెక్క చేయక గుండ్రని బల్ల సమావేశానికి ఆ దుస్తులతోనే వెళ్లారు. ఆ రోజులలో పాశ్చాత్య పత్రికలు ఆయన ఆశయాల గురించి

రాసిందానికన్నా, ఆయన వస్త్రధారణ గురించీ, ఆహారం గురించీ రాసినదే ఎక్కువ అని పాశ్చాత్య రచయిత ఒకరు పేర్కొన్నారు.

చదువుకొనే పిల్లలలో సమానత్వం అలవరచే ఉద్దేశంతో కావచ్చు చాలా బళ్లలో విద్యార్థినీ విద్యార్థులు ఒకే రకమైన దుస్తులు ధరించాలనే నియమం ప్రవేశపెట్టారు. కొన్ని పాఠశాలల వారు ఆ దుస్తులు ఫలానా వారి దగ్గరే తీసుకోవాలని నిర్దేశిస్తూ ఉండడంలోనూ ఒక రకమైన అదృశ్య సమానత్వం ఉందేమో!

అలాగే కొన్ని సంస్థలలోనూ ఉద్యోగులందరూ ఒక రకమైన దుస్తులు తొడుక్కోవాలనే నియమం ఉంది. ఆ ఉద్యోగులు చేసే ఉద్యోగాలలో తేడా ఉన్నా దుస్తుల విషయంలో ఎటువంటి తేడా పాటించరు.

పాశ్చాత్య దేశాలలో సందర్భోచితమైన వస్త్రధారణ పట్ల పట్టింపు ఎక్కువ. సాధారణ వస్త్రధారణకూ, అసాధారణ వస్త్రధారణకూ తేడా పాటించాలి. అలాగే ఆయా సందర్భాలకు తగిన రంగుల దుస్తులూ ధరించాలి. పాశ్చాత్య దేశాలలో వస్త్రధారణకే కాక కాలికి తొడుక్కొనే చెప్పులు, బూట్లు వంటి వాటి విషయంలోనూ పట్టింపు ఉంటుంది. మన దేశంలోనూ పాశ్చాత్య పద్ధతులను పాటించే కొన్ని సంస్థల వారు వస్త్రధారణ గురించీ, కాళ్లకు తొడుక్కొన్న చెప్పుల గురించీ పేచీలు పెడుతూ ఉంటారని అడపా దడపా వార్తలు వస్తూనే ఉన్నాయి.

మనిషికి స్వతహాగా ఉండే విలువ వస్త్రధారణ వల్ల పెరగదు. కొన్ని రకాల ఉపాసనలు చేసేవారు మురికి బట్టలు ధరిస్తూ ఉంటారని కొందరు పెద్దలు చెప్తారు. చిరిగిన వస్త్రమైనా ఉతికి కట్టుకోమని పెద్దలు సూచించారు.

ఇరవై ఏళ్లక్రితం కొన్ని పాశ్చాత్య దేశాలలో కొత్తగా ధనవంతులైన వారు పెళపెళలాడుతూ తళతళలాడుతూ ఉండే దుస్తులు ధరించేవారు. ఆ పద్ధతి మొదలయినంత త్వరగా మాసిపోయింది.

మన చలన చిత్రాలలో నాయకులు ఎంత పేదవారయినా విలువైన వస్త్రాలలోనే కనిపించడం చిత్ర వస్త్ర సూత్రం.

ఇటీవలి కాలంలో వస్త్రధారణ గురించిన అభిప్రాయాలు ఎంతో మారిపోయాయి. వయసుకూ, స్థాయికీ తగిన వస్త్రధారణ చేయాలి. కాస్త ఎక్కువ ధర చెల్లించి అయినా కొంత బాగుండే దుస్తులు కొనుక్కోవాలన్నది నేటి వస్త్రధారణ సూత్రాలలో ముఖ్యమైనది. ఉన్న దుస్తులు జాగ్రత్తగా చూసుకోవడం, విచిత్రమైన ఫేషన్ల జోలికి పోకపోవడం, కొన్న తరువాత విచారించకుండా ముందే విచారించి కొనడం తక్కిన వస్త్ర సూత్రాలు. మనకు అనుకూలంగా ఉండే వస్త్రాలే ధరించడం మరొక సూత్రం. తగ్గింపు ధరలకు దుస్తులు కొంటున్నప్పుడు వాటి మన్నిక గురించి చూసుకోవాలి.

కొందరికి తమకోసం కుట్టించుకొన్నవే బాగుంటాయి. ప్రత్యేక సందర్భాలకోసం వస్త్రాలు కొనేటప్పుడు మరింత జాగ్రత్త అవసరమని విడిగా చెప్పనక్కరలేదు. అలాగే ఎదిగే పిల్లలకోసం దుస్తులు కొనడం కూడా జాగ్రత్తగా చేయవలసిన పనే.

పురుషుల వస్త్రధారణ గురించి ఒక పెద్ద మనిషి – ఏ పురుషుణ్ణయినా చూడ గానే అతను దుస్తులు తెలివిగా కొన్నాడనీ, జాగ్రత్తగా తొడుక్కున్నాడనీ అనిపించాలి అని సూచించాడు.

ముక్తాయింపు:

"నేను వీధిలోకి వెడితే చాలు అందరూ నన్నే చూస్తుంటారు. నాలో ఏ ప్రత్యేకత ఉందో ఏమో!" అన్నాడు ఒక భర్త ఉత్సాహంగా.

"మీ ప్రత్యేకతా? ఇరవై ఏళ్ల నాటి బట్టలే వద్దన్నా ఇంకా తొడుక్కోవడం" అన్నది భార్య మరింత ఉత్సాహంగా.



57. ఇక విజయం మీదే

ఒకసారి విజయం సాధించాక అదే స్థాయిలో విజయం సాధించడానికి ఎప్పటికప్పుడు అవసరమైన మార్పులుచేస్తూ ఉండాలి. విజయం స్థాయి నిలకడగా ఉండదు కనుక ఆశించిన స్థాయి అందుకోవడానికి అవసరమైన దృష్టి పెంపొందించుకోవాలి. మొదట అందుకొన్న వేగాన్నీ సామర్థ్యాన్నీ నిలుపుకోవడానికి నిరంతర ప్రయత్నం అవసరం.

అపజయం ఎదురయినప్పుడు కుంగిపోవడం ఎంత తప్పో విజయం చవిచూచినప్పుడు అతిగా, పొంగిపోవడమూ అంతే తప్పు అని ఆ మధ్య ఒక పెద్ద మనిషి చెప్పారు. విజయం సాధించినప్పుడు సంతోషపడడం అనేది మామూలు విషయమే కదా? విజయసాధన ఉత్సాహం కలిగిస్తుంది కదా? మరి విజయం సాధించినప్పుడు నిర్లిప్తంగా, నిరుత్సాహంగా ఉండమంటే ఎట్లా కుదురుతుంది అని అడగవచ్చు. విజయం ఉత్సాహం కలిగించే మాట వాస్తవమే. అయితే ఆ విజయం కలిగించే మత్తులో పడిపోవద్దన్నదే హెచ్చరిక.

యాభై అరవై ఏళ్ల క్రితం ఇద్దరు యువకులు ఒక పత్రిక మొదలుపెట్టారు. అప్పటిదాకా అటువంటి ప్రయత్నం ఇంకెవ్వరూ చెయ్యలేదు. ఆ కొత్త ప్రయత్నం చాలా మంది పాఠకులను ఆకర్షించింది. ఒక భాషలో విజయవంతమైన ఆ ప్రయత్నాన్ని ఇంకొక భాషలోనూ సాగించారు. అక్కడా విజయమే కలిగింది. ఆ యువకులు తమకు విజయం కలిగించిన ఆ సూత్రాన్ని గట్టిగా పట్టుకున్నారు. ఆ సూత్రం పాటించి ఏళ్ల తరబడి తమ పత్రికను ప్రచురించారు. యువకులు వృద్ధులయ్యారు. వాళ్ల పత్రికల మూసలోనే మరికొన్ని పత్రికలు వచ్చాయి. కొన్ని అసలు పత్రికతో పోటీపడ్డాయి. చాలా పత్రికలు ఆగిపోయాయి. అయితే కొన్నేళ్ల తర్వాత అసలు పత్రిక ప్రాచుర్యం కూడా తగ్గింది. ఆ పత్రిక పెట్టిన వారికి వారు సాధించిన విజయమే ఆటంకమయింది. విజయసూత్రం అన్నది అన్ని కాలాలకూ అన్వయించదు. నిన్నటి సూత్రం నేడు పనిచేయదు. నేడు పని చేసేది రేపు పని చేయకపోవచ్చు.

కాలానుగుణంగా మారకపోవడం ఒక సమస్య. ఒకసారి విజయం సాధించాక అదే స్థాయిలో విజయం సాధించడానికి ఎప్పటికప్పుడు అవసరమైన మార్పులు

చేస్తూ ఉండాలి. విజయం స్థాయి నిలకడగా ఉండదు కనుక - ఆశించిన స్థాయి అందుకోవడానికి అవసరమైన దృష్టి పెంపొందించుకోవాలి. మొదట అందుకొన్న వేగాన్నీ, సామర్థ్యాన్నీ నిలుపుకోవడానికి నిరంతర ప్రయత్నం అవసరం. లేకుంటే అందుకొన్న ఎత్తునుంచి జారిపోవడం మొదలవుతుంది. క్రీడాకారులు ఎప్పటికప్పుడు కొత్త రికార్డులు సాధించడానికి ఉవ్విళ్లూరడానికి - విజయపరంపరను కొనసాగిస్తూ ఉండాలన్న తపనే కారణం.

విజయ సూత్రం అంటూ ఒకటి తెలిసిపోయాక దాంట్లో మార్పులు ఎందుకు చేయాలి అని ప్రశ్నించవచ్చు. ఏదయినా సమస్య వచ్చినప్పుడే తప్ప అంతా సక్ర మంగా సాగుతున్నప్పుడు మార్పు గురించి ఆలోచించనక్కర లేదు కదా అని కొందరు అనుకొంటూ ఉంటారు. పడవలో చిల్లిపడినపుడు దాన్ని మరమ్మత్తు చేయాలి కాని బాగున్న పడవ గురించి దిగులుపడడం ఎందుకు అనీ వారు ప్రశ్నిస్తూ ఉంటారు. పడవలో చిల్లిపడలేదు. అది బాగానే ఉంది. అది బాగానే ఉంటే - అది బాగానే ఉన్నప్పుడు దాన్ని మరింత మెరుగుపరుచుకోవచ్చు కదా? విజయసాధన కూడా అటువంటిదేనంటారు సామాజిక శాస్త్రవేత్తలు.

సాధించిన విజయం సార్థకంగా ఉండాలంటే దాన్ని మరింత మెరుగు చేసుకొనే ప్రయత్నం సాగుతూనే ఉండాలి. అలాగే విజయసాధనలో అపజయాలను సరిగా అంచనా వేసుకోవాలి. 'ఈ పరిశోధనలో ఇన్నిసార్లు అపజయం పొందారు కదా? మీకు నిరాశగా లేదా?' అని ఒక శాస్త్రవేత్తను ఒకాయన అడిగాడట. 'ఇన్ని రకాలుగా నా పరిశోధన పని చేయదని తెలుసుకున్నాను' అన్నాడట ఆ శాస్త్రవేత్త. 'మరొక సారి ప్రయత్నిస్తాను' అనే వాడట.

'మనం అనుకొన్న లక్ష్యాలు సాధించాము. ఇప్పుడు వాటిని మెరుగు పరచు కొందాం' అనుకోవడమే మెరుగైన విజయసూత్రం అంటారు సామాజిక శాస్త్రవేత్తలు. మార్పును సమస్యగా కాక అవకాశంగా చూడాలనీ అంటారు.

అన్నిటికన్నా ముఖ్యం - విజయంవల్ల కళ్లు నెత్తికెక్కకుండా చూసుకోవడం, కళ్లు మూసుకుపోకుండా చూసుకోవడం.

కళ్లు నెత్తికెక్కితే చూడవలసిన నిజం కనిపించదు. కళ్లు మూసుకుంటే - అసలు ఏదీ కనిపించదు. అందుకనే విజయం సాధించిన తర్వాత జాగ్రత్తగా ఉండాలనడం.

ముక్తాయింపు:

'మీ విజయ రహస్యం ఏమిటి?' అని ఒక వర్ధమాన రచయిత ఒక వృద్ధ రచయితను అడిగాడు.

'ప్రతి రచనకూ కొత్త కాగితాలు వాడుతూ ఉండడం' అన్నాడు వృద్ధ రచయిత.

రచయిత గురించి...

విరిగి పెరిగితి, పెరిగి విరిగితి – కష్ట సుఖముల సారమెరిగితి అన్న కవి వాక్కు డాక్టర్ పి.ఎస్.గోపాలకృష్ణ విషయంలో అక్షరసత్యం. జీవితంలో ఒక్కో మెట్టు నిర్మించుకుంటూ అధిగమిస్తూ వస్తున్నారు ఆయన. కవితలు, కథలు, వ్యాసాలు, వాణిజ్య ప్రకటనలతో సహా ఆయన చాలా రాశారు. అనువాదకులుగా డాక్టర్ పి.ఎస్.గోపాలకృష్ణ కృషి ప్రత్యేకమైనది. సినిమాల డబ్బింగ్‌తో సహా అన్ని రకాల అనువాద ప్రక్రియల్లో అనుభవం గడించారు ఆయన. ఆయనకు తెలుగు, ఇంగ్లీషులతో పాటు హిందీ, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో ప్రవేశం ఉంది. ఈ కారణంగానే ఇంగ్లీషు, హిందీ, తెలుగు, కన్నడం, మలయాళం నుంచి తమిళంలోకి కొన్ని సినిమా స్క్రిప్టులను అనువదించారు. తమిళం, కన్నడం, మలయాళ భాషలనుంచి కూడా తెలుగులోకి సినిమా స్క్రిప్టులను అనువదించారు.

పి.ఎస్.గోపాలకృష్ణ 1949లో మద్రాసులో జన్మించారు. "తెలుగు, కన్నడ భాషలలోని సామెతల తులనాత్మక అధ్యయనం" అనే అంశంపై పరిశోధన చేసి మైసూరు విశ్వవిద్యాలయం నుంచి పి.హెచ్‌డి. పట్టం పొందారు. 1973లో ఎమెస్కో ప్రచురణ సంస్థలో సంపాదక సహాయకుడిగా తొలి ఉద్యోగం. అక్కడ చాలా పుస్తకాల ప్రచురణ బాధ్యత వహించారు. 1974లో తెలుగు భాషాసమితిలో చేరారు. వారి 'విజ్ఞాన ప్రగతి' పత్రిక సంపాదకవర్గంలో కొన్నాళ్లు ఉద్యోగం. 1975లో చందమామ ప్రచురణల సంస్థ సంపాదకవర్గంలో చేరి వనిత, విజయచిత్ర పత్రికల రూపకల్పనలో సహకరించారు.

1977 నవంబర్‌లో ఆకాశవాణిలో కార్యక్రమ నిర్వాహకుడుగా చేరి ప్రస్తుతం హైదరాబాద్ ఆకాశవాణి ప్రాంతీయ శిక్షణా సంస్థలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. రేడియోకి వేయికి పైగా రచనలు చేశారు. కేంద్ర సాహిత్య అకాడెమీలో దక్షిణ ప్రాంత కార్యదర్శిగా, ఉప కార్యదర్శిగా కూడా ఆయన పనిచేశారు.

మీడియా హౌస్ పబ్లికేషన్స్ పుస్తకాలు

			రూ.
1.	మీ గురించి మీకు తెలుసా?	డాక్టర్ పి.ఎస్.గోపాలకృష్ణ	75
2.	ఫన్ దేహాలు	హాస్యబ్రహ్మ శంకర నారాయణ	100
3.	'పన్'పరాగ్	హాస్యబ్రహ్మ శంకర నారాయణ	50
4.	శంకర నారాయణ అప్రస్తుత ప్రసంగాలు	హాస్యబ్రహ్మ శంకర నారాయణ	100
5.	జయదేవ్ కార్టూన్లు	జయదేవ్	100
6.	నిజాం-బ్రిటీష్‌సంబంధాలు	సరోజినీ రేగాని	150
7.	జర్నలిస్టులకోసం	డాక్టర్ గోవిందరాజు చక్రధర్	70
8.	అనువదించడం ఎలా?	డాక్టర్ గోవిందరాజు చక్రధర్	90
9.	ప్రచారం పొందడంఎలా?	డాక్టర్ గోవిందరాజు చక్రధర్	70
10.	వ్యాసప్రభ	డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వర రావు	150
11.	చింతన	డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వర రావు	50
12.	చిరస్మరణీయులు	డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వర రావు	50
13.	విన్నంత కన్నంత	బూదరాజు రాధాకృష్ణ	100
14.	మంచి జర్నలిస్టు కావాలంటే	బూదరాజు రాధాకృష్ణ	75
15.	సొంత కథ	రాంభట్ల కృష్ణమూర్తి	80
16.	మన భాష	డాక్టర్ డి.చంద్రశేఖర రెడ్డి	100
17.	సంహిత (సాహిత్య వ్యాసాలు)	డాక్టర్ డి.చంద్రశేఖర రెడ్డి	100
18.	బలవంతులు(అనువాద కవితలు)	డాక్టర్ డి.చంద్రశేఖర రెడ్డి	30
19.	పతిత పావని, త్రిల్లింత	కాకాని చక్రపాణి (ఒక్కో సంపుటి) కథల సంకలనాలు	50
20.	ది ఘోస్ట్ (నవల)	కాకాని చక్రపాణి, గోవిందరాజు చక్రధర్	60
21.	గోరంతదీపం (నవల)	కాకాని చక్రపాణి, గోవిందరాజు చక్రధర్	30
22.	Damodaram Sanjivayya and his times	Dr. G.Venkat Rajam	450

ప్రతులకు

Media House Publications

1-9-289/4, Behind Post Office, Vidyanagar

Hyderabad - 500 044, ✆: 760 7307

డాక్టర్ పి.ఎస్. గోపాలకృష్ణ



అధునికంగా చెప్పినా
ఆధ్యాత్మికంగా చెప్పినా
ఎవరి గురించి వారు
తెలుసుకోవాలి.
విత్తనంలో మహావృక్షం
ఇమిడి ఉన్నట్టు
ప్రతివారిలోనూ
అపరిమిత శక్తులు
దాగి ఉంటాయి.
వాటిని గుర్తించి
సానబెట్టి
సమున్నత వ్యక్తిత్వాన్ని
సాధించుకోవచ్చు.
మీ గురించి మీకు తెలుసా
అని ప్రశ్నించే ఈ పుస్తకం
మనుషుల శక్తి సామర్థ్యాలను
ఉదాహరణలతో పేర్కొంటుంది.
వాటికి వన్నే వాసీ చేర్చే
మార్గాలను వివరిస్తుంది.
లలితలలితంగా
సరళాతిసరళంగా సాగే
ఈ రచన అందరి కోసం.

మీ గురించి మీకు తెలుసా?

Media House
PUBLICATIONS